ఈనాడు

విజయవాడ 19-3-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 218

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఈనాడు



విజయవాడ 19-3-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 218

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 18+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఆంధ్రాపై యుద్ధం చేస్తారా?

- హామీల అమలు అడిగితే దాడి చేస్తారా?
- కాంగ్రెస్ హోదా ఇస్తామంటుంటే.. మీకెందుకు సాధ్యం కాదు?
- భాజపాను నిలదీసిన చంద్రబాబు
- హక్కుల సాధనకు అందరూ సహకరించాలని పిలుపు
- శక్తిమంతమైన జాతిగా తెలుగువాళ్లు ఎదగాలని ఆకాంక్ష
- ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి



విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు దేవినేని, అఖిలప్రియ, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, సీఎం సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్, స్పీకర్ కోడెల శివప్రసాదరావు, వర్ల రామయ్య, దేవదాయ ధర్మదాయ కార్యదర్శి అనూరాధ తదితరులు

ఈనాడు – అమరావతి

విభజన హామీలు అమలు చేయాలని తాను గట్టిగా కోరితే కేంద్రంలోని భాజపా పెద్దలు యుద్ధం చేస్తామనడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నిప్పులు చెరిగారు. తెలుగుజాతిపై యుద్ధం చేస్తారా? ఆంధ్రప్రదేశ్‌పై యుద్ధం చేస్తారా?.. ఎవరిపై యుద్ధం చేస్తారంటూ నిలదీశారు. ఎదురుదాడి చేయిస్తారా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఉన్న సమస్యలను పరిష్కరించమని అడగడం తప్పా? అని నిగ్గదీశారు. ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక, దేవాదాయ ధర్మాదాయ శాఖల ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్రస్థాయి ఉగాది సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ విభజన చట్టంలో పెట్టిన 18 డిమాండ్లు, రాజ్యసభలో ఇచ్చిన హామీలపై సమీక్ష చేయండి, సమాధానం చెప్పండి, సహాయం చేయండని తాను అడిగితే.. అవేం చేయకుండా ఇబ్బందులు పెడతాం, ఎదరుదాడి చేస్తాం, రాష్ట్రంపై దాడి చేస్తాం అనడం బాధాకరమన్నారు. మనం చేయని విభజన తప్పునకు శిక్ష పడుతోందని ఒక్కోసారి బాధ, ఆవేదన కలుగుతున్నాయన్నారు. సీనియర్ నాయకుడినయ్యుండి.. తన తర్వాత (మిగతా 2లో)

ఈ రోజు నేను బలహీనపడితే.. ఆంధ్రప్రదేశ్ బలహీనపడుతుంది. ప్రజలకు నష్టం జరుగుతుంది. నాయకత్వాలను బలహీనపర్చడం, ప్రశ్నించిన వాళ్లపై ఎదురుదాడి చేయడం, చేయించడం వంటి చర్యలకు కేంద్రం పాల్పడుతోంది.

తెలుగుజాతి ప్రయోజనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకట్టు పెట్టేది లేదు. నాకు ప్రజల సహకారం కావాలి. రాష్ట్రానికి న్యాయ సమ్మతంగా రావాల్సిన వాటన్నింటి కోసం విద్యార్థులు, కళాకారులు, ప్రజలు అందరం కలిసి కట్టుగా పోరాడాల్సిన సమయమిది.

హోదా సహా ఏపీకి ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని కాంగ్రెస్ తాజాగా పేర్కొంటోంది. వాళ్లు చేస్తామంటున్నవి.. ఇప్పుడున్నవాళ్లు ఎందుకు చేయలేమంటున్నారో చెప్పాలి.

– చంద్రబాబు



వారెవ్వా కార్తీక్

- ఆఖరి బంతికి సిక్స్ కొట్టి గెలిపించిన దినేశ్
- భారత్‌దే ముక్కోణపు టీ20 సిరీస్

ఆశలన్నీ అడుగంటిన వేళ నీ పోరాటం అద్భుతం! నరాలు తెంచే ఉత్కంఠలో నువ్వు నిలిచిన తీరు అద్వితీయం! అంత విధ్వంసంలోనూ ఆడిన ఆ క్రికెటింగ్ షాట్లు అమోఘం! వారెవ్వా కార్తీక్.. నీ ఆట నభూతో! కొలంబోలో దుమ్మురేపిన ఈ వికెట్‌కీపర్ బ్యాట్స్‌మన్ అభిమానుల హృదయాలను కొల్లగొట్టాడు. బంగ్లాదేశ్ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ టీమ్ ఇండియాకు అపురూపమైన విజయాన్నందించాడు.మామూలు ఇన్నింగ్సా అది! భారత అభిమానులు ఇప్పట్లో మరిచిపోరు.. బంగ్లా జట్టూ మరువలేదు. దినేశ్ కార్తీక్ (29 నాటౌట్; 8 బంతుల్లో 2x4, 3x6) అద్భుతమే చేశాడు. టీ20 ముక్కోణం ఫైనల్లో విజయం కోసం ఆఖరి బంతికి సిక్స్ కొట్టాల్సివుండగా బ్యాటును మంత్రదండంగా మార్చి సౌమ్య సర్కార్ బంతిని అమాంతం కవర్స్‌లో బౌండరీ ఆవల పడేశాడు. అంతే భారత్ సంబరాల్లో మునిగిపోయింది. నిజానికి చివరి రెండు ఓవర్లలో విజయానికి 34 పరుగులు అవసరం ఉండగా టీమ్‌ఇండియా ఓటమి అంచుల్లో నిలిచింది. కానీ కార్తీక్ కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను బంగ్లా చేతుల్లో నుంచి లాగేశాడు. మొదట బంగ్లాదేశ్ 8 వికెట్లకు 166 పరుగులు సాధించింది. – వివరాలు ఛాంపియన్‌లో

మరో ప్రయత్నం

నేడు సభ ముందుకు తెదేపా, వైకాపా అవిశ్వాస నోటీసులు

- గందరగోళం నెలకొంటే వాయిదా తప్పదు
- చర్చపై ఉత్కంఠ
- 1963లో తొలి అవిశ్వాసం ఎదుర్కొన్నది నెహ్రూనే
- అత్యధిక సవాళ్లు ఎదుర్కొన్న నేత ఇందిరాగాంధీ

ఈనాడు – దిల్లీ



కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన అవిశ్వాస తీర్మానం శుక్రవారం చర్చకు రాకుండానే మురిగిపోవడంతో తెదేపా, వైకాపాలు సోమవారం మరో ప్రయత్నం చేయనున్నాయి. అన్నాడీఎంకే, తెరాసలు వెల్‌లో నిల్చొని ఆందోళన చేస్తున్న కారణంగా అవిశ్వాస తీర్మానానికి మద్దతిచ్చే 50 మందిని లెక్కించడం సాధ్యం కాలేదంటూ స్పీకర్ సుమిత్రా మహాజన్ శుక్రవారం సభను వాయిదా వేశారు. ఆ వెంటనే సోమవారం చర్చకోసం రెండు పార్టీలూ అదేరోజు మధ్యాహ్నం స్పీకర్ సచివాలయంలో మళ్లీ నోటీసులు అందజేశాయి. వాటిని సోమవారం మధ్యాహ్నం స్పీకర్ మరోసారి సభముందుంచే అవకాశం ఉంది. అప్పటికి సభ సజావుగా ఉంటే స్పీకర్ వాటికి మద్దతిచ్చే వారిని లేచి నిల్చోమని సూచిస్తారు. మొత్తం లోక్‌సభ సభ్యుల్లో 10% మంది మద్దతిస్తున్నట్లు స్పీకర్ నిర్ణయించుకుంటే అవిశ్వాసాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు ప్రకటించి చర్చ షెడ్యూల్‌ను నిర్ణయిస్తారు. శుక్రవారంనాటి పరిస్థితులే పునరావృతమైతే అవిశ్వాస తీర్మాన నోటీసులను తిరస్కరించి, సభను వాయిదా వేస్తారు. ఇక ప్రభుత్వ వ్యవహారాలేమీ లేవని భావనకు వస్తే నిరవధిక వాయిదా వేయడానికీ అవకాశం ఉంది. సభ సాగడమా? లేదా? అన్నది ప్రభుత్వం నుంచి వచ్చే స్పందనపై ఆధారపడి ఉంటుంది.

విశ్వాసం.. అవిశ్వాసం..: పార్లమెంటు ఉభయ సభలు వేర్వేరుగా సభా నిర్వహణ నిబంధనలు రూపొందించుకోవడానికి రాజ్యాంగంలోని 118వ అధికరణ అనుమతిస్తోంది. దాని ప్రకారం లోక్‌సభ 198వ నిబంధన.. అవిశ్వాస తీర్మాన ప్రక్రియ గురించి చెబుతోంది. దాని ప్రకారం సభలోని ఏ సభ్యుడైనా కేంద్ర మంత్రివర్గానికి వ్యతిరేకంగా లిఖితపూర్వకంగా అవిశ్వాస తీర్మాన నోటీసు ఇవ్వొచ్చు. ఇలాంటి అవిశ్వాస తీర్మానం కారణంగా గతంలో వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 1999లో ఓటమి చవిచూసింది. సభలో తనకు మెజార్టీ ఉందని నిరూపించుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి వచ్చినప్పుడు విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెడుతుంది. అవిశ్వాస తీర్మానం తరహాలో విశ్వాస తీర్మానానికి సంబంధించి విస్పష్ట నిబంధనలు లేవు. 184వ నిబంధన (మిగతా 2లో)

అవిశ్వాసానికి మద్దతిస్తాం: మమత

ఈనాడు, అమరావతి: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ఫోన్‌లో మాట్లాడారు. మోదీ ప్రభుత్వంపైన పెడుతున్న అవిశ్వాస తీర్మానానికి మద్దతివ్వాలనిచంద్రబాబు కోరగా... అందుకామె అంగీకరించారు. తమకు మద్దతుగా నిలవడం పట్ల చంద్రబాబు మమతబెనర్జీకి కృతజ్ఞతలు తెలిపారు.

కందులన్నీ మనమే కొందాం

- ఒక్కో రైతు నుంచి 25 క్వింటాళ్ల కొనుగోలు
- కరవు మండలాల్లో 50 అదనపు పనిదినాల కల్పన
- ఉగాది సందర్భంగా సీఎం నిర్ణయాలు 2లో



పరిహారంలో ఎందుకీ వ్యత్యాసం

- అసైన్డ్ రైతుల సమస్య పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో గళమెత్తక తప్పదు
- పవన్‌కల్యాణ్ 13లో

నేడు టెట్ ఫలితాలు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలు సోమవారం విడుదల కానున్నాయి. సాయంత్రం 4 గంటలకు విజయవాడలోని గేట్‌వే హోటల్‌లో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఫలితాలు విడుదల చేస్తారు. ఫలితాలు www.eenadu.net లో చూడవచ్చు.



రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ విజయం!

16లో

మోదీయే అవినీతి

- నీరవ్‌మోదీ ప్రజాధనాన్ని దోచుకెళ్తారు
- దానిని నరేంద్రమోదీకి ఎన్నికల ఖర్చుగా సమకూరుస్తారు
- భాజపా అంటే కౌరవులు... మేం పాండవులం
- యుద్ధంలో గెలుపు సాధించేది మేమే
- కార్యకర్తలకు, నాకు మధ్యనున్న అడ్డుగోడల్ని పగులగొడతా
- గతసారి మేం ప్రజాకాంక్షల్ని నెరవేర్చలేకపోయాం
- ప్లీనరీ ముగింపు సమావేశంలో రాహుల్‌గాంధీ
- విభేదాలు విడనాడి పార్టీ కోసం పనిచేయాలని శ్రేణులకు పిలుపు



దిల్లీ

మోదీ... భారత్‌లోని ఆశ్రిత పెట్టుబడిదారులకు, ప్రధానమంత్రికి మధ్య ఉన్న అవగాహనకు ప్రతీక ఈ పేరు. ప్రజలకు చెందిన రూ.30,000 కోట్లను ఒక మోదీ మరో మోదీకి ఇస్తారు. ఆ మోదీ తిరిగి ఈ మోదీకి ఆ డబ్బును మార్కెటింగ్ కోసం, ఎన్నికల్లో ఖర్చు కోసం సమకూరుస్తారు. ప్రధాని మోదీ ఏమీ అవినీతిపై పోరాడడం లేదు. ఆయనే అవినీతి...' అని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్రంగా ఆరోపించారు. ఆర్థిక కుంభకోణాల్లో నిందితులుగా ఉంటూ పరారైన ప్రముఖ ఆభరణాల వ్యాపారి నీరవ్ మోదీ, వ్యాపారవేత్త లలిత్ మోదీలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ఆదివారం దిల్లీలో కాంగ్రెస్ 84వ ప్లీనరీ ముగింపు సమావేశంలో 53 నిమిషాల పాటు ఆయన ప్రసంగించారు. దేశం తరఫున తన పార్టీ మాట్లాడుతుందన్నారు. అవినీతిపరులు, శక్తిమంతులు దేశాన్ని నియంత్రిస్తున్నారని చెప్పారు. భాజపా ఒక సంస్థ వాణిని వినిపిస్తుందనీ, కాంగ్రెస్ మాత్రం దేశం గుండెచప్పుడు అని పేర్కొన్నారు.

నిజం కోసం పోరాడతాం

భాజపా అంటే కౌరవ సైన్యమనీ, తాము మాత్రం పాండవుల్లాంటివాళ్లమని రాహుల్ చెప్పారు. అధికారం కోసం కౌరవుల్లా భాజపా పోరాడుతుంటే, ధర్మం కోసం నిలబడిన పాండవుల మాదిరిగా తాము నిజం కోసం పోరాడతామని చెప్పారు. యుద్ధంలో గెలిచేది తామేనని ధీమా వ్యక్తం చేశారు. 'అనేక శతాబ్దాల క్రితం కురుక్షేత్ర సంగ్రామం జరిగింది. కౌరవులు శక్తిమంతులు, అహంకారులు. పాండవులు వినయశీలురు. వారు ధర్మం కోసం పోరాడారు. కౌరవుల్లా భాజపా కూడా అధికారం కోసం పోరాడడానికే ఉంది. పాండవుల మాదిరిగా కాంగ్రెస్ నిజం కోసం పోరాడుతుంది. భాజపా కంటే కాంగ్రెస్‌పై ప్రజలకు ఎక్కువ అంచనాలు ఉన్నాయి. మా పార్టీ ఎప్పుడూ భాజపాలాంటిది కాదు. హత్య కేసులో నిందితుడిని భాజపా అధ్యక్షుడిగా ఈ దేశ ప్రజలు ఆమోదిస్తారు. అధికార దాహం ఉన్న వ్యక్తిని వారు భాజపాలో (మిగతా 14లో)

ఇదీ సంగతి!



ఇదిగో ప్యాకేజీ, దాన్ని తీసుకోవటం నీకే చేతకావట్లేదు.

నిధులే ప్రధాన అడ్డంకి

- 20 నెలలు.. రూ.40 వేల కోట్లు
- విడుదల ప్రక్రియ తీవ్ర జాప్యం
- 2019 కల్లా పోలవరం పూర్తయ్యేనా!

ఈనాడు – అమరావతి



పోలవరం. రాష్ట్రానికి జీవనాడి. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం దీనిని పూర్తి చేయాల్సి ఉంది. అటు కేంద్రం... ఇటు రాష్ట్రం 2019 నాటికి పనులు పూర్తి చేసి నీరు ఇస్తామని చెబుతున్నాయి. ఆ మేరకు ఎప్పటికప్పుడు అక్కడ గడ్కరీ... ఇక్కడ చంద్రబాబు నేతృత్వంలో సమీక్షలు జరుగుతున్నాయి. పనులు వేగంగా పూర్తి చేసే క్రమంలో అవసరమైన చర్యలు చేపడుతున్నాయి. ఇదంతా బాగానే ఉన్నా... ప్రధానంగా నిధుల విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రాజెక్టు పనులు ముందడుగు వేయడంలో ఆటంకంగా మారింది. సవరించిన అంచనాలు ఆమోదం పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అవి ఆమోదం పొందితే తప్ప భవిష్యత్తులో నిధులు వచ్చే అవకాశం లేదు. తొలుత రాష్ట్రం ఖర్చు చేయడం... ఆ తర్వాత కేంద్రం చెల్లించడం జరుగుతోంది. ఈ చెల్లింపుల ప్రక్రియ రాను రాను జాప్యమవడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతోంది. ఇతర సాగునీటి ప్రాజెక్టులపై కూడా ఆ ప్రభావం కనిపిస్తోంది. పోలవరం అథారిటీ, కేంద్ర జలసంఘం, జాతీయ జల అభివృద్ధి సంస్థ, నాబార్డు ఇన్ని గడపలు తొక్కి...తిరిగి అదే క్రమంలో నిధులు రావాల్సి వస్తోంది.

ఇంకా రావాల్సిన మొత్తం రూ.2568 కోట్లు

కేంద్ర మంత్రిమండలి ఆమోదించిన ప్రకారం.. . ఈ ప్రాజెక్టులో నీటిపారుదల వ్యయాన్ని కేంద్రం పూర్తిగా చెల్లిస్తుందని కూడా పేర్కొన్నారు. 2017 ఆగస్టులో రూ.58,319.06 కోట్ల మేర తాజా అంచనాలు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది. విద్యుత్కేంద్రం ఖర్చు మినహాయిస్తే (మిగతా 2లో)



కవయిత్రి మొల్ల నివసించిన ఇంటి దుస్థితి ఇది

కాలగర్భంలో 'మొల్ల' నివాసం

- ఆనవాళ్లు కోల్పోతున్న మహాకవయిత్రి ఇల్లు
- పరిరక్షించడంలో అంతులేని నిర్లక్ష్యం
- కడప జిల్లా పెద్దగోపవరంలో దుస్థితి

3లో





మనవడు దేవాన్ష్‌కు ఉగాది పంచాంగాన్ని చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో సీఎం సతీమణి భువనేశ్వరి ● విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ఉగాది వేడుకలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా కళారత్న పురస్కారాలను అందుకుంటున్న సినీగేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి, నటుడు జయప్రకాశ్‌రెడ్డి, సంగీత దర్శకురాలు శ్రీలేఖ

ఆంధ్రాపై యుద్ధం చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రులై, కేబినెట్‌లోకి వచ్చిన వారి దగ్గరకు ఎలాంటి భేషజం లేకుండా నాలుగేళ్లు ఎంతో ఓపికగా తిరిగానన్నారు. మా రాష్ట్రానికి న్యాయం చేయండి, మేం అడిగేవి గొంతెమ్మ కోరికలు కావంటూ అడిగినా.. కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం లెక్కచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరి బడ్జెట్ చూసిన తర్వాత తాను ఇక భరించలేకపోయానంటూ చంద్రబాబు పేర్కొన్నారు. తాను ఎక్కడా ఏ తప్పు చేయలేదన్నారు. రాష్ట్రంలోని ప్రత్యేకమైన రాజకీయాలను వినియోగించుకుని ఒక పార్టీ(వైకాపా) కేసులు మాఫీ కోసం వెళితే కేంద్రం వారిని అడ్డం పెట్టుకుంటోందని ఆరోపించారు. మరొకరిని(పవన్ కల్యాణ్) ఉపయోగించుకుని ఎప్పుడూ లేని విధంగా నాలుగేళ్లు తమతో బాగుండి.. ఒక్కసారిగా తమపై విరుచుకుపడేలా చేశారన్నారు. కేంద్రంలో మంత్రి పదవులు, గవర్నర్ పదవులను అడగలేదని, పైగా రాష్ట్రానికి న్యాయం జరుగుతుందని తానే రెండుసార్లు ఒక ఎంపీని వారికి ఇచ్చానన్నారు. కేంద్రం సహాయ నిరాకరణ చేస్తూ మనకు వ్యతిరేకంగా పనిచేస్తుంటే.. ఇక్కడి వాళ్లు కొందరు రాష్ట్రంలో ఏదో జరిగిపోయిందన్నట్టు అశాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నిస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. కేంద్రాన్ని వదిలేసి ఇక్కడికొచ్చి తనపై విరుచుకుపడుతున్నారని, ఇది మంచిది కాదని హితవు పలికారు.

చెన్నై, హైదరాబాద్ లాంటి నగరం వద్దా?

తెలుగువాళ్లు ప్రపంచంలోనే శక్తిమంతమైన జాతిగా తయారవ్వాలనేది తన ఆకాంక్ష అని, దాని కోసం ఎలాంటి సహకారం అందించడానికైనా తాను సిద్ధమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో కట్టుబట్టలతో ఇక్కడికి వచ్చి ఒక్కో పనిని త్వరితగతిన చేపడుతూ, పరిపాలనపై పట్టు సాధించామన్నారు. దేశంలో ఏ రాష్ట్రం సాధించలేని ప్రగతిని ఆంధ్రప్రదేశ్ సాధించిందంటే ప్రజలు, ప్రభుత్వం పట్టుదల వల్లే సాధ్యమైందని తెలిపారు. తాను ఒక్క పిలుపు ఇస్తే రైతులు ముందుకొచ్చి 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం అందజేయడం దేశ చరిత్రలోనే ఎక్కడా జరగలేదని పేర్కొన్నారు. ఇటీవల కొందరు ఎందుకింత భూమి అంటూ కొందరు వివాదం చేస్తున్నారని, ప్రపంచంలో ఎక్కడైనా ఓ నగరం నిర్మాణమైతే అది ఆకాశంలో కాదు.. నేలపైనే జరగాలని చంద్రబాబు అన్నారు. తాను ఇప్పటికే తాత్కాలిక సచివాలయం నిర్మాణం చేపట్టానని, ఇదే సరిపోతుందనుకుంటే ఇంకేం కట్టాల్సిన పనిలేదన్నారు. తమిళనాడుకు చెన్నై, తెలంగాణకు హైదరాబాద్, కర్ణాటకకు బెంగళూర్, మహారాష్ట్రకు ముంబయి ఉన్నట్టే.. తెలుగు వారికి కూడా అలాంటి ఓ నగరం ఉండాలా వద్దా అనేది అంతా ఆలోచించాలని అన్నారు. అందుకే ఎంత మంది ఎన్ని మాట్లాడినా.. వెనక్కి తగ్గకుండా ఓ బ్రహ్మాండమైన నగర నిర్మాణం చేపట్టే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుందని వెల్లడించారు.

మన పంచాంగం వారసత్వ సంపద

ఉగాది పచ్చడి మాదిరిగానే జీవితంలో అన్నీ సమపాళ్లలో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలతో పాటూ పంచాంగం కూడా వారసత్వంగా తెలుగు వారికి వచ్చిందన్నారు. పంచాంగ శ్రవణంతో మొదలైన ఈ ఏడాదంతా అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానన్నారు. రాష్ట్రంలోని సంప్రదాయ కళలు, కళాకారులను ప్రోత్సహించే క్రమంలో భాగంగానే సాంస్కృతికశాఖకు తొలిసారిగా రూ.86 కోట్ల బడ్జెట్ కేటాయించామన్నారు. 6,746మంది కళాకారులకు నెలకు రూ.1500 మంది చొప్పున పింఛన్లను ఇస్తున్నామన్నారు. షెడ్యూలు కులాల్లోని డప్పు కళాకారులకు సైతం త్వరలోనే పింఛన్లను అందజేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా 47మందికి కళారత్న అవార్డులు, 99 మంది ఉగాది పురస్కారాలను అందజేశారు. కొండపల్లి ఎడ్లబండి మరబొమ్మ నమూనాల పోటీలలో విజేతలైన ముగ్గురికి నగదు బహుమతులను ఇచ్చారు. సాధారణ, వ్యవసాయం, ఉద్యాన, పోలవరం పంచాంగాలను ముఖ్యమంత్రి చేతులమీదుగా ఆవిష్కరించారు. మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, భూమా అఖిలప్రియ తదితరులు పాల్గొన్నారు.

కందులన్నీ మనమే కొందాం

ఈనాడు, అమరావతి: రైతులకు ఎలాంటి ఇబ్బంది రానీయకుండా.. ఈఏడాది ఖరీఫ్‌లో పండిన కందుల నిల్వలన్నీ మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అవసరమైన నిధుల్ని మంజూరు చేసింది. ఉగాది సందర్భంగా సీఎం చంద్రబాబు పలు అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

రాష్ట్రంలో ఈ ఏడాది 2లక్షల టన్నుల కంది ఉత్పత్తి వచ్చింది. నాఫెడ్ ద్వారా 45వేల టన్నులు మాత్రమే మద్దతు ధరపై సేకరించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. మరో 55వేల టన్నులకు అనుమతి ఇవ్వాలని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు కేంద్రానికి లేఖ రాశారు. అయితే తాజాగా 12వేల టన్నులను తీసుకునేందుకే అక్కడ నుంచి అంగీకారం వచ్చింది. మరోవైపు రైతులు కందులతో కొనుగోలు కేంద్రాలకు భారీ ఎత్తున తరలివస్తున్నారు. కేంద్రం ఇచ్చిన అనుమతి మేరకు వీరందరి వద్ద నుంచి తీసుకునే అవకాశం లేకపోవడంతో మార్క్‌ఫెడ్ అధికారులు వీరికి టోకెన్లు ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. కర్షకులు పడుతున్న ఇబ్బందులు గుర్తించిన ప్రభుత్వం వారి వద్ద ఉన్న కందులన్నీ కొనాలని మార్క్‌ఫెడ్‌కు ఆదేశాలిచ్చింది. ఖరీఫ్‌లో పండించిన ఉత్పత్తి మొత్తం సేకరించాలని సూచించింది.

రూ.50 కోట్ల విడుదలకు ఆదేశం

ఇప్పటిదాకా ఒక్కో రైతు నుంచి 20 క్వింటాళ్లు మాత్రమే కందులు కొనుగోలు చేయాలనే నిబంధన ఉంది. రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న డిమాండ్ల నేపథ్యంలో దీన్ని సడలిస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి ఒక్కో రైతు నుంచి 25 క్వింటాళ్ల వరకు తీసుకోవాలని స్పష్టం చేశారు. సేకరణకు అవసరమయ్యే నిధులను మార్క్‌ఫెడ్ సమకూర్చుకుంటే ప్రభుత్వం హామీ ఇస్తుంది. పంట ఉత్పత్తి సేకరణ ఖర్చులు, అమ్మకం సమయంలో వచ్చే నష్టాన్ని కూడా ప్రభుత్వమే భరించనుంది. మార్కెటింగ్ నిధుల నుంచి రూ.50కోట్లు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. రైతుల నుంచి తీసుకున్న కందులను కొనుగోలు ధరకే వివిధ శాఖలకు ఇస్తారు. వారు పప్పు చేయించి పంపిణీ చేస్తారు.

కరవు మండలాల్లో అదనపు పనిదినాలు

రాష్ట్రంలో రెండో విడతగా 18 కరవు మండలాలను ప్రకటించారు. ఇక్కడ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అదనంగా 50 పనిదినాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

క్యాన్సర్ రోగుల్లో ఆత్మహత్య ముప్పు

లండన్: మూత్రపిండాలు, మూత్రాశయ, ప్రొస్టేట్ క్యాన్సర్ బాధితుల్లో "ఆత్మహత్యకు పాల్పడే ముప్పు" ఐదు రెట్లు ఎక్కువగా ఉంటుందని తాజా అధ్యయనంలో తేలింది. బ్రిటన్‌లోని బర్మింగ్హామ్ వర్సిటీ నిపుణులు చేపట్టిన ఈ పరిశోధనకు భారత సంతతి నిపుణులు ప్రశాంత్ పటేల్ నేతృత్వం వహించడం విశేషం. 2001 నుంచి 2011 మధ్య ఇంగ్లండ్, వేల్స్‌లలోని భిన్న ఆసుపత్రుల్లోని క్యాన్సర్ రోగుల సమాచారాన్ని వీరు విశ్లేషించారు. దీన్ని ఇతరులతో సరిపోల్చారు. దీంతో క్యాన్సర్ రోగులు ఆత్మహత్యలకు పాల్పడే ముప్పు సగటున మూడు రెట్లు ఎక్కువని తేలింది. ప్రొస్టేట్, మూత్రకోశం లాంటి ప్రత్యుత్పత్తి భాగాలను చుట్టుముట్టే క్యాన్సర్ బాధితుల్లో ఈ ముప్పు మరింత ఎక్కువని బయటపడింది. క్యాన్సర్ చికిత్స సమయంలో ఒత్తిడి, కుంగుబాటే ఆత్మహత్య భావనలు పెరిగేందుకు కారణమని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పార్టీలకు అందే విదేశీ నిధుల పరిశీలన ఉండదు!

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

దిల్లీ: రాజకీయ పార్టీలకు అందే విదేశీ నిధుల వివరాలు వెలుగుచూసే అవకాశమే ఉండకపోవచ్చు. విదేశాల నుంచి అందే నిధుల వివరాలను పరిశీలించకుండా రాజకీయపార్టీలకు మినహాయింపునిస్తూ రూపొందించిన బిల్లును లోక్‌సభ ఆమోదించింది. దీనిపై అసలు ఎక్కడా చర్చ అన్నదే జరగలేదు. బుధవారం ఈ బిల్లును లోక్‌సభ తీవ్ర గందరగోళం, ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆమోదించేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టంలో పేర్కొన్న కొన్ని నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలు విదేశీ నిధులను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరాదు. ఇక, 'విదేశీ నిధుల (నియంత్రణ)చట్టం-2010 ప్రకారం విదేశీ సంస్థలేవీ కూడా రాజకీయ పార్టీలకు నిధులనుఅందచేయనే కూడదు. అయితే, ఈ విదేశీ నిధుల(నియంత్రణ) చట్టానికి భాజపా 2016లో సవరణ తెచ్చింది.

కూర్చుని కాలం గడిపేయకండి

ఇలాంటి జీవనశైలితో మధుమేహుల కుటుంబ సభ్యులకు తీవ్ర హాని!

లండన్: శారీరక కష్టం చేయకుండా... టీవీ, కంప్యూటర్ల ముందు కూర్చుని రోజులు గడిపేసేవారికి కష్టకాలం తప్పదట! కుటుంబ సభ్యుల్లో టైప్-2 మధుమేహం ఉన్నవారికైతే... ఇలాంటి జీవనశైలి మరీ హానికరమని లైవ్‌పూల్ విశ్వవిద్యాలయ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. కెల్లీ బౌడెన్ డేవిస్ బృందం- రోజూవ్యాయామంచేసే 45మంది ఆరోగ్య పరిస్థితిని2వారాలు పరిశీలిస్తూ వచ్చారు. వీరిలో 16 మంది కుటుంబ సభ్యులు మధుమేహం బాధితులు. ఆ తర్వాత వారందరికీ 14 రోజులపాటు వ్యాయామ విరామం ఇచ్చి చూడగా- అందరి శరీరాలు, రక్తంలోనూ కొవ్వు శాతం పెరిగింది. కుటుంబంలో మధుమేహ చరిత్ర ఉన్నవారిలో వాటి స్థాయులు మరింత ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిధులే ప్రధాన అడ్డంకి

(మొదటి పేజీ తరువాయి)

అది రూ.54113.40 కోట్లుగా లెక్కించినట్లు. ఇవి కేంద్ర జలసంఘం పరిశీలనలో ఉన్నాయి. అనేక ప్రశ్నలు అక్కడ లేవనెత్తితే... వాటికి రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు సమాధానాలు ఇస్తూ వస్తున్నారు. జాతీయ ప్రాజెక్టుగా ఆమోదించిన తర్వాత 2018 జనవరి వరకు రాష్ట్రం రూ.7918.04 కోట్లు ఖర్చు చేస్తే ఈ ఏడాది మార్చి 6 వరకు కేంద్రం ఇచ్చింది రూ. 5349.70 కోట్లు. ఇంకా రూ.2568.34 కోట్లు రావాల్సి ఉంది. ఇందులో రూ.780 కోట్లు తాజా అంచనాలకు కేంద్రం ఆమోదిస్తే తప్ప వచ్చే అవకాశం లేదు. 2019 డిసెంబర్ నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి గడ్కరీ చెబుతున్నారు. రాష్ట్రమూ అదే చెబుతోంది. వచ్చే 20 నెలల కాలంలో దాదాపు రూ.40 వేల కోట్లు ఈ ప్రాజెక్టుకు అవసరమవుతాయి. ఈ ప్రాజెక్టు వేగంగా పూర్తి చేయించే క్రమంలో కేంద్రం నుంచి అందాల్సిన సాయానికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 12సార్లు దిల్లీకి వెళ్లి ప్రధానిమంత్రితో పాటు కేంద్ర ఆర్థిక, జలవనరులశాఖ మంత్రులతో కూడా మాట్లాడి వచ్చారు. ఈ నేపథ్యంలో రాష్ట్రం ఖర్చు చేసిన మొత్తం సకాలంలో కేంద్రం తిరిగి చెల్లించేలా ప్రక్రియ వేగవంతం కావాలి. అప్పుడే రాష్ట్ర ప్రజల కలలు నెరవేరుతాయి.

2014 నుంచి ఏం జరుగుతూ వస్తోంది

- హామీ: 2014 ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఈ ప్రాజెక్టుకు కేంద్రం జాతీయ హోదా ఇచ్చింది. 1.4.2014 నాటికి ఈ ప్రాజెక్టుకు అయ్యే పూర్తి వ్యయాన్ని తామే భరిస్తామని కేంద్రం పేర్కొంది. అవసరమైన అన్ని అనుమతులు కేంద్రమే తీసుకువస్తుంది.
- చట్టం: 2014 రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 90లో పొందుపరిచారు.
- ప్రాజెక్టు వల్ల ముంపులో చిక్కుకునే 7 మండలాలను తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు బదలాయిస్తూ ప్రస్తుత కేంద్ర మంత్రిమండలి తొలి సమావేశంలో విభజన చట్టానికి సవరణ చేస్తూ నిర్ణయం తీసుకుంది. 2014 మే 29న ఆర్డినెన్సు తీసుకువచ్చారు.

కేంద్ర మంత్రిమండలిలో ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు?

1. 2016 డిసెంబర్ 20 నాటి కేబినెట్ ముసాయిదా నోట్ అనుబంధం (ఈ) ప్రకారం ప్రాజెక్టును కేంద్రమే నిర్మిస్తూ... పూర్తి స్థాయి పునరావాస ఖర్చులను కూడా చెల్లిస్తుంది.
2. 2017 మార్చి 15న కేంద్ర మంత్రిమండలి ఆమోదం ప్రకారం ఈ దిగువ నిర్ణయాలు తీసుకున్నారు.

ఎ. నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సూచనల మేరకు ప్రాజెక్టును కేంద్రం బదులుగా రాష్ట్రమే నిర్మించేందుకు అంగీకారం.

బి. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో సాగునీటి వసతికి 1.4.2014 నాటికి ఎంత వ్యయమవుతుందో అందులో ఆ నాటి వరకు అయిన ఖర్చును మినహాయించి మిగిలిన మొత్తం కేంద్రమే భరిస్తుంది. (అంటే ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2005లోనే ప్రారంభించారు. అప్పట్లో సత్వర సాగునీటి ప్రయోజన పథకం కింద కేంద్రం చేర్చింది. ఆ మేరకు కేంద్రం కొంత సాయం చేస్తూ వచ్చింది.)

సి. 1.4..2014 నాటి ముందు చేసిన ఖర్చు గానీ, 1.4.2014 నాటి అంచనాలకు మించి ఆ తర్వాత ఖర్చయ్యే మొత్తం గానీ కేంద్రం ఇవ్వబోదు. (అంటే 2013-14 ధరలతో ప్రాజెక్టు వ్యయాన్ని లెక్కించి తయారు చేసిన అంచనాల మేరకే కేంద్రం నిధులు ఇస్తుంది. ఆ తర్వాత ప్రాజెక్టు ఎప్పటికి పూర్తి చేసినా ఆ తర్వాత పెరిగిన ధరల మేరకు ప్రాజెక్టు వ్యయాన్ని కేంద్రం భరించబోదని దీని అర్థం.)

- 2017 ఆగస్టు 16న కేంద్ర మంత్రిమండలి ఆమోదించిన ప్రకారం... 2019-20 ఆర్థిక సంవత్సరం చివరి వరకు ప్రాజెక్టుకు రూ.23814.70 కోట్లు నాబార్డు ద్వారా ఇచ్చేందుకు ఆమోదం.
- 2017 ఆగస్టు 16న రూ.58,319.06 కోట్ల అంచనాతో సవరించిన అంచనాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర జలసంఘానికి సమర్పించింది.
- కేంద్ర జలసంఘం పరిశీలనలను పరిగణనలోకి తీసుకుని రూ.57,940.86 కోట్ల అంచనాలతో తిరిగి 2018 జనవరి 2న సవరించిన అంచనాలు కేంద్రానికి సమర్పించారు. వీటిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి.

సవరించిన అంచనాలపై ఎన్నో ప్రశ్నలు

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 2013-14 ధరల మేరకు సవరించిన అంచనాలతో ఇప్పటికే రాష్ట్ర జలవనరులశాఖ కేంద్రానికి పూర్తి స్థాయి ప్రాజెక్టు నివేదిక పంపింది. వారి నుంచి వచ్చిన అనుమానాలను నివృత్తి చేస్తూ మళ్లీ మార్పులు చేస్తూ మరోసారి నివేదిక ఇచ్చింది. వీటిపై కేంద్ర జలసంఘం నుంచి అనేక ప్రశ్నలు రాష్ట్రానికి ఇంకా వస్తూనే ఉన్నాయి. పునరావాసం, భూసేకరణ, ఎడమ-కుడి కాలువల్లో కట్టడాలకు సంబంధించి పెరిగిన పని పరిమాణంపైనా అనేక ప్రశ్నలు వ్యక్తం చేశారు. రాష్ట్ర జలవనరులశాఖ అధికారులు శశిభూషణ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావులు దిల్లీ వెళ్లి జలసంఘం అధికారుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కేంద్ర జలసంఘం పూర్తి స్థాయిలో అనుమానాలు నివృత్తి చేసుకున్న తర్వాత మరో రెండు దశలు పూర్తయితేనే కొత్త డీపీఆర్ ఆమోదం పొందుతుంది. ఆ తర్వాతే నిధులు రాష్ట్రానికి వస్తాయి.

వివాహేతర సంబంధానికి ఇద్దరి బలి

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడ), న్యూస్‌టుడే: వివాహితులైన ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. ఇద్దరి కుటుంబ సభ్యులకు తెలిసిపోవడంతో వివాదం పోలీసులవరకూ వెళ్లింది. ఈ నేపథ్యంలో మనస్తాపానికి చెందిన ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ లూనాసెంటర్‌కు చెందిన కనగాల శ్యాంప్రసాద్(36)కు వివాహమై ఇద్దరు పిల్లలు సంతానం. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్న అతనికి మధురానగర్‌కు చెందిన ఓ వివాహిత(35)తో పరిచయం ఏర్పడింది. ఆమెకు కూడా ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారిద్దరూ కొంత కాలంగా సహజీవనం చేస్తున్నారు. వివాహిత భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇద్దర్నీ సత్యనారాయణపురం పోలీసులు పిలిపించి హెచ్చరించడంతో శ్యాంప్రసాద్ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది జరిగిన కొన్ని గంటలకే ఆ వివాహిత కూడా ఇంట్లో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఈ సంఘటనలపై రెండు పోలీస్‌స్టేషన్లలో అనుమానాస్పద మృతి కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరిహద్దుల్లో పాక్ దళాల విధ్వంసం



ఆదివారం పూంచ్ సెక్టార్‌లోని బల్కోట్‌లో పాకిస్థాన్ దాడుల్లో గాయపడిన చిన్నారులు

- ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి మృతి

జమ్మూ: సరిహద్దుల్లో పాకిస్థాన్ బలగాలు మరోసారి పేట్రేగిపోయాయి. నియంత్రణ రేఖ(ఎల్‌వోసీ) వెంబడి భారత గ్రామాలను లక్ష్యంగా చేసుకొని ఆదివారం మోర్టారు బాంబుల వర్షం కురిపించాయి. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురిని బలితీసుకున్నాయి. మృతుల్లో అన్నదమ్ములైన ముగ్గురు మైనరు బాలురు ఉన్నారు. పాక్ కాల్పుల్లో ఐదుగురు సైనికులు గాయపడ్డారని.. వారిలో జూనియర్ కమిషన్డ్ స్థాయి అధికారి కూడా ఉన్నారని సైన్యాధికారి ఒకరు వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో ఎల్‌వోసీకి దాదాపు 3-4 కిలోమీటర్ల దూరంలోని భారత గ్రామాలపై పాక్ దళాలు ఎలాంటి కవ్వింపులు లేకుండానే విచక్షణరహితంగా నాలుగు గంటలపాటు కాల్పులు జరిపాయని అధికారవర్గాలు వెల్లడించాయి. భారత బలగాలు ఈ కాల్పులను సమర్థంగా తిప్పికొట్టాయని తెలిపాయి. పాక్ దళాలు ప్రయోగించిన షెల్ బాంబు తాకడంతో బాలకోటె సెక్టార్‌లోని దేవతా సర్గ్లూన్ గ్రామంలో ఓ ఇంట్లో ఉన్న ఐదుగురు దుర్మరణం పాలయ్యారని పేర్కొన్నాయి. మృతులను మహమ్మద్ రంజాన్(35) ఆయన భార్య మలికా బీ(32), వారి కుమారులు అబ్దుల్ రెహ్మాన్(14), మహమ్మద్ రిజ్వాన్(12), రజాక్(7)గా అధికారులు గుర్తించారు. రంజాన్ కుమార్తెలు నస్రీన్(11), మహ్రీన్(5) గాయపడ్డారని.. వారిని వాయుమార్గంలో జమ్ముకు తరలించి చికిత్స అందిస్తున్నామని వెల్లడించారు.

గ్రహం అనుగ్రహం

19-3-2018 సోమవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
విదియ: సా. 5-58 తదుపరి తదియ
రేవతి నక్షత్రం: రా. 8-21 తదుపరి అశ్విని
అమృత ఘడియలు: సా. 5-56 నుంచి 7-32 వరకు
వర్జ్యం: ఉ. 8-15 నుంచి 9-52 వరకు
దుర్ముహూర్తం: మ. 12-32 నుంచి 1-20 వరకు
తిరిగి మ. 2-56 నుంచి 3-44 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-10; సూర్యాస్తమయం: సా.6-07
చంద్రదర్శనం

మరో ప్రయత్నం

(మొదటి పేజీ తరువాయి)

కింద సాధారణ తీర్మానం తరహాలో దాన్ని ప్రతిపాదిస్తారు. సంకీర్ణ ప్రభుత్వాల శకం ప్రారంభమయ్యాక ఏ పార్టీకీ స్పష్టమైన మెజార్టీ రావడంలేదు. మెజార్టీ సభ్యుల మద్దతున్న కూటమికి నేతృత్వం వహించే వ్యక్తిని రాష్ట్రపతి ప్రధానమంత్రిగా నియమించడం, బాధ్యతలు చేపట్టాక ఆయన మెజార్టీ నిరూపించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. 1998లో మెజార్టీ ఎంపీలు లేఖలు ఇవ్వడంతో అప్పటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్.. వాజ్‌పేయిని ప్రధానిగా నియమించారు. పదిరోజుల్లోపు సభ విశ్వాసం పొందాలని సూచించారు.

దానికంటే ముందు కొన్ని సందర్భాల్లో ప్రధానమంత్రులు విశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చి, సభలో వాటిని ప్రతిపాదించకముందే రాజీనామాలు చేసిన ఉదంతాలు ఉన్నాయి. 1979 ఆగస్టు 20న చరణ్ సింగ్, 1996 మే 28న వాజ్‌పేయి ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు.

- లోక్‌సభలో ఇప్పటివరకూ 13 విశ్వాస తీర్మానాలపై చర్చ జరిగింది. అయిదుగురు ప్రధానులు రాజీనామా చేయాల్సి వచ్చింది. వాజ్‌పేయి ప్రభుత్వం రెండుసార్లు విశ్వాస తీర్మానంలో ఓడిపోయింది.
- 1989లో ప్రధానిగా చేపట్టిన వెంటనే విశ్వాసపరీక్షలో నెగ్గిన వీపీ సింగ్ 1999 నవంబర్ 7న జరిగిన విశ్వాస పరీక్షలో ఓడిపోయారు. ఆనాడు వీపీసింగ్ ప్రభుత్వానికి భాజపా ప్రభుత్వం మద్దతు ఉపసంహరించడం, చంద్రశేఖర్ వర్గం భాజపాతో చేతులు కలపడంతో వీపీసింగ్ ప్రభుత్వం విశ్వాసం కోల్పోయింది.
- 1997 ఏప్రిల్ 11న హెచ్‌డీదేవెగౌడ ప్రభుత్వం కూడా సభ విశ్వాసం చూరగొనలేక దిగిపోయింది. కాంగ్రెస్ పార్టీ దేవేగౌడ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించడంతో ఆయన విశ్వాసం నిరూపించుకోవాల్సి వచ్చింది.
- 1999 ఏప్రిల్ 17వ తేదీన వాజ్‌పేయి ప్రభుత్వం. చరిత్రలో తొలిసారిగా ఒక్క ఓటు తేడాతో విశ్వాస పరీక్ష ఓడిపోయింది. అన్నాడీఎంకే అధినాయకురాలు జయలలిత మద్దతు ఉపసంహరించడంతో వాజ్‌పేయి విశ్వాసం నిరూపించుకోవాల్సి వచ్చింది. అప్పట్లో ప్రభుత్వానికి మద్దతుగా 269, వ్యతిరేకంగా 270 ఓట్లుపడ్డాయి. మిత్రపక్షంగా ఉన్న నేషనల్ కాన్ఫరెన్స్ సభ్యుడు సైపుద్దీన్‌సోజ్ ఫిరాయించడం, ఒడిశా సీఎంగా ఉన్న గిరిధర్ గమాంగ్ లోక్‌సభకు వచ్చి ఓటేయడం వాజ్‌పేయి ప్రభుత్వ ఓటమికి దారితీసింది.
- 1990లో చంద్రశేఖర్, 1991, 1993లో పీవీనరసింహారావు, 1996లో దేవేగౌడ, 1997లో ఐకే గుజ్రాల్, 1998లో వాజ్‌పేయి, 2008లో మన్మోహన్‌సింగ్‌లు విశ్వాస తీర్మానాలు ప్రతిపాదించి నెగ్గారు.
- 2008 నాటి విశ్వాస పరీక్షలో.. తమకు లంచాలు ఇచ్చారంటూ కొందరు ఎంపీలు నగదుతో సహా సభలోకి వచ్చి కలకలం సృష్టించారు. 1993లో పరీక్షలో 'జేఎంఎం లంచం కేసు' తెరపైకి వచ్చింది.

ముప్పేమీ లేకున్నా..

ప్రస్తుత అవిశ్వాస తీర్మానం వల్ల మోదీ ప్రభుత్వానికి వాటిల్లే ముప్పేమీలేదు. భాజపాకు సొంతంగానే మెజార్టీ ఉంది. అదనంగా మిత్రపక్షాల బలమూ ఉంది. అయితే మాజీ మిత్రపక్షమే అవిశ్వాసాన్ని ప్రతిపాదించడం ఒకింత ఇబ్బందికర పరిణామం. తీర్మానం చర్చకొస్తే.. ఈ నాలుగేళ్లలో మోదీ ప్రభుత్వ 'వైఫల్యాల'ను ప్రతిపక్షాలు తవ్విపోసే అవకాశం ఉంది.

సభలో గందరగోళం నెలకొన్నప్పటికీ ఆర్థిక, ద్రవ్య వినిమయ బిల్లులను ఆమోదింపచేసుకున్న ప్రభుత్వం అవిశ్వాస తీర్మానాన్ని కూడా అదే తరహాలో చర్చకు అనుమతించాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి. అయితే సభ సజావుగా లేదన్న కారణంతో 2014లో అవిశ్వాస నోటీసులను చర్చకు తీసుకోకుండా కాంగ్రెస్ తోసిపుచ్చింది. దాన్ని ఆధారంగా తీసుకొని నేటి ప్రభుత్వమూ ముందుకెళ్లే అవకాశం ఉంది.

అవిశ్వాస పరీక్షలు

- 1952 నుంచి ఇప్పటివరకూ 26సార్లు లోక్‌సభలో అవిశ్వాస తీర్మానాలు ప్రతిపాదించారు. ఆంధ్రప్రదేశ్ విభజన సమస్యపై 2014 ఫిబ్రవరి 6న తెదేపా ఎంపీలు మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇచ్చారు. సభలో గందరగోళం నెలకొన్న కారణంగా అవి చర్చకు రాలేదు.
- తొలి అవిశ్వాస తీర్మానం 1963 ఆగస్టులో అప్పటి నెహ్రూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జేబీ కృపలానీ ప్రతిపాదించారు. భారత్-చైనా యుద్ధంలో ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా ఆయన ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం 347 ఓట్ల తేడాతో ఓడిపోయింది.
- ఇందిరాగాంధీ అత్యధికంగా 15 అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొన్నారు. అన్నింట్లోనూ ఆమె విజయవంతంగా బయటపడగలిగారు.
- 2003లో వాజ్‌పేయి ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోనియాగాంధీ ప్రవేశపెట్టిన అవిశ్వాసం 314-189 ఓట్ల తేడాతో వీగిపోయింది.

తెదేపా మూడోసారి..

తెలుగుదేశం పార్టీ అవిశ్వాస నోటీసు ఇవ్వడం ఇది మూడోసారి. 1987లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అప్పటి తెదేపా లోక్‌సభాపక్షనేత సి.మాధవరెడ్డి అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించారు. అది మూజువాణి ఓటుతో వీగిపోయింది. 2014 ఫిబ్రవరిలో మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోటీసు ఇచ్చారు. అది చర్చకు రాలేదు. ఇప్పుడు తెదేపా లోక్‌సభాపక్షనేత తోటనరసింహం మూడోసారి ప్రతిపాదించారు.

పార్లమెంటు సమావేశాలు ముగిసేవరకూ సభకు హాజరుకావాలి

దిల్లీ: పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ తమ పార్టీ ఎంపీలంతా తప్పనిసరిగా ఉభయ సభలకు హాజరుకావాలని తెదేపా ఆదివారం ఒక విప్ జారీ చేసింది. కేంద్రంలోని ఎన్డీయే సర్కారుపై ఆ పార్టీ అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఈ ఆదేశం వెలువడింది.

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	39.5	22.0
శ్రీకాకుళం	37.0	21.0
గుంటూరు	36.5	22.1
సూర్యాపేట	36.0	27.0
కర్నూలు	36.0	23.0
కడప	36.0	22.0
ఖమ్మం	36.0	22.0
విశాఖపట్నం	36.0	21.2
నిజామాబాద్	36.0	21.0
రామగుండం	35.8	20.6
తిరుపతి	35.6	23.1
ఆదిలాబాద్	35.5	18.1
విజయవాడ	35.2	22.0
మెదక్	34.8	18.9
ఒంగోలు	34.3	24.6
మహబూబ్‌నగర్	34.0	21.0
హైదరాబాద్	33.8	21.3
అనంతపురం	33.2	23.4
నరసాపురం	33.2	22.5
నెల్లూరు	33.0	24.0
కరీంనగర్	32.0	23.0
తాడేపల్లిగూడెం	32.0	22.0
హన్మకొండ	30.0	21.0

కాలగర్భంలో 'మొల్ల' నివాసం

- ఆనవాళ్లు కోల్పోతున్న మహాకవయిత్రి ఇల్లు
- పరిరక్షించడంలో అంతులేని నిర్లక్ష్యం
- కడప జిల్లా పెద్దగోపవరంలో దుస్థితి





మహా కవయిత్రి మొల్ల విగ్రహం ★ ఆమె కూర్చుని రామాయణం రాసిన బండ ఇదే..

ఈనాడు, కడప: తెలుగు సాహితీ వినీలాకాశంలో ధ్రువతారగా వెలుగొందిన మహాకవయిత్రి మొల్ల. మొల్ల రామాయణంతో చరిత్రలో నిలిచిన ఆమె ఆనవాళ్లు కాలగర్భంలోకి చేరుతుండటం తెలుగు సాహితీ అభిమానులను ఆవేదనకు గురిచేస్తోంది. కడప-నెల్లూరు జాతీయ రహదారిపై బద్వేలుకు కూతవేటు దూరంలో ఉన్న గోపవరమే మొల్ల నివాసం. ఇక్కడి పెద్ద గోపవరంలో ఆమె నివసించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఆమె నివసించిన ఇల్లు పైకప్పు లేకపోగా.. మొండిగోడలతో దర్శనమిస్తోంది. ఇప్పటికీ ఈ ఇంటిని సందర్శించేందుకు సాహితీ అభిమానులు ఇక్కడికి వస్తుంటారు. ఆమె పూజించిన రామాలయం, అందులోని రాముడి విగ్రహాలు ఇప్పటికీ కనువిందు చేస్తున్నాయి. మొల్ల రామాయణం రచించినప్పుడు ఆమె కూర్చున్న బండ కూడా అలాగే ఉంది. ఇవన్నీ ఇప్పటి తరాలకు మహాకవయిత్రి తీపిగుర్తులే. ఎంతో వైశిష్ట్యం కలిగిన ఈ ఆనవాళ్లను పరిరక్షించడంలో ప్రభుత్వం నిర్లిప్తత ప్రదర్శిస్తుండటం ఇబ్బందిగా మారుతోంది.

మొక్కుబడిగానే నిధులు: ఈ సాహితీ కేంద్రాన్ని అభివృద్ధి చేసేందుకు 2008లో అప్పటి ప్రభుత్వం రూ.1.17 కోట్లు కేటాయించింది. ఆ నిధులతో పర్యటకశాఖ ఆధ్వర్యంలో గోపవరం వద్ద మొల్ల పేరుతో హరిత రెస్టారెంట్, పెద్ద గోపవరం గ్రామంలో ఉద్యానవనం ఏర్పాటుకు ప్రయత్నించారు. ఎకరా స్థలంలో ఉద్యానం ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఆ ప్రక్రియ అంతటితో ఆగిపోయింది. హరిత రెస్టారెంట్ మూతపడింది. దీంతో రూ.కోటి వృథా అయింది. మొల్ల ఆరాధించిన రామాలయ అభివృద్ధికి 2014లో దేవాదాయ శాఖ రూ.16 లక్షలు మంజూరు చేసింది. నిధులు ఖర్చు చేయకపోవడంతో అవీ మురిగిపోయాయి.

అభివృద్ధి జరగాలి

మహా కవయిత్రి మొల్ల నివసించిన ఈ ప్రాంతాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఆ దిశగా అడుగేయాలి. ప్రత్యేకంగా నిధులు వెచ్చించి గోపవరాన్ని అభివృద్ధి చేయాలి. గోపవరానికి మొల్ల గోపవరంగా నామకరణం చేయాలి. సాహితీ అభిమానులకు వెలకట్టలేని ఈ కేంద్రాన్ని పదిలం చేసి ఇవ్వడం ప్రభుత్వ విధి.

– గానుగపెంట హనుమంతరావు,
మొల్ల సాహితీపీఠం అధ్యక్షుడు, గోపవరం



పూరీలో జగన్నాథుని దర్శించుకుని బయటకు వచ్చిన రామ్‌నాథ్ కోవింద్ దంపతులకు జగన్నాథుని చిత్రపటం అందజేస్తున్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

భారత్-అమెరికా మంత్రుల చర్చలు వాయిదా!

వాషింగ్టన్: భారత్...అమెరికాల విదేశాంగ, రక్షణ మంత్రుల మధ్య తొలిసారిగా జరగాల్సి ఉన్న చర్చలు వాయిదా పడ్డాయి. అమెరికా నూతన విదేశాంగ మంత్రిగా మైక్ పాంపియో ఖరారు విషయంలో నెలకొన్న అనిశ్చితి ఇందుకు కారణమని సంబంధిత అధికారి ఒకరు వెల్లడించారు. వాస్తవానికి ఏప్రిల్ 18, 19 తేదీల్లో ఈ చర్చలు జరపాలని నిర్ణయించుకున్నారు.

ప్రభుత్వ విధానాలతోనే కోలుకోలేని స్థితి

- బాధిత రైతు కుటుంబాల పట్ల అధికారుల నిర్లక్ష్యం
- మానవ హక్కుల వేదిక సమన్వయ కమిటీ సభ్యుడు వీఎస్ కృష్ణ

కందుకూరు, న్యూస్‌టుడే: వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వం అనుసరిస్తున్న అన్యాయమైన విధానాలతోనే రైతులు కోలుకోలేని స్థితికి చేరుకుని ఆత్మహత్యలు చేసుకుంటున్నారని మానవ హక్కుల వేదిక తెలుగు రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు వి.ఎస్.కృష్ణ అన్నారు. ప్రకాశం జిల్లా కందుకూరు పట్టణంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కందుకూరు డివిజన్‌లోని వెలిగండ్ల, వలేటివారిపాలెం, కందుకూరు మండలాల్లో అప్పుల బాధలు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన రైతుల కుటుంబాలను ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడి ఆత్మహత్యలకు గల కారణాలను తెలుసుకున్నారు. రైతు కుటుంబాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఉందని తమ పరిశీలనలో గుర్తించామన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను ఆదుకునేలా ప్రత్యేక ప్యాకేజీతో కూడిన ఆర్థిక సహాయం, పునరావాస ఏర్పాటు కోసం ఉన్న జీవో నెంబర్ 62 ప్రకాశం జిల్లాలో సక్రమంగా అమలు కావడం లేదన్నారు. అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ కనీసం ఆయా గ్రామాలను సందర్శించకపోవడం బాధాకరమన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు ప్రకాశం జిల్లాలో 119 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడినట్టు వీఎస్ కృష్ణ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక ప్రతినిధి ఎం.బ్రహ్మయ్య పాల్గొన్నారు.



ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాల వివరాలు సేకరిస్తున్న వి.ఎస్.కృష్ణ

నేడు సమాచార కమిషనర్ల నియామకం

ఈనాడు, అమరావతి: సమాచార హక్కు కమిషనర్ల నియామకం సోమవారం జరగనుంది. ప్రధాన కమిషనర్‌తోపాటు మరో ఇద్దరు కమిషనర్ల నియామకం కోసం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో నిర్వహించే సమావేశానికి ముఖ్యమంత్రి హాజరుకానున్నారు.

కియాతో ఒప్పందాలు: అనంతపురం జిల్లాలో కియా మోటార్స్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్ల తయారీ కంపెనీ పనులను ఇటీవలే ముఖ్యమంత్రి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇదే సంస్థ ప్రభుత్వంతో సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి సమక్షంలో మరికొన్ని అవగాహన ఒప్పందాలు చేసుకోనుంది.

ఐఐటీ విద్యార్థులతో దేశ వికాసం సాధ్యం

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థులతోనే దేశ వికాసం సాధ్యమని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ఆదివారం జరిగిన భువనేశ్వర్ ఐఐటీ 6వ స్నాతకోత్సవంలో ఆయన కీలకోపన్యాసం చేశారు. పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయన్నారు. నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధికి కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఉదయం పూరీ జగన్నాథ ఆలయంలో రాష్ట్రపతి ప్రత్యేక పూజలు చేయించారు. 1947లో జగన్నాథ ఆలయాన్ని సందర్శించిన సందర్భంగా కోవింద్ తండ్రితో రిజిస్టర్‌లో తీసుకున్న సంతకాన్ని రాష్ట్రపతికి చూపించారు. తండ్రి సంతకం చూసిన తనకు ఎంతో ఆనందం కలిగిందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. భక్తులు స్వామిని మరింత సులభంగా దర్శించుకునేందుకు సౌకర్యాలు కల్పించాలని ఆలయ పాలనా కమిటీకి సూచించారు. అనంతరం పూరీలో ఉన్న జాతీయ సంస్కృతి సంస్థాన్(విద్యా సంస్థ) 100 సంవత్సరాల వేడుకల్లో పాల్గొన్నారు. పూరీని తూర్పు ప్రాంత కాశీగా ప్రస్తుతించారు. సాయంత్రం రాష్ట్రపతి ప్రత్యేక విమానంలో దిల్లీకి తిరిగి ప్రయాణమయ్యారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తదితరులు కోవింద్‌కు వీడ్కోలు పలికారు.

ట్రాక్టర్లు ఆటోలకు జీవితకాల పన్ను

మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: ట్రాక్టర్లు, ఆటోలకు జీవితకాల పన్ను(లైఫ్‌ట్యాక్స్) స్వీకరించే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడే రైతులు, చిన్నకుటుంబాల వారు ప్రతి 3 నెలలకు ఒకసారి తమ ట్రాక్టర్లు, ఆటోలకు పన్నులు చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించామన్నారు. వారికి వెసులుబాటు కల్పించేందుకు ఒకేసారి లైఫ్‌ట్యాక్స్ చెల్లించే విధానం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ఈ విషయాన్ని కేబినెట్ సమావేశంలో చర్చిస్తామని పేర్కొన్నారు.

శశికళ భర్త నటరాజన్‌కు తీవ్ర అస్వస్థత

నేడు పెరోల్‌కు శశికళ దరఖాస్తు



చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ భర్త నటరాజన్ శనివారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గుండెపోటు, శ్వాస సంబంధిత సమస్యలు రావడంతో ఆయన్ను చెన్నై శివారులోని గ్లోబల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నటరాజన్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని, కృత్రిమశ్వాస అందిస్తున్నట్టు గ్లోబల్ ఆస్పత్రి ఓ ప్రకటనలో తెలిపింది. కర్ణాటకలోని పరప్పన అగ్రహారం జైలులో ఉన్న శశికళ తన భర్తను చూసేందుకు సోమవారం పెరోల్ కోసం దరఖాస్తు చేసుకోనున్నట్లు సమాచారం. నటరాజన్ గత ఏడాది అక్టోబరులో అస్వస్థతకు గురవడంతో ఆయనకు మూత్రపిండం, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించిన విషయం తెలిసిందే. నెలపాటు ఆస్పత్రిలోనే వైద్యచికిత్సలు అందించాక గత ఏడాది నవంబరు 2న డిశ్చార్జి చేశారు. అప్పటినుంచి ఆయన నుంగంబాక్కం మహాలింగపురంలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన మళ్లీ తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఆస్పత్రికి తరలించారు. ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ ఆస్పత్రికి వెళ్లి నటరాజన్‌ను పరామర్శించారు.

ఆస్తి పంచివ్వలేదని తల్లి దారుణహత్య

తలతో పోలీస్‌స్టేషన్‌లో కుమారుడు లొంగుబాటు





రాణి (పాత చిత్రం), నిందితుడు ఆనంద్

చెన్నై, న్యూస్‌టుడే: ఆస్తి పంచివ్వలేదనే ఆగ్రహంతో కన్నతల్లినే దారుణంగా హతమార్చాడో కుమారుడు. ఆపై ఆమె తలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. తమిళనాడు రాష్ట్రం పుదుకోట్టై జిల్లాలో ఆదివారం ఈ దారుణం చోటుచేసుకుంది. ఆలంగుడి సమీపంలోని మరవన్‌పట్టికి చెందిన రాణికి నలుగురు కుమారులు. ఆమె భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. ఆస్తి పంపకాల కోసం పెద్దకుమారుడు ఆనంద్ తల్లితో గొడవ పడుతుండేవాడు. శనివారం రాత్రి కూడా ఆనంద్ ఇదే విషయాన్ని లేవనెత్తగా... తన ప్రాణం పోయినప్పటికీ చిల్లిగవ్వ కూడా ఇవ్వనని రాణి తెగేసి చెప్పారు. కొద్దిసేపటి తర్వాత గొడవ సద్దుమణిగింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం మళ్లీ అతడొచ్చి గొడవకు దిగాడు. తర్వాత వేట కొడవలితో తల్లి మెడ కోశాడు. ఆ తలను ఓ సంచిలో వేసుకుని కరంబకుడి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. మరవన్‌పట్టి గ్రామం మళైయూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో అక్కడి పోలీసులకు కరంబకుడి పోలీసులు సమాచారం ఇచ్చారు. అక్కడికి వెళ్లిన మళైయూర్ పోలీసులు రాణి మొండెం స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

ఈనాడు

అన్నదాతకెన్నడు అచ్ఛేదిన్?

ఎన్ని ఉగాదులు వెళ్లినా, శ్రమఫలంతో ఎన్నెన్ని గాదులు నింపి జాతికి అన్నం పెడుతున్నా బడుగురైతు బతుకంతా- కష్టాలే పెట్టుబడి, నష్టాలే దిగుబడి. రాబడి రాజపూజ్యం సున్నాగా, వ్యయం అవమాన భారాలే అధికంగా ఏళ్ల తరబడి ఏటికి ఎదురీదుతున్న రైతన్నల గ్రహస్థితికి ప్రకృతి ఉత్పాతాలూ తమవంతు పుణ్యం కట్టుకొంటున్నాయని తాజా అధ్యయనం చాటుతోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతి విపత్తులు కలగలసి 2005-'15 నడుమ దశాబ్దకాలంలో, ఒక్క అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనే ఆరు లక్షల 43 వేలకోట్ల రూపాయల విలువైన రైతుల కష్టార్జితాన్ని నేలపాలు చేశాయని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) అంచనా వేసింది. రైతుల పుట్టి ముంచడంలో కరవు కాటకాలదే ప్రధాన వాటా కాగా, వరదలు తుపాన్లు పంట తెగుళ్లు పశువ్యాధులు విషరసాయన వ్యర్థాల వంటివి వాటి వెన్నంటి ఉన్నాయని ఎఫ్ఏఓ నివేదిక చాటుతోంది. ప్రధానంగా ఆసియా దేశాల్లోని రైతుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయంటున్న ఎఫ్ఏఓ- దాదాపు మూడు లక్షల పాతిక వేలకోట్ల రూపాయల నష్టం ఇక్కడే సంభవించిందని స్పష్టీకరించింది. ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మందికి, అదే ఇండియాలో రమారమి 70 కోట్ల ప్రజావాహినికి వ్యవసాయమే జీవనోపాధి. భారతావనిలో 14 కోట్ల హెక్టార్ల సాగుయోగ్య భూములున్నాయన్న మాటేగాని- హెక్టారు లోపు చిన్న కమతాలే 80 శాతం ఉండగా, 68 శాతం భూభాగానికి కరవు కాటకాల ముప్పు పొంచే ఉంది. కాబట్టే ప్రపంచంలో తక్కిన దేశాలతో పోలిస్తే ఇండియాలో రైతుల బతుకులు అక్షరాలా గాలిలో దీపాలవుతున్నాయి. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న సంకల్పం చెప్పుకొన్న మోదీ ప్రభుత్వం- ఉత్పాదక ఖర్చులను నిర్దుష్టంగా లెక్కించి పంటల కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్ల మేర నిర్ధారిస్తామని మొన్నటి బడ్జెట్లో భరోసా ఇచ్చింది. మద్దతు ధర విషయంలో అన్ని ప్రధాన వ్యయాల్ని పరిగణనలోకి తీసుకొంటామన్న ప్రధాని మోదీ- తమ లెక్కలకు స్వామినాథన్ సిఫార్సులే గీటురాయి అని చెప్పకపోవడాన్నిబట్టే రైతన్న వ్యథ ఇప్పట్లో తీరేదికాదన్న సత్యం రూఢి అవుతోంది. అన్నదాతకు అచ్ఛే దిన్ ఇంకెప్పుడన్న ప్రశ్నకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే జవాబుదారీ!

వ్యవసాయ ప్రధాన దేశమన్న పేరేగాని స్థూల దేశీయోత్పత్తిలో ఆ రంగం వాటా ఆరున్నర దశాబ్దాల్లో 56.5 శాతం నుంచి 14 శాతానికి పడిపోయింది. రెండు దశాబ్దాల్లో మూడు లక్షల మందికి పైగా రైతుల బలవన్మరణాల నేపథ్యంలో ప్రాణాంతక సేద్యం లాయకీ కానేకాదంటూ ప్రతిరోజూ రెండు వేలమంది రైతులు కాడీమేడీ వదిలేస్తున్న దురవస్థ సాగులో సంక్షోభానికి అద్దం పడుతోంది. లక్షల ఎకరాల్లో పొలాలు స్థిరాస్తి వెంచర్లుగా మారిపోతుండటం- జాతి ఆహార భద్రతకూ పెనుముప్పుగా దాపురిస్తోంది. దీర్ఘకాలంలో దేశ సార్వభౌమాధికారానికే గొడ్డలిపెట్టు కాగల మహోపద్రవమిది! ఏ భారతీయ రైతూ... మణులు మాణిక్యాల్ని దోచిపెట్టమని అడగడం లేదే! ఏ వాణిజ్య వ్యాపారాల నిర్వహణకైనా లాభదాయకత ప్రామాణికమైనప్పుడు- నేలతల్లికి స్వేదాన్ని నైవేద్యం పెట్టి పండించే పంటకు గిట్టుబాటు ధర రైతు కోరడం తప్పు కాదే! దేశీయంగా మద్దతు ధరల పేరిట దశాబ్దాలుగా సాగుతున్నది మహా మాయాజాలం. మార్కెట్ ధరలు కనీసస్థాయి కన్నా దిగువకు పడిపోతే రైతును ఆదుకోవడానికే ఎంఎస్పీని కనీస ధరగా నిర్ణయించామన్న ప్రభుత్వం- దాన్ని పెంచడం సాధ్యం కాదంటూ 2015లో విడ్డూరవాదన వినిపించింది. ఉత్పత్తి వ్యయం కన్నా అధికంగా ఎంఎస్పీ నిర్ణయిస్తే సాగువ్యయాన్ని తగ్గించాలన్న సర్కారు లక్ష్యం దెబ్బతింటుందని, ద్రవ్యోల్బణమూ పెరుగుతుందనీ ఆందోళన వ్యక్తీకరించింది. అలా అసంబద్ధంగా నిర్ణయిస్తున్న అరకొర మద్దతూ దక్కక పొలమనే పద్మవ్యూహంలో దళారుల దగాకు బలైపోతున్న ప్రతి రైతూ ఓ అభిమన్యుడే. అన్నదాత వెన్నువిరిచి జాతి ఆహార భద్రతకు ప్రణాళికలల్లడం- క్రూరపరిహాసమే!

అన్ని రాష్ట్రాల నుంచి సాగుకు సంబంధించిన వివరాలు సేకరించి జాతీయ సగటు ఆధారంగా ప్రస్తుతం మద్దతు ధర నిర్ణయమవుతోంది. సాగు వ్యయం అధికంగా ఉండే రాష్ట్రాల్లోని రైతులకు అక్కడే అన్యాయం జరుగుతోంది. వరి పండించే అన్ని రాష్ట్రాల్ని లెక్కలోకి తీసుకొని సాగువ్యయం, కుటుంబ శ్రమ గణించి క్వింటా వరి ఉత్పాదనకు రూ.1,117 మాత్రమే ఖర్చు అవుతుందని దానికి కౌలు, సొంత పెట్టుబడి వడ్డీ కలిపితే రూ.1,484కు చేరుతుందని కేంద్ర కమిటీ నిర్ణయించింది. చివరకు క్వింటా వరికి రూ.1,550గా మద్దతు ధర నిర్ధారించడం ద్వారా- సాగు ఖర్చు, కుటుంబ శ్రమ కంటే 38.7 శాతం అధికంగా మద్దతు నిర్ధారించినట్లు సంబంధిత కమిటీ వెల్లడించింది. వాస్తవానికి, క్వింటా వరి సాగుకు రూ.2,158 ఖర్చు అవుతుందని, దానికి 50శాతం అదనంగా కలిపి రూ.3,237 మద్దతు ధరగా నిర్ణయించాలని తెలంగాణ కోరినా- కేంద్రం పెడచెవిన పెట్టింది. రాష్ట్రం కోరిన దాంట్లో సగం కూడా లేని మద్దతు ధర- సగటు రైతు గౌరవప్రద జీవనానికి భరోసా ఇచ్చేదేనా? ఏటికేడు పెరిగే జీవన వ్యయ సూచీలే ప్రాతిపదికగా ప్రభుత్వోద్యోగుల వేతన సవరణ సాగుతున్నప్పుడు- ఆ మానవీయ దృక్కోణం మద్దతు ధరల్లో ప్రతిఫలించక్కర్లేదా? కరవు కాటకాలు రానీ, తుపాన్లు వరదలు ముంచెత్తనీ- వాటి దుష్ప్రభావాలు రైతు నైతిక ధృతిని కదలబార్చలేని విధంగా జాతీయ రక్షణ ఛత్రం రూపొందాలి. మేలిమి విత్తనాలు ఎరువులతోపాటు లాభదాయక సేద్య పరిజ్ఞానం సుక్షేత్రాలకు చేరి, రైతు రాజులా బతికేలా గిట్టుబాటు ధరలు లభించి తీరాలి. పంటలకు అరకొర మద్దతు కాదు, రైతు గౌరవప్రద జీవనానికి గరిష్ఠ దన్ను సమకూరినప్పుడే జాతి ఆహార భద్రతకు భరోసా దక్కేది!

తెలుగు రైలుకు ఎర్రజెండా

రైల్వే పాలన వ్యవహారాల్లో ఎప్పుడూ రాజకీయాలదే పైచేయి. ప్రయాణికుల అవసరాలు, ప్రయోజనాల కన్నా పాలకుల ప్రాధాన్యాలకే రైల్వే శాఖ పట్టం కడుతుంది. అధికారంలో ఉన్నవారి అంతరంగానికి అనుగుణంగా నివేదికలు ఇస్తుంటుంది. నిర్ణయాలు తీసుకుంటుంది. విశాఖపట్నం రైల్వే జోన్ వ్యవహారమే ఇందుకు నిదర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సందర్భంగా విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటు తదితర హామీలను ఇచ్చారు. విభజన జరిగిన ఆరునెలల్లోగా ఆయా ప్రాజెక్టుల ప్రారంభానికి అవసరమైన పరిశీలన పూర్తి చేయాలని గడువు కూడా విధించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రైల్వే ప్రాజెక్టులు ఎంతో కీలకం. ఈ హామీలపై ఇప్పుడు రైల్వే శాఖ మాట మారుస్తోంది. కొత్త జోన్ ఏర్పాటు వల్ల ఆర్థికభారం పెరుగుతుందని, శాఖకు నష్టం వాటిల్లుతుందంటూ అర్థరహిత వాదనను తెరపైకి తీసుకువచ్చింది. తెలంగాణలో కీలకమైన కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (రైలుపెట్టెల కర్మాగారం)తోపాటు, రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలను రైల్వే నెట్‌వర్క్‌తో అనుసంధానం చేయాల్సిన కొత్త రైలు మార్గాలకు నిధులు రావడం లేదు. విభజన చట్టంలో చెప్పిన ఆరు నెలల గడువు ముగిసి మూడున్నరేళ్లవుతోంది. అయినా ఉలుకూపలుకూ లేదు. మొత్తం మీద రైల్వేశాఖ పరంగా తెలుగు రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతోంది.

అడుగు ముందుకు పడని ప్రాజెక్టులు

అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో చర్చించి, ఆమోదించిన విభజన చట్టంలోని ప్రాజెక్టులకే నిధుల కేటాయింపులు ఉండటం లేదు. చట్టంలో పేర్కొన్న మేరకు తెలంగాణలోని ప్రధాన పట్టణాలకు, హైదరాబాద్‌కు ఏపీ కొత్త రాజధాని అమరావతి నుంచి వేగవంతంగా ప్రయాణించేందుకు రైలుమార్గాలు నిర్మించాలి. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (రైలుపెట్టెల కర్మాగారం) ఏర్పాటుకు ఆరునెలల్లోగా పరిశీలన పూర్తిచేయాలి. 'విజయవాడ-గుంటూరు-తెనాలి' మెట్రో మార్గంపై విభజన జరిగిన ఏడాదిలోగా సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇచ్చి తదనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. ఈ ప్రాజెక్టుల పూర్తికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదు. అయినప్పటికీ అడుగు ముందుకు పడటం లేదు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ (రైలుపెట్టెల కర్మాగారం) ఆవశ్యకతపై విభజనకు ముందే ఎన్నో విన్నపాలు, ప్రతిపాదనలు వెళ్లాయి. తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు కూడా కోచ్ ఫ్యాక్టరీ వల్ల మేలు జరుగుతుంది. ఈ విషయాన్ని పట్టించుకున్న పాపాన పోలేదు. తెలంగాణలో కొన్ని పట్టణాలకు రైల్వే ప్రయాణం నేటికీ కలగానే మిగిలింది. తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టులకు నిధుల మంజూరులో దశాబ్దాలుగా అన్యాయం జరుగుతోందని తెలుగు ఎంపీలు, ప్రభుత్వాలు మొత్తుకుంటున్నా కేంద్రం చెవికి ఎక్కడం లేదు. ఉత్తరాది రాష్ట్రాలను, తెలుగు రాష్ట్రాలతో పోల్చి చూస్తే రైలుమార్గాల నిర్మాణంలో ఎంత అన్యాయం జరిగిందన్నది కళ్లకు కడుతుంది. ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, పశ్చిమ్ బంగ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో రైలుమార్గాల పరంగా లోటు లేదు. దేశం మొత్తంలో అత్యధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న రైల్వేజోన్లలో దక్షిణ మధ్య రైల్వే అగ్రస్థానానికి పోటీపడుతున్నా ఇక్కడ రైలు మార్గాల నిర్మాణం నత్తనడకన సాగుతోంది! భువనేశ్వర్ కేంద్రంగా 2003లో ఏర్పాటుచేసిన రైల్వే జోన్‌లో విశాఖపట్నాన్ని కలిపిన తరవాత ఆదాయం, అభివృద్ధి ప్రాథమ్యాలు అటే పోతున్నాయి.

విభజన చట్టంలో పేర్కొన్న మేరకు ఏపీలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం చర్చకు వచ్చినప్పుడల్లా దేశంలో ఇప్పటికే 12 కొత్త రైల్వే జోన్లను, మరో 35 డివిజన్లు ఏర్పాటు చేయాలనే డిమాండు ఉన్నట్లు రైల్వేశాఖ చెబుతోంది. రాజకీయపరమైన ఒత్తిళ్లు వచ్చినప్పుడే నేతలు వాటిపై దృష్టి సారిస్తున్నారు. పదిహేనేళ్ల క్రితం ఒకేసారి ఏడు కొత్త జోన్లను ఏర్పాటు చేసినప్పుడు విమర్శలొచ్చినా అప్పటి ఎన్డీఏ ప్రభుత్వం లెక్కచేయలేదు. 90వ దశకం ద్వితీయార్ధంలో బిహార్‌లోని హాజీపూర్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికై రైల్వేమంత్రిగా పనిచేసిన రామ్‌విలాస్ పాసవాన్ ఏకంగా హాజీపూర్‌కు బడ్జెట్‌లో రైల్వేజోన్ ప్రకటించారు. కోల్‌కతా కేంద్రంగా ఉన్న పాత తూర్పు రైల్వేజోన్‌ను విడదీసి హాజీపూర్ కేంద్రంగా 'తూర్పు రైల్వే జోన్' ఏర్పాటుచేశారు. దీనికి ఆదాయం అధికంగా వచ్చే అయిదు రైల్వే డివిజన్లు కలిపారు. అప్పుడు రైల్వేశాఖకు నిబంధనలు గుర్తుకు రాలేదు. హాజీపూర్‌ను జోన్‌గా మార్చేందుకు ఇతర రాష్ట్రాలకు మరో ఆరు జోన్లు ఏర్పాటు చేశారు. అందులో భాగంగానే భువనేశ్వర్ కేంద్రంగా తూర్పు కోస్తా రైల్వే జోన్ ప్రారంభమైంది. ఈ జోన్ ఏర్పాటుకు విశాఖపట్నం రైల్వే డివిజన్‌ను సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణమధ్య రైల్వే జోన్ నుంచి విడదీసి భువనేశ్వర్‌కు మార్చారు. నాటి నిర్ణయమే ఇప్పుడు ఏపీకి శాపంగా మారింది. అధిక ఆదాయం వచ్చే విశాఖపట్నం డివిజన్‌ను వదులుకునేందుకు ఇప్పుడు తూర్పు కోస్తా జోన్ అంగీకరించడం లేదు. ఈ విషయం బయటికి చెప్పకుండా ఏవో సాకులు చెబుతున్నారు.

హేతుబద్ధతేదీ?

గతంలో రైల్వే మంత్రులుగా పనిచేసిన నాయకులు తమ సొంత ప్రాంతాలకు రైల్వే ప్రాజెక్టులను ఇష్టారీతిగా మంజూరు చేయించుకున్నారు. కర్ణాటక నేతలు జాఫర్ షరీఫ్, మల్లికార్జున ఖర్గేలు రైల్వేశాఖ సారథులుగా సొంత రాష్ట్రానికి కొంత మేలు చేసుకున్నారు. అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు నిధుల మంజూరులో కలిసికట్టుగా పోరాడే తమిళనాడుకూ చాలా ప్రాజెక్టులు



- విశాఖ జోన్‌పై కప్పదాటు వైఖరి
- కాజీపేట రైలుపెట్టెల కర్మాగారంపై శీతకన్ను
- ఆదాయం పుష్కలం... ఆదరణ శూన్యం
- ఉత్తరాదితో పోలిస్తే రైళ్ల సంఖ్య పరిమితం

వచ్చాయి. ఉత్తరాది నేతలైతే రైల్వే శాఖను తమ జేబు సంస్థగా మార్చుకుని నిధులు, ప్రాజెక్టులు మళ్లించుకుంటున్నారు. రైల్వేల పరంగా దక్షిణాదిన బాగా వెనకబడిన రాష్ట్రాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాత్రమే. దేశం మొత్తానికి కీలకమైన రెండు గ్రాండ్ ట్రంక్ రైలుమార్గాలకు మధ్య ప్రాంత స్టేషన్‌గా విజయవాడ ఉంది. ఇక్కడి నుంచి ఉదయం, సాయంత్రం దేశంలోని కీలక ప్రాంతాలకు బయలుదేరే రైళ్లే లేవంటే తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు ఎంత అన్యాయం జరిగిందో అర్థం చేసుకోవచ్చు. అటు చెన్నై, ఇటు హౌరా, దిల్లీ, ముంబయి, బెంగళూరు వంటి ప్రధాన నగరాలతో విజయవాడ పోటీపడుతోంది. ఇక్కడి నుంచి అర్ధరాత్రి, తెల్లవారుజామున ఇతర ప్రాంతాలకు వెళుతున్న రైళ్లలో బెర్తులు దొరక్క ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఒక్క విజయవాడకే కాదు, తెలంగాణలో కీలకమైన వరంగల్, ఖమ్మం, ఏపీలోని నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం వంటి ప్రధాన నగరాలన్నింటిదీ ఇదే దుస్థితి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దక్షిణ మధ్య రైల్వే జోన్‌ను 1966లో గాంధీ జయంతి రోజున ఏర్పాటుచేశారు. అప్పటితో పోలిస్తే ఇప్పుడు అనేక మార్పులు వచ్చాయి. తొలుత చెన్నై కేంద్రంగా దక్షిణ రైల్వే జోన్‌లో ఉన్న హుబ్బళ్లి, విజయవాడ, మధ్య రైల్వే జోన్‌లో ఉన్న శోలాపూర్, సికింద్రాబాద్ రైల్వే డివిజన్లతో సికింద్రాబాద్ కేంద్రంగా దక్షిణ మధ్య రైల్వే జోన్‌ను ప్రారంభించారు. కొంతకాలానికే శోలాపూర్ డివిజన్‌ను తిరిగి మహారాష్ట్రకు చెందిన మధ్య రైల్వే జోన్‌కు ఇచ్చేశారు. 2003లో హుబ్బళ్లి డివిజన్‌నే రైల్వే జోన్ కేంద్రంగా మార్చి కర్ణాటకలో కొత్తగా 'నైరుతి రైల్వేజోన్' ఏర్పాటుచేశారు. డివిజన్లను కలపడం, తొలగించడానికి రైల్వే శాఖ పరిపాలనా కారణాలను చెబుతోంది. బలమైన రాజకీయ నేతల నుంచి ఒత్తిళ్లు వచ్చినప్పుడు కొత్త రైల్వేజోన్లను సైతం ఏర్పాటు చేస్తోంది. తెలుగు రాష్ట్రాల నుంచి రైల్వేశాఖ మంత్రులుగా ఎవరూ పనిచేయకపోవడం వల్ల ఇక్కడ దశాబ్దాల క్రితం శంకుస్థాపన చేసిన మార్గాలకు ఇప్పటికీ నిధులు రావడం లేదు. కొత్త మార్గాలు పూర్తికావడం లేదు. కొత్తగా రైళ్లు రావడం లేదు.

వెనకబడిన ప్రాంతాలకు ఉపకరించాలి

దేశ అభివృద్ధిలో రైల్వే పాత్ర కీలకం. ప్రాంతీయ విచక్షణతో వ్యవహరిస్తే అభివృద్ధి కొన్ని ప్రాంతాలకే పరిమితమవుతుంది. రైలు మార్గాల విస్తరణ దశాబ్దాలుగా కొన్ని రాష్ట్రాల్లోనే అధికంగా ఉంటోంది. తెలుగు రాష్ట్రాలకు జరిగిన అన్యాయాన్ని ఇప్పటికైనా సరిదిద్దేందుకు సరైన చర్యలు కరవయ్యాయి. వెనకబడిన ప్రాంతాల్లో కొత్త రైలుమార్గాల నిర్మాణం, రైల్వే ప్రాజెక్టులు చేపట్టాల్సిన అవసరం ఉంది. తెలంగాణలో వెనకబడిన ఉమ్మడి ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో పలు ప్రాంతాలకు సరైన రైలు మార్గాలే లేవు. నడికుడి-వెంకటగిరి రైలు మార్గం నిర్మిస్తే తెలంగాణ నుంచి ఏపీ మీదుగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ప్రయాణ దూరం తగ్గుతుంది. దీనిపై దశాబ్దాలుగా విన్నవిస్తున్నా అవసరమైన మేరకు నిధులు మంజూరు కావడం లేదు. కాజీపేట కేంద్రంగా రైల్వే డివిజన్‌తో పాటు, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలని ఎంతో కాలంగా ప్రజలు కోరుతున్నారు. ఉత్తర, దక్షిణ భారతాలను కలిపే కీలక జంక్షన్ అయిన కాజీపేటను అభివృద్ధి చేయడానికి అవకాశమున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటుచేస్తే అక్కడి నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు రైలుమార్గాల నిర్మాణం, కొత్త రైళ్ల ప్రారంభానికి అవకాశాలుంటాయి. విశాఖ, రాజమండ్రి, విజయవాడ, అనంతపురం నగరాల నుంచి ఉదయం, సాయంత్రం ప్రజలకు అనువుగా ఉండే సమయాల్లో కొత్త రైళ్లను ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది. మరిన్ని రైల్వే ప్రాజెక్టులు ప్రతిపాదించి నిధులు తెచ్చుకోవడానికి అవకాశం దక్కుతుంది. కాజీపేటను డివిజన్ కేంద్రంగా మారిస్తే అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి ఏర్పడుతుంది. కోచ్ ఫ్యాక్టరీ వల్ల తెలంగాణలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. ప్రస్తుతం భువనేశ్వర్ జోన్‌లో అధిక ఆదాయం వచ్చే డివిజన్ విశాఖపట్నమే. ఏ డివిజన్‌లో ఆదాయం వచ్చినా దాన్ని తొలుత ఎక్కడ ఉపయోగించాలన్న అంశంపై నిర్ణయాలు తీసుకోవడానికి ప్రతిపాదనలు జోనల్ కేంద్రంగా ఉండే ప్రధాన కార్యాలయంలోనే రూపొందుతాయి. జోన్ ఆవిర్భవిస్తే పరిపాలనకు ఓ కార్యాలయం ఏర్పాటు అవుతుంది తప్ప పెద్దగా ఒరిగేమీ ఉండదన్న రైల్వే శాఖ వాదన అర్థరహితం. జోన్ వల్ల ప్రాధాన్యం లేదన్నప్పుడు దాన్ని ఏర్పాటు చేయడానికి ఎందుకు వెనకాడుతున్నారో అర్థం కాదు. ఆర్థిక పరిస్థితి బాగా లేదని చెప్పడం, జోన్ ఏర్పాటుచేస్తే అదనపు భారం పడుతుందన్న వాదనలోనూ వాస్తవం లేదు. అధిక ఆదాయం వచ్చే విశాఖ రైల్వే డివిజన్‌నే జోన్‌గా మార్చమంటున్నారు తప్ప ఆదాయం లేని డివిజన్ గురించి అడగటం లేదు. దక్షిణ మధ్య రైల్వే జోన్ నుంచి హుబ్బళ్లి డివిజన్‌ను విడదీసి అక్కడ కొత్త జోన్ ఏర్పాటుచేయడం సమంజసమేనని 2003లో రైల్వే శాఖ చెప్పింది. అదే మాదిరిగా ఇప్పుడు భువనేశ్వర్ జోన్ నుంచి విశాఖ డివిజన్‌ను విడదీసి కొత్త జోన్ ఏర్పాటు చేయమంటే మాత్రం కుదరదని చెబుతోంది. ఫలితంగా ఏపీకి తీరని అన్యాయం జరుగుతోంది. రైల్వేజోన్ వంటి చిన్న హామీని కూడా నిలబెట్టుకోకుండా నిర్లిప్తంగా వ్యవహరించడం సరైనది కాదు. రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా నిర్ణయాలు తీసుకోవడం కేంద్రం కర్తవ్యం!

– మంగమూరి శ్రీనివాస్

కేజ్రీవాల్ 'సారీ'గమలు

'అయ్యవారేం చేస్తున్నారు అంటే, చేసిన తప్పులు దిద్దుకుంటున్నారు' అనే మాట అరవింద్ కేజ్రీవాల్ పుట్టక ముందే ఎలా పుట్టిందన్నది నేటి రాజకీయ 'బరి'శోధనాంశం. 'తప్పులు చేస్తే పశ్చాత్తాపపడవచ్చు. అవి చేయకుంటే, తరవాత పశ్చాత్తాపపడీ ప్రయోజనం లేదు' అని పఠాభి కవి ఎప్పుడో అన్నమాట- ఆప్ 'విధి' నేతకు ఇప్పుడు ఎలా ఒంటపట్టిందన్నదీ ప్రశ్నే!

ఎప్పటికెయ్యది ప్రస్తుత మప్పటికా మాటలాడి తప్పించుకోవడాన్ని మించిన రాజ'కీ'యం ఏముంటుంది? రాజకీయాల్లో 'ఆప'వేషాలు అన్నీ ఇన్నీ కావు. అంతా 'ఆప్' చిప్. కనీవినీ ఎరుగని రాజకీయంలో 'అడుగు'జాడ కేజ్రీవాల్‌దే! ఆయన రాజకీయ సంగీతమే వేరు. సంగీతంలో సరిగమలు ఉంటాయి. మరి కేజ్రీవాల్ సంగీతంలో 'సారీ'గమలు వినిపిస్తుంటాయి. ఎంతటి గడ్డు పరిస్థితి నుంచి అయినా గట్టెక్కడానికి సారీ అనే రెండక్షరాలు చాలు. ప్రత్యేకించి 'కేసు గుండెల్లోన కొట్లాడుతాంది... కూకుండనీదురా కూసింత సేపు' అని 'కోర్టుమిట్టాడే' పరిస్థితే వస్తే- చేతులెత్తేస్తే సరి!

'నోటికొచ్చినట్టు తిట్టెయ్, ఇబ్బంది వస్తే కాళ్లు పట్టెయ్' అనేది రాజకీయాల్లో కొత్త ధర్మంగా 'మూపు' దిద్దుకుంటోంది. సొంత లాభం కొంత చూసుకో... రాజీ మార్గం పట్టవోయ్- ఇదే సందేశం. ఉన్నత పదవుల్లో ఉన్నవారికి ఇంతకు మించిన 'తంత్రదండం' లేదు. దండం పడితే ఏం లాభం, దణ్నం పెడితేనే పెద్ద మేలు- అని దీని సారాంశం... సారీ అంశం!

దేనినైనా పణంగా పెట్టి సాధించవచ్చు అంటారు గాని; క్షమా'పణం'గా పెడితే బోలెడంత మనశ్శాంతిని, ధనశాంతిని సాధించవచ్చు. రణాలకు కారణాలు ఉన్నట్లే, ఉపసంహరణాలకూ కారణాలు ఉంటాయి. ఎందెందు వెదకి చూసిన అందందే రాజకీయాలు! అట్టి కథాక్రమం బెట్టిదనిన- తాజాగా కేజ్రీవాల్ పంజాబ్ మాజీ మంత్రి, శిరోమణి అకాలీదళ్ నేత బిక్రమ్‌సింగ్ మజీతియాకు క్షమాపణ చెప్పారు. శిరోభారం నుంచి తప్పించుకున్నారు. పరువు నష్టం కేసు నుంచి బయటపడ్డారు.

మాదకద్రవ్యాల కుంభకోణంలో మజీతియా పాత్ర ఉందని కేజ్రీవాల్ గత పంజాబ్ శాసనసభ ఎన్నికల వేళ ఆరోపించారు. దాంతో కేజ్రీవాల్ మీద మజీతియా పరువునష్టం దావా వేశారు. దీన్ని ఎదుర్కోలేక కేజ్రీవాల్ క్షమాపణ చెప్పేశారు. కథ సుఖాంతమైంది. ఈ 'ఆప్' సోపాలు ఏల, ఈ క్షమాపణలేల? అవినీతి వ్యతిరేక పోరాట యోధుణ్నని రొమ్ము విరుచుకుతిరిగే కేజ్రీవాల్ 'అతడు వాలము తిప్పు... ఇతడు శూలము తిప్పు' అన్నట్లు మారిపోవడం వెనక ఉన్న కారణాలు ఎవ్వరికైనా నవ్వు తెప్పిస్తాయి.

కేజ్రీవాల్‌మీద వారణాసి, అమేఠీ, పంజాబ్, అసోం, మహారాష్ట్ర, గోవా వంటి ప్రాంతాల్లో 20కి పైగా సివిల్, క్రిమినల్ కేసులు ఉన్నాయట, ఈ కేసులన్నింటిలో కోర్టుల చుట్టూ తిరగాలా, ముఖ్యమంత్రి బాధ్యతల్ని పక్కనపెట్టి ఈ పని చేయాలా? ముఖ్యమంత్రి పదవే ముఖ్యం అనుకొని కేజ్రీవాల్ రాజీమార్గం అనుసరించారట. 'రాజీవాల్' అయిపోయారట. కొద్దిరోజుల్లో కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీకి ఓ కేసులో క్షమాపణ చెబుతారట.



'నేను చేసిన ఆరోపణలకు ఎటువంటి ఆధారాలూ లేవు' అని 'మొక్కి'వక్కాణించనున్నారట. ఇతర కేసుల సంగతీ ఇంతే. పరువు నష్టం కేసులకు జడిసి, వెనక్కి తగ్గితే కేజ్రీవాల్‌కు పరువు'నష్టం' కాదా... అంటే ఎంతమాట! రాజకీయపరమైన బతుకుతెరువు ముందు పరువు ఎంత? ఒపీనియన్స్ ఛేంజ్ చేయకపోతే పొలిటీషియన్ కానేరడని గిరీశం ఎప్పుడో చెప్పాడు. గిరీశం మాటే వినకపోతే, ఆయన బాటే నడవకపోతే ఏమన్నా ఉందా; రాజకీయాల్లో ఓట్లకు 'పుట్ట'గతులు ఉంటాయా?

రాజకీయాల్లో పదికాలాలపాటు తరింపజేసే తారక మార్గాన్ని కేజ్రీవాల్ ఇప్పటి నాయకులకు 'ఉప్పు'దేశించారు. ఎన్నికలవేళ ప్రత్యర్థిమీద ఎన్ని ఆరోపణలైనా చేయవచ్చు. అప్పటికి పబ్బం గడుస్తుంది. ఒకవేళ కోర్టులో కేసులు రుసరుసలాడితే అప్పుడు చూసుకోవచ్చు. ఈ మార్గాన్ని పొర'బాట' అనవచ్చు. 'నీవు నిజాయతీ మార్గాన్ని ఎంచుకున్నప్పుడు, ప్రతిబంధకాల్ని ఎదుర్కోక తప్పదు. అలాంటప్పుడు ప్రపంచంలోని అన్ని శక్తులతో పాటు దేవుడు నీకు సాయం చేస్తాడు' అని కేజ్రీవాల్ సూక్తిముక్తావళి వినిపిస్తారు. రాజీ మార్గం కూడా దేవుడే ప్రబోధించాడని చెబితే, దానికి ఏ కోర్టులోనూ అప్పీలు ఉండదు.

ఎటొచ్చీ కేజ్రీవాల్ 'నిజాయతీ మార్గాన్ని' ఆయన అనుచరులే అర్థం చేసుకోలేదు. మజీతియాకు క్షమాపణ చెప్పడం జీర్ణించుకోలేని పంజాబ్ ఆప్ అధ్యక్షుడు భగవంత్‌మాన్ తన పదవికి రాజీనామా చేశారు. మాదకద్రవ్యాల మాఫియాకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తానని చెప్పారు. కేజ్రీవాల్ ఆయనకు కూడా ఎప్పటికైనా సారీ చెబుతారేమో, ఎవరికైనా తెలుసా... అని కొందరు కిసుక్కుమంటున్నారు.

రాజీ విద్య కేజ్రీవాల్ ఒక్కరోజులో సాధించుకున్నది కాదు. ఆయన మొదటిసారి ముఖ్యమంత్రి అయిన కొంత కాలానికి ఆవేశపడి రాజీనామా చేశారు. కొన్నాళ్లకు ఆవేశం తగ్గిపోయాక 'రాజీనామా చేయడం పొరపాటే' అన్నారు. ఆ తరవాత 'పొరపాటు'ను సరిదిద్దుకున్నారు. రెండోసారి ముఖ్యమంత్రి అయ్యాక, ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా రాజీనామా ఊసెత్తలేదు. ఆప్‌ను గెలిపించి, కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిని చేసి పొరపాటు చేశామే- అని జనం అనుకుంటున్నారని ఎవరన్నా అన్నా, ఆయన రాజీపడరు. రాజకీయమంటే 'రాజీ'కీయం. రాజకీయ పార్టీ అన్నా, రాజకీయ నాయకుడన్నా- తన ప్రయోజనాల కోసం రాజీపడటమే కదా రాజకీయం! అదే గీటురాయి. ఓటురాయి. ఎవ్వరేమనుకున్నా, ఆయన వెనక్కి తగ్గరు.

కేజ్రీవాల్ రాజకీయాల్లో రెండు దశలు ఉంటాయి. ఉవ్వెత్తున ఎగసిపడటం, చప్పున కిందపడిపోవడం. ఆప్ జమానాలో ఊహాతీతమైనవీ జరిగిపోతున్నాయి. కొంత కాలం కిందట కేజ్రీవాల్ నివాసంలోనే, ఆయన సమక్షంలోనే సాక్షాత్తు దిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీదనే ఇద్దరు శాసనసభ్యులు దాడిచేశారు. ఒక ఐఏఎస్ అధికారి, అదీ ఆయన అత్యున్నతాధికారిగా ఉన్న ప్రభుత్వ సారథి కళ్లముందే దాడి జరగడంపై దేశవ్యాప్తంగా ప్రకంపనలు కనిపించాయి. దాడికి నిరసనగా ఉన్నతాధికారులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు. దీన్ని కూడా కేజ్రీవాల్ ఆంతరంగికులు అనుకూల రీతిలో చెబుతున్నారు. 'జరిగిన కథ' ఏమైనా, ఇతరుల రాజ్యంలోనైతే నల్లబ్యాడ్జీలు పెట్టుకోవడానికి అవకాశమిస్తారా... అంటున్నారు. కేజ్రీవాల్ పెద్ద మనసుతో రాజీపడటమే ఇందుకు కారణమని చెబుతున్నారు.

అది సరేగాని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మీదనే దాడి జరిగితే- శాంతిభద్రతలకు దిక్కంటూ ఉంటుందా, దాని సంగతి చెప్పరేం అంటే... వచ్చే సమాధానంతో ఎవరికైనా కడుపునిండిపోతుంది. 'మరీ అంత తొందరపడిపోతారేం, మా సారు ఎప్పటికైనా తప్పకుండా సారీ చెబుతారు-అంతకంటే ఏం కావాలి' అంటున్నారు. 'సారీ చెప్పుమురా నరుడా! సాధ్యము కానిది లేదురా' అని రాగాలు తీస్తున్నారు.

ఏమైతేనేం, కేజ్రీవాల్ పేరు చిరకాలం నిలబడిపోతుంది. దీనికి రాజకీయ వైరంతో తల బద్దలుకొట్టుకోవాల్సిన అవసరం లేదు. చేతిచమురు వదులుతుందన్న బెంగ ఉండదు. కాళ్లచెప్పులు అరుగుతాయన్న బాధా లేనుగాక లేదు. ఒక్క దెబ్బతో, వైరాలన్నీ మటుమాయం అవుతాయి.

'సారీ' చెప్పి చూడు, సకలం నీ సొంతమవుతుంది. 'సారీ' జహాసే అచ్ఛా!

– శంకరనారాయణ

అంజలి

'అర్థి' అంటే, కోరుకునేవాడు. ఎవరికి ఏది లేదో, దాన్ని అర్థిస్తారు. అలా అని, అవన్నీ లభించవు.

అర్థించేందుకు ఓ అర్హత ఉండాలి. ఆధ్యాత్మిక ప్రయోజనాల కోసం సాధకుడు జపతపాలు చేయాలి. ఎప్పుడూ ఏదీ కోరనివారు, అన్నింటికీ అతీతమైనవారు ఆంజనేయస్వామి రీతిలో నిరంతర ధ్యానం సాగించాలి.


స్మరణకు పైస్థాయిని 'ధ్యానం'గా పరిగణిస్తారు. సాధనలోని వ్యక్తి ఆత్మానుగతంగా తనలోని సర్వశక్తుల్నీ ఏకం చేస్తాడు. అంతర్యామి గురించి అన్వేషించడమే అతడి ధ్యాన పరమార్థం.

అంతర్యామి ఎప్పుడూ అక్కడే ఉంటాడు. అంతరాలయంలోనే ఆ స్వామి కొలువుంటాడు. ఆయన శ్రీచరణాల కోసం సాధకుడి నేత్రాలు వెతుకుతాయి. లోపల తిష్ఠవేసుకున్న అజ్ఞానం, అహంకారం వంటి అడ్డంకుల్ని తొలగించుకుంటూ ముందుకు సాగుతాయి. వైకుంఠనాథుడి మందిరానికి చేరుకునేందుకు, సాధకుడు ఏడు ద్వారాలు దాటాలి. అవి- అహంతో కూడిన అరిషడ్వర్గాలు. ఆరు ద్వారాల వద్ద వ్యక్తి అర్హతను నిర్ణయించే ద్వారపాలకులు ఉంటారు. అతడు తనలోని ఒక్కొక్క దుర్గుణాన్ని త్యాగం చేస్తుంటే, అదే క్రమంలో ప్రతి ద్వారాన్నీ దాటేందుకు వారు అనుమతిస్తారు. ఆరో ద్వారం దాటాక, 'నేను' అనే అహం నశించిపోవాలి. అప్పుడు అతడిలో అద్వైత స్థితి కలుగుతుంది. పరమాత్మ దర్శనం లభిస్తుంది. 'త్వమేవాహం' అనే పరమ సత్యం అనుభవానికి వస్తుంది.

అందుకే శ్రీరామకృష్ణులు 'నీవే పరమాత్మవు. నీ తెలియనితనం వల్ల, నీకు ఆ సత్యం అవగతం కావడం లేదు' అంటారు. ఎంత కోహినూరు వజ్రమైనా- దాన్ని బాగా సానపడితే తప్ప, అంతటి విలువగలదని లోకానికి తెలిసే అవకాశం లేదు. భక్తి కూడా అటువంటిదే!

మనిషి అజ్ఞానం ఎటువంటిదంటే, అతడు ఎన్నో కోరుకుంటాడు. వాటన్నింటినీ, దేవుడికి కానుకలిచ్చి తీర్చుకోగలనన్న భ్రమలో జీవిస్తుంటాడు. మొక్కులకు కోరికల చిట్టాను జతపరుస్తాడు. కొండకు, వెంట్రుకకు ముడివేసి లాగుతాడు. 'వస్తే కొండ వస్తుంది. పోతే వెంట్రుక తెగుతుంది. అంతే కదా' అనుకుంటాడు.

దేవుడితో ఎప్పుడూ ఎన్నడూ పాచికలు ఆడకూడదు. ఆయన చేతిలో మనిషే ఒక పాచిక. ఆ దైవంతోనే ఆటలాడటం అంటే, అది ముందువెనకలు చూడని విపరీత



అంతర్యామి

సాహసం! భగవంతుడిది అనంతమైన శక్తి. దాని ముందు మనుషులు ఎంత? ఈ అవగాహన కలగనంతవరకు, వారికి భగవంతుడు అర్థం కానట్లే!

భగవంతుణ్ని భక్తుడు ప్రతి ఒక్కటీ అత్యంత భక్తితో, వినయంతో కోరాలి. అంజలి ఘటించడమే అతడి వినయానికి సంకేతం. శ్రద్ధగా దోసిలి పట్టినవాడికే అనుగ్రహ ప్రసాదం లభిస్తుంది. పరిపూర్ణ భక్తివిశ్వాసాలతో ముందడుగు వేయాలి. విశ్వాసం లేనిదే భక్తి కలగదు. ఆ భక్తి కలగనిదే దైవానుగ్రహం లభించదు.

అంజలి సమర్పించే భక్తుడు ప్రాపంచికమైన వాటిని అర్థించడు. పరమాత్మ పదభక్తినే అతడు త్రికరణశుద్ధిగా కోరతాడు. భక్తి స్థిరంగా ఉండేలా అనుగ్రహించాలంటాడు. భక్తి అనేది- స్వామి 'ఆనంద నిలయ మందిరం'లో ప్రవేశానికి ఉపకరించే ఒక తాళపు చెవి! స్థిరమైన పదభక్తి లేకపోవడం వల్ల, ఎత్తుపల్లాలు ఎదురవుతాయి. మనసు అవస్థలపాలవుతుంటుంది.

భగవంతుణ్ని ఎలా పొందాలో 'భగవద్గీత'లో శ్రీకృష్ణుడు ఇలా ప్రవచిస్తాడు- 'అన్ని కర్మలూ నాకే అర్పించు. నన్నే శరణు కోరు'. ఈ రెండు వాక్యాలే మహామంత్రాలు.

దైవార్పణంగా మనిషి కర్మలు సాగించాలి. దైవమే సర్వస్వంగా భావించి తరించాలి. అటువంటి స్థితికి చేరుకున్న తరవాత, అంజలి ఘటించాల్సిన అవసరమూ అతడికి అంతగా ఉండదు.

అందుకే, ఆ స్థితిలో- 'అంతా భగవంతుడే చూసుకుంటాడు' అంటాయి శాస్త్రాలు!

– కాటూరు రవీంద్ర త్రివిక్రమ్

‘ఓసోస్... స్ట్రాబెర్రీ అయితే ఏటి... మిరియాలయితే ఏటి పండించే ఇదానం తెలియాలిగానీ..’ అంటాడు బౌడు కుశలవుడు. అనడమే కాదు చేసి చూపించి.. అందరితో శభాష్ అనిపించుకున్నాడు. చదివింది పదో తరగతే అయినా శాస్త్రవేత్తలకూ విత్తనాలు ఇచ్చేంత దిట్టగా మారాడు. కుశలవుడు చేసిన అద్భుతాలు చూస్తే మనలాంటోళ్లు ఇతను మామూలోడు కాదెహె.. ‘మన్యం మొనగాడు’ అనాల్సిందే! ఇంతకీ అతను చేసిన ఆ అద్భుతాలు ఏంటో తెలుసుకుందామా?





మన్నెంలో మొనగాడు

స్ట్రాబెర్రీలను చూస్తే ఇప్పటికీ మనకొక అభిప్రాయం ఉంటుంది. అవి నగరాల్లోనే ఉంటాయి అందరికీ అందుబాటులో ఉండవు.. బోలెడు ఖరీదని. అలాంటి నమ్మకాన్ని కుశలవుడు చాలా తేలిగ్గా బ్రేక్ చేసేశారు. స్ట్రాబెర్రీ పంట పండించి లాభాలు గడించాడు. ఒక్క స్ట్రాబెర్రీనే కాదు మిరియాలు, బార్లీ... గోధుమలు అబ్బో ఆ జాబితా చాంతాండంత. అతను చేసిన ప్రయోగాలు లెక్కలేనన్ని. నిజం చెప్పాలంటే సాగుబడి పాఠాలు చెప్పే బడికి అతను ప్రిన్సిపల్‌లాంటోడు. అబ్బో ఇన్ని ప్రయోగాలు చేస్తున్నారు అంటే బాగా చదువుకున్నోడు అనుకుంటే తప్పులో కాలేసినట్టే. ఆయన చదువు పదోతరగతి మాత్రమే. కానీ మట్టి మనసుని చదవడంలో మాత్రం పీహెచ్‌డీ చేశారు. అందుకే అతను పెద్ద పెద్ద శాస్త్రవేత్తలు సాధించలేని విజయాలు కూడా అవలీలగా సాధించారు. కొత్తపంటలు వేసి చేతులు కాల్చుకోవడం ఎందుకూ.. అంటూ తోటి రైతులు కుశలవుడుని ఎన్నిసార్లు హేళన చేసినా దానిని ఓ సవాల్‌గా తీసుకున్నారే కానీ... వెనకడుగు వేయలేదు. సాగులో సత్ఫలితాలు సాధించి అందరి మన్ననలూ పొందుతున్నారు.

కొత్తపంటల పరిచయం...

విశాఖజిల్లాలోని చింతపల్లి మండలం గొందిపాకల కుశలవుడి సొంతూరు. అతనికున్నది మన్యం భూమి. అతను పండించే నేల సారవంతమైన భూమి ఏమాత్రం కాదు. ఒక వేళ దాన్ని సానుకూలంగా మార్చుకున్నా ఆ అటవిలో సాగు మెలకువలు చెప్పేవారి జాడ లేదు. అలాంటి నేలలో కళ్లు చెదిరే స్ట్రాబెర్రీలు వేసి గులాబీరంగు బంగారం పండించి చూపించారు. ఆ ఒక్కటే అతను చేసిన అద్భుతం కాదు. ఇంకా అనేకం ఉన్నాయి. స్ట్రాబెర్రీ అనగానే అది విదేశీపంటేమో అనుకుంటాం. అది వాస్తవం కూడా. శీతల ప్రాంతాల్లో మాత్రమే పండే ఈ పండుని మనం కూడా పండించగలం అని నిరూపించారు. విశాఖలోని తన స్నేహితుడి సాయంతో పదేళ్ల క్రితం రెండెకరాల పొలంలో తొలిసారిగా స్ట్రాబెర్రీని ప్రయోగాత్మకంగా పండించారు. ఈ పంటకు సుమారు లక్షరూపాయల వరకూ పెట్టుబడిగా పెట్టారు. కానీ లాభం రాలేదు. కారణం.. కొత్తపంట కదా... తెలిసినవాళ్లు, పరిచయస్తులు, రుచి చూస్తామంటూ తలాకొన్ని పండ్లు పట్టుకుపోవడంతో ఆశించిన లాభాలురాలేదు. ఆ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఒక్కసారితో ఆపేయకుండా వరుసగా స్ట్రాబెర్రీ సాగు చేపడుతూ లాభాలు వచ్చేంతవరకూ శ్రమించారు. బార్లీ, గోధుమ, ఆవాలు వంటి సంప్రదాయేతర పంటలు వేసి తనేంటో నిరూపించుకున్నారు. కాఫీ, మిరియాలు, బొప్పాయి, అరటి, పాలూరు పనస, బర్మా కొత్తిమీర వంటి ఉద్యాన, సుగంధ ద్రవ్య పంటలను సాగుచేస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మొదట్లో తనకున్న ఐదెకరాల పొలంలోనే పరిమితంగా కొత్తరకాల పంటలను సాగుచేయడం ప్రారంభించారాయన. వ్యవసాయం పట్ల అతనికున్న ప్రేమని చింతపల్లి వ్యవసాయాధికారి రవీంద్రనాథ్ చూసి ముచ్చటపడ్డారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరుగుతున్న రైతు శిక్షణ తరగతులకు కుశలవుడుని ఆహ్వానించారు. ఆ పిలుపు కుశలవుని జీవితాన్ని మలుపు తిప్పింది. వ్యవసాయం పట్ల ఇతనికున్న ప్రేమను గమనించిన వ్యవసాయాధికారులు ఆదర్శ రైతుగా అవకాశం కల్పించి.. పరిశోధన, విస్తరణ సలహా మండలి సభ్యుడిగా అవకాశం ఇచ్చారు. .

శాస్త్రవేత్తలకూ కొత్త విత్తనాలు...

సాధారణంగా ఏవైనా కొత్తపంటలను శాస్త్రవేత్తలు ముందుగా సాగుచేసి వాటి ఫలితాలను బాగున్నాయి అని నిర్ధరించుకున్నాక అప్పుడు వాటిని రైతులకు పరిచయం చేస్తారు. కానీ ఇది కుశలవుని విషయంలో సీన్ రివర్స్ అయ్యింది. మహారాష్ట్రలోని పుణె నుంచీ బార్లీ విత్తనాలని తీసుకువచ్చి తన పొలంలో సాగు చేసి అవి మంచి ఫలితాలను ఇవ్వడంతో శాస్త్రవేత్తలకు వాటిని అందించారు. బిందు సేద్యం చేసి సేంద్రియ పద్ధతిలో కుశ పండించిన స్ట్రాబెర్రీలను ‘డ్యూడ్రాప్స్’ పేరుతో విక్రయించాడు.



ఉద్యాన పంటల సాగులో అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్న కుశలవుడుని వెంకట రామన్న గూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయం తమ పరిశోధన, విస్తరణ సలహామండలి సభ్యునిగా నియమించి గౌరవించింది. తనకు తెలిసిందే ప్రపంచం అనుకోకుండా తోటి రైతులు చేస్తున్న ప్రయోగాలుకూడా గమనించడం కుశలవుని ప్రత్యేకత. కేరళకు చెందిన టి.టి.థామస్ ‘పెప్పర్ డెక్కన్’ అనే మేలురకపు హైబ్రిడ్ మిరియాలను సొంతంగా అభివృద్ధి పరిచారు. సాధారణంగా మిరియాలు ఒక్కో రెమ్మకు 60 నుంచీ 70 గింజలు కాస్తే.. థామస్ అభివృద్ధి చేసిన మిరియాలు రెమ్మకు ఏకంగా వెయ్యి వరకూ కాస్తాయి. దీన్ని గుర్తించిన కేరళ ప్రభుత్వం అతన్ని ఉత్తమరైతుగా గుర్తించింది. ఈ విషయాన్ని అంతర్జాలం ద్వారా తెలుసుకున్న కుశలవుడు థామస్‌ని కలిసి ఆ మిరియాలను వెంట తీసుకువచ్చి స్థానికంగా సాగు చేశారు.

సేంద్రియం అతని మంత్రం...

కుశలవుడు తనకున్న అటవీ భూమిలో కాఫీతోటలను సాగుచేశాడు. అప్పటికే గిరిజనులంతా కాఫీతోటల్లో అధిక దిగుబడుల కోసమని రసాయనిక ఎరువుల వినియోగానికి అలవాటు పడ్డారు. కానీ కుశమాత్రం పూర్తిగా సేంద్రియ పద్ధతిలో కాఫీసాగు చేపట్టి సత్ఫలితాలు సాధించారు. దీంతో కేంద్ర కాఫీ బోర్డు అధికారుల దృష్టిని ఆకర్షించాడు. అలా పదేళ్ల క్రితమే కేంద్ర కాఫీబోర్డు ప్రకటించిన అంతర్జాతీయ కాఫీ ఫైన్‌కప్ అవార్డుకు ఎంపికయ్యాడు. అతను ఇచ్చిన స్ఫూర్తి ఎంతో మంది రైతులని ఆకర్షించింది. దీంతో ఈప్రాంతానికి చెందిన రెండు వేల మంది గిరిజన రైతులతో కుశలవుడు గిరిజన గ్రామ స్వరాజ్య సంఘాన్ని స్థాపించారు. తొలిసారిగా సేంద్రియసాగు ధ్రువపత్రం పొందిన ఘనత కూడా గ్రామస్వరాజ్యసంఘానికే దక్కింది. మూడేళ్లపాటు కాఫీని పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేసినందుకు బెంగళూరులోని అదితి అనే జాతీయ సంస్థ 2008లో గొందిపాకల గ్రామానికి ఆర్గానిక్ సర్టిఫికెట్‌ని జారీచేసింది.


-లక్కోజు నాగసుబ్రహ్మణ్యం, న్యూస్‌టుడే, చింతపల్లి.

ఈ ఇంటి తీరే వేరు...

మట్టి వాసనలు మధుర భావనలు!

ఇదేంటి... మామూలు ఇల్లే కదా అనుకుంటున్నారా?
కానే కాదు... ఇది సనాతన శైలి, అధునాతన భావనలు కలగలిసిన ఓ నమూనా గృహం...
అంతేనా పర్యావరణ స్పృహ... ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే గట్టిదనం
ఈ ఇంటికి ఉన్న అదనపు సుగుణాలు...
మరి...ఓ సారి ఆ ఇంటిని గురించి తెలుసుకుందాం... పదండి..!





సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని బడంపేటలో యక్షి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ‘కూడలి’ పేరిట ఒక వేదికను అందుబాటులోకి తెచ్చారు. గ్రామీణప్రాంతాల్లో యువతలో నైపుణ్యాలను పెంచడంతో పాటు సాగును లాభసాటిగా మార్చడమెలా అన్న అంశంపైనా ఇక్కడ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ కార్యకలాపాల కోసం 2016 ఓ భవనాన్ని నిర్మించారు. ముంబయికి చెందిన ఆర్కిటెక్చర్ ఒకరు నారాయణఖేడ్ నియోజకవర్గంతో పాటు నర్సాపూర్ నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో పర్యటించి ఆనాటి ఇళ్లు, నిర్మాణశైలిని పరిశీలించారు. వాటిని ప్రతిబింబించేలా ఈ ఇంటికి రూపునిచ్చారు. ఉత్తరప్రదేశ్, హిమాచలప్రదేశ్‌కు చెందిన నిపుణులతో పాటు స్థానికులనూ ఇందులో భాగస్వామ్యులను చేశారు. మట్టి, డంగుసున్నం, గడ్డిని పూర్తిస్థాయిలో వాడుకున్నారు. పైకప్పు కింద మట్టితో పాటు వేపకొమ్మలు వేశారు. గ్రామాలన్నీ తిరిగి గూనపెంకులు తెచ్చి పెట్టారు. గోడలు నునుపుగా ఉండటంతో పాటు మట్టి అట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇందుకు గాను సన్నని దుబ్బమట్టితో మూడు పొరలుగా పైపూత పూశారు. ఆకర్షణీయంగా ఉండేందుకు జాజును రంగుగా వాడారు. భూకంపాలు సంభవిస్తే భవనం దెబ్బతినకుండా చూసేందుకు చాలా తక్కువ స్థాయిలో మాత్రమే స్టీలు, సిమెంటు వాడారు. రూ.80లక్షల ఖర్చుతో దాదాపు మూడు సంవత్సరాల సమయం తీసుకొని దీన్ని పూర్తి చేశారు. మన నిర్మాణశైలిని భవిష్యత్తు తరాలకు అందించడంతోపాటు అందరికీ ఇదొక చక్కని వేదిక కావాలనే లక్ష్యంతో ఈ తరహాలో నిర్మాణం చేపట్టామని యక్షి సంస్థ డైరెక్టర్ మధుసూదన్ వివరించారు. కాంక్రీటు, స్టీలు చాలా నామమాత్రంగా వాడుకుంటూ... పూరిస్థాయిలో మట్టితో కట్టామన్నారు. ఇది వందేళ్లపాటు నిలిచి ఉంటుందన్నారు. ఈ ఎండాకాలంలోనూ ఏసీలూ, ఫ్యాన్లు లేకున్నా గదులన్నీ చాలా చల్లగా ఉండటం విశేషం. పర్యావరణహితంగా ఉండటంతో పాటు పాతకాలపు నిర్మాణాలను గుర్తుకుతెస్తున్న ఈ మట్టిభవనం అందరినీ ఆకర్షిస్తోంది.

- రాజేందర్ సురకంటి, ఈనాడు, సంగారెడ్డి

తొలి వేడుక... చదువులమ్మ నీడలో!



సాధారణంగా వివాహం అయిన నూతన దంపతులు గ్రామంలోని దేవాలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లిస్తారు. కానీ ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చిమ్మపూడిలో పరిస్థితి వేరు. ఇక్కడ ఒక కొత్త సంప్రదాయాన్ని ఆచరిస్తున్నారు. తమ గ్రామానికి గ్రంథాలయమే గుడిగా భావిస్తున్నారు. కొత్త జంట గ్రంథాలయం సందర్శించి పుస్తకాలకు మొక్కుతారు. తమ వంతుగా గ్రంథాలయం అభివృద్ధికి తోచినంత సాయం అందిస్తారు. గ్రామ ప్రజలలో విజ్ఞానాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఇటికాల విశ్వనాథచారి, వజ్రమ్మ దంపతుల పేరిట 2013లో దాతల సహకారంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ అనేక పుస్తకాలను, దిన పత్రికలను అందుబాటులో ఉంచుతున్నారు. నిత్యం పదుల సంఖ్యలో గ్రామస్థులు దీనిని సందర్శిస్తూ పుస్తక పఠనం చేస్తున్నారు. గ్రామంలో నూతన వధూవరులు గ్రంథాలయాన్ని సందర్శించి వారికి తోచినంత విరాళం సమర్పించే ఆనవాయితీని ఆచరిస్తున్నారు.

- వాసిరెడ్డి శ్రీహరి, రఘునాథపాలెం, న్యూస్‌టుడే

రాతను మార్చి... గీతను కూర్చారు!

ఆయన నిఘంటువులో అనారోగ్యం అనే పదముంది. అలసటను ఉర్దూలో ఏమంటారో ఉంది. ఆయన జీవితంలో మాత్రం ఆ పదాలకు చోటు లేదు. 75 వయసులో క్యాన్సర్ వచ్చినా చలించలేదు. గుండెలో అలజడి రేగినా వెరవలేదు. క్యాన్సర్‌ను జయించాడు. గుండెను దిటవు చేసుకున్నాడు. గీతాసారాన్ని ఉర్దూలో నివేదించారు. తన మస్తిష్కంలోని ఉర్దూ పద సంపదను పది మందికీ పంచారు. ఆయన పేరు ఎస్.టి.వెంకట అప్పలాచార్య. తొంబై ఏళ్ల ఆ వృద్ధతేజం గురించి మరింత వివరంగా..




అప్పలాచార్యది సనాతన వైదిక కుటుంబం. మాతృభాష తెలుగులో పద్యాలు, శ్లోకాలు గుక్కతిప్పుకోకుండా చెప్పేవారు. సంస్కృతంలోనూ ప్రవేశం ఉంది. అప్పలాచార్యకు తెలుగుపై ఎంత పట్టుందో.. ఉర్దూలో అంత అభినివేశం ఉంది. అప్పలాచార్య 1929లో జన్మించారు. కుటుంబం హైదరాబాద్ గడ్డిఅన్నారంలో ఉండేది. ఆస్మాన్‌గఢ్‌లో ఉన్న ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివారు. ఉర్దూ మీడియం కావడంతో ఆ భాష సులభంగానే అబ్బింది. సిటీ సైన్స్ కళాశాలలో ఇంటర్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదివారు. తనకు ఉర్దూపై మక్కువ ఏర్పడటానికి గురువు ఖాదర్ హుస్సేన్ ప్రోత్సాహమే కారణమంటారు అప్పలాచార్య. వారిచ్చిన ప్రోత్సాహంతో మధురమైన భాషను నేర్చుకోగలిగానని చెబుతారు.

ఉర్దూ గీత

1952లో డిగ్రీ పూర్తి చేసిన అప్పలాచార్యకు మొదట రెవెన్యూ శాఖలో ఉద్యోగం వచ్చింది. తర్వాత విద్యుత్ శాఖలో ఉద్యోగంలో చేరారు. ఇవి కాదనుకొని తనకు ఇష్టమైన ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. లెక్కల మాస్టారుగా పిల్లలకు పాఠాలు చెప్పారు. విద్యాశాఖలో వివిధ హోదాల్లో పనిచేసి 1988లో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదవీ విరమణ చేశారు. రిటైర్ అయ్యాక ఉర్దూలో మరింత కృషి చేయడం మొదలుపెట్టారు. కృష్ణమాచార్యులు అనే మిత్రుడు అప్పలాచార్యను గోరఖ్‌పూర్‌లోని గీతా ట్రస్ట్ వారికి పరిచయం చేశారు. గీతా ట్రస్ట్ సంస్కృతంలోని భగవద్గీతను అన్ని భాషల్లోకి తర్జుమా చేసే కార్యాన్ని నిర్వహిస్తున్న రోజులవి. భగవద్గీతను ఉర్దూలోకి తర్జుమా చేయాల్సిందిగా అప్పలాచార్యను కోరారు. ఏడాదిలో భగవద్గీలోని 18 అధ్యాయాల్లోని 700 శ్లోకాలను ఉర్దూలోకి యథాతథంగా అనువదించారు. దీనికి ‘నగ్మే ఇలాహి’ (భగవంతుని గీత) అని నామకరణం చేశారు. ఈ గ్రంథాన్ని 2003లో గీతా ప్రెస్ 6000 ప్రతులను అచ్చువేసింది. పునఃముద్రణకు కూడా నోచుకుంది.

నిఘంటు శోధన..

భగవద్గీతను తర్జుమా చేయడంలో ఆయనకు ఓ తెలుగు-ఉర్దూ నిఘంటువు ఎంతగానో ఉపకరించింది. రాత ప్రతిగా ఉన్న ఆ నిఘంటువు 1945 ప్రాంతంలో అప్పలాచార్య దగ్గరికి చేరింది. వనపర్తి వాస్తవ్యుడైన రెడ్రెడ్డి జగన్నాథరెడ్డి సంకలనం చేసిన నిఘంటు ప్రతిని పునఃసమీక్షించాలని అప్పలాచార్య సంకల్పించారు. ఆ సమయంలోనే ఆయనకు క్యాన్సర్ వచ్చింది. మూడేళ్ల పోరాటం తర్వాత ఆరోగ్యం కుదుటపడింది. వైద్యానికి ఆత్మవిశ్వాసం తోడవ్వడంతో క్యాన్సర్‌ను జయించానంటారు ఆ పెద్దాయన. ‘కొన్నాళ్లకు గుండెలో ఇబ్బంది మొదలైంది. దానిని అధిగమించా. మనోబలమే శ్రీరామ రక్ష’ అని చెప్పుకొచ్చారు. ఆరోగ్యం మెరుగయ్యాక ఆలస్యం చేయకుండా తెలుగు-ఉర్దూ నిఘంటువు మీద దృష్టి సారించారు. తన రెండో కుమారుడు శ్రీనివాసచార్య సహకారంతో ఐదేళ్ల పాటు కృషి చేసి నిఘంటువును రూపొందించారు. 1328 పేజీలున్న నిఘంటువులోని పదాల సంఖ్య 70 వేలు. సొంత డబ్బుతో దానిని అచ్చువేయించారు. 2016లో ఈ భారీ నిఘంటువును ఆవిష్కరించారు. ఇప్పుడు మరో బృహత్కార్యానికి శ్రీకారం చుడతానంటున్నారు. ‘భగవద్గీత-ఖురాన్’ గ్రంథాల సారాన్ని ఉర్దూలో వివరించే ప్రయత్నం చేస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్నారు. ఆయన ఆశయం నెరవేరాలని మనమూ కోరుకుందాం.



నేను సార్... ఏక్ సౌ గ్యారా!

తొమ్మిది పదుల వయసుకు చేరువవుతున్న అప్పలాచార్య ఇప్పటికీ ఆరోగ్యవంతంగా ఉన్నారు. కెన్యాలో ఉద్యోగం చేస్తున్న పెద్దకుమారుడి దగ్గర ఉన్న అప్పలాచార్యను వీడియో కాల్‌లో పలకరిస్తే.. ఉర్దూ భాష గురించి, పాత జ్ఞాపకాలన్నీ ఉల్లాసంగా చెప్పుకొచ్చారు. “నాకు ఉర్దూ ఇంతగా రావడానికి మా గురువు ఖాదర్ హుస్సేన్ గారే కారణం. వారు చెప్పిన పాఠాలు.. పాడిన కవితలు.. నన్నెంతో ప్రభావితం చేశాయి. అప్పట్లో ఆయన్ను ఓసారి కలిశాను. పేరు చెబితే గుర్తుపట్టలేదు. నేను సార్ ఏక్ సౌ గ్యారా ‘111‘ (మూడు నామాలు ధరించేవాణ్ని) అని చెబితే.. ‘నువ్వా!’ అంటూ ఆలింగనం చేసుకున్నారు” అంటూ గతానుభవాలు పంచుకున్నారు.

ఈనాడు సినిమా


'భరత్ అను నేను'లో మహేష్‌బాబు

'సుబ్రహ్మణ్యపురం' ప్రారంభం

సుమంత్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సుబ్రహ్మణ్యపురం'. ఇషా కథానాయిక. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ధీరజ్ బొగ్గరం, బీరం సుధాకర్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సుమంత్‌కి ఇది 25వ చిత్రం. ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నాయకానాయికలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి కథానాయకుడు నాగచైతన్య క్లాప్ నిచ్చారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించారు.



సుమంత్, ఇషాపై క్లాప్‌నిస్తున్న నాగచైతన్య

చిత్ర లోగోని ఎంపీ జె.సి.దివాకర్‌రెడ్డితోపాటు నటులు రాజశేఖర్, జీవిత సంయుక్తంగా ఆవిష్కరించారు. సుమంత్ మాట్లాడుతూ "నా సినిమాల్ని సందడిగా ప్రారంభించడం నాకు ఇష్టం ఉండదు. కానీ ఈ చిత్ర నిర్మాతలు ఇది మీ కెరీర్‌లో ఓ మైలురాయిలాంటి చిత్రమనీ, సందడిగా ప్రారంభించబోతున్నామని రెండు వారాల కిందటే చెప్పారు. వాళ్లు చెప్పేవరకూ ఇది నా 25వ చిత్రమని తెలియదు. మానవాతీత అంశాల నేపథ్యంలో సాగే ఓ మిస్టరీ థ్రిల్లర్ కథాంశమిది. ఈ తరహా సినిమా చేయడం నాకిదే తొలిసారి. దర్శకుడు రెండున్నర గంటలపాటు కథ చెప్పి సినిమా మొత్తం చూపించారు. కథ వింటున్నప్పుడే తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠ వ్యక్తమైంది. ఆ అనుభూతి ప్రేక్షకులకూ కలిగించేలా ఈ సినిమా ఉంటుంది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఇది నా తొలి సినిమా. ఇదివరకు మూడు లఘు చిత్రాలు తెరకెక్కించా. వాటికి సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందన లభించింది. సుమంత్‌కి ఈ కథ చెప్పగానే చేయడానికి అంగీకరించారు. ఏప్రిల్ మూడో వారం నుంచి చిత్రీకరణ ప్రారంభిస్తాం" అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్‌చంద్ర, ఛాయాగ్రహణం: ఆర్.కె.ప్రతాప్.


ఆది పినిశెట్టి, రవిశంకర్, మోహన్, నవీన్ ఎర్నేని, చిరంజీవి, రామ్‌చరణ్, సమంత, దేవిశ్రీప్రసాద్, సుకుమార్, చంద్రబోస్ తదితరులు

అవార్డులన్నీ 'రంగస్థలం'కే వస్తాయి!

"అవార్డుల కోసం ఎవరూ సినిమాలు తీయరు. కానీ ఈసారి అవార్డులన్నీ 'రంగస్థలం'కి వస్తాయి. జాతీయ అవార్డులొచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. రావాలి.. రాకపోతే అన్యాయం జరిగినట్టే" అన్నారు చిరంజీవి. రామ్‌చరణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'రంగస్థలం'. సమంత నాయిక. మైత్రీ మూవీస్ సంస్థ నిర్మించింది. సుకుమార్ దర్శకుడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. ఈనెల 30న విడుదల కాబోతోంది. ఆదివారం విశాఖపట్నంలో విడుదల ముందస్తు వేడుక జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిరంజీవి మాట్లాడుతూ "వైజాగ్‌తో చాలా అనుబంధం ఉంది. ఇక్కడి వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంటుంది. నా రెండో ఇల్లు... విశాఖ. విశ్రాంత జీవితం ఎక్కడైనా గడపాలనుకుంటే విశాఖని ఎంచుకుంటా. 'రంగస్థలం' స్వచ్ఛమైన గ్రామీణ కథ ఇది. సినిమా చూశా. పల్లెవాతావరణాన్ని, మనస్తత్వాన్ని, అక్కడి రాజకీయాల్ని చక్కగా చూపించాడు. నాకు 'ఖైదీ' ఎలానో చరణ్‌కి 'రంగస్థలం' అలా. తన ఇమేజ్ పెంచే సినిమా అవుతుంది. నటుడిగా మరో మెట్టు ఎక్కించేలా ఉంటుంది. ఇంత మంచి పాత్ర చరణ్‌కి దక్కినందుకు నటుడిగా ఈర్ష్య పడుతున్నా తండ్రిగా గర్వంగానూ ఉంది. పాటలు చాలా సహజంగా తీశాడు. కరుకుదనం, మొటుదనం, నాటుదనం కనిపిస్తాయి. వినికిడి లోపం చుట్టూ వినోదాన్ని పండించడం ఆకట్టుకుంది. ఈ చిత్రానికి కర్త కర్మ క్రియ... సుకుమారే.. చాలా తక్కువ రోజుల్లో ఇంత మంచి పాటలిచ్చాడు దేవిశ్రీ. తెలంగాణ బిడ్డ అయి ఉండి గోదావరి యాసలో చంద్రబోస్ పాటలు రాయడం ఆనందంగా ఉంది. తన పెన్నుకి వెన్ను వంచి నమస్కరిస్తున్నా" అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ "చిన్నప్పుడు పల్లెటూరుతో అంతగా అనుబంధం లేదు. కానీ ఈ సినిమాతో పల్లెటూరిని నాకు పరిచయం చేసిన సుక్కుకి కృతజ్ఞతలు. ఆ వాతావరణం చూశాక.. పట్నాల్లో ఎందుకు ఉంటున్నామా అనిపిస్తుంది. సమంత ఎవరితో సినిమా చేసినా... ఆ కథానాయకుడికి కొత్త ఉత్సాహం ఇస్తుంది. నాకూ అలానే అనిపించింది. తనతో చేసిన ప్రతి సన్నివేశం అందంగా వచ్చింది. దేవి వినగానే నచ్చే పాటలు ఇచ్చాడు. 'ఎంత సక్కగున్నావే' పాటలో అమ్మాయిని చాలా అద్భుతంగా వర్ణించారు. ప్రతీ నటుడూ ఇలాంటి సినిమా చేయాలి. ఓ కొత్త చరణ్‌ని నాకే పరిచయం చేశారు. నాపై నాకే గౌరవం పెరిగింది. మా అమ్మానాన్న, అభిమానులు గర్వపడే సినిమా ఇచ్చార"న్నాడు. సమంత మాట్లాడుతూ "ప్రతీ సన్నివేశాన్ని చాలా ప్రేమతో చెబుతారు సుకుమార్. రామలక్ష్మి పాత్ర చెబుతున్నప్పుడు ఆయన కళ్లు మాత్రమే చూశా. అందులో ఆయన ప్రేమ కనిపించింది. ఆ పాత్రకు వంద శాతం న్యాయం చేయాలని ఓ సవాల్‌గా తీసుకున్నా. 'ఎంత సక్కగున్నావే' పాటతో దేవిశ్రీ నన్ను రామలక్ష్మి చేశార"ని చెప్పింది.

చంద్రబోస్ మాట్లాడుతూ "గీత రచయితగా ఇరవై మూడేళ్ల ప్రయాణం నాది. తొలి దశలో రాఘవేంద్రరావు - కీరవాణిల సారథ్యంలో మంచి పాటల్ని రాసే అవకాశం వచ్చింది. సుకుమార్ - దేవిశ్రీ కాంబినేషన్‌తో రెండో దశ ప్రారంభమైంది. తెలుగు భాష సొగసుని శ్రోతలకు అందించే ప్రయత్నంలో కొన్నిసార్లు పువ్వులు, ఇంకొన్నిసార్లు పిందెలు, కాయలు అందించాను. 'రంగస్థలం'తో మాత్రం నా పంట పండింద"న్నారు. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ "పల్లెటూరి నేపథ్యంలో సినిమా చేయాలని ఎప్పటి నుంచో అనుకుంటున్నా. అది ఈ సినిమాతో తీరింది. కేవలం అయిదు రోజుల్లో అయిదు పాటల్ని పూర్తి చేశాం. సుకుమార్ ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలతో వస్తాడు. అందుకే నాకూ కొత్త పాటలు ఇచ్చే అవకాశం దొరుకుతోంద"న్నారు. సుకుమార్ మాట్లాడుతూ "చిరంజీవి గారు రాజకీయాల్లోకి వస్తున్నప్పుడు 'ముఖ్యమంత్రి పదవి కంటే చిరంజీవి పదవే గొప్పది కదా..? ఆయన ఎందుకు వస్తున్నారు' అని దేవిశ్రీ నన్ను అడిగాడు. ఎంతమందికి ఎన్ని పదవులు ఉన్నా చిరంజీవి అనే పదవి ప్రత్యేకం. సమంత ఒప్పుకుంటే.. జీవితాంతం తనతో సినిమాలు తీస్తుంటా. చిట్టిబాబు పాత్రలో ఒదిగిపోవడానికి చరణ్‌కి ఎంతోసేపు పట్టలేదు. చాలా సన్నివేశాలు తొలి టేకులో ఓకే అయిపోయేవి. చరణ్ కోపం, ఆనందం, బాధ.. వీటన్నింటిలోనూ నిజాయతీ ఉంటుంది. అందుకే అంత చక్కగా నటించార"న్నారు. ఈ కార్యక్రమంలో అల్లు అరవింద్, పూజా హెగ్డే, అనసూయ, సుస్మితా కొణిదెల, బ్రహ్మాజీ, బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్, తిరుపతి ప్రసాద్, ఆది పినిశెట్టి, కళా దర్శకుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నర్తనశాల'కు రీమేక్ కాదు



నాగశౌర్యపై క్లాప్‌నిస్తున్న వంశీ పైడిపల్లి

నాగశౌర్య కథానాయకుడిగా తెరకెక్కనున్న చిత్రం '@ నర్తనశాల'. శ్రీనివాస్ చక్రవర్తి దర్శకుడు. ఉషా ముల్పూరి నిర్మాత. ఆదివారం హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వంశీ పైడిపల్లి క్లాప్‌నిచ్చారు. అనంతరం నాగశౌర్య మాట్లాడుతూ "కృష్ణవంశీ శిష్యుడు శ్రీనివాస్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నృత్యానికి ప్రాధాన్యమున్న చిత్రమిది. పాత 'నర్తనశాల' చిత్రానికి రీమేక్ కాదు. చక్కటి వినోదాత్మక చిత్రం. తర్వాలో కథానాయిక ఎవరో ప్రకటిస్తాం" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఐరా సంస్థలో తెరకెక్కిన 'ఛలో' పెద్ద హిట్ అయింది. దాన్ని మించేలా సినిమా రూపొందిస్తానని మాటిస్తున్నా" అన్నారు. ఈ చిత్రంలో నరేష్, జయప్రకాశ్, అజయ్, పోసాని తదితరులు నటిస్తున్నారు. సంగీతం: మహతి స్వర సాగర్, ఛాయాగ్రహణం: విజయ్ సి.కుమార్.


తనిష్క్

ప్రేమలో పడ్డాక..!

సుజన్, తనిష్క్ జంటగా నటించిన చిత్రం 'అప్పుడు - ఇప్పుడు'. చలపతి పువ్వల దర్శకత్వం వహిస్తున్నారు. ఉషారాణి కనుమూరి, విజయ రామకృష్ణంరాజు నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఉగాది సందర్భంగా ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. "ఒక తీయటి అనుభూతిని పంచే కథ ఇది. ప్రేమతోపాటు హాస్యానికి పెద్ద పీట వేస్తూ తెరకెక్కించాం. ఒక జంట ప్రేమలో పడ్డాక ఏమైందనేది తెరపైనే చూడాలి. వేసవిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు నిర్మాతలు. శివాజీరాజా, పేరుపురెడ్డి శ్రీనివాస్ ముఖ్యపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: పద్మనాభ్ భరద్వాజ్, ఛాయాగ్రహణం: కల్యాణ్ సమి.

నిశ్శబ్ద ఆయుధం



నారా రోహిత్‌పై క్లాప్‌నిస్తున్న పత్తిపాటి పుల్లారావు

నారా రోహిత్ కథానాయకుడిగా శ్రీవైష్ణవి క్రియేషన్స్ సంస్థ ఓ చిత్రానికి శ్రీకారం చుట్టింది. పి.బి మంజునాథ్ దర్శకుడు. ఈ చిత్రానికి 'శబ్దం' అనే పేరు ఖరారు చేశారు. 'హిజ్ సైలెన్స్ ఈజ్ హిజ్ వెపన్' అనేది ఉపశీర్షిక. ఆదివారం అమరావతిలో ఈ చిత్రం లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పత్తిపాటి పుల్లారావు క్లాప్‌నిచ్చారు. పెదకూరపాడు శాసన సభ్యులు కొమ్మలపాటి శ్రీధర్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడుతూ "ఉగాది రోజున కొత్త చిత్రం ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. ప్రేక్షకులకు వినోదం పంచివ్వడానికి మా చిత్రబృందమంతా కష్టపడతాం. ఆడియో వేడుక కూడా అమరావతిలోనే నిర్వహిస్తామ"న్నారు. "కథని నమ్మి నాకు ఈ అవకాశం ఇచ్చారు నారా రోహిత్. ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటా. కథకు తగిన టైటిల్ ఇది. ఏప్రిల్ చివరి వారం నుంచి చిత్రీకరణ ప్రారంభం అవుతుంది. విశాఖపట్టణం, కాకినాడ, హైదరాబాద్‌ల్లో చిత్రీకరణ జరుపుతామ"న్నారు దర్శకుడు. ఈ చిత్రానికి సంగీతం: వికాస్ కురిమెళ్ల, ప్రొడక్షన్ డిజైనర్: రవీందర్, ఛాయాగ్రహణం: రిచర్డ్ ప్రసాద్.

పండగరోజున చెప్పేశారు

ఉగాది... ఓ కొత్త ఆరంభం. కొత్త ఆశలకు, కొత్త ఆశయాలకూ శ్రీకారం చుట్టే రోజు. చిత్రసీమలోనూ ఉగాది హంగామా కనిపించింది. కొత్త లుక్కులు, కొత్త కబుర్లతో టాలీవుడ్ కళకళలాడింది. విడుదల తేదీలు ఫిక్సయ్యాయి. కాంబినేషన్లు ఖరారయ్యాయి.


కీర్తి సురేష్


వెంకటేష్


సావిత్రి కథ ఆధారంగా 'మహానటి' రూపుదిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. వైజయంతీ మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. ఉగాది సందర్భంగా విడుదల తేదీ ఖరారైంది. మే 9న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్టు చిత్ర బృందం ప్రకటించింది.

తెలుగులో మరో మల్టీస్టారర్ చిత్రానికి రంగం సిద్ధమవుతోంది. వెంకటేష్, నాగచైతన్య.. ఇద్దరూ కలసి నటిస్తారని ఎప్పటి నుంచో చెప్పుకుంటున్నారు. ఇప్పుడు అందుకు మార్గం సుగమమైంది. ఈ చిత్రానికి బాబి దర్శకత్వం వహించనున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్మించనున్నాయి. మేలో చిత్రీకరణ ప్రారంభిస్తారు.

అఖిల్ మూడో చిత్రానికి దర్శకుడు ఎవరన్నది తెలిసింది. 'తొలి ప్రేమ'తో ఆకట్టుకున్న వెంకీ అట్లూరితో అఖిల్ జట్టు కట్టబోతున్నాడు. ఈ విషయాన్ని ఉగాది రోజున తన ట్విట్టర్ ద్వారా ధృవీకరించాడు అఖిల్. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ ఈ చిత్రానికి నిర్మాతగా వ్యవహరిస్తారు. 'ఫిదా', 'తొలి ప్రేమ'... ఇలా వరుస విజయాలతో దూసుకుపోతున్న వరుణ్ తేజ్.. మరో చిత్రానికి శ్రీకారం చుట్టేస్తున్నాడు. 'అప్పట్లో ఒకడుండేవాడు'తో ఆకట్టుకున్న సాగర్ చంద్ర దర్శకత్వం వహిస్తారు. రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించనున్నారు.


అఖిల్


వరుణ్‌తేజ్


రవితేజ

'ఎం.ఎల్.ఎ'తో ఈ వారం ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు కల్యాణ్‌రామ్. 'నా నువ్వే' చిత్రీకరణ దశలో ఉంది. ఇప్పుడు మరో చిత్రానికి శ్రీకారం చుట్టబోతున్నాడు. తన కొత్త సినిమా విశేషాల్ని ఉగాది రోజున ప్రకటించాడీ నందమూరి కథానాయకుడు. 'ఉయ్యాల జంపాల', 'మజ్ను' చిత్రాలతో ఆకట్టుకున్న విరించి వర్మ చెప్పిన కథకు కల్యాణ్ రామ్ ఓకే చెప్పేశారు. జెమిని కిరణ్ నిర్మాత. ఆదివారం ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన విడుదల చేశారు. రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'నేల టికెట్టు'. కల్యాణ్ కృష్ణ దర్శకుడు. ఉగాది సందర్భంగా ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు. మే 24న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తుంది.


కల్యాణ్ రామ్

పించ్ ట్రైలర్

ఒకటో తారీఖు, ఒకటో తారీఖు అని ముప్పై రోజులు ఎదురుచూస్తాం. చివరికి అది అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంది. వరదబాధితుల్ని ఆదుకోవడానికి హెలీకాప్టర్ వచ్చివెళ్లిపోయినట్లు.

చిత్రం : అమ్మో ఒకటో తారీఖు

- పంపినవారు : సునీల్, కరీంనగర్

ఒత్తిడికి మల్లె కొవ్వొత్తి

మనసుని ఆహ్లాదపరిచే సువాసనలతో, చూడచక్కని ఆకృతుల్లో ఆకట్టుకుంటాయి. సుగంధ కొవ్వొత్తులు. వీటినుంచి వచ్చే పరిమళాలు ఆరోగ్య ప్రయోజనాల్నీ అందిస్తాయట. మరి అవేంటో చదివేద్దామా!



లావెండర్: ఇది చక్కని సువాసన మాత్రమే అందిస్తుందని అనుకుంటాం. కానీ ఈ కొవ్వొత్తుల నుంచి వచ్చే లావెండర్ పరిమళం ఒత్తిడీ, కుంగుబాటూ, అలసటా, తలనొప్పి నుంచి తక్షణ ఉపశమనాన్ని అందిస్తుంది. నిద్రలేమితో బాధపడేవారికి ఇది చక్కని పరిష్కారం కూడా అంటారు నిపుణులు. దీన్ని వెలిగించి పడకగదిలో పెట్టుకుంటే చాలు.



దాల్చిన చెక్క: ఇప్పుడు ఇవి కూడా దొరుకుతున్నాయి. దాన్నుంచి వచ్చే ఘాటైన, తీయనైన వాసన గదిని సువాసనభరితం చేస్తుంది. మెదడునీ ఉల్లాసంగా ఉంచుతుంది. ఏకాగ్రతను కూడా పెంచుతుంది. వికారానికి చక్కని పరిష్కారం. దీన్ని పనిచేసే ప్రదేశంలో వెలిగిస్తే ఒత్తిడి అదుపులో ఉంటుంది.



మల్లె: దీన్నుంచి వచ్చే సువాసన భావోద్వేగాలను అదుపులో ఉంచి, ఒత్తిడిని తగ్గిస్తుంది. శ్వాసకోశ సమస్యల్ని అదుపు చేయడంలోనూ ఈ కొవ్వొత్తి ఎంతో మేలు చేస్తుంది.



పుదీనా: ఇది వేసవే కాబట్టి... ఈ కొవ్వొత్తుల్ని గదిలో అక్కడక్కడా పెట్టడం వల్ల చల్లదనం వచ్చిన అనుభూతి కలుగుతుంది. మెదడు పనితీరు చురుగ్గా ఉంటుంది. పిల్లలు చదువుకునే చోట ఉంచితే మంచిది.



గులాబీలు: నిద్రలేమి సమస్యతో బాధపడేవారు ఈ గులాబీ సువాసనల కొవ్వొత్తుల్ని వెలిగించండి. మనసును ఆహ్లాదంగా ఉంటుంది. తలనొప్పి అదుపులోకి వస్తుంది.



ప్రేమంటే...

లోతుని కొలవలేకపోవచ్చు. అది పుట్టడానికి కారణాలూ కనుక్కోలేకపోవచ్చు. కానీ దాని నాడిని మాత్రం పట్టుకోవచ్చు. ఎలా దొరుకుతుంది? ఓర కంటి చూపులతో గుండెల్లో పుట్టిన గుబులుతో దాన్ని గుర్తుపట్టేయొచ్చు. పెదాలమీద చిరునవ్వుతోనే సునామీలు చుట్టుముట్టేస్తుంటే చెప్పేయొచ్చు. ఏమని?...ఒకరంటే మరొకరికి ఇష్టమని... అదేనా ప్రేమంటే! దానికి తొలిమెట్టు ఆకర్షణే కదా...మరి ఆ రెంటికీ మధ్య ఉన్న గీత కనిపించిందా! దాన్నేమాత్రం ఏమరుపాటుగా గమనించుకోలేకపోయినా ఉద్వేగాలు వరదలైపారతాయి. కన్నీటి సుడులతో గుండె కల్లోలం అవుతుంది. మరి స్వచ్ఛమైన ప్రేమను ఒడిసిపట్టుకునేదెలా...


ఆకర్షణకి అడ్డేద్దాం!

● ఒక్కగానొక్క కూతురుని కంటికి రెప్పలా కాచుకుంటున్న ఆ తల్లిమాటలు...టీనేజీకి వచ్చేసరికి ఆ అమ్మాయికి కఠినంగా కనిపించాయి. తను కోరుకున్న స్వేచ్ఛ...వీధి చివర బేకరీలో పనిచేసే అబ్బాయి చూసే చూపుల్లో కనిపించింది. ఆ అమ్మాయి దానికే ప్రేమ అనే పేరు పెట్టుకుంది. అతనికోసం ఏదైనా చేసేసే స్థాయికి చేరుకుంది. మరి నిజమైన ప్రేమేనా?

● కీర్తన బీటెక్ పూర్తిచేసి ఓ కార్పొరేట్ కంపెనీలో పనిచేస్తోంది. అప్పటివరకూ చదువే ప్రపంచంగా ఉన్న ఆమెకు కొత్త స్నేహాలూ, సరదాలు మరోలోకాన్ని చూపించాయి. పెళ్లయిన వాడని తెలిసినా సరే! ఆ సహోద్యోగే తన ప్రపంచం అంటోంది. దానికే ప్రేమ అనే నిర్వచనం ఇస్తోంది..? ఇంతకీ అది ప్రేమేనా?

ఇవి నిజానికి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ సందర్భంగా చెప్పిన ఇద్దరమ్మాయిలకు మినహా బయటివారందరికీ అది ప్రేమ కాదనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. అలా తెలుసుకోలేకపోవడం వల్లే ఇలాంటి ఆడపిల్లలు చిక్కుల్లో పడుతుంటారు. తరాలు మారినా ప్రేమ శక్తి తగ్గలేదు కానీ దాన్ని చూసే తీరు మాత్రమే మారింది అంటారు మానసిక నిపుణులు. ఒకప్పటి ప్రేమ.. పెళ్లి పీటలు వరకూ రావాలంటే రోజులూ, నెలలూ...సంవత్సరాలే పట్టేది. కాదు.. కాదు! అసలు అమ్మాయితో ఒక్క మాట మాట్లాడటానికే అంత సమయం పట్టేది. ఇప్పుడు ప్రేమను చెప్పడానికేకాదు..ట్విట్టర్‌లో ట్వీట్ చేసే సమయంలోనే పెళ్లి చేసేసుకుంటున్నారు. ఆ కొద్దికాలానికే మరికొన్ని ప్రేమలు కలిసి ఒకే ఇంట్లో ఉండేంత చనువునీ ఇచ్చేస్తున్నాయి. అసలు అది నిజమైన ప్రేమో కాదో తెలుసుకునేదెలా? అంటారా? ఈ రెండింటికీ మధ్య తేడాలు గమనించగలిగితే సరి.

ఆకర్షణలో ఉన్నప్పుడు శారీరకంగా ఎంతందంగా కనిపించాలి..ఎదుటివారిని ఎలా ఆకర్షించాలి అన్న ఆలోచనలే ఎక్కువగా వస్తుంటాయట. అదే నిజమైన ప్రేమ అయితే మీరెలా ఉన్నా కూడా వారు మిమ్మల్ని స్వీరించగలుగుతారు దాన్నే అసలైన ప్రేమగా గుర్తించమంటున్నారు మానసిక నిపుణులు.



ప్రేమ

♥ ప్రేమలో మొట్ట మొదట కనిపించేది ఆకర్షణే కానీ ..ఒకరికొకరు దగ్గరయ్యే కొద్దీ ఇద్దరూ తమ బలాలూ, బలహీనతలను సమానంగా అంగీకరించగలుగుతారు. ఒకరికోసం మరొకరు ఇష్టంగా సర్దుకుపోగలుగుతారు.

♥ ప్రేమలో అసూయ, అనుమానాలకి చోటే లేదు. ఎదుటివారి భావాలకు ప్రాధాన్యత సమంగా ఉంటుంది.

♥ ప్రేమలో పారదర్శకతకే ప్రాధాన్యత ఎక్కువ. .

ఆకర్షణ

♥ ఆకర్షణ ప్రేమకు తొలిమెట్టు. కానీ ఆకర్షణ మాత్రం ప్రేమ కాదు.

♥ ఒకరిని చూస్తే గుండె లయతప్పడం, నరాలు జివ్వుమనడం వంటి భావాల్లోనే మీరు ఆగిపోతే అది ఆకర్షణే. అప్పుడే భావావేశాలూ పుట్టుకొస్తాయి. ♥ అసూయ ప్రేమకు చిహ్నం...కానీ దానికే మొదటి ప్రాధాన్యం అయితే మీది ఆకర్షణే. మీ ఇద్దరి సంబంధంలో అనుమానాలూ, అభద్రత దాన్ని నొక్కి చెబుతాయి.

♥ భావోద్వేగాలకూ, శారీరక, ఇతర అవసరాలకు అనుగుణంగా ఆకర్షణ పుట్టుకొస్తుంది.

మరేం చేయాలి....

కౌమార దశలో యువత నలుగురిలోనూ తమకో గుర్తింపు కావాలని కోరుకుంటారు. ఆ క్రమంలోనే సాహసాలు చేయడం, ప్రత్యేకంగా కనిపించాలనుకోవడం, అందానికి ప్రాధాన్యం ఇవ్వడం, గొప్పలు చెప్పుకోవడం వంటివి చేస్తుంటారు. ఈ క్రమంలో ఆడా, మగా స్నేహాలు క్రమంగా ఆకర్షణ వలల్లో చిక్కుకుంటాయి. అవి చిక్కుముడుల్లా మారకుండా ఉండాలంటే....

తొందరపాటు వద్దు: కాలేజీ అన్నాక సరదాలూ, సంతోషాలు కాస్త ఎక్కువే ఉంటాయి. మీ బృందంలో అమ్మాయిలూ, అబ్బాయిలూ కలిసే ఉండి ఉండొచ్చు. వారిలో కొందరు ఇతరులతో కంటే మీతోనే ఎక్కువగా మాట్లాడటానికి ప్రయత్నిస్తుంటారు. అలాని వారు చూపించే శ్రద్ధ అంతా మీ మీద ప్రేమేనని ఊహించుకోకండి. ఆ విషయాన్ని తొందరపడి నలుగురితోనూ పంచుకోవాలనీ ప్రయత్నించొద్దు. ఎందుకంటే అది కాదని తేలినప్పుడు అందరిలోనూ మీరు చులకన అవుతారు. ముందు ప్రేమకు, స్నేహానికీ, ఆకర్షణకు మధ్య ఉన్న చిన్న తేడాను గమనించుకోండి. అప్పుడు మీకే అర్థమవుతుంది. అది ప్రేమో కాదో!

స్పష్టత అవసరం: ఒకవేళవారు నిజంగానే మిమ్మల్ని ప్రేమిస్తున్నాని చెబితే...కాదనాలా? అవుననాలా! అంటూ మథన పడుతున్నారా? ముందు మీరు ప్రేమించడానికి తగిన అర్హత అంటే వయసు ఉందా? ఒకవేళ ఇంట్లో మీ విషయం చెబితే ఒప్పుకుంటారా? అన్న అంశాలతో పాటు అసలు మీరెందుకు అవతలివారిని ఇష్టపడతున్నారో కూడా ఒక్కసారి ఆలోచించుకోండి. మంచి బహుమతి ఇచ్చాడనో, నలుగురిలోనూ మీకు ప్రపోజ్ చేశాడానో చిన్న చిన్న విషయాలు మీ ప్రేమకు కారణం కాకూడదు సుమా! ఇవన్నీ ఆకర్షణ వలలు పోయేంత వరకే ఉంటాయి. అందుకే ఏ ఆలోచన చేసేప్పుడైనా దూరదృష్టితో ఆలోచించాలి. దానికి తగ్గ పరిణతి వచ్చేవరకూ మీ ప్రేమను దూరంగా పెట్టండి. అలా ఉన్నప్పుడు తల్లిదండ్రులు మీ ప్రేమను ఎలా కాదంటారు చెప్పండి.

పారదర్శకత ఉండాలి: ఏ స్నేహమైనా, ప్రేమైనా రహస్యం కాకూడదు. అలా చేస్తే ఆ బంధాలు మిమ్మల్ని కొన్నిసార్లు చిక్కుల్లో పడేస్తాయి. అందుకే పారదర్శకంగా ఉండటానికి ప్రయత్నించండి. మీ స్నేహితుల్ని మీ తల్లిదండ్రులకి పరిచయం చేయండి. నిజానికి మీ ప్రేమ విషయమే చెప్పాల్సి వచ్చినా భయపడాల్సిన పని లేదు. ముందు స్నేహితులుగా పరిచయం చేయండి. వారూ ఒకరిని ఒకరు దగ్గరగా చూసేందుకు చక్కని అవకాశం లభిస్తుంది. ఈ పరిణతి మీ ప్రేమను సులభంగా గెలిపిస్తుంది.



డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

ఎముక ఆరోగ్యానికి ఎండ!



మహిళల్లో ముప్పై ఏళ్ల తరువాత ఎముకల్లో సాంద్రత తగ్గుతుంది. సమతులాహారం తీసుకోవడం వల్ల ఈ సమస్యను దాదాపు రాకుండా చూడొచ్చు. మరి ఎముకలు బలంగా ఉండటానికి ఏం చేయాలంటే...

➡ మీరు రోజూ తీసుకునే ఆహారంలో క్యాల్షియం, విటమిన్-డి ఉండేలా చూసుకోవాలి. పాలూ, పెరుగూ, తాజా పండ్లూ, కాయగూరలూ, గుడ్లూ తీసుకోవడం వల్ల మీ ఎముకలకు కావాల్సిన బలం చేకూరుతుంది. వీటికి అదనంగా పండ్ల రసాలూ, చిరుధాన్యాలను కూడా తీసుకుంటే మంచిది.

➡ ప్రతిరోజూ ఉదయం ఎండలో కాసేపు కూర్చోవాలి. దీనివల్ల విటమిన్-డి మీకు నేరుగా అందుతుంది. అలాగే వైద్యులతో మాట్లాడితే డి విటమిన్ మాత్రల్నీ సూచిస్తారు.

➡ మీ ఎత్తుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వీలైతే ఆ సమయాన్ని ఉదయానికి మార్చుకోండి. ఆరుబయట వ్యాయామం, పరుగూ, నడకా వంటివి ఎంచుకోవడం వల్ల మీ ఎముకలు దృఢంగా మారడంతోపాటు ఆరోగ్యంగానూ ఉంటారు.

➡ ఆరోగ్యం పట్ల అశ్రద్ధ కనబరచకూడదు. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ ఉండాలి. జన్యుసంబంధ కారణాల వల్ల కొన్ని అనారోగ్య సమస్యలు తలెత్తవచ్చు. కాబట్టి అప్రమత్తంగా ఉండాలి. ఆస్టియోపోరోసిస్ లాంటి సమస్య తలెత్తకుండా ముందు నుంచే జాగ్రత్తలు పాటించాలి.

చక్కనమ్మకి చిన్న పిన్ను చాలు..



జుట్టు కాస్త పొడవుంటేనే కానీ రకరకాల జడల్ని ప్రయత్నించలేం. అలాని ఎప్పుడూ ఒకే తరహా పోనీకి ఫిక్సయిపోలేం. జుట్టుని వదులుగా వదిలేసినా, రబ్బరు బ్యాండుతో బిగించినా, లేదా చిన్నగా అల్లినా సరే...ఈ ఆధునిక తలపిన్నుల్ని పెట్టుకుంటే చాలు అదనపు అందాన్ని తెచ్చిపెడతాయి. నక్షత్రాలూ, పూలూ, వివిధ జంతువులూ, పక్షుల ఆకృతుల్లో ఇవి లభిస్తున్నాయి. వీటిని తల్లో పెట్టుకుంటే చూపుతిప్పుకోనివ్వని ఆకర్షణ మీదే.

రెండో పెళ్లయ్యాక మొదటి భర్తతో విడాకులు వస్తాయా?


? నేను కాలేజీలో ఉండగా ప్రేమించి పెళ్లిచేసుకున్నా...కానీ ఇంట్లో ఒప్పుకోరని కొన్నినెలలపాటు తాళినీ, మా బంధాన్నీ, దాచిపెట్టాం. చదువయ్యాక మా విషయం చెప్పాలనుకున్నాం కానీ ఈలోగానే మా ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. మా ఇళ్లలోనూ ప్రేమా, పెళ్లి సంగతి తెలిసి అంగీకరించలేదు. వేర్వేరుగా ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. ఇది జరిగి ఎనిమిదేళ్లు అవుతోంది. ఇప్పుడు నాకు ఇద్దరు పిల్లలు. తనకీ పిల్లలున్నారు. కానీ ఈ మధ్య అతడు తిరిగి నాతో బంధం కలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. పైగా విడాకులు తీసుకోలేదు కాబట్టి మనం ఇప్పటికీ భార్యాభర్తలమే అంటున్నాడు. దీనివల్ల నా కాపురంలో సమస్యలు వస్తాయని భయంగా ఉంది. దీన్ని నేనెలా పరిష్కరించుకోవాలి? – ఓసోదరి

✔ మీ ఇద్దరూ ప్రేమించి పెళ్లి చేసుకున్నాక ఇంట్లో చెప్పకపోవడమే చాలా పెద్ద తప్పు. ఇక్కడ మీరు ఏవిధంగా పెళ్లి చేసుకున్నారో వివరంగా రాయలేదు. గుడిలో తాళికట్టడం, దండలు మార్చుకోవడం, నుదుట తిలకం దిద్దడం వంటి వాటిని చట్టం పెళ్లిగా ఆమోదించదు. హిందూవివాహ చట్టం ప్రకారం ఎవరైతే పెద్దల సమక్షంలో సంప్రదాయం ప్రకారం కానీ, గుడిలో కానీ పెళ్లి చేసుకుంటారో అది మాత్రమే వివాహంగా చెల్లుబాటు అవుతుంది. ఆ విధంగా వివాహం జరిగాక విడాకులు తీసుకోకుండా రెండో పెళ్లి చేసుకుంటే మాత్రం అదీ చెల్లదు. మీరిద్దరూ వేర్వేరు పెళ్లిళ్లు చేసుకుని పిల్లల్నీ కన్నారు కాబట్టి చట్టబద్ధత లేకపోయినా సామాజికంగా అది చెల్లుబాటు అవుతుంది. అతను ఇప్పుడు మీరే తన భార్య అనడం సరికాదు. ఇది అతని చపలత్వాన్ని సూచిస్తోంది. మీ మొదటి పెళ్లి విషయం ఇప్పటికైనా పెద్దలకు తెలియపరిచి న్యాయపరంగా విడాకులు తీసుకోవడానికి ప్రయత్నించండి. ఒకవేళ అతను మీ సంసారానికి ఏమైనా ఇబ్బందులు కలిగిస్తుంటే అతని మీద క్రిమినల్ చర్యలు తీసుకోవచ్చు. ఎందుకంటే ఇప్పటికే మీ సంసారానికీ, వ్యక్తిగత జీవితానికీ ఇబ్బంది కలిగిస్తున్నాడు కాబట్టి 'రైట్ టు ప్రైవసీ యాక్ట్' కింద ప్రతి స్త్రీకీ తన వ్యక్తిగత స్వేచ్ఛను కాపాడుకునే హక్కు రాజ్యాంగం కల్పిస్తోంది. మీ సంసార విషయాల్లో జోక్యం చేసుకునే హక్కు అతనికి ఎంతమాత్రం లేదు. మీకు ఇష్టం లేకుండా అతను కల్పించుకుంటుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి. అతడిని పిలిపించి కౌన్సెలింగ్ చేయడం ద్వారా విడాకులు తీసుకోవడానికి ఒప్పించండి.

ఇక్కడ మీరు ఇంకొకటి గమనించాలి. మీ మొదటి పెళ్లికి విడాకులు తీసుకున్నాకే రెండోది చెల్లుబాటు అవుతుంది. రెండో భర్త నుంచి మీ పిల్లలకి న్యాయపరంగా హక్కులన్నీ వస్తాయి గానీ మీకు మాత్రం ఆస్తిలో వాటా రాదు. ఒకవేళ విడాకులు తీసుకున్నా భరణం కూడా లభించదు. మీకు భార్యగా న్యాయమైన హక్కు కావాలంటే తప్పనిసరిగా విడాకులు తీసుకుని ఉండాలి. మీ మొదటి భర్త విడాకులు ఇవ్వకపోయినా మీరు చట్టబద్ధంగా అడుగులు వేస్తే తప్పక వస్తాయి.

ఇప్పటికైనా మించిది లేదు అతను బెదిరిస్తున్నాడు కాబట్టి బ్లాక్ మెయిల్ కేసు, ప్రాణానికి ప్రమాదం ఉందనీ, సైబర్ క్రైమ్ కేసులు నమోదు చేయొచ్చు. అతని భార్యా, తల్లిదండ్రులకీ తెలిచేసి విడాకులకు ఒప్పించండి. ఇంకా నిర్లక్ష్యం చేయకండం వల్ల లేనిపోని సమస్యల్లో చిక్కుక్కునే ప్రమాదం ఉంది. అతని మాటలకీ, బెదిరింపులకీ ఎంత మాత్రం లొంగాల్సిన అవసరం లేదు.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

మురికివాడలను ముస్తాబు చేస్తోంది




ముంబయి అనగానే ఆకాశహర్మ్యాలూ, పెద్ద పెద్ద షాపింగ్‌మాళ్లతో పాటే అక్కడున్న మురికివాడలూ గుర్తొస్తాయి. ఆ వాతావరణం ఒక కళా హృదయాన్ని కదిలించింది. ముంబయికి చెందిన రబుల్‌నాగీ అనే కళాకారిణి మురికివాడల్లో మార్పు తీసుకొచ్చేందుకు 'మిసాల్ ముంబయి' అనే కార్యక్రమం ప్రారంభించింది. దీంట్లో భాగంగానే 2012లో 'పెయింట్ ధారావి' పేరుతో ఓ కార్యక్రమం మొదలుపెట్టింది. మురికివాడల్లో ఉండే ఇళ్ల గోడల్ని రంగులమయం చేయడమే ఆ కార్యక్రమం లక్ష్యం. 'ఒక మురికివాడను దూరం నుంచి చూసి దీన్ని మార్చాలని ఆలోచించడం సులువే. కానీ, అక్కడికి వెళ్లి పరిస్థితులు అర్థం చేసుకోవడం, వాళ్లకు అర్థమయ్యేలా చెప్పి ఒప్పించడం చాలా కష్టమైన పనే' అంటుందామె. కేవలం ఈ పైపై పూతలు పూసినంత మాత్రానా వెంటనే మార్పు రాదు. అందుకే పారిశుద్ధ్యం, మహిళా సాధికారత... ఇలా అవసరమైన విషయాలపై అవగాహన కల్పించడం కూడా మొదలుపెట్టింది. ఇప్పటి వరకు జాఫెర్ బాబా కాలనీ, మౌంట్ మారీ లాంటి ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో మార్పు తీసుకొచ్చేందుకు పనిచేస్తోంది ఈ కార్యక్రమం కేవలం ముంబయికే పరిమితం కాకుండా భారతదేశంలోని ఇతరప్రాంతాలకూ విస్తరిస్తానంటోంది నాగీ.

మృదువైన చేతులకు మర్దన

చాలామంది ఇంటిపనీ, వంటపనితోపాటు.. పొద్దస్తమానం రకరకాల పనులు చేస్తుంటారు. ఈ క్రమంలో చేతులు మృదుత్వాన్ని కోల్పోయి నిర్జీవంగా, పొడి బారినట్టు అవుతాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేయకుండా ఈ జాగ్రత్తలు తీసుకుని చూడండి.

నూనె: పనులు ఎక్కువగా చేసేవారు ప్రతిరోజూ రాత్రిపూట పడుకునే ముందు చేతులకూ, వేళ్లకూ కొబ్బరి నూనె లేదా ఆలివ్ నూనెతో మర్దన చేయాలి. కాసేపయ్యాక గ్లవుజులు వేసుకోవాలి. మర్నాడు చన్నీళ్లతో కడిగేయాలి. ఇలా చేయడం వల్ల రోజంతా పని చేసి బరకగా మారిన చేతులకు తేమ అంది ఆరోగ్యంగా ఉంటాయి.

వేణ్నీళ్లు: చేతులు నీళ్లలో ఎక్కువగా నానడం మంచిది కాదు. అలాగే చేతుల్ని పదే పదే చల్లటినీళ్లలోనూ ఉంచకూడదు. ఎక్కువ పనులు చేసేవారు చేతులు కడుక్కోవడానికి గోరువెచ్చనినీరు వాడటం మంచిది.



క్రీంలు: చేతులకు రాసుకునే క్రీములు ఎప్పుడూ బ్యాగులోనే ఉండాలి. ప్రతి మూడు నాలుగు గంటలకోసారి రాసుకుంటూ ఉండాలి. దీనివల్ల చర్మం మృదుత్వాన్ని కోల్పోకుండా ఉంటుంది.

పెట్రోలియం జెల్లీ: ఇప్పటికే చేతులు బాగా బరకగా మారి, మృదుత్వాన్ని కోల్పోయి ఉంటే మాత్రం వాటికి ఎంత తేమ అందిస్తుంటే అంత మంచిది. ముఖ్యంగా పెట్రోలియం జెల్లీ బాగా రాయాలి. ఇది జిడ్డుగా ఉండటం వల్ల పొడిబారిన సమస్య తగ్గుతుంది.



ఎంబీబీఎస్/ బీడీఎస్ చేయాలనుకునే ప్రతి విద్యార్థికీ ముఖ్యమైన పరీక్ష నీట్. ఇది మే 6న జరుగుతుంది. ఈ ఏడాది నుంచి రెండు తెలుగు రాష్ట్రాలూ నేషనల్ పూల్‌లోకి వెళ్లడం వల్ల మన రాష్ట్రాల కన్వీనర్ కోటాలోని మెడికల్, డెంటల్ సీట్లలో 15% ఇతర రాష్ట్ర విద్యార్థులకు ఇవ్వాలి. అలాగే ఇతర రాష్ట్రాల్లోని 15% సీట్లకు మన విద్యార్థులు పోటీ పడవచ్చు. ఈ పరిస్థితుల్లో గత సంవత్సరాలకంటే మెరుగ్గా కృషి చేయాల్సిందే!

సీటు పట్టేద్దాం... నీట్‌గా!

ఇంటర్ పరీక్షలు పూర్తయి, పోటీపరీక్షల సన్నద్ధత వేగం పుంజుకుంటోంది. బైపీసీ విద్యార్థులు రాసే ముఖ్య పరీక్షలు నీట్, ఎంసెట్. కొంతమంది ఎయిమ్స్, జిప్‌మర్ పరీక్షలు కూడా రాస్తున్నారు. ఎయిమ్స్ మే 26, 27 తేదీల్లో, జిప్‌మర్ జూన్ 3న జరుగుతుంది.

కనీసం 720 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 550 మార్కులకుపైగా వస్తేనే.. 2018లో మెడికల్ కళాశాలలో ఎ- కేటగిరీ సీట్లలో చేరే అవకాశం ఉంటుంది. ఈ అవగాహన ఏర్పరచుకుని సరైన ప్రణాళికతో ఈ 45 రోజులు తయారు కాగలిగితే సులభంగా సీటు సాధించుకోవచ్చు. నేషనల్ పూల్‌కి వెళ్లడం వల్ల ఓపెన్ కేటగిరీ విద్యార్థులు నష్టపోతారు కానీ రిజర్వేషన్ (ఎస్సీ, ఎస్టీ) విద్యార్థులకు అదనంగా కొంత మేలు జరుగుతుంది. అంటే వారు ఇతర రాష్ట్రాల్లోని సీట్లను తక్కువ మార్కులకే పొందే అవకాశముంది.

12 లక్షల మంది రాస్తున్న నీట్‌లో 550/720 మార్కులు తెచ్చుకోవాలంటే ప్రతిరోజూ ప్రతి విషయాన్నీ అవగాహన చేసుకుని వెళ్ళాల్సిందే. సబ్జెక్టువారీ ప్రణాళిక ఎలా ఉండాలో తెలుసుకుందాం! .

సగభాగం బయాలజీదే!

2018లో జరగబోయే నీట్‌లో బయాలజీ నుంచి మొత్తం 90 ప్రశ్నలు ఉంటాయి. బోటనీ, జువాలజీ సమంగా ఉండాల్సిన అవసరం లేదు. గత రెండేళ్లుగా బోటనీ నుంచి ప్రశ్నలు ఎక్కువ వస్తున్నాయి. కాబట్టి సుమారుగా 50, 40గా తీసుకోవచ్చు. ప్రతి సరైన సమాధానానికీ 4 మార్కులు కాబట్టి బయాలజీలో 360 మార్కులు సంపాదించుకోవచ్చు. 720 మార్కులకు జరిగే నీట్‌లో సగభాగం బయాలజీదే. దీనిలో సాధారణంగా చదివే విద్యార్థి జాగ్రత్త వహిస్తే 300కుపైగా మార్కులను సాధించుకోవచ్చు. ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలకు మాత్రమే పరిమితమైనా 320కుపైగా సాధించుకునే అవకాశం ఉంటుంది.



పీవీఆర్‌కే మూర్తి
శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదువుతూ ముఖ్యాంశాలను పాఠ్య పుస్తకంలోనే అండర్‌లైన్ చేసుకోవాలి. తరువాత సీబీఎస్ఈ బోర్డు ప్రశ్నలను చదివితే ప్రశ్నపత్రంలో ఎలాంటి ప్రశ్నలకు ప్రాధాన్యం ఉంటుందో అవగతమవుతుంది. తెలుగు రాష్ట్ర విద్యార్థులు ఇంత వరకూ ఎంసెట్‌కు అలవాటుపడ్డారు కాబట్టి సీబీఎస్ఈ ప్రశ్నలను చూడటం తప్పనిసరి. అందుకే తెలుగు రాష్ట్రాల బయాలజీ పుస్తకం కంటే ఉత్తర భారతదేశ పుస్తకాలను ఎంచుకుంటే సీబీఎస్ఈ వారు ఎలాంటి ప్రశ్నలు ఇస్తున్నారో అర్థమవుతుంది. మన రాష్ట్రాల్లో చాలావరకు పాత ఎంసెట్ మెటీరియల్‌కు అట్టతీసి నీట్ పుస్తకంగా ప్రచురిస్తున్నారు. అలాకాకుండా నీట్‌ను దృష్టిలో ఉంచుకుని సీబీఎస్ఈలో అడిగే ప్రశ్నల విధానంపై అవగాహన పెంచే పుస్తకాలకు మాత్రమే ప్రాధాన్యమిచ్చి చదవాలి.

బయాలజీలో వివిధ చాప్టర్ల వెయిటేజీ గత సంవత్సరాల్లో కింది విధంగా ఉంది. ఈ ఏడాది కూడా స్వల్ప మార్పులతో అదే కొనసాగవచ్చు.

అంశం	వెయిటేజీ
హ్యూమన్ ఫిజియాలజీ	17%
డైవర్సిటీ ఇన్ ద లివింగ్ వరల్డ్	14%
జెనెటిక్స్ అండ్ ఎవల్యూషన్	11%
బయోటెక్నాలజీ & ఇట్స్ అప్లికేషన్స్	11%
బయాలజీ అండ్ హ్యూమన్ వెల్ఫేర్	9%
స్ట్రక్చరల్ ఆర్గనైజేషన్ ఇన్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్	9%
రిప్రొడక్షన్	9%
సెల్ స్ట్రక్చర్ అండ్ ఫంక్షన్స్	7%
ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్	7%
ప్లాంట్ ఫిజియాలజీ	6%

నీట్ బయాలజీ పునశ్చరణలో జాగ్రత్తలు

- బొమ్మలను లేబుల్స్‌తో అర్థం చేసుకోవడం, గుర్తుంచుకోవడం.
- పరీక్షల్లో ఎక్కువగా అడిగే ప్రశ్నలను ఒక దగ్గర రాసుకోవడం.
- ఎక్కువగా మర్చిపోయే అంశాలను ఒక దగ్గర రాసుకోవడం.
- బహుళైచ్ఛిక ప్రశ్నలను వీలైనన్ని ఎక్కువగా అభ్యాసం చేయడం.
- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాన్ని మొదటి నుంచి చివరి వరకు క్షుణ్ణంగా చదవడం.

సమయం తక్కువగా ఉంది. కాబట్టి సులభంగా మార్కులు సాధించే అంశాలకే ఎక్కువ సమయాన్ని కేటాయించడం మేలు. చదివే సమయంలో కనీసం 50% కాలాన్ని బయాలజీకి ఇవ్వగలిగితే ఎక్కువ లాభం చేకూరుతుంది.

రసాయనశాస్త్రం.. ప్రశ్నల్లో తేడా

దీని మూడు విభాగాల్లో విద్యార్థి తయారీ విధానంలో స్వల్ప మార్పు ఉండాలి. అంటే భౌతిక, అకర్బన, కర్బన రసాయన శాస్త్రాలకు ఒకే పద్ధతిని పాటించడం సరి కాదు.

అకర్బన రసాయన శాస్త్రంలో సిద్ధాంతపరమైన ప్రశ్నలుంటాయి. కాబట్టి సన్నద్ధమయేటపుడు దీన్ని చివరకు మిగులుస్తారు. ఇది చాలా తప్పు. ఇప్పటి నుంచే సరైన ప్రణాళికతో గ్రూపులకు సంబంధించి టేబుల్స్ చేసుకుంటూ వెళితే గుర్తుంచుకోవడం సులభమవుతుంది.

భౌతిక రసాయన శాస్త్రంలో కొన్ని ఫార్ములాలు గుర్తుంచుకోవాలి. లెక్కించడం త్వరగా చేయడం అభ్యసించాలి. జవాబుల్లో అంతరం ఉంటుంది కాబట్టి మొదట లెక్కించేటప్పుడు సుమారుగా చూసుకుని దగ్గర సంఖ్యకు వెళ్లవచ్చు.

ఉదాహరణకు– 9.8×4 ఉంది అనుకుందాం. దానిని 10×4గా తీసుకుని 40 కంటే కొద్దిగా తక్కువగా ఉన్న జవాబు ఏది ఉందో గమనిస్తే.. మిగిలినవి దూరంగా ఉంటే ఆ జవాబును వెంటనే గుర్తించవచ్చు. ఇటువంటి అభ్యాసం ఇప్పటినుంచే చేయాలి. ఈ సమయంలో రాని ప్రశ్నలకు ఎక్కువ సమయాన్ని వృథా చేసుకోకుండా వచ్చినవాటిని పునశ్చరణ చేసుకుంటే తుది పరీక్షలో వాడి, కచ్చితత్వం పెరుగుతాయి.

కర్బన రసాయన శాస్త్రంలో మెకానిజం మీద ప్రశ్నలు ఇస్తున్నారు. ఎక్కువమంది విద్యార్థులు వాటిలోనే ఎక్కువ తప్పులు చేస్తున్నారు. ఈ చర్యల్లో రియేజంట్ ప్రాముఖ్యాన్ని సరిగా అర్థం చేసుకుంటే సులభంగా జవాబును గుర్తించవచ్చు.

నీట్ కెమిస్ట్రీ పునశ్చరణలో జాగ్రత్తలు

- గ్రూపులు, వాటి ధర్మాలకు సంబంధించి టేబుల్స్ తయారు చేసుకుని ప్రతిరోజూ ఒకసారి చదవాలి.
- ఆక్సిడైజింగ్, రెడ్యూసింగ్ ఏజెంట్స్ గురించి విడివిడిగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- ఆర్గానిక్ రియాక్షన్స్‌ను వీలైనన్ని ఎక్కువసార్లు పేపర్ మీద సాధన చేయాలి.
- నీట్ సంబంధిత పుస్తకాల్లోని బహుళైచ్ఛిక ప్రశ్నలను మాత్రమే ఎక్కువగా తయారు చేసుకోవాలి.
- పరీక్షను 45 నిమిషాల వ్యవధిలో పూర్తిచేసేలా అభ్యాసం అలవరచుకోవాలి.

అంశం	వెయిటేజీ
అకర్బన రసాయన శాస్త్రం (ఇనార్గానిక్ కెమిస్ట్రీ)	36%
భౌతిక రసాయన శాస్త్రం (ఫిజికల్ కెమిస్ట్రీ)	36%
కర్బన రసాయన శాస్త్రం (ఆర్గానిక్ కెమిస్ట్రీ)	28%

భౌతికశాస్త్రం... పట్టున్నవి పునశ్చరణ

భౌతికశాస్త్రంపై ఇప్పటికే పట్టు ఏర్పరచుకుని ఉండాలి. కానీ ఎక్కువ శాతం విద్యార్థులు ఈ సమయంలో భౌతిక శాస్త్రానికి ఎక్కువ సమయాన్ని వెచ్చించి చివరికి పూర్తిగా నష్టపోతున్నారు.

పోటీపరీక్షల్లో విద్యార్థి మానసిక స్థితి చాలా ప్రభావం చూపుతుంది. భౌతికశాస్త్రంపై భయంతో ఎక్కువ సమయం వెచ్చించేకొద్దీ విద్యార్థి తనపై ఆత్మవిశ్వాసం కోల్పోయి తుది పరీక్షలో అధ్వానస్థితికి పోయే ప్రమాదముంది. అందుకే ఈ తక్కువ సమయంలో ఏ అంశాలపై పట్టు ఉందో వాటికే ఎక్కువ సమయం కేటాయించాలి. వాటినే రెండు, మూడుసార్లు పునశ్చరణ చేసుకోవాలి. ఇలా ఆత్మవిశ్వాసంతో ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఏర్పడుతుంది.

విద్యార్థికి ప్రథమ సంవత్సర సిలబస్‌పై బాగా పట్టు ఉంటే మెకానిక్స్‌కి తోడుగా మోడర్న్ ఫిజిక్స్‌ని.. ద్వితీయ సంవత్సర సిలబస్‌పై పట్టు బాగా ఉంటే ఎలక్ట్రిసిటీకి తోడుగా మోడర్న్ ఫిజిక్స్‌ని బాగా అభ్యాసం చేయాలి. దీనివల్ల 45 ప్రశ్నల్లో 30కిపైగా జవాబులను తప్పకుండా గుర్తించే వీలవుతుంది. అవగాహనతో ఈ విధంగా సిద్ధమైన ఏ విద్యార్థి అయినా సులభంగా 600/720 పైగా మార్కులు తెచ్చుకోవచ్చు!

అంశం	వెయిటేజీ
మెకానిక్స్	24%
ఎలక్ట్రో డైనమిక్స్	24%
మోడర్న్ ఫిజిక్స్	20%
హీట్ అండ్ థర్మోడైనమిక్స్	13%
ఎస్‌హెచ్ఎం అండ్ వేవ్స్	7%
ఆప్టిక్స్	7%
ప్రాపర్టీస్ ఆఫ్ మ్యాటర్	5%

సాధనలో మునిగి... ర్యాంకర్‌గా తేలాడు!

గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్... గేట్! పరీక్ష చూస్తే...అఖిలభారత స్థాయి. దానికి సిద్ధమయ్యే తీరు మామూలుగా ఉంటే సరిపోతుందా? అది అత్యంత ఇష్టమైన వ్యాపకంగా సాగాలి. సమయం ఎలా ముగుస్తుందో కూడా తెలియనంతగా సాధనలో మునిగిపోవాలి. అలా చేశాడు కాబట్టే భువన్‌చంద్ర ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. గేట్-2018 ఫలితాల్లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచిన ఈ విద్యార్థి తన విజయరహస్యాలు ఇలా చెపుతున్నాడు...

గేట్ టాపర్ గెలుపు బాట

"మొదటి ప్రయత్నంలో ర్యాంకు సాధించలేకపోయాను. బీటెక్ ప్రాజెక్టు వర్క్స్ కారణంగా గేట్‌పై అప్పుడు దృష్టిసారించలేకపోయాను. అందుకే 324 ర్యాంకు వచ్చింది. ఎలాగైనా మంచి ర్యాంకు సాధించాలి.. ఇస్రో, డీఆర్‌డీవో లాంటి సంస్థల్లో చేరాలనే లక్ష్యంతో గత ఏడాది జులై నుంచి చెన్నైలోని ఓ ఇన్‌స్టిట్యూట్లో శిక్షణ తీసుకోవటం ప్రారంభించాను.

డిసెంబరు వరకూ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు చదవడం, ప్రాక్టీస్ చేయడం.. ప్రతిరోజూ ఇదే దినచర్య. జనవరి నుంచి ఫిబ్రవరిలో 3వ తేదీ పరీక్ష రాసేవరకూ రాత్రి 11 గంటల వరకు చదువు సాగించాను. ముగ్గురు మిత్రులం కలిసి చేసిన కంబైన్డ్ స్టడీస్ కలిసి వచ్చింది. అంశాలపై చర్చించుకోవడం, ప్రాబ్లమ్స్ సాల్వ్ చేసుకోవడం చేశాం. ర్యాంకు సాధించాలనే ధ్యాసతో ముందుకుసాగాను.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కోచింగ్ తరగతులకు హాజరు.. తర్వాత ఒక అర్ధగంట భోజనానికి. ఆపై ఇన్‌స్టిట్యూట్‌లోనే కూర్చుని ప్రాబ్లమ్స్‌పై శ్రద్ధపెట్టాను. రాత్రి వరకు అక్కడే ఉండేవాడిని. రాత్రికి గదికి వచ్చిన తర్వాత 11 గంటల వరకు స్నేహితులతో కలిసి మళ్ళీ సాధన.

మొదట 80 మార్కులే..

గేట్ ఫలితాల్లో మొదట 80 మార్కులే వచ్చాయి. 3 ప్రశ్నలను ఛాలెంజ్ చేయగా రెండింటికి అందరికీ మార్కులు వచ్చాయి. ఒక ప్రశ్నకు సంబంధించి నా ఒక్కడికే మార్కులు కలిశాయి. దీంతో అదనంగా ఆరు మార్కులు వచ్చాయి. 86.67 మార్కులు రావడంతో మొదటి ర్యాంకు లభించింది. గేట్ స్కోరు 1000 వచ్చింది.

డిసెంబరు నుంచి ప్రాక్టీస్‌కు మరింత ఎక్కువ సమయం కేటాయించాను. జనవరి నెల ఎలా వచ్చి వెళ్లిపోయిందో నాకసలు గుర్తే లేదు. డిసెంబరు నెలకు సిలబస్‌ను పూర్తి చేసి, జనవరి నుంచి మాక్ టెస్టులు రాశాను. మొత్తం 8 మాక్‌టెస్ట్‌లు రాయగా ఐదింటిలో నేనే మొదటి స్థానంలో నిలిచాను. ఎంత బాగా చదివినా పునశ్చరణ (రివిజన్) అనేది ఉండాలి. గతంలో వచ్చిన ప్రశ్నపత్రాలను పరిశీలించాలి. ఏ స్థాయిలో ప్రశ్నలు వస్తున్నాయి, ఎలా బురిడీ కొట్టిస్తున్నారు అనేవి పాత పేపర్‌లను చూసి, విశ్లేషించుకోవాలి. దీనివల్ల ప్రశ్నలు ఎంత లోతుగా అడుగుతున్నారో తెలుస్తుంది. 2007 నుంచి గేట్‌లో ఏరోస్పేస్ ఇంజినీరింగ్‌లో ఇచ్చిన ప్రతి ప్రశ్నపత్రాన్నీ సాధన చేశాను.

ఇలా లక్ష్యం చేరుకోవచ్చు..

ఏరోస్పేస్ ఇంజినీరింగ్ విభాగంలో గేట్ గత ఏడాది దాదాపు 5 వేల మంది రాశారు. ఒకసారి సిలబస్ పూర్తి చేసిన తర్వాత రివిజన్ చాలా ప్రధానం. సిలబస్ సముద్రంలాగా ఉంటుంది. దీంతో విద్యార్థులు కంగారుపడిపోతారు. ఇన్‌స్టిట్యూట్‌లో నేర్చుకోవడమే కాకుండా ప్రాక్టీస్ అనేది చాలా ముఖ్యం. ఒక్కో టాపిక్‌ను విడదీసి సిద్ధం కావాలి. ప్రశ్న పైకి తేలికగా కనిపిస్తుంది. దీంతో ఆ ఉత్సుకతలో ఏదో ఒక చిన్న తప్పు చేసేస్తారు. ఏం ఇచ్చారు.. ఏం అడుగుతున్నారు అన్నదాన్ని చూసుకోవాలి.

65 ప్రశ్నలకు 180 నిమిషాలు మాత్రమే సమయం ఉంటుంది. ముందుగా తేలికగా ఉన్న ప్రశ్నలను చేసుకుంటూ పోవాలి. ఏదైనా కఠినమైన ప్రశ్న ఉంటే దానికి ఐదు నిమిషాల కంటే ఎక్కువ సమయం కేటాయించకూడదు. ఇలాంటి వాటికి పేపర్ మొత్తం పూర్తయిన తర్వాత ఇంకా సమయం ఉంటే అప్పుడు మళ్ళీ వీటిపై దృష్టి సారించాలి.

నాకు నాలుగు ప్రశ్నలు కఠినంగా అనిపించడంతో వీటికి ఐదు నుంచి ఆరు నిమిషాల సమయం కేటాయించాను. మొదటిసారి రాసిన గేట్ పరీక్ష ద్వారా తార్కిక ప్రశ్నలను ఎలా ఎదుర్కోవాలో తెలిసింది. శిక్షణ కోసం ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లి, వచ్చిపోవడం కాకుండా.. సాధన బాగా చేయాలి. ఏరోజుకారోజు ప్రాబ్లమ్స్ సాధన చేస్తూ ఉండాలి. దీంతో ఎక్కడ తప్పులు చేస్తున్నామో తెలుస్తుంది. పరీక్షల ముందు సమయంలో ఒత్తిడికి గురికాకూడదు.

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం నాకు ఆదర్శం. డీఆర్‌డీవో, ఇస్రోల్లో చేరి పరిశోధనలు చేయాలని అనుకుంటున్నాను. ప్రస్తుతం వచ్చిన ర్యాంకుతో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ)లో చేరాలని అనుకుంటున్నాను".



పునుకోలు భువన్‌చంద్ర
తల్లిదండ్రులు: సుబ్బారావు, రోజారాణి
స్వస్థలం: కృష్ణా జిల్లా హనుమాన్‌జంక్షన్ మండలం తిప్పనగుంట
నివాసం: విజయవాడ
జేఈఈ అడ్వాన్స్‌డ్: 2224 ర్యాంకు (2013)
బీటెక్: ఏరోస్పేస్ ఇంజినీరింగ్ (ఐఐటీ మద్రాస్)

– మాసిని శ్రీనివాసరావు, ఈనాడు-అమరావతి

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

వెటర్నరీ యూనివర్సిటీలో 183 టీచింగ్ పోస్టులు

నియామక వర్సిటీ: పి.వి.నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ, హైదరాబాద్.
పోస్టులు: అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
ఖాళీలు: బ్యాక్‌లాగ్-83, రెగ్యులర్-100
విభాగాలు: వెటర్నరీ సైన్స్, డెయిరీ సైన్స్, ఫిషరీ సైన్స్, ఫిజికల్ సైన్స్, అగ్రికల్చరల్ సైన్సెస్, లైబ్రరీ సైన్స్.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, నెట్/ స్లెట్/ సెట్/ పీహెచ్‌డీతోపాటు బోధన/ పరిశోధన రంగంలో అనుభవం.
ఎంపిక: వర్సిటీ నిబంధనల ప్రకారం.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.1000
చివరితేది: 10.04.2018
వెబ్‌సైట్: http://tsvu.nic.in/

హెచ్‌ఎల్‌ఎల్-హైట్స్‌లో 113 ఖాళీలు

సంస్థ: భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు చెందిన హెచ్‌ఎల్‌ఎల్ ఇన్‌ఫ్రాటెక్ సర్వీసెస్ లిమిటెడ్ (హైట్స్), నోయిడా.
పోస్టులు: సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఇంజినీర్ తదితరాలు.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్, బీఆర్క్, ఇంజినీరింగ్ డిప్లొమా, ఇతర అర్హతలు.
వయసు: పోస్టును అనుసరించి గరిష్ఠంగా 55 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్.
చివరితేది: 01.04.2018
వెబ్‌సైట్: http://www.hllhites.com/careers/

ప్రవేశాలు

ఏపీపీఈసెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తరపున ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ సెట్‌ను నిర్వహిస్తోంది.
కోర్సులు: బీపీఈడీ, యూజీడీపీఈడీ
కాలవ్యవధి: 2 సంవత్సరాలు
అర్హత: డీపీఈడీ కోర్సులకు ఇంటర్, బీపీఈడీ కోర్సులకు డిగ్రీ.
ఎంపిక: పీఈసెట్ ద్వారా.
పరీక్ష తేది: 04.05.2018 నుంచి
దరఖాస్తు ఫీజు: రూ.850
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 22.03.2018
వెబ్‌సైట్: http://sche.ap.gov.in/

ఫెలోషిప్స్ అండ్ స్కాలర్‌షిప్స్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

పోస్టులు–ఖాళీలు: జేఆర్ఎఫ్-01, ప్రాజెక్ట్ అసోసియేట్-04, రిసెర్చ్ అసోసియేట్-01.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీతోపాటు నెట్/ గేట్/ బీఈటీ/ పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్
చివరితేది: 06.04.2018
వెబ్‌సైట్: https://www.uohyd.ac.in/

ఏపీ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్-2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామక అర్హతకు నిర్వహించే పరీక్ష. ఆంధ్రా యూనివర్సిటీ ఈ టెస్టును నిర్వహిస్తోంది.
అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత.
ఎంపిక: స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) ద్వారా.
పరీక్ష తేది: 01.07.2018
పరీక్షా కేంద్రాలు: విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, తిరుపతి.
దరఖాస్తు ఫీజు: రూ.1000
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: 26.03.2018
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 02.05.2018 (అపరాధ రుసుముతో జూన్ 6 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు)
వెబ్‌సైట్: https://apset.net.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

బాలలపై పెరుగుతున్న హింసాకాండ

- 11 శాతం పెరిగిన నేరాలు
- అపహరణలు, అత్యాచారాలే ఎక్కువ
- ఎన్‌సీఆర్‌బీ తాజా నివేదిక వెల్లడి

కోల్‌కతా: బాలలపై హింస పెట్రేగుతోంది. వీరిపై జరుగుతున్న నేరాలు 2015-16 మధ్యకాలంలో 11 శాతానికిపైగా పెరిగాయి. 2015లో దేశ వ్యాప్తంగా 94,172 కేసులు నమోదుకాగా.. 2016లో ఈ సంఖ్య 1,06,958కు చేరింది. జాతీయ నేర నమోదు విభాగం(ఎన్‌సీఆర్‌బీ) తాజాగా విడుదలచేసిన గణాంకాల్లో ఈ వివరాలున్నాయి. స్వచ్ఛంద సంస్థ "క్రై చైల్డ్ రైట్స్ అండ్ యు' పరిశోధన ఈ విషయాన్ని ఇదివరకే వెల్లడించింది. గత దశాబ్ద కాలంలో బాలలపై నేరాలు 500 శాతం మేర పెరిగాయని (2006లో 18,967 నుంచి 2016లో 1,06,958కు) క్రై పేర్కొంది. ఎన్‌సీఆర్‌బీ తాజా సమాచారం ప్రకారం.. బాలలపై 50 శాతానికిపైగా నేరాలు ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, దిల్లీ, పశ్చిమ బెంగాల్‌లలోనే నమోదయ్యాయి. వీటిలో 15 శాతంతో ఉత్తర్ ప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్.. 14, 13 శాతాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఏ నేరాలు ఎక్కువ?

★ చిన్నారులపై నేరాల్లో అపహరణ కేసులే ఎక్కువగా ఉన్నాయి. 2016లో నమోదైన మొత్తం కేసుల్లో వీటి వాటా 48.9 శాతం (52,253) వరకూ ఉంది.

★ అపహరణల తర్వాత స్థానంలో అత్యాచారాలున్నాయి. వీటి వాటా 18 శాతం. మరోవైపు పోక్సో చట్టం కింద నమోదైన కేసులు 33 శాతం వరకూ ఉన్నాయి. లైంగిక దాడులు, వేధింపులు, అశ్లీల దృశ్యాల చిత్రీకరణ తదితర నేరాలను పోస్కో కింద నమోదుచేస్తారు.


★ 2016లో దేశ వ్యాప్తంగా ఆచూకీ గల్లంతైన చిన్నారుల సంఖ్య 1,11,569 (41,175 మంది బాలురు, 70,394 మంది బాలికలు)గా ఉంది. ఈ కేసుల్లో పశ్చిమ బెంగాల్ (15.1 శాతం) మొదటి స్థానంలో ఉంది. 2016 చివరినాటికి మొత్తంగా 55,944 మంది ఆచూకీ గల్లంతైన చిన్నారులను పోలీసులు పట్టుకోగలిగారు.

డైనమిక్ ధరలపై కమిటీ నివేదిక..

- రైల్వే మంత్రి గోయల్ అసంతృప్తి
- మరోసారి సమీక్షకు ఆదేశం

దిల్లీ: విమానం టికెట్ల తరహాలో అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలో 'డైనమిక్' ధరల విధానాన్ని అమలు చేయాలన్న కమిటీ నివేదికను రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్ తిరస్కరించారు. రాజధాని, దురంతో, శతాబ్ది రైళ్లలో ఈ విధానం అమల్లో ఉన్న విషయం తెలిసిందే. ఈ అంశంపై సమీక్షించిన మంత్రి.. 'ఫ్లెక్సీ ఫేర్'పై సమీక్షించి.. మరోసారి నివేదిక తయారు చేయాలని సూచించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 'ధరల్లో మార్పు' విధానం ప్రభావంపై అధ్యయనం చేయడానికి గత డిసెంబరులో ఈ కమిటీ ఏర్పాటైంది. అన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లలోనూ ఈ విధానాన్ని అమలు చేయాలని ఈ కమిటీ జనవరి 15న సమర్పించిన నివేదికలో సూచించింది. ' 'తక్కువ సమయంలో గమ్యస్థానాలకు చేర్చే రైళ్లలో, అన్ని ఎక్స్‌ప్రెస్‌లలో కింది బెర్త్‌లకు, పండగల సమయాల్లో టికెట్ల ధరల్లో పెరుగుదల ఉండాలని పేర్కొంది. ప్రయాణ తేదీ దగ్గర పడేకొద్దీ టికెట్ల బుకింగ్ ధర పెంచాలని సూచించింది. ఈ నివేదికపై ఈ నెల 13న సమీక్షించిన రైల్వేమంత్రి.. ప్రతిపాదనలపై అసంతృప్తి వ్యక్తం చేశారని, మరోసారి సమీక్షించాలని ఆదేశించారని అధికారులు తెలిపారు. రాజధాని, దురంతో, శతాబ్ది రైళ్లలో అమలు చేస్తున్న 'డైనమిక్' ధరల విధానంతో రైల్వేకు ఆదాయం పెరిగిందని, ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగిందని ఈ కమిటీ నివేదిక చెబుతోంది.

చైనా ప్రధానిగా రెండోసారి లీకెకియాంగ్



బీజింగ్: చైనా ప్రధానమంత్రిగా లీ కెకియాంగ్ రెండోసారి ఎన్నికయ్యారు. అధికార కమ్యూనిస్టు పార్టీలో రెండో స్థానంలో ఉన్న లీ (62) మరో ఐదేళ్లు ఈ పదవిలో కొనసాగనున్నారు. చైనా అధ్యక్షుడిగా రెండోసారి షీ జిన్‌పింగ్‌ను శనివారం ఎన్నుకున్న ఆ దేశ పార్లమెంటు.. ఆదివారం ప్రధానిగా లీ కెకియాంగ్‌ను ఎన్నుకుంది. గత ఐదేళ్లుగా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో కలిసి పనిచేస్తున్న లీ.. నిరాడంబర వ్యక్తిగా గుర్తింపుపొందారు. ప్రధాని హోదాలో దేశ ఆర్థిక వ్యవహారాల్ని పర్యవేక్షిస్తున్నారు.

నూతన అవినీతి నిరోధక వ్యవస్థ.. చైనా నూతన అవినీతి నిరోధక వ్యవస్థ (జాతీయ పర్యవేక్షణ కమిషన్)కు అధిపతిగా ఆ దేశ పార్లమెంటు ఆదివారం యాంగ్‌షియోడును ఎన్నుకుంది. పర్యవేక్షణ మంత్రిగా కొనసాగుతున్న యాంగ్ అధికార పార్టీ నేతృత్వంలోని అవినీతి నిరోధక వ్యవస్థ (సీసీడీఐ)కు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జిన్‌పింగ్ అధ్యక్షుడయ్యాక దేశంలో అవినీతి నిరోధానికి కఠిన చర్యలు చేపట్టారు. పదుల సంఖ్యలో సీనియర్ అధికారులు జైలుపాలయ్యారు. ఈ నేపథ్యంలో యాంగ్ ఎంపిక ప్రాధాన్యం సంతరించుకుంది.



హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
(భారత ప్రభుత్వ సంస్థ)

భూమి కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దిగువ తెలిపిన ప్రదేశాలలో **రీటైల్ అవుట్‌లెట్స్**ను నెలకొల్పేందుకు **హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్**కు **విక్రయం లేదా లీజు** (కనీసం 20 సంవత్సరాలు) ద్వారా భూమి ప్లాట్‌ను బదిలీ చేసేందుకు సదరు ప్లాట్ యొక్క సర్వ హక్కులుగల మరియు పరిపూర్ణ యజమానుల నుండి లేదా సదరు భూమి యొక్క స్వాధీనతను కలిగియున్న యజమానులతో ఈ ప్రకటన విడుదల తేదీకి ముందు అప్పటికే రిజిస్టరు అమ్మకం ఒప్పందాన్ని కుదుర్చుకున్న, సదరు భూమినందు ప్రయోజనాన్ని కలిగియున్న పార్టీలు లేదా ఇతర సహ-యజమానులకు సంబంధించి ఆక్షేపణలేవి లేని సహ-యజమానుల నుండి టూ బిడ్ పద్ధతిపై, అనగా ఎ) టెక్నికల్ బిడ్, బి) ఫైనాన్షియల్ బిడ్ పద్ధతిపై సీల్డు ఆఫర్లు కోరబడుతున్నవి.

ప్రకటన క్రమ సం.	స్థలము	రెవెన్యు జిల్లా	కనీస ప్లాట్ కొలతలు: ఫ్రంటేజ్ మీటర్లలో	కనీస ప్లాట్ కొలతలు: డెప్త్ మీటర్లలో
1	ఎడమ వైపు, రామవరప్పాడు నుండి నిడమనూరు, NH-16 పై (ఓల్డ్ NH-5)	కృష్ణా	35	45
2	బెంజ్ సర్కిల్ (విజయవాడ) నుండి తాడిగడప, NH-65 పై (మున్సిపల్ పరిధిలోపల) (ఓల్డ్ NH-9)	కృష్ణా	22	22
3	NH-65 పై, పామర్రు నుండి గూడూరు (ఓల్డ్ NH-9)	కృష్ణా	35	45
4	NH-216 పై, మచిలీపట్నం నుండి పెడన (ఓల్డ్ NH-214A)	కృష్ణా	35	45
5	NH-216 పై, పెడన నుండి బంటుమిల్లి (ఓల్డ్ NH-214A)	కృష్ణా	35	45
6	నాగాయలంక నుండి అవనిగడ్డ రోడ్డు పై, నాగాయలంక నుండి బండలాయి చెరువు SH-47 పై	కృష్ణా	35	35
7	హనుమాన్ జంక్షన్ నుండి నూజివీడు SH-46 పై	కృష్ణా	35	35
8	యనమలకుదురు నుండి అవనిగడ్డ రోడ్డుపై, పెదపులిపాక నుండి శ్రీకాకుళం	కృష్ణా	30	30
9	చల్లపల్లి టౌన్ పరిధిలోపల	కృష్ణా	22	22
10	మచిలీపట్నం నుండి చల్లపల్లి NH-216 పై, (ఓల్డ్ NH-214A)	కృష్ణా	35	45
11	పాయకాపురం నుండి కుండవారి కండ్రిక వయా పాతపాడు రోడ్డు	కృష్ణా	20	20
12	NH-65 పై, కీసర టోల్‌గేట్ నుండి నందిగామ బైపాస్ (ఓల్డ్ NH-9)	కృష్ణా	35	45
13	విజయవాడ మున్సిపల్ పరిధిలోపల	కృష్ణా	22	22
14	జి.కొండూరు బైపాస్ పై న్యూ NH-30	కృష్ణా	35	45
15	కందులపాడు జంక్షన్ నుండి జి.కొండూరు వయా ఆత్కూరు NHపై కాదు	కృష్ణా	30	30
16	పరిటాల నుండి కంచిక చర్ల NH-65 పై (ఓల్డ్ NH-9)	కృష్ణా	35	45
17	గొల్లపూడి నుండి ఇబ్రహీంపట్నం (మున్సిపల్ పరిధిలోపల) NH-65 పై (ఓల్డ్ NH-9)	కృష్ణా	22	22
18	ఆటోనగర్ నుండి NH-5 రోడ్డు (వయా మహానాడు రోడ్), విజయవాడ (NHపై కాదు)	కృష్ణా	22	22
19	చంద్రగూడెం నుండి కాకర్ల NH-30 పై	కృష్ణా	35	45
20	విజయవాడ స్టేట్ స్కూలు నుండి నిడమానూర్ వరకు వయా కామినేని హాస్పిటల్ రోడ్డు (NHపై కాదు)	కృష్ణా	22	22
21	IRR పై రామవరప్పాడు ఫ్లైవోవర్ తరువాత వయా నున్న జంక్షన్ జక్కంపూడి వరకు	కృష్ణా	22	22
22	గుంటూరు, బెస్ట్ ప్రైస్ నుండి ఆటోనగర్, జి.టి. రోడ్ పై	గుంటూరు	22	22
23	డా॥ బి.ఆర్.అంబేడ్కర్ సర్కిల్ (లాడ్జిసెంటర్) నుండి 5 కి.మీ లోపు, గుంటూరు - అమరావతి రోడ్ పై	గుంటూరు	22	22
24	కేంద్రియ విద్యాలయం, నల్లపాడు నుండి పేరేచర్ల ఫ్లైవోవర్, గుంటూరు - సత్తెనపల్లి రోడ్డు పై (మున్సిపల్ పరిధిలోపల)	గుంటూరు	22	22
25	సత్తెనపల్లి (టౌన్ పరిధి లోపల)	గుంటూరు	22	22
26	వినుకొండ (టౌన్ పరిధి లోపల)	గుంటూరు	22	22
27	బుడంపాడు నుండి నారకోడూరు, SH-48పై	గుంటూరు	35	35
28	నరసరావు పేట (టౌన్ పరిధి లోపల)	గుంటూరు	22	22
29	పిడుగురాళ్ళ (టౌన్ పరిధి లోపల)	గుంటూరు	22	22
30	గుంటూరు టౌన్ (మున్సిపల్ పరిధి లోపల)	గుంటూరు	22	22
31	ఎడమవైపు, కొండముడు జంక్షన్ నుండి నకరికల్లు, SH-2 పై	గుంటూరు	35	35
32	ఆర్.టి.ఓ.ఆఫీసు నుండి ఆటోనగర్, యం.జి ఇన్నర్ రింగ్ రోడ్డ్ పై, గుంటూరు (రైల్వేట్రాక్ నుండి 1కి.మీ. పరిధిలో లేకుండా)	గుంటూరు	22	22
33	NH-16 జంక్షన్ నుండి పుల్లడిగుంట గ్రామం, గుంటూరు నుండి ప్రత్తిపాడు రోడ్డు పై SH-115 (NH-16 పై కాదు)	గుంటూరు	35	35
34	పెదపూడి గ్రామం, పెదపూడి నుండి అమృతలూరు రోడ్డు పై	గుంటూరు	30	30
35	నూతక్కిగ్రామం, రేవేంద్రపాడు నుండి నూతక్కి రోడ్డు పై	గుంటూరు	30	30
36	నిడమర్రు గ్రామం, మంగళగిరి నుండి నిడమర్రు రోడ్డు పై	గుంటూరు	30	30
37	వారధి నుండి మంగళగిరి బైపాస్ రోడ్డు. NH-16 పై (ఓల్డ్ NH-5)	గుంటూరు	35	45
38	వైకుంఠపురం గ్రామం, అమరావతి నుండి విజయవాడ రోడ్డు పై	గుంటూరు	30	30
39	లామ్ గ్రామం, గుంటూరు నుండి అమరావతి రోడ్డు పై	గుంటూరు	22	22
40	రేపల్లె, LIC బిల్డింగ్ నుండి రింగ్‌రోడ్ వరకు	గుంటూరు	22	22
41	పసుమర్రు గ్రామం, చిలకలూరిపేట నుండి చీరాల రోడ్డు SH-45 పై	గుంటూరు	35	35
42	చింతలపూడి గ్రామం, బాపట్ల నుండి పొన్నూరు రోడ్డు, SH-48 పై	గుంటూరు	35	35
43	తెనాలి (మున్సిపల్ పరిధిలోపల)	గుంటూరు	22	22
44	ఏలూరు టౌన్	పశ్చిమగోదావరి	22	22
45	దేవరపల్లి నుండి గౌరీపట్నం, SH-103 పై	పశ్చిమగోదావరి	35	35
46	సీతారామపురం నుండి ముత్యాలపల్లి, NH-216 పై	పశ్చిమగోదావరి	35	45
47	భీమవరం టౌన్	పశ్చిమగోదావరి	22	22
48	చాగల్లు నుండి నిడదవోలు, పంగిడి రోడ్డు పై	పశ్చిమగోదావరి	30	30
49	వీరవాసరం నుండి లంకలకోడేరు, NH-165 పై	పశ్చిమగోదావరి	35	45
50	రాజమండ్రి, మున్సిపల్ పరిధి లోపల	తూర్పుగోదావరి	22	22
51	అమలాపురం, మున్సిపల్ పరిధి లోపల	తూర్పుగోదావరి	22	22
52	రాజోలు	తూర్పుగోదావరి	35	35
53	రావులపాలెం, NH పై కాకుండా	తూర్పుగోదావరి	35	35
54	నగరం, NH పై	తూర్పుగోదావరి	45	45
55	అంబాజి పేట, గ్రామ పరిధి లోపల	తూర్పుగోదావరి	30	30
56	ఏలేశ్వరం, గ్రామ పరిధి లోపల	తూర్పుగోదావరి	30	30
57	దివాన్ చెరువు, NH పై	తూర్పుగోదావరి	45	45
58	ధవళేశ్వరం	తూర్పుగోదావరి	30	30
59	కాకినాడ - 2 కి.మీ. లోపు, పోర్ట్ ఎడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ మీదుగా ఏంకరేజ్ పోర్ట్, ADB రోడ్ పై	తూర్పుగోదావరి	35	35
60	అన్నవరం-కత్తిపూడి, NH-16 పై, ఎడమవైపు	తూర్పుగోదావరి	45	45
61	తుని నుండి అన్నవరం, NH-16 పై, ఎడమవైపు	తూర్పుగోదావరి	45	45
62	కాకినాడ (2 కి.మీ. లోపు అచ్చంపేట జంక్షన్ నుండి లైట్‌హౌస్ జంక్షన్ వరకు, ADB రోడ్ పై)	తూర్పుగోదావరి	35	35
63	గొల్లప్రోలు నుండి కత్తిపూడి NH-216 పై (ఇరువైపుల)	తూర్పుగోదావరి	45	45
64	గాజువాక జంక్షన్ నుండి DIET కాలేజ్ మధ్యలో, ఎడమవైపు విశాఖపట్నం నుండి అనకాపల్లి NH16 పై	విశాఖపట్నం	45	45
65	DIET కాలేజ్ నుండి గాజువాక మధ్యలో, కుడివైపు విశాఖపట్నం నుండి అనకాపల్లి, NH-16 పై	విశాఖపట్నం	45	45
66	లంకెలపాలెం జంక్షన్ నుండి 5 కి.మీ.లోపు, లంకపాలెం-పర్వాడ రోడ్డు పై	విశాఖపట్నం	30	30
67	టెక్కలి గ్రామం	శ్రీకాకుళం	30	30
68	రాం లక్ష్మన్ జంక్షన్ నుండి పెదపాడు జంక్షన్	శ్రీకాకుళం	22	22
69	పుండి గ్రామం	శ్రీకాకుళం	30	30
70	రాజం నుండి పాలకొండ, 1 కి.మీ. లోపు	శ్రీకాకుళం	30	30
71	కురుపం నుండి రావడ రోడ్డు, 1 కి.మీ. లోపు	విజయనగరం	30	30
72	అనంతపురం నుండి బెంగుళూరు వైపు, కుడివైపు NH-44 పై, 405 KM మైలురాయి నుండి 416 KM మైలురాయి మధ్యలో	అనంతపురం	35	45
73	అనంతపురం నుండి బెంగుళూరు వైపు, కుడివైపు NH-44 పై, 380 KM మైలురాయి నుండి 390 KM మైలురాయి మధ్యలో	అనంతపురం	35	45
74	రాయదుర్గ్ టౌన్, మున్సిపల్ పరిధి లోపల	అనంతపురం	22	22
75	పమిడి టౌన్, టౌన్ పరిధి లోపల, NH కాకుండా	అనంతపురం	22	22
76	హిందూపూర్ టౌన్, మున్సిపల్ పరిధి లోపల	అనంతపురం	22	22
77	తాడిపత్రి మున్సిపల్ పరిధి లోపల	అనంతపురం	22	22
78	అనంతపురము మున్సిపల్ పరిధి లోపల	అనంతపురం	22	22
79	కర్నూలు సిటి (కలెక్టర్ ఆఫీసు నుండి నంద్యాల చెక్‌పోస్ట్ వరకు)	కర్నూలు	22	22
80	కర్నూలు సిటి (గవర్నమెంట్ జనరల్ హస్పిటల్ నుండి సి.యన్. హస్పిటల్ వరకు - కుడివైపు)	కర్నూలు	22	22
81	కర్నూలు సిటి (గుత్తి రోడ్డు - NH-44 జంక్షన్ నుండి చెన్నమ్మ సర్కిల్)	కర్నూలు	22	22
82	కర్నూలు సిటి (మున్సిపల్ పరిధి లోపల	కర్నూలు	22	22
83	వెల్దుర్తి మండలం, బొమ్మిరెడ్డిపల్లి గ్రామం (NH-44 పై ఎడమవైపు, గుత్తి నుండి కర్నూల్ రోడ్డు) (ఓల్డ్ NH-7)	కర్నూలు	35	45
84	శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజ్ నుండి కర్నూల్ వైపు, 6కి.మీ రోడ్డుకు ఇరువైపులా, NH-40 పై (ఓల్డ్ NH-18)	కర్నూలు	35	45
85	బత్తలూరు నుండి దీబగుంట్ల, ఎడమవైపు, NH-40 పై, (ఓల్డ్ NH-18)	కర్నూలు	35	45
86	నంద్యాల టౌన్, మున్సిపల్ పరిధి లోపల	కర్నూలు	22	22
87	కడప టౌన్, మున్సిపల్ పరిధి లోపల	కడప	22	22
88	బద్వేల్ టౌన్,మున్సిపల్ పరిధి లోపల, NH-67 పై (ఓల్డ్ SH-57)	కడప	22	22
89	8 కి.మీ. లోపుగా ఎడమవైపు, ఎర్రగుంట్ల టౌన్ నుండి కమలాపురం వైపు, SH-31 పై	కడప	35	35
90	రాయచోటి నుండి పులివెందుల రోడ్డు, 5 కి.మీ. లోపు, ఎడమవైపు	కడప	45	45
91	కమలాపురం టౌన్ మున్సిపల్ పరిధి లోపల, SH పై కాకుండా	కడప	22	22
92	ప్రొద్దుటూరు టౌన్, మున్సిపల్ పరిధి లోపల	కడప	22	22
93	నెల్లూరు టౌన్, ట్రంక్ రోడ్డు పై, పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం మరియు గాంధి బోమ్మ జంక్షన్, ఎడమవైపు	SPSR నెల్లూరు	22	22
94	కావలి టౌన్, ఆర్.టి.సి. మెయిన్ బస్సు స్టాండ్ నుండి 3 కి.మీ లోపు	SPSR నెల్లూరు	22	22
95	నెల్లూరు టౌన్, మిని బైపాస్ రోడ్డుపై, ఆత్మకూరు బస్సు స్టాండ్ మరియు ముత్కురు సెంటర్‌ల మధ్య, కుడివైపు	SPSR నెల్లూరు	22	22
96	నెల్లూరు టౌన్, పోదల్‌కూర్ - ఎస్.పి.బంగళా మరియు ఎ.పి.ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ మధ్య	SPSR నెల్లూరు	22	22
97	నెల్లూరు టౌన్, చిల్డ్రన్ పార్క్ రోడ్డుపై, ముత్కురు సెంటర్ మరియు NH-16 (ఓల్డ్ NH-5), NH పై లేకుండా	SPSR నెల్లూరు	22	22
98	నెల్లూరు టౌన్, మిని బైపాస్ రోడ్డుపై, ముత్కురు సెంటర్ మరియు బి.వి.నగర్ సాయిబాబా గుడిసెంటర్‌ల మధ్య, ఎడమవైపు	SPSR నెల్లూరు	22	22
99	నెల్లూరు టౌన్, ముత్కురు రోడ్డు - ముత్కురు సెంటర్‌కి 5 కి.మీ, ముత్కురు వైపు, ఎడమవైపు	SPSR నెల్లూరు	22	22
100	బుజ బుజ నెల్లూరు మరియు కకటూరుల మధ్య, NH-16 పై (ఓల్డ్ NH-5)	SPSR నెల్లూరు	45	45
101	నెల్లూరు టౌన్, ట్రంక్ రోడ్డు పై, యం.జి.బి. ఫెలిసిటి మాల్ మరియు అయ్యప్పగుడి జంక్షన్‌ల మధ్య	SPSR నెల్లూరు	22	22
102	నెల్లూరు టౌన్, ట్రంక్ రోడ్డు పై, గాంధి బొమ్మ జంక్షన్ మరియు యం.జి.బి. ఫెలిసిటి మాల్ మధ్య ఇరువైపులా	SPSR నెల్లూరు	22	22
103	నెల్లూరు టౌన్, మిని బైపాస్ రోడ్డుపై, టి.డి.పి. ఆఫీసు మరియు బి.వి.నగర్ సాయిబాబా గుడి మధ్య, కుడివైపు	SPSR నెల్లూరు	22	22
104	గూడూరు టౌన్, టౌన్ పరిధిలోపల	SPSR నెల్లూరు	22	22
105	గూడూరు నుండి నాయుడు పేట మధ్య, NH-16 పై, (ఓల్డ్ NH-5), ఇరువైపులా	SPSR నెల్లూరు	45	45
106	నాయుడుపేట నుండి తడల మధ్య, NH-16 పై, (ఓల్డ్ NH-5), ఇరువైపులా	SPSR నెల్లూరు	45	45
107	సూళ్లూరుపేట టౌన్ పరిధి లోపల	SPSR నెల్లూరు	22	22
108	మల్లంపల్లె గ్రామం, ఎర్రగొండపాలెం మండలం, పై, మార్కాపూర్ నుండి మాచర్ల రోడ్డుకి ఎడమవైపు	ప్రకాశం	35	45
109	పెద్దగంజాం గ్రామం, చిన్నగంజాం మండలం, NH-216 పై (ఓల్డ్ NH-214A), ఒంగోలు నుండి చీరాల రోడ్డు, కుడివైపు	ప్రకాశం	35	45
110	త్రోవగుంట గ్రామం, NH-216 పై (ఓల్డ్ NH-214A), ఒంగోలు నుండి చీరాల రోడ్డు	ప్రకాశం	35	45
111	మర్రిచెట్ల పాలెం గ్రామం, SH-53 పై, ఒంగోలు నుండి కర్నూలు రోడ్డు ఎడమవైపు	ప్రకాశం	35	35
112	ఒంగోలు మండలం, NH-16 పై, (ఓల్డ్ NH-5), విజయవాడ నుండి చెన్నై ఎడమవైపు	ప్రకాశం	35	45
113	చీరాల మండలం, NH-216 పై (ఓల్డ్ NH-214A), న్యూ బైపాస్, ఒంగోలు నుండి బాపట్ల రోడ్డు	ప్రకాశం	35	35
114	చీరాల టౌన్, గాంధీ విగ్రహం నుండి కొత్తపేట్ రోడ్డు వరకు	ప్రకాశం	22	22
115	పామర్రు మండలం, NH-565 పై, ఏర్పేడు నుండి మార్కాపూర్ రోడ్డు	ప్రకాశం	35	35
116	చీరాల టౌన్, మున్సిపల్ పరిధిలోపల	ప్రకాశం	22	22
117	అద్దంకి మండలం, SH-2 పై మేదరమెట్ల నుండి నర్సారావుపేట రోడ్డు, ఎడమవైపు	ప్రకాశం	25	25
118	బొల్లపల్లె టోల్‌ప్లాజా నుండి 10 కి.మీ లోపల, NH-16 పై కుడివైపు (ఓల్డ్ NH-5), చెన్నై నుండి విజయవాడ	ప్రకాశం	35	45
119	బొల్లపల్లె టోల్‌ప్లాజా నుండి 10 కి.మీ లోపల, NH-16 పై ఎడమవైపు (ఓల్డ్ NH-5), చెన్నై నుండి విజయవాడ	ప్రకాశం	35	45
120	ఒంగోలు టౌన్, కలక్టరేట్ నుండి ఎడమవైపు ఓల్డ్ NH-5 జంక్షన్ వరకు	ప్రకాశం	22	22
121	చీమకుర్తి మండలం SH-53 పై, ఒంగోలు నుండి కర్నూలు రోడ్డు	ప్రకాశం	35	35
122	ఒంగోలు టౌన్, సంగమిత్ర హాస్పిటల్ నండి మంగమూరు జంక్షన్‌ల మధ్య, ఓల్డ్ NH బైపాస్ రోడ్డు పై	ప్రకాశం	22	22
123	ఒంగోలు టౌన్ మున్సిపల్ పరిధిలోపల	ప్రకాశం	22	22
124	ఒంగోలు మండలం, విజయవాడ నుండి చెన్నై కుడివైపు, NH-216 పై (ఓల్డ్ NH-5)	ప్రకాశం	35	45
125	ఉప్పుగుండూర్ గ్రామం, ఒంగోలు నుండి చీరాల రోడ్డుపై ఎడమవైపు, NH-216 పై (ఓల్డ్ NH-214A)	ప్రకాశం	35	35
126	నాగుఉప్పలపాడు మండలం, ఒంగోలు నుండి చీరాల రోడ్డు, NH-216 పై (ఓల్డ్ NH-214A)	ప్రకాశం	35	35
127	వేటపాలెం మండలం, ఒంగోలు నుండి బాపట్ల రోడ్డు, NH-216 పై (ఓల్డ్ NH-214A)	ప్రకాశం	35	35
128	కుప్పం టౌన్ పరిధి లోపల, NH పై కాకుండా	చిత్తూరు	22	22
129	మదనపల్లి మున్సిపల్ పరిధిలోపల	చిత్తూరు	22	22
130	పీలేరు క్రాస్‌రోడ్డు నుండి 3 కి.మీ. లోపు, NH-40 పై ఇరువైపులా	చిత్తూరు	35	35
131	పీలేరు క్రాస్‌రోడ్డు నుండి 3 కి.మీ. లోపు, NH-71 పై ఇరువైపులా	చిత్తూరు	35	35
132	పీలేరు క్రాస్‌రోడ్డు నుండి 3 కి.మీ. లోపు, పీలేరు టౌన్‌లో, NH పై కాకుండా	చిత్తూరు	22	22
133	చిత్తూరు టౌన్ పరిధిలోపల	చిత్తూరు	22	22
134	పలమనేరు టౌన్ పరిధి లోపల NH పై కాకుండా	చిత్తూరు	22	22
135	పలమనేరు టౌన్ పరిధి లోపల, NH-42 పై ఇరువైపులో (ఓల్డ్ NH-219)	చిత్తూరు	35	35
136	పలమనేరు టౌన్ పరిధి లోపల, NH-206 పై ఇరువైపులో (ఓల్డ్ NH-4)	చిత్తూరు	35	35
137	చంద్రగిరి బైపాస్ మరియు పాకలవారిపల్లెల మధ్య, NH-140 పై కుడివైపు	చిత్తూరు	35	45
138	తిరుపతి రామానుజా సర్కిల్ మరియు ఆటో నగర్‌ల మధ్య, రేణిగుంట ఎడమవైపు	చిత్తూరు	22	22
139	ఏర్పేడు నుండి రేణిగుంట చెక్‌పోస్టు జంక్షన్‌ల మధ్య, NH-71 పై ఎడమవైపు (ఓల్డ్ SH-61)	చిత్తూరు	35	45
140	తిరుపతి టౌన్, రామానుజా సర్కిల్ మరియు కపిలతీర్థంల మధ్య, ఇరువైపులో	చిత్తూరు	22	22
141	తిరుపతి టౌన్, లీలామహల్ జంక్షన్ మరియు తిరుపతి ఆర్.టి.ఓ. ఆఫీసు మధ్య, ఇరువైపులో	చిత్తూరు	22	22
142	తిరుపతి మున్సిపల్ పరిధిలోపల	చిత్తూరు	22	22
143	శ్రీకాళహస్తి టౌన్ పరిధి, NH పై కాకుండా	చిత్తూరు	22	22
144	తిరుపతి పరిధిలోపల, చెర్లోపల్లి జంక్షన్ మరియు శ్రీనివాసమంగాపురం గుడికి ఇరువైపులా	చిత్తూరు	22	22
145	తుమ్మలగుంట క్రాస్ నుండి చెర్లోపల్లి జంక్షన్, ఇరువైపులో - తిరుపతి టౌన్	చిత్తూరు	22	22
146	చెర్లోపల్లి జంక్షన్ మరియు రంగంపెటల మధ్య, NH-71 పై ఇరువైపులా	చిత్తూరు	35	45
147	యస్.వి.పురం (వడమలపెట మండలం) టోల్ నుండి పుత్తూర్‌ల మధ్య, NH-205 పై ఇరువైపులా	చిత్తూరు	35	45
148	రేణిగుంట చెక్‌పోస్ట్ నుండి యస్.వి.పురం (వడమలపెట మండలం) టోల్‌ల మధ్య, NH-205 పై ఇరువైపులా	చిత్తూరు	35	45
149	రేణిగుంట జంక్షన్ నుండి మముందూర్ మధ్య, SH-31 పై	చిత్తూరు	35	45
150	తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డుపై	చిత్తూరు	22	22
151	పుత్తూరు టౌన్ పరిధి లోపల	చిత్తూరు	22	22

గమనిక : LHS - ఎడమ చేతి వైపు, RHS - కుడి చేతి వైపు, NH - నేషనల్ హైవే, SH - స్టేట్ హైవే
అనువైన భూమి కొరకు **ఈ ప్రకటన జారీ చేయబడినది. డీలర్‌షిప్‌ల కొరకు కాదు**

దిగువ తెలిపిన విషయాలను గమనించండి :

1. నేషనల్ హైవే మీద ఆఫరు చేయబడిన భూమి NH నిబంధనలకు అనుగుణమైనదై ఉండవలెను. సదరు స్థలం NH నిబంధనలకు అనుగుణమైనది కాని పక్షంలో అది తిరస్కరించబడుతుంది.
2. స్థలం/ స్థలాల వాణిజ్య పరమైన గిట్టుబాటుకు లోబడి ఏ ప్రదేశంలోనైనా ఆఫరు చేయబడిన ఒకటి కన్నా ఎక్కువ స్థలాలను HPCL తన విచక్షణ మేరకు తీసుకుంటుంది.
3. ప్రకటించబడిన అన్ని స్ట్రెచ్‌లలో లభ్యత మరియు వాణిజ్య పరమైన గిట్టుబాటుకు లోబడి HPCL, తన విచక్షణ మేరకు ఎక్కువ భూమి ఏరియాని తీసుకుంటుంది.
4. ఆస్తి, స్పష్టమైన మరియు మార్కెటబుల్ టైటిల్‌ను కలిగియుండవలెను.
5. బిడ్డర్లు పట్టణ భూపరిమితి, వ్యవసాయేతర అనుమతి, ఆదాయపన్ను క్లియరెన్స్, ఎన్‌కంబ్రెన్స్ ఏదీలేదని సర్టిఫికెట్లు వగైరా లాంటి అన్ని చట్టబద్ధ క్లియరెన్సులకై ఏర్పాటు చేయవలెను.
6. సమాన కోట్స్ వచ్చిన పక్షంలో విద్యుత్తు మరియు నీటి కనెక్షన్ అందుబాటులో ఉన్న భూమి ప్లాట్లకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.
7. ఉమ్మడి బిడ్డర్లు లేదా పూర్తి భూమి బిడ్డరు చెందిన పక్షంలో, మా అవసరాన్ని తీర్చే, ఎవరి ప్లాట్లు ఒకదానికొకటి ఆనుకొని ఉన్నచో, ఆ ప్లాట్లు గల వ్యక్తుల బృందం ఇతరుల కొరకు వారిలో ఒకరు పవర్ ఆఫ్ అటార్నీని కలిగి ఉండుట ద్వారా కోట్ వేయవచ్చును.
8. వ్యవసాయేతర మార్పిడి క్రింద ఉన్న భూముల విషయంలో ముఖ్యంగా వాణిజ్య మార్పిడికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. వ్యవసాయ భూమిని ఆఫరుచేసేవారు దానిని వ్యవసాయేతరముగా, మరీ ముఖ్యంగా లీజుడీడ్/అమ్మకం యొక్క రిజిస్ట్రేషన్‌కు ముందుగా తమ స్వంత ఖర్చులు మరియు వ్యయం మీద పెట్రోలు పంపు మరియు ఇతర అనుబంధ ప్రయోజనాలకై ఉపయోగార్థం వాణిజ్య మార్పిడి చేయవలెను.
9. అమ్మకం/లీజుకు ప్రతిపాదించబడిన భూమి స్పష్టంగా విభజింపబడవలెను మరియు టైటిల్ డాక్యుమెంట్/ఖివాట్/ఖతౌని,ఖస్రా/ గిర్దావరి అనేవి స్పష్టంగా సూచించబడవలెను మరియు వాటిని ధృవీకరించవలెను.
10. HPCL చే అంచనా వేయబడిన విధంగా ఆఫరు చేయబడిన స్థలాన్ని రోడ్డు మట్టానికి తెచ్చుటకు రిటైనింగ్ గోడ/ హ్యూమ్ పైపులు వ్యయం వగైరా సహా మట్టి నింపుట/కోత వ్యయం అనేవి బిడ్స్ వాణిజ్య మదింపు కొరకు పరిగణలోకి తీసుకోబడతాయి.
11. హరిత వనం (గ్రీన్ బెల్ట్) పరిధిలోకి వచ్చే భూమి అంగీకరించబడదు.
12. దళారులు మరియు ఆస్తి డీలర్లు దరఖాస్తు చేయనవసరం లేదు.
13. ఈ ప్రకటన రీటైల్ అవుట్‌లెట్ డీలర్‌షిప్‌లకు ఉద్దేశించినది కాదు.
14. సదరు ప్లాటు యొక్క ముందు భాగం హైవే/మెయిన్ రోడ్డు / సర్వీసు రోడ్డును ఆనుకొని ఉండవలెను.
15 సదరు ప్లాటు యందు ఓవర్‌హెడ్ విద్యుత్ ప్రసారం లేదా టెలిఫోన్ లైన్లు, ఉత్పత్తి/నీటి పైపులైన్లు/కాలువలు, డ్రైనేజి/నల్లాలు/పబ్లిక్ రోడ్డు/ రైల్వే లైన్ వగైరా ఉండరాదు. 11KV కన్నా ఎక్కువ ఓవర్‌హెడ్ విద్యుత్ HT లైను గల ప్లాట్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించబడతాయి.
16. ఇంగ్లీష్ మరియు తెలుగు ప్రకటనలలో ఏవైనా తేడాలు ఉన్నచో, ఇంగ్లీష్ ప్రకటనలో ఉన్న వివరాలే సరియైనవి.
17. మా గత ప్రకటన(ల)కు ప్రతిస్పందనగా పై ప్రదేశాలలో దేనికైనా తమ ఆఫరు(ల)ను దాఖలు చేసియున్న వారు ఆసక్తి ఉన్నచో తాజాగా ఆఫరు(ల)ను దాఖలు చేయవలెను. ఆఫర్లను దిగువ తెలిపిన విధంగా రెండు వేర్వేరు సీల్డు కవర్లలో టు బిడ్ సిస్టమ్‌లో దాఖలు చేయవలెను.

(A) **టెక్నికల్ బిడ్:**
ఆఫరు చేస్తున్న భూమి ప్లాటు వివరాలతోపాటు డాక్యుమెంట్లు ఏవేని ఉన్నట్లైతే వాటిపై సంతకం చేసి ఒక సీల్డు కవరులో ఉంచి, "టెక్నికల్ బిడ్" అని స్పష్టంగా వ్రాయవలెను. టెక్నికల్ బిడ్‌లో భూమి యొక్క ఆఫరు ధర/వ్యయం తాలూకు ఎట్టి రెఫరెన్స్ ఉండరాదు.
బిడ్డరు దిగువనీయబడిన వివరాలను దాఖలు చేయవలెను.
(i) దరఖాస్తుదారుని పేరు, పూర్తి చిరునామా మరియు కాంటాక్ట్ నెంబరు....
(ii) భూమి యొక్క యజమాని (యజమానుల) పేరు.
(iii) ఆస్తియొక్క వివరాలను సూచించే ప్రధానమైన ప్లాన్.
(iv) ప్లాటు యొక్క కొలతలతోపాటు అమ్మకానికి/లీజుకు ఆఫరుచేయబడిన విస్తీర్ణము.
(v) 7/12 సంగ్రహం లేదా తత్సమానము, అనగా ఖటౌని, జమాబంది, ఖస్రా, గిర్దావరి, చిట్టా, అడం గల్, వగైరా మరియు టైటిల్ డీడ్, అనగా సేల్ డీడ్. భూమి యొక్క యజమాన్యతను ధృవీకరించే లింక్ డాక్యుమెంట్లు వగైరాలతో పట్టా.
(vi) పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్స్ రిజిస్టర్డ్ పవర్ ఆఫ్ అటార్నీ యొక్క కాపీని దాఖలు చేయవలెను. ఐటమ్(5) మరియు (6)లో పేర్కొనబడిన డాక్యుమెంట్లు లేకుండా అందిన ఆఫర్లు తిరస్కరించబడతాయి.

(B) **ఫైనాన్షియల్ బిడ్:**
(i) పెంపుదల ఏమైనా ఉంటే, దానితోపాటు చదరపు మీటరు ఒక్కంటికి...రూపాయలు చొప్పున ఆశిస్తున్న ప్రాథమిక నెలవారీ అద్దె మరియు చదరపు మీటరు ఒక్కంటికి రూపాయలు చొప్పున ఆశిస్తున్న అమ్మకం ప్రతిఫలంను ఫైనాన్షియల్ బిడ్ కలిగి ఉండవలెను.
(i) ఫైనాన్షియల్ బిడ్‌ను ఒక విడి సీల్డు కవరులో ఉంచి, దాని పైభాగాన"ఫైనాన్షియల్ బిడ్" అని వ్రాయవలెను.

18. సీల్డు టెక్నికల్ మరియు ఫైనాన్షియల్ బిడ్ కవర్లు రెండింటిని ఒక మూడవ కవరులో ఉంచి, దానికి సీలు వేసి, దాని పైభాగాన "...... వద్ద భూమి కొరకు ఆఫరు" అని వ్రాయవలెను.
19. దాఖలు చేయబడిన ఆఫరు గడువు తేదీ నుండి 180 రోజులపాటు లేదా పరస్పర అంగీకారమైనట్టి పొడిగించబడిన వ్యవధి వరకు చెల్లుబాటులో ఉండవలెను.
20. ప్రతి ప్రదేశం కొరకు వేర్వేరు ఆఫరును ఇవ్వవలెను. ఆసక్తి గల పార్టీలు దిగువతెలిపిన గడువు తేదీ/సమయం లోగా సంబంధిత కార్యాలయ చిరునామాకు దరఖాస్తు చేసుకోవచ్చును. దిగువ తెలిపిన సంబంధిత కార్యాలయాల వద్ద ఆఫర్ల స్వీకరణకు గడువు తేదీ **27 ఏప్రిల్ 2018,** మరియు సమయం **16.00 గం..** గడువు తేదీ మరియు సమయం తరువాత అందిన ఆఫర్లు పరిగణించబడవు. టెక్నికల్ బిడ్స్ దిగువతెలిపిన చిరునామాల వద్ద **27 ఏప్రిల్ 2018,** మరియు సమయం **17.00** గం.లకు తెరువబడతాయి. ఆసక్తి గల బిడ్డర్లు టెక్నికల్ బిడ్‌ను తెరుచు సమయంలో హాజరవవచ్చును. ఎట్టి కారణమును తెలుపకనే పూర్తి ప్రకటనను లేదా ప్రకటించబడిన ఏవేని ప్రదేశాలను రద్దుచేసే హక్కు హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు కలదు.

క్రమ సంఖ్య 1 నుండి 49 వరకు గల ప్రదేశాల కొరకు:
చీఫ్ రీజినల్ మేనేజర్ - రిటైల్, **హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్,** విజయవాడ రిటైల్ రీజినల్ ఆఫీస్, సాయిబాబా టెంపుల్ దగ్గర, తాడేపల్లి పోస్ట్, **గుంటూరు జిల్లా - 522 501,** ఆంధ్రప్రదేశ్

క్రమ సంఖ్య 50 నుండి 71 వరకు గల ప్రదేశాల కొరకు:
డిప్యూటి జనరల్ మేనేజర్ - రిటైల్, **హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్,** విశాఖ రిటైల్ రీజినల్ ఆఫీస్, పెట్రోనిలయం, ఏ.యు. ఇన్ గేట్ ఎదురుగా, పోస్ట్ బాక్స్ నెం. 135, **విశాఖపట్టణం - 530003,** ఆంధ్రప్రదేశ్

క్రమ సంఖ్య 72 నుండి 92 వరకు గల ప్రదేశాల కొరకు:
డిప్యూటి జనరల్ మేనేజర్ - రిటైల్, **హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్,** 2వ అంతస్తు, చెంగల్వ టవర్స్, ఎ.పి.యస్.ఆర్.టి.సి. బస్‌స్టాండ్, యన్.జి.ఒ. కాలనీ, **కడప - 516001,** ఆంధ్రప్రదేశ్

క్రమ సంఖ్య 93 నుండి 152 వరకు గల ప్రదేశాల కొరకు:
చీఫ్ రీజినల్ మేనేజర్ - రిటైల్, **హిందుస్థాన్ పెట్రోలియం కార్పోరేషన్ లిమిటెడ్,** హౌస్.నెం. 16-15-986-2, ఆర్వీ హౌస్, కృష్ణ మందిరం దగ్గర, చిల్డ్రన్స్ పార్క్ మెయిన్ రోడ్డు, **నెల్లూరు - 524002,** ఆంధ్రప్రదేశ్

బెంచీల సరఫరాలో అవినీతి పర్వం

- ఏడాదికే మూలకు చేరుతున్న పరిస్థితి
- కంపెనీ పేర్లు లేకుండానే పాఠశాలలకు అందజేత
- పనుల అప్పగింతపైనా ఆరోపణలు
- తుది బిల్లుల కోసం రాజకీయ ఒత్తిడి
- నాలుగు జిల్లాల్లో పూర్తయిన కమిటీ విచారణ

ఈనాడు - అమరావతి

సర్వశిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ), పాఠశాల విద్యాశాఖ సరఫరా చేసిన డెస్కు(డ్యుయల్ డెస్కు)ల సరఫరాలో అక్రమాలు జరిగినట్లు విచారణలో తేలింది. గతేడాది పదోతరగతి పరీక్షలకు ముందు సరఫరా చేయగా.. రెండో ఏడాది పరీక్షలు రాసే సమయానికే చాలాచోట్ల విరిగిపోయినట్లు బయటపడింది. అధికారులు, గుత్తేదార్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో రూ.కోట్లు ప్రజాధనం దుర్వినియోగమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తు



కర్నూలులోని ఓ పాఠశాలలో విరిగిన డ్యుయల్ డెస్కు

తున్నాయి. సర్వశిక్షా అభియాన్‌లో కొనుగోళ్లు నుంచి ప్రతి వస్తువు సరఫరాలోనూ కీలకంగా వ్యవహరించే గుత్తేదారే ఈ పనులు దక్కించుకున్నారు. ఒక్క ఎస్ఎస్ఏలోనే ఈ గుత్తేదారు రూ.500కోట్లుకు పైగా లావాదేవీలు నిర్వహించారు. గతంలో ఈ గుత్తేదారు చెప్పిందే వేదంగా ఈశాఖలో సాగడంతో డెస్కుల నాణ్యతను అధికారులు గాలికొదిలేశారు. ఈ కుంభకోణాన్ని 'ఈనాడు' వెలుగులోకి తెవడంతో విచారణ చేపట్టారు. దాదాపు ఏడాదిగా విచారణ సాగిస్తున్న తనిఖీల బృందం ఇప్పటికి నాలుగు జిల్లాల్లో పరిశీలనలు పూర్తి చేసింది. దీనిపై నివేదికను రూపొందించింది. గోద్రెజ్-ఇన్టీరియో కంపెనీ డెస్కులను సరఫరా చేయాల్సి ఉండగా ఎలాంటి

సరఫరా, నిధులు ఇలా..		
సరఫరా	:	నెల్లూరు, గుంటూరు మినహా 11 జిల్లాలకు
పాఠశాలలు	:	184
మొత్తం డెస్కులు	:	39,565
ఒక్కోదాని ఖరీదు	:	రూ.5,041
మొత్తం విలువ	:	రూ.19.94 కోట్లు

కంపెనీ పేర్లు లేనివాటిని అంటగట్టారు.

అక్రమాలు ఇలా..!

- డ్యుయల్ డెస్కుల పనుల అప్పగింత నుంచి సరఫరా వరకు ఎక్కడా నిబంధనలు పాటించలేదు. ఎలాంటి టెండర్లు నిర్వహించకుండానే నేరుగా పనులు అప్పగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.
- డెస్కులపై ఎలాంటి కంపెనీ పేరు వేయలేదు. ఇవి అసలు కంపెనీవా? నకిలీవా? అనేది అర్థం కాని పరిస్థితి.
- ఒక్క కర్నూలు జిల్లాలోని 36పాఠశాలల్లో కమిటీ తనిఖీలు నిర్వహించగా 202డెస్కులు విరిగిపోయినట్లు గుర్తించారు. చిత్తూరు జిల్లాలోనూ చాలా పాఠశాలల్లో పనికిరాకుండా పోవడంతో మూలకుపడేశారు.
- పిల్లలు కూర్చునే డెస్కు షీటు కింద రాడ్లు సరిగా లేవు.
- డ్యుయల్ డెస్కులు విరిగిపోతున్నట్లు ఫిర్యాదు రావడంతో సదరు గుత్తేదారు కొత్తవాటిని సరఫరా చేయకుండా చిన్నచిన్న మార్పులు చేసి ఇచ్చేశారు.
- డెస్కుల నాణ్యతపై ఆరోపణలు రావడంతో కమిటీని ఏర్పాటు చేశాక సైతం పాఠశాల విద్యాశాఖ అధికారులు రూ.10కోట్లు చెల్లింపులు జరిపారు. ఇది అధికారులకు తెలిసి చేశారా? తెలియక చేశారా? అనేది కమిటీ తెల్చాల్సి ఉంది.

చివరి బిల్లులు కోసమూ ఒత్తిడి..

డెస్కుల నాణ్యతపై ఆరోపణలు రావడంతో చివరిగా చెల్లింపులు చేయాల్సిన రూ.4.5కోట్లు బిల్లులను సర్వశిక్షా అభియాన్ నిలిపివేసింది. వీటి కోసం గుత్తేదారు నేతల ద్వారా ఒత్తిడి తీసుకువస్తున్నారు. విచారణ కమిటీ నివేదికను తనకు అనుకూలంగా ఇప్పించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. గుత్తేదారు బ్యాంకు పూచీకత్తుగా చూపిన రూ.49లక్షలు ఖాతాలో ఉన్నాయా? లేవా? అని తెలుసుకునేందుకు కమిటీ లేఖ రాయనుంది. ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి విచారణ చేయిస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉందని పాఠశాల విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.



ఘటనాస్థలంలో బిజయ్ సాహు మృతదేహం

ఇన్‌ఫార్మర్ నెపంతో వ్యక్తి హత్య

ఒడిశాలో మావోయిస్టుల ఘాతుకం

బరగఢ్(ఒడిశా), న్యూస్‌టుడే: ఒడిశాలోని బరగఢ్ జిల్లా పైకమాల్ సమితి అటవీ ప్రాంతంలో ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు ఓ వ్యక్తిని హతమార్చారు. శనివారం రాత్రి ఈ ప్రాంతంలో కూంబింగ్ చేపడుతున్న సీఆర్‌పీఎఫ్ జవానులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా సాలేపల్లి గ్రామానికి చెందిన బిజయ్ సాహును మావోయిస్టులు అపహరించుకెళ్లిన విషయం విదితమే. ఆదివారం ఉదయం సాలేపల్లి అటవీ ప్రాంతంలో బిజయ్ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహం వద్ద మావోయిస్టులు విడిచిపెట్టిన లేఖలను స్వాధీనం చేసుకున్నారు. అందులో పేర్కొన్న మేరకు... 2017 సెప్టెంబర్‌లో బిజయ్ సాహు ఇచ్చిన సమాచారం అధారంగానే పోలీసులు ఇద్దరు మావోయిస్టులను ఎన్‌కౌంటర్ చేశారన్నారు. అందుకు ప్రతీకారంగా ఈ హత్య చేసినట్లు తెలిపారు. సాలేపల్లి గ్రామంలో పాన్ దుకాణం నిర్వహిస్తున్న బిజయ్‌కి భార్య, ఆరేళ్ల కుమారుడు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

సత్వరమే పంట నష్టపరిహారం

- వరిలో ఉపగ్రహ ఆధారిత పర్యవేక్షణ విధానం
- ఇరి సహకారంతో ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- ఖరీఫ్ నుంచి అమలుకు రంగం సిద్ధం

ఈనాడు, అమరావతి: ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి రైతుకు సత్వరమే పరిహారాన్ని అందించే దిశగా 'ఉపగ్రహ ఆధారిత వరి పర్యవేక్షణ విధానం' అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దీనికి సంబంధించి ఇప్పటికే అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ(ఇరి)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందుకు రూ.20కోట్లు చెల్లించింది. గడిచిన ఖరీఫ్, రబీ పంటకాలల్లో ప్రయోగాత్మకంగా కొన్ని మండలాల్లో ఈ విధానాన్ని పరిశీలించారు. ఆశాజనకమైన ఫలితాలు రావడంతో వచ్చే ఖరీఫ్ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం ప్రయోగశాల ఏర్పాటు, క్షేత్ర సహాయకులు, సిబ్బంది నియామకాలు కూడా త్వరలో పూర్తి చేయనున్నారు.

ఉపగ్రహ ఆధారంగా..: ప్రాజెక్టు అమల్లో భాగంగా వరి సాగు చేసే ప్రాంతాల్లో పంట నష్టాన్ని అంచనా వేస్తారు. గ్రామ పరిధిలో సర్వే నంబర్ల వారీగా పొలాలను ఎంపిక చేసుకుని అందులో పంటల సాగును గుర్తిస్తారు. పంట నష్టం సమయాల్లో ఉపగ్రహ ఆధారిత చిత్రాలను తీస్తారు. వాటితో క్షేత్రస్థాయిలో విశ్లేషించి నష్టాన్ని అంచనా వేస్తారు. ఇలా కరవు, అకాల వర్షాలు, తెగుళ్ల వల్ల పంటలకు కలిగే నష్టం గుర్తించి బీమా సంస్థలకు నివేదిక ఇస్తారు. 2017 ఖరీఫ్, 2017-18 రబీల్లో కొన్ని ప్రాంతాల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించారు. 80శాతం కచ్చితత్వంతో కూడిన ఫలితాలు వచ్చినట్లు నిర్ధరించారు.

జాప్యాన్ని నివారించవచ్చు: ప్రస్తుతం పంట నష్టాలను గుర్తించడానికి పంటకోత ప్రయోగాలనే ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. పంటకాలం పూర్తయ్యాక గణాంక శాఖ తీసే లెక్కల ఆధారంగానే నష్టాన్ని లెక్కించి పరిహారం అందిస్తున్నారు. దీనివల్ల ఖరీఫ్ ఆరంభంలో నష్టం జరిగితే చివరిలో గుర్తిస్తున్నారు. అవి బీమా సంస్థలకు చేరి పరిహారం విడుదలయ్యే సరికి మళ్లీ ఖరీఫ్ పూర్తవుతోంది. ఉపగ్రహ ఆధారంగా ఈ జాప్యాన్ని నివారించవచ్చు. రోజుల వ్యవధిలోనే కచ్చిత నష్టాన్ని లెక్కించవచ్చు. ఖరీఫ్ ప్రారంభంలో వరదల వల్ల పంట దెబ్బతింటే రోజుల వ్యవధిలోనే పరిహారం అందుతుంది.

బీమా సంస్థలతో చర్చలు: రైతుల నుంచి ప్రీమియం వసూలు చేసుకుని పంటలు దెబ్బతిన్న సమయంలో పరిహారం చెల్లించేది బీమా సంస్థలే. అందువల్ల పంటల బీమా అమలు చేస్తున్న సంస్థలతో చర్చలు జరుగుతున్నాయి. వారి అంగీకారంతో ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం గుంటూరు జిల్లా లాం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రయోగశాల ఏర్పాటు చేయనున్నారు. ఇరి ఆధ్వర్యంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ సిబ్బందికి శిక్షణ ఇప్పిస్తున్నట్లు వ్యవసాయ, ఉద్యానశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రారంభంలో వరికి మాత్రమే ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించినా క్రమంగా మిగిలిన పంటలకు కూడా విస్తరించే ఆలోచన ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి దామోదరనాయుడు వివరించారు.

30 లక్షల ఎల్ఈడీ వీధిదీపాలు ఏర్పాటు చేయాలి

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో 30 లక్షల ఎల్ఈడీ వీధిదీపాలను ఏర్పాటు చేసి ప్రపంచ రికార్డు సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించినట్లు ఇంధన శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. తద్వారా రాబోయే పదేళ్లలో 333 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఆదా జరిగి రూ.500 కోట్లు మిగులుతాయని ఆయన వివరించినట్లు పేర్కొంది. "జాతీయ వీధిదీపాల పథకం కింద ఇప్పటికే 9.19 లక్షల ఎల్ఈడీ వీధిదీపాలు ఏర్పాటు చేశాం. ఈ విషయంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. అయితే ఇది మాత్రమే సరిపోదు. అంతర్జాతీయ రికార్డు సాధించేలా ప్రణాళిక సిద్ధం చేయాలి. రాష్ట్రంలోని 13 వేల గ్రామ పంచాయతీల్లో ఉన్న సంప్రదాయ వీధి దీపాలన్నింటినీ తొలగించి వాటి స్థానంలో ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఇవి దోహదపడతాయి" అని సీఎం అన్నట్లు ఇంధన శాఖ వివరించింది.

రాత మారని 'రైతు'బంధు

- పంట ఉత్పత్తులపై రుసుము వసూలు రూ.470కోట్లు
- రైతులకిచ్చే రుణాలు రూ.43.39కోట్లు మాత్రమే
- అధిక వడ్డీలకు తెచ్చుకుని అప్పులపాలవుతున్న అన్నదాతలు

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలో 'రైతుబంధు' రాత మారడం లేదు. అప్పుల పాలవుతున్న రైతుకు అండ దొరకడం లేదు. వారి పంట ఉత్పత్తులపై ఒక శాతం రుసుము చొప్పున ఏడాదికి రూ.470కోట్లకుపైగా మార్కెటింగ్ శాఖకు వస్తున్నా.. రుణాలివ్వడానికి సతాయిస్తున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా రూ.44.39 కోట్లు రుణమివ్వగా, ఈ ఏడాది జనవరి దాకా రూ.43.39కోట్లు మాత్రమే మంజూరుచేశారు. రాజకీయ చట్రంలో మార్కెట్ కమిటీలు, పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న కార్యదర్శులవల్ల కర్షకులకు రుణం అందడం లేదు.

లక్ష్యం: ధర అనుకూలంగా లేని సమయంలో రైతు తన ఉత్పత్తులను మార్కెట్ యార్డు గిడ్డంగి/శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచి దాని విలువపై 75శాతం వరకు రుణం పొందవచ్చు. గరిష్ఠంగా రూ.2లక్షల వరకు రుణమిస్తారు. దీనిపై ఆరునెలల వరకు వడ్డీ ఉండదు. ఈలోగా ధర వస్తే అమ్ముకోవచ్చు. లేదంటే ఆరు నెలల తర్వాత నుంచి తొమ్మిది నెలల వరకు 12శాతం వడ్డీ వసూలు చేస్తారు.

అమలుకు దూరంగా 89 కమిటీలు

రాష్ట్రంలోని 191 కమిటీల పరిధిలో 89 చోట్ల ఒక్క రైతుకు కూడా రుణమివ్వలేదు. పథకాన్నే వర్తింపజేయలేదు.

★ 10 కమిటీల్లో ఒక్కొక్కరు చొప్పున మాత్రమే మమ అన్పించారు. 31కమిటీల్లో 87మందికిమాత్రమే ఇచ్చారు.

★ మిర్చి క్రయవిక్రయాలు అధికంగా సాగే గుంటూరు యార్డు పరిధిలో ఒక్కరికీ రుణం అందకపోవడం రైతుబంధు అమలు తీరుకు దర్పణం పడుతోంది. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే వారికి రుణం మంజూరు చేస్తామని గతంలో చెప్పినా నిర్లక్ష్యం వహించారు. మొత్తం 21 కమిటీలు ఉండగా చిలకలూరిపేట, తాడికొండ, రొంపిచర్ల, కూచినపూడి, ఫిరంగిపురం, రాజుపాలెంలో ఒక్క రైతుకూ రుణం అందలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇక్కడే గరిష్ఠంగా 1,083 మందికి రూ.11.26 కోట్లు మంజూరయ్యాయి.

★ చిత్తూరు జిల్లాలో మరింత అధ్వానంగా ఉంది. 19 మార్కెట్‌కమిటీలకుగాను శ్రీకాళహస్తి 13, తొట్టంబేడులో 28 మందికి రూ.55లక్షల రుణాలందాయి. మరే మార్కెట్ కమిటీలోనూ పథకం జాడ లేదు.

★ శ్రీకాకుళం రూ.85.37లక్షలు, విజయనగరం రూ.34.16 లక్షలు, విశాఖపట్నం 69.75లక్షలు, ప్రకాశం రూ.77.24 లక్షలు, చిత్తూరు రూ.55.02లక్షలు, అనంతపురం రూ.53.39లక్షలే రుణాలిచ్చారు. ఇందులో ఎక్కడా రూ.కోటికి కూడా చేరలేదు.

★ ఈ పథకం కింద రుణగ్రహీతలు 80శాతం వరకు వ్యాపారులేనని ఎమ్మెల్యేలే పేర్కొంటున్నారు.

ఇచ్చింది రూ.43.39 కోట్లే: రాష్ట్రంలో ఈ ఏడాది ఐదు వేల మందికి రైతుబంధు పథకం కింద రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. పది నెలలు గడిచినా లక్ష్యంలో 73 శాతం మందికి మాత్రమే ఇవ్వగలిగారు. మార్కెటింగ్ అధికారులు శ్రద్ధ తీసుకోకపోవడమే దీనికి ప్రధాన కారణం.

సంవత్సరం	ఇచ్చిన రుణం (రూ.కోట్లలో)	తీసుకున్న రైతులు
2014-15	26.06	3,145
2015-16	33.42	3,414
2016-17	44.39	3,988
2017-18 (జనవరి దాకా)	43.39	3,637

అలవిమాలిన జాప్యం..

రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి 24 నుంచి 48శాతం వరకు వడ్డీకి అప్పు తెచ్చుకుంటున్నారు. మార్కెట్ ఛైర్మన్లు, డైరెక్టర్లు చెప్పిన వారిలో ఒకరిద్దరికీ రుణమిచ్చి మమ అన్పిస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే రుణం అందేలా చూస్తామనే హామీలిస్తున్నా ఆచరణలో కనిపించడం లేదు. మార్కెట్ కమిటీ అధికారులు, సిబ్బంది సహకారంతో రైతుల పేర్లతో సరుకు నిల్వఉంచి కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రుణాలు పొందుతున్నారు. ఒక్కో యార్డు పరిధిలో కనీసం 200 మందికైనా పథకం కింద రుణమిచ్చేలా చూస్తేనే రైతులకు ఊరట కలుగుతుంది.

ఇక గ్రామాల్లోనూ అంకుర వాణిజ్య వ్యవస్థాపకులు

- సెర్ప్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలు
- సీఈవో కృష్ణమోహన్ వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రామీణ నిరుద్యోగితను తగ్గించడమే లక్ష్యంగా పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మరో కొత్త పథకాన్ని అమల్లోకి తెస్తోంది. ఇప్పటివరకు ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారులుగా ఉన్న గ్రామీణ వర్గాలను అంకుర వాణిజ్య వ్యవస్థాపకులు (వాణిజ్యవేత్తలు)గా తయారు చేయాలన్నది ఈ పథకం లక్ష్యం. దీని అమలుకు కార్యచరణ ప్రారంభించినట్లు సెర్ప్ సీఈవో కృష్ణమోహన్ ఆదివారం తెలిపారు. సామాజిక శిక్షణ శిబిరాల నిర్వహణకు సన్నాహాలు చేపట్టినట్లు వివరించారు. ఇందుకోసం మండలాల్లో బిజినెస్ మేనేజర్లను నియమిస్తున్నామన్నారు. "ఎంపిక చేయబడిన సామాజిక శిక్షణా అభ్యర్థి గ్రామస్థాయిలోని స్వయం సహాయ సంఘ మహిళల్లో అంకుర వాణిజ్య వ్యవస్థాపనకు అనువైన వారిని గుర్తిస్తారు. వారికి అవసరమైన ప్రతిభాపాటవాలు, నైపుణ్యాలను పెంపొందించేటందుకు బ్లాక్ రిసోర్స్ సెంటర్‌లో రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తారు. ఎంచుకున్న వ్యాపారానికి అవసరమైన రుణం మంజూరు, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల నుంచి అనుమతులు తదితర పనులన్నింటిలో సదరు శిక్షణా అభ్యర్థి చేయూతనివ్వడంతోపాటు రికార్డుల నిర్వహణ, మార్కెటింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇస్తారు. అంకుర వాణిజ్య వ్యవస్థాపన ఏర్పాటయ్యాక గ్రామీణ అంకుర వాణిజ్య కార్యక్రమం పురోగతిని 48 నెలల పాటు శిక్షణా అభ్యర్థి గ్రామసంఘానికి, బ్లాక్ రిసోర్స్ సెంటర్‌కు తెలియజేస్తారు. కాలానుగుణంగా వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి అభివృద్ధికి సహకరిస్తారు" అని సీఈవో కృష్ణమోహన్ వివరించారు.

ఉగాది వేళ.. తండ్రీకొడుకుల ఆత్మహత్య

- బంధువులే కారకులంటూ లేఖలు

రాజమహేంద్రవరం నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎదురింటివారు ఉగాది పచ్చడి ఇద్దామని తలుపు తడితే ఎవరూ పలకలేదు. తెలిసినవారు ఫోన్‌చేస్తే తీయలేదు. దీంతో మద్దిపాటి శివరామకృష్ణ సోదరుడు శ్రీనివాసు స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా తండ్రీకొడుకులు ఫ్యానుకు ఉరేసుకుని కనిపించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని అద్దేపల్లి కాలనీ యశోదా ఆర్కేడ్ అపార్టుమెంటులో ఉంటున్న మద్దిపాటి శివరామకృష్ణ(60), ఆయన మూడో కుమారుడు నరేష్ బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదివారం మధ్యాహ్నం వెలుగుచూసింది. బంధువుల కారణంగా తన భార్య, కుమారుడి భార్య వారి పుట్టినిళ్లకు వెళ్లిపోయారని, తాము ఒంటరివారమయ్యామనే మనస్తాపంతోనే వారు ప్రాణం తీసుకున్నారని పోలీసులు భావిస్తున్నారు. తమ మృతికి బంధువులే కారణమంటూ శివరామకృష్ణ రాసిన లేఖలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

విజయవాడ విమానాశ్రయానికి త్వరలో సీఐఎస్ఎఫ్ భద్రత

షిర్డీ, జామ్‌నగర్, జబల్‌పూర్‌లకు కూడా..

దిల్లీ: దేశంలోని కనీసం మరో నాలుగు విమానాశ్రయాలకు త్వరలోనే 'కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం' (సీఐఎస్ఎఫ్) భద్రత లభించనుంది. విజయవాడ(ఆంధ్రప్రదేశ్), షిర్డీ(మహారాష్ట్ర), జామ్‌నగర్ (గుజరాత్), జబల్‌పూర్(మధ్యప్రదేశ్) విమానాశ్రయాలు ఇక నుంచీ సీఐఎస్ఎఫ్ భద్రతా వలయంలోకి వస్తాయి.

అవసరమైతే అధిక కేటాయింపులు

- 'ఎన్టీఆర్ జలసిరి' అమలులో సవరణలు
- ఉత్తరాంధ్ర జిల్లాలకు అధిక ప్రాధాన్యం

ఈనాడు, అమరావతి: ఎన్టీఆర్ జలసిరి బోర్ల కేటాయింపులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అవసరమైన ప్రాంతాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వాలని నిర్ణయించింది. ఇప్పటికే అత్యధికంగా వినియోగంలో ఉన్న జిల్లాలకు మంజూరు చేయడంతో నిరుపయోగమవుతున్నాయి. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ఉత్తరాంధ్ర జిల్లాలకు తాజాగా అదనపు కేటాయింపులు చేసింది. విద్యుత్తు పంపుసెట్ల స్థానంలో సౌర విద్యుత్తు బోర్లు ఏర్పాటు కోసం ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోంది. ఎన్టీఆర్ జలసిరిలో ఈ ఏడాది (2017-18) 35 వేల బోర్లు 12 జిల్లాలకు కేటాయించారు. అనంతపురం జిల్లాలో భూగర్భ జలాలు అందుబాటులో ఉండవన్న కారణంతో మినహాయించారు. ఒక్కో బోరు విలువ రూ.65 వేలుగా అంచనా వేయగా, ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులు రూ.6 వేలు, మిగతా రైతులు రూ.25 వేలు చెల్లిస్తే మిగతా మొత్తాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమకూర్చనున్నాయి. కోస్తా, రాయలసీమలోని అత్యధిక జిల్లాల్లో రైతుల నుంచి ఈ కార్యక్రమానికి స్పందన లోపించగా, ఉత్తర కోస్తాలో అత్యధికంగా రైతులు ముందుకొచ్చారు. జలసిరిపై ఇటీవల సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రైతులు కోరుకున్న చోట అత్యధిక కేటాయింపులు చేయాలన్న ఆదేశాలతో అధికారులు శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు అదనపు కేటాయింపులు చేశారు.

జిల్లాలకు ప్రత్యేక బృందాలు...

జలసిరిలో తాజాగా వివిధ జిల్లాలకు చేసిన అదనపు కేటాయింపులు వినియోగంలోకి వచ్చేలా ప్రత్యేక అధికార బృందాలను జిల్లాలకు పంపుతున్నారు. వీరంతా రైతులతో సమావేశమై సౌర విద్యుత్తు పంపుసెట్ల పనితీరు, ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీ, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏప్రిల్ నుంచి జూన్ మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35 నుంచి 40 డిగ్రీల మధ్య సరాసరి నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. సౌర విద్యుత్తు పంపుసెట్లను రైతులు ఉపయోగించుకునేలా అధికారులు ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

ఎన్టీఆర్ జలసిరిలో వివిధ జిల్లాలకు చేసిన కేటాయింపులు, వీటిలో ఇప్పటివరకు తీయించిన బోర్లు, బిగించిన సౌర విద్యుత్తు మోటార్లు


	కేటాయించిన బోర్లు	తీయించిన బోర్లు	సౌర మోటార్లు అమర్చినవి
విజయనగరం	9,000	3,362	1,668
విశాఖపట్నం	2,000	524	238
శ్రీకాకుళం	9,000	731	233
నెల్లూరు	1,600	1,658	938
ప్రకాశం	6,500	6,373	2,236
కర్నూలు	800	788	373
కృష్ణా	600	590	441
కడప	700	341	116
గుంటూరు	1,100	1,072	370
తూర్పు గోదావరి	2,000	2,000	948
చిత్తూరు	1,000	967	603
పశ్చిమ గోదావరి	700	663	636
అనంతపురం	0	0	0
మొత్తం	35,000	19,069	8,800

సరికొత్త సాంకేతికతతో చందమామపై బిలాల గుర్తింపు




టొరంటో: చంద్రుడిపై బిలాలను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకుగాను కృత్రిమ మేధస్సు(ఏఐ) సాయంతో శాస్త్రవేత్తలు సరికొత్త సాంకేతికతను అభివృద్ధి చేశారు. చందమామ ఉపరితల నిర్మాణాన్ని సంపూర్ణంగా విశ్లేషించడంతోపాటు సౌర వ్యవస్థ తొలినాళ్లనాటి పరిస్థితులను మెరుగ్గా అవగతం చేసుకునేందుకు ఈ ఆవిష్కరణ దోహదపడే అవకాశముంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతలు జాబిల్లిపై బిలాలను గుర్తించడం, లెక్కించడం వంటి ప్రక్రియలకు అధిక సమయాన్ని తీసుకుంటున్నాయని కెనడాలోని టొరంటో విశ్వవిద్యాలయ పరిశోధకులు మహమ్మద్ అలీ-డిబ్ తెలిపారు. వాటికి ప్రత్యామ్నాయంగా ఏఐ సాయంతో సరికొత్త సాంకేతికతను తాము ఆవిష్కరించామని వెల్లడించారు. చంద్రుడిపై ఇప్పటికే ఉన్న బిలాలలను అది కచ్చితత్వంతో గుర్తించిందని పేర్కొన్నారు. ఇప్పటివరకు కనిపించని 6 వేల కొత్త బిలాలనూ ఈ సాంకేతికత సాయంతో గుర్తించగలిగామని వివరించారు.

విటమిన్ బి-12తో మధుమేహ ముప్పు దూరం



లండన్: శరీరానికి 'విటమిన్ బి-12' చాలా తక్కువ పరిమాణంలోనే అవసరమైనప్పటికీ.. ఆరోగ్యంపై అది చూపే ప్రభావం చాలా అధికమని శాస్త్రవేత్తలు వెల్లడించారు. మధుమేహం నుంచి రక్షణ కల్పించడంలోనూ ఆ విటమిన్ దోహదపడుతుందని తాజాగా గుర్తించారు. 108 మంది చిన్నారులపై పరిశోధనల ద్వారా హైదరాబాద్‌లోని 'సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సీసీఎంబీ)' శాస్త్రవేత్తలు, పుణె, సింగపూర్, బ్రిటన్ శాస్త్రవేత్తలతో కూడిన బృందం తాజా అంశాలను నిర్ధారించింది. మధుమేహానికి కారణమయ్యే జన్యువుల వ్యక్తీకరణను 'విటమిన్ బి-12' నిరోధిస్తున్నట్లు తేలిందని శాస్త్రవేత్తలు తెలిపారు. తద్వారా మధుమేహం నుంచి రక్షణ పొందవచ్చునని వివరించారు. దాదాపు 40-70 శాతం మంది భారతీయులు ప్రస్తుతం ఈ విటమిన్ లోపంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. శరీరానికి ప్రతిరోజు కేవలం 2 మైక్రోగ్రాముల విటమిన్ బి-12 అవసరమవుతుందని వెల్లడించారు.

పిడికిలి పటుత్వంతో గుండె పదిలం!



లండన్: వ్యక్తుల గుండె ఆరోగ్య స్థితిని వారి పిడికిలి శక్తితో తెలుసుకోవచ్చునని శాస్త్రవేత్తలు తాజాగా గుర్తించారు. చేతిపట్టు పటుత్వం అధికంగా ఉన్న వ్యక్తులు హృదయం, రక్తనాళాల సంబంధిత రుగ్మతల బారినపడే ముప్పు తక్కువగా ఉంటుందని వెల్లడించారు. సాధారణంగా వ్యక్తుల కండర శక్తిని తెలుసుకునేందుకు చేతి పటుత్వాన్ని కొలమానంగా తీసుకుంటుంటారని బ్రిటన్‌లోని క్వీన్ మేరీ విశ్వవిద్యాలయ పరిశోధకులు స్టీఫెన్ పీటర్సన్ తెలిపారు. అయితే, చేతి పట్టు పటుత్వాన్ని గుండె ఆరోగ్యంతో ముడిపెట్టి 5,065 మందిపై తాము తాజా అధ్యయనం నిర్వహించామని వెల్లడించారు. చేతుల్లో శక్తి ఎక్కువగా ఉన్న వ్యక్తుల్లో గుండె ఒక్కో హృదయ స్పందనకు అధిక స్థాయిలో రక్తాన్ని బయటకు పంపిస్తున్నట్లు తాము గుర్తించామన్నారు. అధిక రక్తపోటును తట్టుకునే సామర్థ్యమూ వారి గుండెకు ఉంటున్నట్లు నిర్ధారించారు. గుండెపోటు వంటి హృదయ సంబంధిత వ్యాధుల ముప్పు పొంచి ఉన్నవారిని వారి పిడికిలి శక్తిని పరీక్షించడం ద్వారా ముందే గుర్తించవచ్చునని పేర్కొన్నారు.

యువ భారత్‌కు పొంచి ఉన్న గ్లకోమా ముప్పు




దిల్లీ: అంధత్వానికి దారితీసే గ్లకోమా(నీటికాసులు) వ్యాధి ముప్పు ప్రస్తుతం మనదేశంలో 70 శాతం మందికి పొంచి ఉందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. నేత్రాల నుంచి మెదడుకు సమాచారాన్ని చేరవేసే నాడులు గ్లకోమా బాధితుల్లో దెబ్బతింటాయి. ఫలితంగా కంటిచూపు పోతుంది. ముందస్తు లక్షణాలేవీ బయటపడకుండానే ఈ ప్రభావం కనిపిస్తుంది కాబట్టి గ్లకోమాను నిశ్శబ్ద రుగ్మతగానూ పేర్కొంటారు. గ్లకోమా భారత్‌లో ప్రమాదకరరీతిలో విస్తరిస్తోందని 'సెంటర్ ఫర్ సైట్' వైద్య సేవల సంచాలకులు రితికా సచ్‌దేవ్ తాజాగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రుగ్మతతో ఏటా సగటున 2 లక్షలకుపైగా మంది అంధులుగా మారుతున్నారని తెలిపారు. సాధారణంగా 50 ఏళ్లకు పైబడినవారిలోనే కనిపించే ఈ వ్యాధి ప్రస్తుతం యువతనూ బలితీసుకుంటోందని వెల్లడించారు. తరచూ నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా గ్లకోమాను అడ్డుకోవచ్చునని వివరించారు.

నక్షత్ర మండలాలకూ భ్రమణం..!



మెల్‌బోర్న్: నక్షత్ర మండలాలన్నీ భూమిలానే భ్రమణంలో ఉంటాయని తాజా అధ్యయనం తేల్చింది. అంతేకాదు ఒక్కో భ్రమణానికి కొన్ని వందల కోట్ల ఏళ్లు పడుతుందని లెక్కగట్టింది. ఆస్ట్రేలియాలోని ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రోనమీ రీసెర్చ్ (ఐసీఆర్ఏఆర్) నిపుణులు దీన్ని చేపట్టారు. భిన్న ఉపగ్రహ చిత్రాల సమాచారాన్ని వారు విశ్లేషించారు. అనంతరం తాజా అవగాహనకు వచ్చారు. 'నక్షత్ర మండలం ఎంత పెద్దదైనా.. లేదా చిన్నదైనా భ్రమణం మాత్రం జరుగుతుంటుంది. భూమి తన చుట్టూ తాను తిరిగినట్టే ఇవి నెమ్మదిగా తిరుగుతుంటాయి. అంతేకాదు పరిమాణంలో ఒకేస్థాయిలో ఉండే నక్షత్ర మండలాలు ఒకే వేగంతో భ్రమిస్తాయి. నక్షత్రాలు ఎక్కువగా ఉన్నంత మాత్రాన వేగంగా తిరగడం లేకపోతే నెమ్మదిగా తిరగడం లాంటివి జరగవు'అని పరిశోధనలో పాలుపంచుకున్న ఐసీఆర్ఏఆర్ నిపుణులు జెర్హార్ట్ మ్యూరెర్ తెలిపారు.

వీర్య లోపాలతో... ఇతర అనారోగ్య సమస్యలు!



లండన్: పురుషులూ జాగ్రత్త..! వీర్యంలో శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉండే వారిలో ఇతర అనారోగ్య సమస్యలుండే ముప్పు ఎక్కువని తాజా అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా రక్తపోటు, అధిక కొవ్వు పీడించే ముప్పు 20 శాతం ఎక్కువగా ఉంటుందని బయటపడింది. ఇటలీ పరిశోధకులు దీన్ని నిర్వహించారు. సంతాన సమస్యలతో బాధపడుతున్న 5177 మంది పురుషులు దీనిలో పాల్గొన్నారు. వీరి ఆరోగ్య వివరాలను పరిశోధకులు లోతుగా విశ్లేషించారు. దీంతో వీర్యం నాణ్యత తక్కువగా ఉండేవారిలో జీవక్రియా సంబంధిత సమస్యలు, అధిక బరువు, ఎత్తుల నిష్పత్తి (బీఎంఐ), రక్తపోటు తదితర సమస్యలుంటున్నట్లు తేలింది. ఇవి మధుమేహం, గుండె పోటు, పక్షవాతం లాంటి ముప్పులకు కారణమవుతున్నట్లు బయటపడింది. అంతేకాదు వీరిలో టెస్టోస్టిరాన్ సైతం తక్కువగా ఉండే అవకాశముందని వెల్లడైంది. ఎముకలు గుల్లబారడం, కండరాలు పటుత్వం కోల్పోవడం లాంటి సమస్యలు దరిచేరకుండా టెస్టోస్టిరాన్ రక్షణ కల్పిస్తుంది.

తిరుమలలో వైభవంగా ఉగాది వేడుకలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవారి ఆలయం, ముఖద్వారాలను తితిదే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. సుప్రభాతం సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి, శ్రీవారి సేనాధిపతి విష్వక్సేనుల వారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. బంగారు వాకిలి ముందు తిరుమహామణి మండపంలో గరుడాళ్వారుకు అభిముఖంగా బంగారు సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను వేంచేపు చేశారు. పట్టువస్త్రాలను పెద్దజీయర్‌స్వామి ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామి సన్నిధిలో అర్చకులకు అప్పగించారు. మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను అలంకరించారు. స్వామివారి పాదపద్మాలపై ఉంచిన పంచాంగాన్ని తీసుకుని ఆస్థాన పండితులు నూతన పంచాంగ పఠనం చేశారు. ఉగాది పండుగ నుంచే తిరుమలేశుని ఆలయ వార్షిక కార్యక్రమాలు, ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఉగాది రోజున స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. సాయంత్రం పురవీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామి ఊరేగుతూ భక్తులకు నూతన సంవత్సర ఆశీస్సులను అందించి అనుగ్రహించారు. ఉగాది ఆస్థానంలో తితిదే ఈవో సింఘాల్, పాల్గొన్నారు.



శ్రీవారికి పట్టువస్త్రాలను తీసుకెళుతున్న పెద్దజీయంగార్. చిత్రంలో చిన్నజీయంగార్, తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



శ్రీశైలంలో వైభవంగా మల్లన్నకు రథోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు వైభవంగా రథోత్సవం జరిగింది. అర్చకులు, వేదపండితులు శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష పూజలు జరిపి రథంపై అధిష్ఠింపజేశారు. వేలాదిగా తరలివచ్చిన కన్నడ భక్తుల నడుమ శ్రీగిరి పురవీధుల్లో రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. మూడు రోజుల పాటు శ్రీగిరిలోనే గడిపి ఉత్సవాల్లో పాల్గొన్న కన్నడ భక్తులు రథోత్సవాన్ని తిలకించిన తర్వాత తమ స్వస్థలాలకు పయనమయ్యారు.

■ వర్షాలు సమృద్ధిగా కురవాలని తూర్పుగోదావరి జిల్లా అన్నవరం దేవస్థానంలో మొదటిసారిగా ఉగాది ఏరువాక వేడుకను వైభవంగా నిర్వహించారు.

భద్రాద్రిలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం

భద్రాచలం, న్యూస్‌టుడే: శ్రీ సీతారామచంద్ర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ ఒకటి వరకు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని నిత్య కల్యాణాలను నిలిపేశారు. తొలి రోజున తెలుగు సంవత్సరాది సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి ఉగాది పచ్చడిని భక్తులకు పంపిణీ చేశారు. అర్చకులు రామయ్యకు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధన నిర్వహించి అభిషేకం చేశారు. దర్బారులో రాజాధిరాజుని కీర్తించిన తీరు మంత్రముగ్ధులను చేసింది. సీతారాముల కరుణాకటాక్షాలతో విళంబి సంవత్సరం శుభకరమైన ఫలితాలను అందిస్తుందని ఆలయ పురోహితులు వెంకటేశ్వర అవధాని చేసిన పంచాంగ శ్రవణం ఆకట్టుకుంది.

ఆరోగ్య స్పృహ.. 'సప్తవర్ణ' ప్రభ

ప్రతి ఒక్కరిలో ఆరోగ్య సంరక్షణ స్పృహ పెరగాలనే లక్ష్యంతో శ్రీకాకుళంలోని యోగ శిక్షకులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఉగాది నేపథ్యంలో అరసవల్లిలోని ప్రసిద్ధ సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం సాగిన 'సూర్యనమస్కారాలు' ఆకట్టుకున్నాయి. సప్త వర్ణాల వస్త్రాల్లో మహిళలు హాజరై దీక్షగా నిర్వహించిన ఈ యోగాసనాల కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, అరసవల్లి



పవన్‌కల్యాణ్‌కు అనుకూలం



ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న పవన్‌కల్యాణ్

ఈనాడు డిజిటల్, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విజయవాడలోని తాత్కాలిక పార్టీ కార్యాలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఉద్దండరాయునిపాలెం నుంచి నేరుగా పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయన ఇక్కడ జరిగిన పూజలో పాల్గొన్నారు. పవన్‌కల్యాణ్‌కు చలనచిత్రాల్లోనే కాక రాజకీయ రంగంలోనూ రాజయోగం ఉందని ఆయన ఉన్న చోట ప్రభంజనం నడుస్తుందని పంచాంగ శ్రవణంలో పండితులు వివరించారు. ఉద్దండరాయునిపాలెంలో రైతుల భూముల పరిశీలన అనంతరం పవన్ అక్కడ నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పండితులు ఆశీస్సులు అందజేస్తూ పాలకుల ప్రజావ్యతిరేక నిర్ణయాలు పవన్‌కల్యాణ్‌కు అనుకూలమవుతాయని చెప్పారు.

భాజపా బలం పుంజుకుంటుంది

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో భాజపా బలం పుంజుకుంటుందని పంచాంగకర్త వీరభద్రశర్మ పేర్కొన్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆయన మాట్లాడుతూ కొన్ని ఒడిదొడుకులు ఎదురైనా పార్టీ ముందుకు వెళ్తుందని, ఉనికిని చాటుకుంటుందన్నారు. త్వరలో జరగనున్న కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో భాజపా తప్పక విజయం సాధిస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి జి.ఆర్.రవీంద్రరావు, ప్రధాన కార్యదర్శి శ్యాంకిశోర్, నేతలు పాల్గొన్నారు.



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా కౌతాళంలోని ఖాదర్‌లింగా స్వామి దర్గాలో పండితుడు కిష్టాచార్యులు పంచాగం పఠనం చేశారు. ఈ కార్యక్రమంలో దర్గా ధర్మకర్త సయ్యద్ సాహెబ్ పీర్ చిష్తీ, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, కౌతాళం

ఒడుదొడుకులున్నా స్థిరంగానే ప్రభుత్వం

● విళంబి నామ సంవత్సరంలో రాష్ట్ర స్థితిగతులపై పంచాంగ శ్రవణం

ఈనాడు డిజిటల్ – అమరావతి

విళంబి నామ సంవత్సరంలో ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా, స్థిరంగా నిలబడుతుందని పంచాంగకర్త ప్రబల సుబ్రహ్మణ్యశర్మ వివరించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో భాషా సాంస్కృతిక, దేవదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు హాజరయ్యారు. రాజమహేంద్రవరానికి చెందిన సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రాష్ట్ర, రాజకీయ, వాతావరణ పరిస్థితులను ఆయన వివరించారు. కేంద్రం, ప్రతిపక్షాల నుంచి వచ్చే ఇబ్బందులను తట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్తులో ఉనికిని కాపాడుకునేందుకు పునాదిని ఇప్పుడే ఏర్పాటు చేసుకుంటుంది. ప్రజలందరి సహాయసహకారాలు లభిస్తాయి. కేంద్ర ప్రభుత్వంలోనూ ఒడిదొడుకులు వస్తాయి. వాటన్నింటినీ తట్టుకుని నిలబడుతుంది. పార్లమెంటులో అలజడులు మరింత పెరిగే అవకాశముంది. కేంద్ర ప్రభుత్వ ఆదాయం పెరుగుతుంది. స్వతంత్రంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెళ్తాయన్నారు. స్టాక్ మార్కెట్‌లలో ఉత్థాన పతనాలు తప్పవు. రాష్ట్రంలో సంతృప్తిగా వర్షాలు కురుస్తాయి. వ్యవసాయం, పాడి పరిశ్రమ చక్కగా ఉంటుంది. పాలు, పెరుగు, నెయ్యి వంటివి సమృద్ధిగా అందుబాటులో ఉంటాయి.

■ ప్రభుత్వానికి ఆదాయం సంతృప్తికరంగానే ఉంటుంది. పర్యాటక శాఖ, ఆర్టీసీ విభాగాల పనితీరు బాగుంటుంది. వ్యవసాయం, దిగుబడులు, పాడి పరిశ్రమ బాగుంటాయి. గనులు, పంచాయతీలు, మున్సిపాలిటీలు, విద్యాసంస్థల అభివృద్ధి విషయంలో కొంత మాంద్యం కనిపిస్తోంది. వాటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. చలన చిత్రాలు, నాటకాలు, క్రీడా రంగాలు మామూలు వృద్ధిని కనబరుస్తూ ఉంటాయి.

■ రాష్ట్రంలో జూదరులు, వ్యసనపరులు పెరిగే అవకాశం ఉంది. కట్టడి చేసేందుకు నాయకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తమవంతు పాత్ర పోషించాలి. పోలీసు శాఖ పనితీరు కూడా బాగుంటుంది.

■ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి రైల్వే, తపాలా, పర్యాటక శాఖ నిదానంగా అభివృద్ధి చెందుతాయి. సరిహద్దు రక్షణ, ఆయుధ సంపత్తి, సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవడంలో సమర్థంగా వ్యవహరిస్తారు. ప్రపంచ దేశాల సహకారం బాగాఅందుతుంది.

■ విళంబి నామ సంవత్సరంలో అందరి జీవితాల్లో నవ్య కాంతులు వెల్లివిరియాలని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కళా వెంకట్రావు ఆకాంక్షించారు. గుంటూరులోని తెదేపా రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నక్కా ఆనందబాబుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



పంచాంగ శ్రవణం చేస్తున్న సుబ్రహ్మణ్య శర్మ

వ్యవసాయ పంచాంగం..

■ వ్యవసాయ రంగం సుభిక్షంగా ఉండేందుకు.. ఏ సమయంలో ఏయే పంటలు వేయాలో పరిశోధన జరిపి ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన పంచాంగాన్ని గుంటూరుకు చెందిన రావూరి వెంకటసాయి వరప్రసాద్ స్వామి చదివి వినిపించారు. లాభసాటి వ్యవసాయం సాధించే దిశగా నూతన వంగడాలు, అధిక ఉత్పత్తికి అనువైన సాంకేతిక పరిజ్ఞానం, యాజమాన్య పద్ధతులతో రైతులు రెట్టింపు ఆదాయాన్ని పొందేలా ఈ విశ్వవిద్యాలయం రూపొందించిన పంచాంగాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

2019లో జగన్‌కు రాజయోగం

పంచాంగ శ్రవణంలో వేదపండితులు

ఈనాడు డిజిటల్, గుంటూరు, ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి జాతకంలో 2018 అక్టోబరు 25 నాటికి శని మహాదశ పూర్తయి, సమస్యలు తొలగుతాయని వేదపండితులు పేర్కొన్నారు. 2019లో ఆయన రాజయోగం పట్టనుందని, ఎన్నికల్లో 135 సీట్లు గెలుచుకుని, మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. అప్పటినుంచి 12 సంవత్సరాల 18 నెలల, 18 రోజులు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతారన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంను మరిపించేలా జగన్ పాలన ఉంటుందన్నారు. గుంటూరు జిల్లా కాకుమానులో జగన్మోహన్‌రెడ్డి ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తాడేపల్లిగూడేనికి చెందిన వేదపండితులు పి.శివరామకృష్ణశర్మ పంచాంగ శ్రవణం చేస్తూ జగన్ మున్ముందు జాతకాన్ని వివరించారు. ఈ ఏడాది హస్త(కాంగ్రెస్)వాసి తగ్గుతుందని, సైకిల్(తెదేపా)లో గాలి పోతుందని, ఫ్యాన్ పవనాలు బాగా వీస్తాయని పేర్కొన్నారు. ఒకవేళ జగన్ గురించి తాము చెప్పింది నిజం కాకపోతే తర్వాతి సంవత్సరం నుంచి పంచాంగ శ్రవణం విరమించుకుంటానన్నారు. వేదపండితులు పంచాంగ శ్రవణం చేస్తున్నంతసేపు కార్యకర్తలు ముఖ్యమంత్రి జగన్ అంటూ నినాదాలు చేశారు. తొలుత వేదపండితులు దేశంలో చోటు చేసుకోనున్న పరిణామాల గురించి వివరించారు. గతంలో ప్రారంభించిన ప్రాజెక్టులు మందకొడిగా సాగుతాయన్నారు. అనంతరం జగన్ ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగన్ సతీమణి వైఎస్ భారతి కాకుమానులో పాదయాత్ర శిబిరానికి హాజరైనా పూజలో పాల్గొనలేదు.

కొమ్మూరు వద్ద మానవహారంలో పాల్గొననున్న జగన్: వైకాపా ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాసంకల్ప మానవహారాలను నిర్వహించనున్నారు. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొమ్మూరు వద్ద మానవహారంలో పాల్గొననున్నారు.



ఉగాది వేడుకల్లో పాల్గొన్న జగన్మోహన్‌రెడ్డి

కొత్త ఏడాదిలో... ఉపాధి పనిదినాల లక్ష్యం 22 కోట్లు!

● కేంద్రం నుంచి ఒకేసారి అనుమతి తీసుకునే యత్నం

● గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పరిశీలనలో ప్రతిపాదనలు

ఈనాడు – అమరావతి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం(నరేగా) పరిధిలో కొత్త ఏడాది(2018-19)లో రాష్ట్రంలోని కూలీలకు 22 కోట్ల పనిదినాల కల్పన కోసం కేంద్రానికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ సమగ్ర ప్రతిపాదనలు పంపింది. రెండు రోజుల క్రితం దిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ వివిధ రాష్ట్రాలతో నిర్వహించిన సమావేశానికి రాష్ట్రం తరఫున అధికారుల బృందం హాజరై నివేదిక అందజేసింది. ఈ ఏడాది(2017-18)లో ఇప్పటివరకు కూలీలకు కల్పించిన ఉపాధి, వేతనాల చెల్లింపులు, ఇంకా చెల్లించాల్సిన బకాయిలను ప్రస్తావిస్తూనే, కొత్త లక్ష్యాలను అధికారుల ముందుంచారు. మూడేళ్లుగా రాష్ట్రం పట్ల ఉదారంగా వ్యవహరించిన కేంద్రం.. మారిన రాజకీయ పరిణామాలతో ఎలాంటి నిర్ణయాన్ని తీసుకుంటుందో అనేది చర్చనీయాంశమవుతోంది. రాష్ట్ర ప్రతిపాదనలపై కేంద్రం వారం రోజుల్లో అధికారిక ఉత్తర్వులిచ్చే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. నరేగాలో ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రంలో గుర్తింపు పొందిన కూలీలకు 20.04కోట్ల పనిదినాలు కల్పించారు. నెలాఖరులోగా 24.01 కోట్లకు చేరుకోవాలన్న లక్ష్యం ఎంతవరకు నెరవేరుతుందన్నది ప్రశ్న. వాస్తవంగా గతంతో పోల్చితే ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య రాష్ట్రంలో పెరిగింది. నిధులు(లేబర్ బడ్జెట్) మెరుగ్గానే ఉపయోగించుకుంటున్నారు. పెరిగిన హాజరు మేరకు కొత్త ఏడాదిలో కేంద్రం నుంచి ఒకేసారి 22కోట్ల పనిదినాల కోసం అనుమతులు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భావిస్తోంది. గత ఏడాది 16కోట్ల పనిదినాల కోసం మొదట అనుమతులు తీసుకొని కూలీల హాజరు పెరగడంతో మరో రెండుసార్లు కేంద్ర ఆమోదాన్ని పొందారు.

కనీసం వేతనం పెరిగే అవకాశం?

నరేగాలో కూలీలకు చెల్లించే కనీస వేతనాన్ని కొత్త ఏడాదిలో పెంచే విషయాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది. వివిధ రాష్ట్రాల అధికారుల నుంచి ప్రతిపాదనలు కూడా కోరింది. ఈ ఏడాది నరేగాలో కనీస వేతనం రూ.197గా నిర్ణయించినా చాలా రాష్ట్రాల్లో లక్ష్యం చేరుకున్న దాఖలాల్లేవు. రాష్ట్రంలోనూ గరిష్ఠంగా రూ.144 వరకు కూలీలు పొందగలిగారు. నిర్దేశించిన పనులు గడువులోగా పూర్తిచేయడంతో కూలీలు కనీస వేతనాన్ని పొందే అవకాశం ఉంది. కొన్ని జిల్లాల్లో కూలీల హాజరే తక్కువ కాగా ఆపై అప్పగించిన పనులను పూర్తిచేయడానికి ఎక్కువ గడువు తీసుకోవడంతో మొత్తం పని విలువను లెక్కించినపుడు రోజువారీ వేతనం రూ.135 నుంచి రూ.144కు మించడం లేదు. ఈసారి వాతావరణ పరిస్థితులను బట్టి అవసరమైతే కూలీలు రెండు పూటలా పనిచేసేలా చూడడం, గడువులోగా పూర్తయ్యే పనులు ఎంపిక చేసేలా యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది.

ఈ ఏడాది పని దినాల లక్ష్యం	: 24.01 కోట్లు
ఇప్పటివరకు పూర్తిచేసింది	: 20.04 (83.48శాతం)
ఇప్పటివరకు చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు	: రూ.657.44 కోట్లు
వీటిలో ఉపాధి పనులకు సంబంధించినవి	: రూ.72.16 కోట్లు
మెటీరియల్ కాంపోనెంట్‌లో చేసిన పనులపై	: రూ.585.28 కోట్లు
కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ప్రకటించిన కనీస వేతనం	: రూ.197
రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం	: రూ.165
గరిష్ఠంగా ఇప్పటివరకు చేరుకున్నది	: రూ.144.06 (87.31%)



హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్‌లోగల స్వర్ణభారతి ట్రస్టులో నిర్వహించిన ఉగాది వేడుకలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఉగాది పచ్చడి తినిపిస్తున్న ఆయన మనవరాలు



ఉగాదిని పురస్కరించుకుని రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌కు ఆశీర్వచనం అందించి తిరుమల వేంకటేశ్వరస్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న తితిదే అధికారులు, ఆలయ పూజారులు

శరీరాలను అమ్మేస్తున్నా శిక్షల్లేవు!

● వీగిపోతున్న మానవ అక్రమ రవాణా కేసులు

● ఏపీలో కేవలం రెండే కేసుల్లోన్లే దోషులకు శిక్ష

ఈనాడు, అమరావతి: మానవ అక్రమ రవాణా కేసుల్లో దోషులకు శిక్షపడటం లేదు. సాటి మనుషుల శరీరాలనే అమ్మేస్తున్నా.. నిందితులు మాత్రం శిక్షల నుంచి తప్పించుకోగలుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2016 సంవత్సరంలో మానవ అక్రమ రవాణా కేసుల్లో కేవలం రెండింటిలోనే దోషులకు శిక్షలుపడ్డాయి. దీంతో తప్పు చేసినా తప్పించుకోవచ్చన్న భావనతో వ్యవస్థీకృత ముఠాలు మరింతగా చెలరేగిపోతున్నాయి. ఝార్ఖండ్, తమిళనాడు, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో ఈ తరహా కేసుల్లో శిక్షలుపడే శాతం ఏపీ కన్నా ఎంతో మెరుగ్గా ఉంది. 2016లో ఏపీలోని న్యాయస్థానాల్లో మానవ అక్రమరవాణాకు సంబంధించి మొత్తం 122 కేసులు విచారణ పూర్తికాగా...120 కేసులు వీగిపోయాయి. అదే ఏడాది ఝార్ఖండ్‌లోని న్యాయస్థానాల్లో 68 కేసుల విచారణ పూర్తికాగా... కేవలం ఏడు కేసులు మాత్రమే వీగాయి. తమిళనాడులో 128 కేసులు విచారణ పూర్తికాగా.. 59 కేసుల్లో శిక్షలుపడ్డాయి. ఏపీలో మాత్రం పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. మానవ అక్రమ రవాణా కేసుల్లో అభియోగపత్రాలు దాఖలు చేయడంలో ఏపీ పోలీసులు ముందున్నప్పటికీ.. దోషులకు కచ్చితంగా శిక్షలు పడేలా చూడటంలో మాత్రం విఫలమవుతున్నారు. ఇలాంటి కేసుల దర్యాప్తుపై శ్రద్ధ కనబరచకపోవడం, సరైన ఆధారాలను న్యాయస్థానంలో సమర్పించడంలో విఫలం కావడం, వ్యవస్థీకృత ముఠాల కార్యకలాపాలను నియంత్రించలేకపోవడం ఫలితంగా ఈ దుస్థితి తలెత్తుతోంది.

288 కేసుల్లో.. ఇద్దరికే శిక్షలు


2016 సంవత్సరానికి సంబంధించి మానవ అక్రమ రవాణా కేసుల్లో 599 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో 288 మందిపైన న్యాయస్థానాల్లో అభియోగపత్రాలను దాఖలు చేశారు. వారిలో కేవలం ఇద్దరికి మాత్రమే శిక్షలుపడ్డాయి. మిగతా 286 మందిపైన నమోదైన కేసులను న్యాయస్థానాలు కొట్టేశాయి. పోలీసుల దర్యాప్తు ఎంత ఉదాసీనంగా ఉంటుందో ఈ ఒక్క ఉదాహరణ చాలు. ఆంధ్రప్రదేశ్ నుంచి జరుగుతున్న మానవ అక్రమ రవాణా బాధితుల్లో మహిళలదే అత్యధిక శాతం. జాతీయ నేరగణాంక సంస్థ నివేదిక ప్రకారం ఈ అంశంలో తమిళనాడు, మహారాష్ట్రల తర్వాత ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో ఉంది. 2016లో దేశవ్యాప్తంగా 4,941 మంది మహిళలను వ్యభిచారం కోసం అక్రమంగా.. ఇతర ప్రాంతాలకు తరలించగా... .వారిలో 14.89 శాతం మంది ఆంధ్రప్రదేశ్ వారే ఉన్నారు. ఆ ఒక్క ఏడాదిలోనే 239 కేసులకు సంబంధించి 355 మంది మహిళలు దీని బారినపడ్డారు. వీరిలో మైనర్ బాలికలు ఉన్నారు. సమస్య తీవ్రత ఈ స్థాయిలో ఉన్నప్పటికీ శిక్షలు సరిగ్గా పడకపోతుండటం.. అక్రమరవాణా ముఠాలకు మరింత ఊతమిస్తోంది.

న్యాయాధికారి అరెస్టులో నాటకీయ పరిణామాలు

ఈనాడు, హైదరాబాద్: అనిశాకు చిక్కిన హైదరాబాద్‌లోని నాంపల్లి కార్మిక న్యాయస్థానం న్యాయాధికారి(ప్రిసైడింగ్ ఆఫీసర్) మల్లంపాటి గాంధీ అరెస్ట్‌లో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో సికింద్రాబాద్ వారాసిగూడలోని గాంధీ నివాసంపై అనిశా అధికారులు శనివారం దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. అర్ధరాత్రి దాటేంత వరకు అధికారుల సోదాలు కొనసాగాయి. ఈక్రమంలో లెక్కల్లో చూపని సుమారు రూ.3.57 కోట్ల ఆస్తుల్ని గుర్తించారు. అర్ధరాత్రి దాటాక 3 గంటల సమయంలో గాంధీని అరెస్ట్ చేస్తున్నట్లు ప్రకటించగానే ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను నేరుగా సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఆదివారం సాయంత్రం గాంధీని తార్నాకలోని అనిశా ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కె.శైలజ నివాసంలో హాజరు పరిచారు. ఈనెల 31 వరకు గాంధీకి జ్యుడిషియల్ రిమాండ్ విధించిన న్యాయమూర్తి.. అతడికి సరైన చికిత్స అందించాలని ఆదేశించారు.

పెట్టుబడి సలహాదారు అనిరుధ్ సేథీపై సెబీ నిషేధం

దిల్లీ: నమోదుకాని పెట్టుబడి సలహాదారులపై సెబీ కొరడా ఝుళిపించింది. 'ఫాతల్ అట్రాక్షన్' పథకంతో పేరు పొందిన పరిశోధనా విశ్లేషకుడు అనిరుధ్ సేథీని సెక్యూరిటీల మార్కెట్ నుంచి నిషేధిస్తున్నట్లు సెబీ ప్రకటించింది. మదుపర్ల నుంచి వసూలు చేసిన ఫీజు వెనక్కి చెల్లించాల్సిందిగా ఆదేశించింది. 2013 ఏప్రిల్ 1 నుంచి 2016 ఏప్రిల్ 20 మధ్య దేశంలోని పలు ప్రాంతాల్లో సేథీ బ్యాంక్ ఖాతాలోకి రూ.36,000 చొప్పున పలు సార్లు జమ అయ్యాయని సెబీ దర్యాప్తులో తేలింది. వెబ్‌సైట్ వివరాలు, పోస్ట్‌లు, ట్వీట్లు, బ్యాంక్ ఖాతా వివరాలు, ఆదాయపు పన్ను రిటర్న్‌లను పరిశీలించిన సెబీ.. సేథీ బ్యాంక్ ఖాతాల్లో రూ.10 కోట్లకు పైగా జమయినట్లు గుర్తించింది.




క్రో డి గు డ్లు

18న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా (ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
19వ తేదీకి...		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	317	నమక్కల్	360

32991 దిగితే మరింత దిద్దుబాటు



సమీక్ష: అంతర్జాతీయ, దేశీయ పరిణామాల నేపథ్యంలో.. గత వారం సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలు స్థిరంగా కొనసాగడం, అంతర్జాతీయ వాణిజ్య యుద్ధంపై ఆందోళనలు పెరగడం సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. యూపీ ఉపఎన్నికల్లో భాజపా పరాజయం, ఎన్‌డీఏ కూటమి నుంచి తెలుగుదేశం పార్టీ వైదొలగడం వంటి పరిణామాలు రాజకీయ అనిశ్చితికి తెరలేపాయి. సానుకూల అంతర్జాతీయ సంకేతాలు దన్నుగా నిలవడంతో ఈ వారం దేశీయ మార్కెట్లు బలంగా ప్రారంభించాయి. అమెరికా, ఉత్తర కొరియాల మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, కమొడిటీ ధరలు పెరగడం, మెరుగైన అమెరికా ఉద్యోగ గణాంకాలు ఇందుకు దోహదపడ్డాయి. భారత ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకుంటోందని ఐఎంఎఫ్ వెల్లడించడం సైతం కలిసొచ్చింది. ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి, వాణిజ్య లోటు గణాంకాలు ఆకట్టుకోవడం కూడా సెంటిమెంట్‌ను బలపరిచింది. అయితే వాణిజ్య యుద్ధ భయాలతో ప్రపంచ మార్కెట్లు మళ్లీ డీలాపడటంతో మన సూచీలూ అదే బాటలో నడిచాయి. అంగీకార పత్రాల (ఎల్‌ఓయూ) జారీని రద్దుచేయాలని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్ణయించడంతో ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు దిద్దుబాటుకు గురయ్యాయి. ఈ పరిణామాలతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 0.39 శాతం నష్టపోయి 33,176 వద్ద ముగిసింది. నిఫ్టీ 0.31 శాతం కోల్పోయి 10,195 దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐలు) నికరంగా రూ.6,288 కోట్లు, డీఐఐలు, ఫండ్లు రూ.223 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా నమోదుకావడం.. మార్కెట్లలో అప్రమత్తతను సూచిస్తోంది.

ఈవారంపై అంచనా: గత వారాన్ని బలంగా ప్రారంభించిన మార్కెట్.. 34,060 పాయింట్ల వద్ద గట్టి నిరోధాన్ని ఎదుర్కొంది. పెరిగిన ప్రతిసారీ అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో సూచీ లాభాలను పోగొట్టుకుంది. ఇటీవలి సూచీ కనిష్ఠ స్థాయి 32,991 దిగువకు చేరితే.. సమీపకాలంలో మరింత దిద్దుబాటుకు ఆస్కారం ఉంది.

ప్రభావిత అంశాలు: ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి తెదేపా వైదొలగడంతో.. తదుపరి రాజకీయ పరిణామాలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలు కీలకం కానున్నాయి. ముడిచమురు ధరలు, ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి. బంధన్ బ్యాంక్, హెచ్ఏఎల్ ఇష్యూలతో పాటు త్వరలో ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వంటి ఐపీఓల రాకతో నిధులు సెకండరీ మార్కెట్ నుంచి ప్రాథమిక మార్కెట్‌కు తరలివెళ్లే అవకాశం ఉంది. అంతర్జాతీయంగా చూస్తే.. వాణిజ్య యుద్ధం, అమెరికా రాజకీయ పరిణామాలు మార్కెట్లకు దిశానిర్దేశం చేయొచ్చు. రేపు, ఎల్లుండి (ఈనెల 20-21) జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య పరపతి సమీక్షా సమావేశాలపై మదుపర్లు కన్నేయొచ్చు. ఉద్యోగ విపణి బలపడటం, పెరుగుతోన్న ద్రవ్యోల్బణం వంటి కారణాలతో ఫెడ్ ఈ సారి వడ్డీ రేట్లు పెంచొచ్చన్న అంచనాలు ఉన్నాయి. 22న బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వడ్డీ రేట్ల నిర్ణయం నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చు.

తక్షణ మద్దతు స్థాయిలు: 32,700, 32,502, 31,994; **తక్షణ నిరోధ స్థాయిలు:** 33,580, 33,875, 34,314

32,991 పాయింట్ల దిగువకు చేరితే.. ప్రస్తుత దిద్దుబాటు మరింత కింది స్థాయిలకు వెళ్లొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ

ఏపీతో మార్కెట్‌కు బీపీ!

● అవిశ్వాస తీర్మానంతో రాజకీయ అస్థిరతపై సందేహాలు ● ఆజ్యం పోయనున్న వాణిజ్య యుద్ధ భయాలు

● నిఫ్టీ 10000 దిగువకు వచ్చే అవకాశం ● బ్యాంకింగ్, ఔషధ షేర్లకు ప్రతికూలతలు ● విశ్లేషకుల అంచనాలు

స్టాక్ మార్కెట్ ఈ వారం

ఆంధ్రప్రదేశ్ పరిణామాలు ఈవారం మార్కెట్‌కు ప్రధానంగా దిశానిర్దేశం చేయనున్నాయి. ఎన్‌డీఏ ప్రభుత్వం నుంచి బయటకు వచ్చేసిన తెదేపా నేడు లోక్‌సభలో మళ్లీ అవిశ్వాస తీర్మానాన్ని పెట్టనుంది. ఈ అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ సహా మరికొన్ని ప్రధాన పార్టీలు మద్దతు తెలపడంతో, ఈరోజు లోక్‌సభ సమావేశాలను మదుపర్లు ఆసక్తిగా గమనించనున్నారు. ఒకవేళ భాజపా, తెదేపాల మధ్య విభేదాలు సద్దుమణగకుంటే రాజకీయ అస్థిరతపై ఆందోళనలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలు కొనసాగితే మార్కెట్‌కు నష్టాలు కొనసాగుతాయని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ ఈవారం 10150 స్థాయి దిగువకు వస్తే.. మరింత డీలాపడి 9800 పాయింట్లకు పడిపోతుందని అభిప్రాయపడుతున్నారు. అలాగే ఈవారంలో జరగనున్న అమెరికా ఫెడ్ సమావేశంలో వడ్డీ రేట్లు పెంచొచ్చని భావిస్తున్నారు.

ఎఫ్ఎంసీజీ			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బ్రిటానియా	4861	4920	4810
కోల్గేట్ పామోలివ్	1044	1055	1029
డాబర్ ఇండియా	321	329	317
గోద్రేజ్ కన్జూమర్	1055	1088	1030
హెచ్‌యూఎల్	1299	1327	1267
ఐటీసీ	261	270	254

బ్యాంకింగ్			
బ్యాంకు	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
యాక్సిస్ బ్యాంక్	523	538	513
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	1853	1895	1826
ఐసీఐసీఐ బ్యాంక్	298	304	295
ఎస్‌బీఐ	252	258	247
పీఎన్‌బీ	99	104	95
యెస్ బ్యాంక్	313	320	306

ఐటీ			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హెచ్‌సీఎల్ టెక్	968	997	932
ఇన్ఫోసిస్	1172	1188	1161
టీసీఎస్	2826	2901	2767
టెక్ మహీంద్రా	635	646	622
విప్రో	296	301	289

చమురు			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
బీపీసీఎల్	448	465	434
హెచ్‌పీసీఎల్	365	378	353
ఐఓసీ	185	196	178
ఆయిల్ ఇండియా	337	344	330
ఓఎన్‌జీసీ	177	182	174
రిలయన్స్ ఇండస్ట్రీస్	900	922	875

వాహన			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
మారుతీ సుజుకీ	8677	8951	8512
ఎంఅండ్ఎం	741	759	726
హీరో మోటోకార్ప్	3546	3715	3446
బజాజ్ ఆటో	2910	2987	2852
టాటా మోటార్స్	340	358	329
టీవీఎస్ మోటార్	632	651	619

ఆయా రంగాలపై ప్రభావం చూపే పరిణామాలు, విశ్లేషకుల అంచనాలు ఇలా..

- జీఎస్‌టీ ప్రయోజనాల బదిలీ సక్రమంగా చేయడం లేదంటూ అందిన నివేదికల ఆధారంగా మరికొన్ని **ఎఫ్ఎంసీజీ** కంపెనీలపై యాంటీ ప్రాఫిటరింగ్ అథారిటీ దర్యాప్తు నిర్వహించనుంది.
- పీఎన్‌బీలో మరో మోసం వెలుగు చూడటం, కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఆర్‌బీఐ గవర్నరు ఉర్జిత్ పటేల్ హెచ్చరిక, లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్ నిషేధం లాంటివి **బ్యాంకింగ్** షేర్లపై ఒత్తిడిని మరింత పెంచొచ్చు.
- మూడు వారాల వరుస నష్టాల నేపథ్యంలో **ఐటీ** షేర్ల ధరలు ఆకర్షణీయంగా మారాయి. ఇటీవల కొన్ని రోజులుగా రూపాయి క్షీణించడం కూడా వీటికి కలిసొచ్చేదే. టీసీఎస్‌లో టాటా సన్స్ 1.6% వాటా విక్రయం, అమెరికాలో ఇన్ఫీ సాంకేతిక కేంద్రం ఏర్పాటు, హెచ్‌సీఎల్ టెక్ కూడా అభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించడం లాంటివి ఆయా షేర్లపై ప్రభావం చూపించొచ్చు.
- **చమురు** ధరలు దిగిరావడం, అదే సమయంలో గిరాకీ పెరగడం చమురు శుద్ధి కంపెనీల షేర్లకు సానుకూల పరిణామంగా చెప్పొచ్చు.
- అమెరికాలో ధరల ఒత్తిడి కొనసాగుతుండటం, దేశీయంగా అమ్మకాలు ఇంకా పుంజుకోకపోవడంతో **ఔషధ** షేర్ల విషయంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉంది. తెలంగాణలోని డాక్టర్ రెడ్డీస్ యూనిట్-3పై ఐదు అభ్యంతరాలను యూఎస్ఎఫ్‌డీఏ వ్యక్తం చేయడం షేరుపై ప్రభావం చూపించొచ్చు.
- ముడి సరకు ధరలు పెరగడంతో **వాహన** కంపెనీలు ధరలను పెంచుతాయేమోనని మదుపర్లు గమనించే అవకాశం ఉంది.
- ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై అమెరికా సుంకం పెంపు ప్రభావం **ఉక్కు** రంగ షేర్లపై కొనసాగొచ్చు. సెయిల్ ఉక్కు కడ్డీల ధరలను పెంచగా.. అల్యూమినియం ఉత్పత్తులను 3 శాతం తగ్గించింది.
- **సిమెంటు** ధరలు ప్రస్తుతం స్తబ్దుగా ఉన్నప్పటికీ.. మౌలిక సదుపాయాలు, అందుబాటు గృహ సముదాయ ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధుల కేటాయింపుతో అమ్మకాలు పెరగొచ్చని భావిస్తున్నారు. జైప్రకాశ్ అసోసియేట్స్‌లో రాకేశ్ ఝున్‌ఝున్‌వాలా కంపెనీ రేర్ ఎంటర్‌ప్రైజెస్ 2% వాటా కొనుగోలు చేయడాన్ని మదుపర్లు పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.
- **భారీ యంత్రపరికరాల** రంగ కంపెనీ భెల్ ఎన్‌టీపీసీ నుంచి రూ.11700 కోట్లు, న్యూక్లియర్ పవర్ కార్ప్ నుంచి రూ.740 కోట్ల విలువైన ఆర్డర్లు గెల్చుకుంది. రహదారి, నీటి శుద్ధి ప్రాజెక్టుల నిమిత్తం ఎల్అండ్‌టీకి కూడా రూ.2597 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చాయి.

సూచీలు			
సూచీ	ప్రస్తుతం	నిరోధం	మద్దతు
సెన్సెక్స్	33176	33901	32758
నిఫ్టీ	10195	10407	10075
బ్యాంక్ నిఫ్టీ	24490	24918	24225

ఔషధ			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
అరబిందో ఫార్మా	573	592	559
కేడిలా హెల్త్‌కేర్	379	390	372
డాక్టర్ రెడ్డీస్	2142	2247	2066
లుపిన్	762	793	745
సిప్లా	559	580	547

లోహ			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
హిందాల్కో	222	230	216
టాటా స్టీల్	600	622	583
వేదాంతా	309	321	301
జిందాల్ స్టీల్	226	236	219
హిందుస్థాన్ జింక్	315	331	304

సిమెంట్			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
ఏసీసీ	1568	1631	1521
అంబుజా సిమెంట్స్	235	246	228
ఇండియా సిమెంట్స్	147	154	143
శ్రీ సిమెంట్	16424	17381	15797
అల్ట్రాటెక్ సిమెంట్	4026	4229	3902

భారీ యంత్ర పరికరాలు			
కంపెనీ	ప్రస్తుత ధర	నిరోధం	మద్దతు
భెల్	86	90	84
సీజీ పవర్	80	85	76
ఎల్అండ్‌టీ	1269	1321	1234
థెర్మాక్స్	1155	1256	1064
సీమెన్స్	1105	1144	1078

గెయిల్‌లో ఐఓసీ, బీపీసీఎల్‌కు వాటాలు

26% చొప్పున కొనుగోలుకు అవకాశం

దిల్లీ: సహజవాయువు (గ్యాస్) వినియోగ సంస్థ గెయిల్ ఇండియాలో 26% చొప్పున వాటాలను ఐఓసీ, బీపీసీఎల్‌లు కొనుగోలు చేసే అవకాశం ఉంది. ఇందుకోసం ప్రభుత్వానికి ఒక్కో సంస్థ రూ.20,000 కోట్లకు పైగా చెల్లిస్తుందని సమాచారం. ఇందువల్ల సమీకృత ఇంధన సంస్థలుగా మారగలమని ఐఓసీ, బీపీసీఎల్ భావిస్తున్నాయి. గెయిల్‌లో ప్రభుత్వానికి ఉన్న 54.89 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు ఐఓసీ, బీపీసీఎల్‌లు ప్రత్యేక ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాయి. బీఎస్ఈలో శుక్రవారం గెయిల్ ముగింపు ధర రూ.440.85 ప్రకారం.. ప్రభుత్వ వాటా విలువ దాదాపు రూ.41,000 కోట్లు కావడం గమనార్హం.

డైరెక్టర్ల పాస్‌పోర్టు వివరాలు సేకరించండి!

దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో మోసపూరిత లావాదేవీల కేసులో నిందితులైన నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీ దేశం విడిచి పారిపోయిన నేపథ్యంలో, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరిన్ని జాగ్రత్తలు తీసుకునేందుకు సిద్ధమైంది. కంపెనీల బోర్డుల్లోని డైరెక్టర్లందరి పాస్‌పోర్టుల వివరాలు ముందుగానే సేకరించాలనే ప్రతిపాదన చేస్తోంది. రూ.50 కోట్ల కంటే ఎక్కువ రుణాలు పొందిన వారి పాస్‌పోర్టు వివరాల్ని 45 రోజుల్లోగా సేకరించాలని ఆర్థిక శాఖ ఇటీవల బ్యాంకుల్ని కోరిన సంగతి తెలిసిందే.

జీఎస్‌టీ రిటర్నులకు పొలికే లేదు

● తొలి-తుది వాటిల్లో సరిపోలుతోంది 16 శాతమే

● జులై-డిసెంబరులో ఇదీ స్థితి

దిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) కింద నమోదైన వ్యాపారులు, అమ్మకాలకు సంబంధించి దాఖలు చేస్తున్న రిటర్నుల్లో తేడాలు పెద్దఎత్తున ఉంటున్నాయి. తొలుత దాఖలు చేసిన రిటర్నుల్లో 16 శాతం మాత్రమే తుది రిటర్నులకు సరిపోలాయి. పన్ను ఎగవేతలేమైనా జరుగుతున్నాయా అనే భావనతో, 2017 జులై-డిసెంబరుకు దాఖలైన జీఎస్‌టీ రిటర్నులను రెవెన్యూ విభాగం పరిశీలించినపుడు, ఈ వివరాలు వెల్లడయ్యాయి. జీఎస్‌టీ రిటర్నుల సమాచారం ప్రకారం..

- మొత్తం 51.96 లక్షల మంది వ్యాపారుల జీఎస్‌టీ రిటర్నులను పరిశీలించారు.
- తుది రిటర్నులు (జీఎస్‌టీఆర్-3బీ) సమర్పించినపుడు, 34 శాతం మంది వ్యాపారులు రూ.34,400 కోట్ల మేర తక్కువ పన్ను చెల్లించారు. ఈ వ్యాపార సంస్థలన్నీ కలిపి చెల్లించిన పన్ను మొత్తం రూ.8.16 లక్షల కోట్లు. అయితే ఈ సంస్థలకు సంబంధించిన జీఎస్‌టీఆర్-1 పరిశీలించినపుడు, వీరు చెల్లించాల్సిన పన్ను మొత్తం రూ.8.50 లక్షల కోట్లని గుర్తించారు.
- కేవలం 16.36 శాతం సంస్థలు తొలుత దాఖలు చేసిన రిటర్నులు, తుది రిటర్నులు సరిపోలాయి. ఇవన్నీ కలిపి చెల్లించిన పన్ను మొత్తం రూ.22,014 కోట్లు.

అదనపు చెల్లింపులు రూ.91,072 కోట్లు: అయితే పన్ను అదనంగా చెల్లించిన వారూ ఉన్నారని రెవెన్యూ విభాగం గుర్తించింది. 49.36% మంది వ్యాపారులు అదనంగా రూ.91,072 కోట్లు పన్ను రూపేణ చెల్లించినట్లు తేలింది. జీఎస్‌టీ కింద వీరంతా కలిపి రూ.6.50 లక్షల కోట్లు చెల్లించారు. జీఎస్‌టీఆర్-1 పరిశీలిస్తే, వీరు చెల్లించాల్సిన మొత్తం రూ.5.59 లక్షల కోట్లు మాత్రమే.

నిశిత పరిశీలన అవసరం: వ్యాపారులు సొంతంగా దాఖలు చేసిన జీఎస్‌టీఆర్ -1లో తెలిపిన పన్ను వివరాలకు, జీఎస్‌టీఆర్-3బి దాఖలు సమయంలో చెల్లించిన వాస్తవ మొత్తాలకు తేడాను నిశితంగా విశ్లేషించాలని జీఎస్‌టీ మండలి కూడా నిర్ణయించింది. ఇదే అభిప్రాయాన్ని ఈవై భాగస్వామి అభిషేక్ జైన్ కూడా వ్యక్తం చేశారు.

రిఫండ్ సమస్యకు ఇ వాలెట్ పరిష్కారం

ఎగుమతిదార్ల ఇబ్బందులపై వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు



జీఎస్‌టీ రిఫండ్‌కు ఎక్కువకాలం పట్టడం వల్ల, నిర్వహణ నిధులకు ఇబ్బంది పడుతున్నామని ఆందోళన చెందుతున్న ఎగుమతిదార్లకు, ఇ వాలెట్ వ్యవస్థ సాంత్వన కలిగించనుందని వాణిజ్య మంత్రి సురేశ్ ప్రభు తెలిపారు. ఈ వ్యవస్థ కింద ఎగుమతిదార్ల గత చెల్లింపులను అనుసరించి, వాపసుగా వస్తుందని భావించిన నగదును వారి ఖాతాల్లో నమోదు చేస్తారు. దిగుమతులపై పన్ను చెల్లింపులకు ఈ మొత్తాన్ని వినియోగించుకోవచ్చు. ఈ కార్యాచరణ ఎలా ఉండాలనే విషయమై వాణిజ్య, ఆర్థిక మంత్రిత్వశాఖల కార్యదర్శులు పని చేస్తున్నారని మంత్రి తెలిపారు. ఇ వాలెట్ అమల్లోకి వస్తే, ఎగుమతిదార్లు వాస్తవంగా పన్ను చెల్లించాల్సిన, రిఫండ్ కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదని మంత్రి వివరించారు. రిఫండ్‌లు 8 నెలలుగా ఆలస్యమవుతున్నాయన్నది, ఈ మొత్తం రూ.20,000 కోట్లకు చేరిందన్నది ఎగుమతిదార్ల ఆందోళన. జీఎస్‌టీ వ్యవస్థ ప్రారంభానికి ముందు, వారు చెల్లించాల్సిన సుంకాల నుంచి మినహాయింపులను తొలగించేవారు. జీఎస్‌టీ వచ్చాక ఎగుమతిదార్లు ముందు పన్ను చెల్లించి, తరవాత రిఫండ్ కోరాల్సి వస్తోంది.

సంధార్ టెక్ ఇష్యూకు దరఖాస్తు చేస్కోండి

విశ్లేషకుల సిఫారసు



ముంబయి: సంధార్ టెక్నాలజీస్ తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) దరఖాస్తు చేసుకోవచ్చని విశ్లేషకులు సిఫారసు చేస్తున్నారు. ఇష్యూ నేడు (19న) ప్రారంభమై బుధవారం (21న) ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా రూ.300 కోట్ల విలువైన తాజా షేర్లతో పాటు, వాటాదారైన జీటీఐ కేపిటల్ బీటాకు చెందిన 64 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నారు. ఇందుకు ఒక్కో షేరుకు రూ.327-332ను ధరల శ్రేణిగా నిర్ణయించారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులను రుణాల చెల్లింపునకు, ఇతర సాధారణ కార్యాకలాపాలకు కంపెనీ వినియోగించనుంది.


సిఫారసు ఎందుకంటే..: సంధార్ టెక్నాలజీస్ ఐపీఓపై ఏంజెల్ బ్రోకింగ్ రీసెర్చ్ సానుకూల ధోరణితో ఉంది. ఇందుకు పలు కారణాలు చెబుతోంది. అవేమిటంటే.. తాళాలు, అద్దాలు, చక్రాలు, ఇంధన విభాగానికి మూతలు.. ఇలా వాహనాల భద్రత, రక్షణకు తోడ్పడే వివిధ రకాల విడిభాగాలను కంపెనీ తయారు చేస్తుండటం. దేశంలో 79 విడిభాగాల తయారీ సంస్థలతో చాలాకాలంగా సంబంధాలు కొనసాగిస్తుండటం. భవిష్యత్‌లో విదేశాల్లో రాణించే అవకాశం ఉండటం. .. అయితే ఇష్యూకు నిర్ణయించిన ధరల శ్రేణి ఎక్కువగా కనిపిస్తోందని, అందువల్ల దీనికి దూరంగా ఉండటమే మేలని మరో బ్రోకరేజీ సంస్థ ప్రభుదాస్ లీలాధర్ సూచిస్తోంది.

కంపెనీ నేపథ్యం ఇది..: 1987లో వ్యవస్థాపితం. దిల్లీ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తోంది. వాహనాల భద్రత, సురక్షితానికి తోడ్పడే విడిభాగాలను ఇది తయారు చేస్తోంది. దేశవ్యాప్తంగా 29 ప్లాంట్లు ఉన్నాయి. స్పెయిన్‌లో 2, మెక్సికోలో 1 చొప్పున తయారీ కేంద్రాలు ఉన్నాయి. హీరో మోటోకార్ప్స్, టీవీఎస్ మోటార్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి దిగ్గజ వాహన తయారీ సంస్థలకు ఇది వాహన విడిభాగాలను సరఫరా చేస్తోంది.

కమొడిటీస్ ఈ వారం

అమెరికా వైపు పసిడి చూపు!


● పసిడి, వెండి



పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు గతవారం రూ.30,403 వద్ద ఆరంభమైంది. ఆ తర్వాత స్వల్పంగా దిద్దుబాటుకు లోనైంది. బుధవారం కొనుగోళ్ల దన్నుతో పుంజుకొని రూ.30,546 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. అయితే ఆ స్థాయిని నిలబెట్టుకోలేకపోయింది. అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో రూ.30,145కి దిగివచ్చింది. ఆఖరుకు వారం మొత్తం మీద 0.58% నష్టంతో రూ.30,227 వద్ద ముగిసింది. ఈవారం జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశంలో వడ్డీ రేట్ల పెంపు తథ్యంలా కనిపిస్తోంది. వడ్డీ రేట్ల పెంపు ఉంటుందని ఇప్పటికే మదుపర్లు సిద్ధపడినందున, మిగతా సంవత్సరంలో పెంపు ఎన్నిసార్లు ఉంటుందనే విషయంపై ఫెడ్ చేసే వ్యాఖ్యలు పసిడి కాంట్రాక్టుకు దిశానిర్దేశం చేస్తాయి. ఈవారం పసిడి కాంట్రాక్టు రూ.30,119 దిగువకు వస్తే మరింత డీలాపడి రూ.29,977; ఆ తర్వాత రూ.29,775కి పడిపోవచ్చు.


వెండి మే కాంట్రాక్టు గతవారం రూ.38,925 ధరతో ఆరంభమైంది. రూ.39,076 స్థాయిని చేరాక దిద్దుబాటుకు లోనై రూ.38,450కి దిగివచ్చింది. చివరకు 0.87% నష్టపోయి రూ.38,587 వద్ద ముగిసింది. ఈవారం కాంట్రాక్టు రూ.38,056 దిగువకు వెళ్లకుంటే.. సానుకూలంగా చలించేందుకు అవకాశం ఉంది. అందువల్ల స్టాప్‌లాస్‌ను సవరించుకుంటూ లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అదే రూ.38,056 స్థాయి దిగువకు వస్తే రూ.37,740కి పడిపోయే ఆస్కారం ఉంది.

● ప్రాథమిక లోహాలు




రాగి ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.456 కంటే పైన కదలాడకుంటే పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లాలి. షార్ట్ సెల్ పొజిషన్లు కూడా కొనసాగించొచ్చు. అయితే రూ.458.80 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణిస్తూ.. కాంట్రాక్టు ధర తగ్గుతున్న కొద్దీ దీన్ని సవరించుకుంటూ రావాలి. సీసం మార్చి కాంట్రాక్టుకు ఈవారం తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. అందువల్ల రూ.151 స్థాయి నుంచి లాంగ్ పొజిషన్లు తీసుకోవడం మంచిదే. జింక్ మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.207.65 స్థాయి దిగువకు వస్తే.. షార్ట్ సెల్ పొజిషన్లు కొనసాగించొచ్చు. కొత్తవి కూడా జత చేసుకోవచ్చు. అయితే రూ.204.85 స్థాయికి దిగివచ్చాక లాభాలు స్వీకరించడం మంచి వ్యూహం అవుతుంది. అక్కడ నుంచి లాంగ్ పొజిషన్లు కూడా తీసుకోవచ్చు. అల్యూమినియం మార్చి కాంట్రాక్టుకు రూ.133 స్థాయి వద్ద నిరోధం కనిపిస్తోంది. ఈ స్థాయిని అధిగమిస్తే మరింత పైకి వెళ్లే అవకాశం ఉంది. నికెల్ మార్చి కాంట్రాక్టు రూ.876.50 దిగువన చలిస్తే, రూ.867.60; ఆ తర్వాత రూ.853 స్థాయిల వరకు పడిపోవచ్చు.

● ఇంధన రంగం



గత నాలుగు వారాలుగా ముడి చమురు కాంట్రాక్టు రూ.3,910- 4,161 శ్రేణిలో చలిస్తోంది. ఈవారం మార్చి కాంట్రాక్టు గడువు తీరిపోనున్నందున, ఈ శ్రేణి నుంచి బయటకు రావడంపైనే మున్ముందు కదలికలు ఆధారపడి ఉన్నాయి. ఒకవేళ ఈ శ్రేణికే కాంట్రాక్టు పరిమితమైతే.. రూ.3,921 ఎగువన లాంగ్ పొజిషన్లు కొనసాగించదలిచిన వారు రూ.3,866 వద్ద స్టాప్‌లాస్ పెట్టుకోవాలి. అదే రూ.4,158 దరిదాపులో షార్ట్ సెల్ పొజిషన్లు తీసుకున్నవారు రూ.4,216 వద్ద స్టాప్‌లాస్‌ను పరిగణించాలి. ఏప్రిల్ కాంట్రాక్టు విషయానికొస్తే కనీసం ఒక రోజైనా కాంట్రాక్టు రూ.3,975 దిగువన చలిస్తే మరింత డీలాపడి రూ.3,871కి పడిపోయే అవకాశం ఉంది. సహజ వాయువు ఏప్రిల్ కాంట్రాక్టుకు ఈవారం లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అయితే 3 వారాలుగా లాభాలొచ్చినందున లాభాల స్వీకరణకూడా చోటుచేసుకోవచ్చు.

● వ్యవసాయ ఉత్పత్తులు



గత మూడు వారాల వరుస నష్టాల నేపథ్యంలో సెనగలు ఏప్రిల్ కాంట్రాక్టుకు ఈవారం కొనుగోళ్ల మద్దతు లభించొచ్చు. ధనియాలు ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.5,319 ఎగువన నిలదొక్కుకోకుంటే రూ.5,291 వరకు దిద్దుబాటు అయ్యే అవకాశం ఉంది. గోరు చిక్కుడు ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.4,141 స్థాయి దిగువన కదలాడకుంటే కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు.

–ఆర్ఎల్‌పీ కమొడిటీ& డెరివేటివ్స్

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఏప్రిల్)	452.65	448.90	(0.83)
సీసం (మార్చి)	155.30	155.25	(0.03)
జింక్ (మార్చి)	213.25	209.90	(1.57)
అల్యూమినియం(మార్చి)	137.05	134.90	(1.57)
నికెల్ (మార్చి)	892.40	883.20	(1.03)
ముడి చమురు (ఏప్రిల్)	4,042	4,067	0.62
సహజ వాయువు (ఏప్రిల్)	181	178.20	1.55
సెనగలు (ఏప్రిల్)	3,721	3,780	1.59
ధనియాలు (ఏప్రిల్)	5,502	5,371	(2.38)
గోరు చిక్కుడు (ఏప్రిల్)	4,255	4,280	0.59

గాడి 'తుప్పు'తున్న తాగునీరు!


విశాఖపట్నం పాత నగరంలో మురుగుకాలువల్లో నుంచి తాగునీటి పైపులైన్లు

ఈనాడు - అమరావతి

పట్టణ ప్రాంతాల్లో అతిసారం విజృంభిస్తోంది. రోజూ ఉదయమే వార్డుల్లో/డివిజన్లలో తిరిగి ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన కమిషనర్లలో చిత్తశుద్ధి లోపిస్తోంది. 13 నగరపాలక సంస్థల్లో సగం మందే రోజూ వార్డు పర్యటనకు వెళుతున్నారు. వీరిలోనూ మళ్లీ నలుగురు ప్రధాన వీధులకే పరిమితమై మురికివాడలు, శివారు ప్రాంతాల జోలికి పోవడం లేదు. మిగిలిన వారిలో మరో నలుగురు కమిషనర్లు మూడు రోజులకోసారి వార్డుల్లోకి వెళ్లడం గగనమవుతోంది. 83 పురపాలక సంఘాల్లో రోజూ విధిగా వార్డుల్లో తిరిగే కమిషనర్లు 63 శాతమే. వీరిలోనూ 18 శాతం మంది తూతూమంత్రంగా వార్డు పర్యటనలు నిర్వహిస్తున్నారు. మిగతా 37 శాతం మందిలో 15 మంది కమిషనర్లు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. మరో 8 మంది కమిషనర్లు ఉన్నతాధికారులు తనిఖీలు చేస్తున్నా ఫలితం లేకపోతోంది. కమిషనర్ల ఉదాసీనతతో క్షేత్రస్థాయిలోని అధికారులు, ఉద్యోగుల నుంచి కార్మికుల వరకు ఇదే దారి. గుంటూరులోని ఆనందపేట, సంగడిగుంటలో చిన్న సమస్య అయినా సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోని

- గుంటూరులో ఈ నెల 3న ప్రబలిన అతిసారంతో ఐదు రోజుల వ్యవధిలో 18 మంది మృతి చెందారు. 500 మందికిపైగా విరేచనాలు, వాంతులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరారు. రెండు డివిజన్లలో ప్రారంభమైన ఈ సమస్య క్రమంగా పది డివిజన్లకు విస్తరించి ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేసింది.
- విజయవాడలోని భవానీపురంలో వారం రోజుల క్రితం అతిసారంతో తీవ్ర అస్వస్థతకు గురైన ఏడుగురికి సకాలంలో వైద్యం అందించడంతో ప్రాణాలతో బయటపడ్డారు. వన్‌టౌన్‌లోని కేవీఆర్ నగర్‌కు చెందిన ఒకరు కలుషిత నీటిని సీసాలో పట్టుకొచ్చి విజయవాడ నగరపాలక సంస్థ (వీఎంసీ) కమిషనర్‌కు చూపించి గోడు వెళ్లబోసుకున్నారు. ఈ నీటిని తాగి ప్రజలు అస్వస్థతకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. కాలువల్లో కలిసిన 40 ఏళ్ల క్రితం నాటి పైపులకు ఏర్పడిన రంధ్రాల్లోకి మురుగు నీరు వెళ్లి కలుషితమవుతోంది. ఇదే నీటిని తాగడంతో గుంటూరులో మరణాలతోపాటు వందల సంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురయ్యారు. విజయవాడ మొదటి పట్టణ పరిధిలోని రెండు, మూడు వార్డుల్లో ఇలాంటి సమస్యే ఉంది. పైపుల్లోకి చేరుతున్న మురుగు నీటిని ప్రజలు తాగి అనారోగ్యానికి గురవుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం..

నగరపాలక సంస్థలు/పురపాలక సంఘాల్లో వివిధ విభాగ అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపమవుతోంది. పారిశుద్ధ్యం, తాగునీటి నిర్వహణలో ప్రజారోగ్య, ఇంజినీరింగ్ విభాగాలది ప్రధాన పాత్ర. ఇరు అధికారులు, ఆటు ఇంజినీర్లు ఎవరికి వారే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మురుగు కాలువల్లో నుంచి తాగునీటి పైపులు వెళుతున్న విషయం తెలిసినా ప్రజారోగ్య సిబ్బంది పట్టించుకోరు, కాలువల్లో నుంచి పైపులు బయటకు తొలగించి ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్న ఆలోచన ఇంజినీర్లు చేయరు. రాష్ట్రంలోని 238 మురికివాడల్లో ఈ సమస్య అత్యంత తీవ్రంగా ఉంది. గుంటూరులో మృతుల సంఖ్య పెరిగి పెద్ద సంఖ్యలో ప్రజలు అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరడానికి ఇదే ప్రధాన కారణం. విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమహేంద్రవరం, కర్నూలు, అనంతపురం నగరపాలక సంస్థల్లో, మరో ఏడు జిల్లా కేంద్ర పురపాలక సంఘాల్లోనూ అధికారుల మధ్య సమన్వయ లోపం ఉంది.

పాలకవర్గాలదీ అదే దారి..

ప్రజలు మెచ్చేలా ముందే కార్పొరేటర్లు/కౌన్సిలర్లు వీధుల్లో ఉండాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలు అత్యధిక పట్టణాలు, నగరాల్లో అమలు కావడం లేదు. పురపాలక ఎన్నికల సందర్భంలో అధ్యక్షుడి హోదాలో చంద్రబాబు తెదేపా తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులతో ఉదయాన్నే వార్డుల్లో తిరుగుతామని ప్రజల మధ్య ప్రమాణాలు చేయించారు. ఎన్నికైన కార్పొరేటర్లు/కౌన్సిలర్లలో చాలామంది ఇవేవీ పట్టడం లేదు. ముఖ్యమైన నగరాల్లో కొందరు కార్పొరేటర్లు కమిషన్లు దండుకోవడంపైనే దృష్టి పెడుతున్నారు. రాష్ట్రంలోని ముగ్గురు మేయర్లు, మరో 58 పురపాలక సంఘాల ఛైర్మన్లు/వైస్‌ఛైర్మన్లు సొంత లాభం చూసుకోవడమే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. మేయర్లలో వార్డుల్లో తిరిగే వారిని వేళ్లపై లెక్కించే పరిస్థితి.

'ఈనాడు' గతేడాదే హెచ్చరించింది.



నాలుగు దశాబ్దాల కిందటి తుప్పుపట్టిన తాగునీటి పైపుల కారణంగా గుంటూరు ప్రజలకు అనారోగ్యం ముప్పు పొంచి ఉన్న విషయాన్ని 2017 అక్టోబరు 22న 'మంచినీటికి 'తుప్పు' ముప్పు' శీర్షికతో ఈనాడు ప్రధాన పత్రిక వెలుగులోకి తెచ్చింది. నిధుల కొరత పేరుతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్న తీరును మళ్లీ 29న 'మిగులుస్తా ...తెగులే' శీర్షికతో ప్రత్యేక కథనాన్ని ప్రచురించినా అధికారులు తేలిగ్గా తీసుకున్నారు. 'ఈనాడు'లో కథనాలు వెలువడిన వెంటనే, గంటూరులో సమస్య వెలుగులోకి వచ్చిన తక్షణమే స్పందిస్తే భారీ ప్రాణనష్టం తప్పేది. జనసేన అధ్యక్షుడు అతిసార మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్నారని తెలియగానే చుట్టు పక్కల జిల్లాల నుంచి 8 మంది కమిషనర్లు, ఇతర అధికారులు, సిబ్బందిని గుంటూరు తీసుకొచ్చి అతిసార ప్రభావిత ప్రాంతాలకు పంపారు.

అదుపులోకి అతిసారం

'గుంటూరు'లో అతిసారం అదుపులోకి వచ్చింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతున్నాం. 128 కిలోమీటర్ల పొడవునా పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి వేస్తున్నాం. 4న సంఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే అప్రమత్తమయ్యాం. పది వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి అస్వస్థతకు గురైన వారందరికీ వైద్యం అందించాం. మెరుగైన వైద్య సేవల కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాం. ఇక్కడ వెళ్లే పైపుల్లో మురుగు నీరు కలవడంతో అతిసారం ప్రబలింది. ప్రాథమికంగా అంచనాకు వచ్చాక దెబ్బతిన్న పైపులైన్లన్నీ మార్చేలా ఏర్పాట్లు చేశాం. ప్రజలందరికీ స్వచ్ఛమైన నీటిని అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఘటన తర్వాత మిగతా నగరపాలక, పురపాలక సంఘాల్లోనూ దెబ్బతిన్న పైపులైన్ల పరిశీలన, మురుగునీరు పైపుల్లోకి వెళ్లే పరిస్థితి ఉన్న చోట వెంటనే కొత్త పైపులు వేసేలా అధికారులకు ఆదేశాలిచ్చాం.

– కరికల్ వలెవన్, ముఖ్య కార్యదర్శి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ

పురపాలక సంఘాల్లో పరిస్థితి..

- 97 పురపాలక సంఘాల్లో తాగునీటి పైపు లైన్ల పొడవు: 3,800 కిలోమీటర్లు
- వీటిలో 35 ఏళ్ల క్రితం నాటివి: 2,273 కిలోమీటర్లు
- పాతవాటి స్థానంలో ఇప్పటి వరకు కొత్తగా వేసినవి: 322 కిలోమీటర్లు
- శాశ్వత పరిష్కారం కోసం అవసరమయ్యే నిధులు: రూ.1,280 కోట్లు

నగరపాలక సంఘాల్లో..

- 13 నగరపాలక సంస్థల్లో తాగునీటి పైపులైన్ల పొడవు: 2,635 కిలోమీటర్లు
- వీటిలో 40 ఏళ్ల క్రితం నాటి పైపులైన్లు: 1,348 కిలోమీటర్లు
- పాతవాటి స్థానంలో ఇప్పటివరకు కొత్తగా వేసినవి: 522 కిలోమీటర్లు
- సమస్య శాశ్వత పరిష్కారం కోసం అవసరమైన నిధులు: రూ.4,982 కోట్లు

పురపాలక సంఘాలు/ నగరపాలక సంస్థల్లో నీటి సరఫరా తీరు..

- రోజూ రెండు పూటలా నీళ్లు సరఫరా చేస్తున్నవి : 25
- రోజులో ఒకసారి నీళ్లు అందిస్తున్నవి : 62
- రెండు రోజులకోసారి నీళ్లు సరఫరా చేస్తున్నవి : 9
- మూడు రోజులకోసారి నీళ్లు ఇస్తున్నవి : 1
- రోజూ తలసరి 135 లీటర్లకుపైగా నీళ్లు సరఫరా చేస్తున్నవి : 9
- 70 లీటర్ల నుంచి 135 లీటర్ల మధ్య అందిస్తున్నవి : 64
- 70 లీటర్ల కంటే తక్కువ సరఫరా చేస్తున్నవి : 37

ఏపీ సెట్ నోటిఫికేషన్ విడుదల

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: రాష్ట్ర అర్హత పరీక్ష (ఏపీ సెట్) నోటిఫికేషన్ ఆదివారం విడుదలైంది. ఈ నెల 26 నుంచి ఆన్‌లైన్‌లో అర్హత పరీక్ష దరఖాస్తులు చేయవచ్చునని ఏపీసెట్ సభ్య కార్యదర్శి ఆచార్య కె.శ్రీనివాసరావు తెలిపారు. మే 2 వరకు అపరాధ రుసుం లేకుండా, రూ.5వేల అపరాధ రుసుంతో జూన్ 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందన్నారు. అర్హత పరీక్ష దరఖాస్తు రుసుం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలన్నారు. జనరల్ అభ్యర్థులకు రూ.1,000, బీసీ అభ్యర్థులకు రూ.800, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు అభ్యర్థులు రూ.500 చెల్లిస్తే సరిపోతుందన్నారు. అర్హత పరీక్ష జులై 1న జరుగుతుందన్నారు. మొత్తం 31 సబ్జెక్టుల్లో, ఆరు ప్రాంతీయ కేంద్రాల్లో పరీక్ష జరుగుతుందనితెలిపారు. andhrauniversity.edu.in, apset.net.in వెబ్‌సైట్‌లలో సమాచారం అందుబాటులో ఉంచామన్నారు.

నీటి ఎద్దడిని పరిష్కరించాలి

అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన గ్రామాల్లో తాగునీటి సమస్యపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో సమస్య తీవ్రత దృష్ట్యా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. మిగతా జిల్లాల్లోనూ సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రకాశం జిల్లాలో నీటి ఎద్దడి దృష్ట్యా అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్య తక్షణ పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాలకు ట్యాంకులు పంపడం, ఆధునిక సాంకేతికతను ఉపయోగించి పర్యవేక్షించే ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. జలవాణి కాల్ సెంటర్‌కు వచ్చే సమస్యలతోపాటు తాగునీటి ఇబ్బందులపై పత్రికల్లో వచ్చే కథనాలపైనా వెంటనే స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని సాధికార మిత్రలకూ జలవాణి కాల్ సెంటర్‌పై అవగాహన కల్పించాలని, పశువులకు సైతం తాగునీటి సమస్య లేకుండా చూడాలని మంత్రి సూచించారు.

'మోదీ ముక్త భారత్'కు రాజ్‌థాకరే పిలుపు

ముంబయి: మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన(ఎంఎన్‌ఎస్) సారథి రాజ్‌థాకరే ఆదివారం కేంద్రప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 2019 నాటికల్లా 'మోదీ ముక్త భారత్'(మోదీ రహిత భారత్) ఉండాలంటూ పిలుపునిచ్చారు. భాజపా సారథ్యంలోని ఎన్‌డీఏ సర్కారును వదిలించుకునేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకం కావాలన్నారు. శివాజీ పార్క్‌లో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.

ఉగ్రవాదాన్ని పాక్ గట్టిగా నిలువరించాలి: అమెరికా

వాషింగ్టన్: తాలిబన్, తదితర తీవ్రవాద సంస్థలకు వ్యతిరేకంగా పాకిస్థాన్ మరింత కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలంటూ పాకిస్థాన్‌కు అమెరికా సూచించింది. ఒకవేళ పాకిస్థాన్ కనుక సీమాంతర ఉగ్రవాదాన్ని ఇలాగే ఉపేక్షిస్తూ ఉంటే...మాత్రం ట్రంప్ సర్కారు ఏకపక్ష చర్యలకు దిగడం ఖాయమని గట్టిగా హెచ్చరించింది. అందుకే, సీమాంతర ఉగ్రవాద దాడులను నిలువరించేందుకు పాక్ చిత్తశుద్ధితో కృషిచేయాలన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్, పాక్ ప్రధాని షాహిద్ ఖకాన్ అబ్బాసీల మధ్య చర్చల అనంతరం శ్వేత సౌధం నుంచి ఈ మేరకు ఓ అధికారిక ప్రకటన వెలువడింది. పాకిస్థాన్ దినపత్రిక 'డాన్' ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికాలో ఉంటున్న తన సోదరి అనారోగ్యంగా ఉండటంతో ఆమెను చూడటానికి వెళ్లిన అబ్బాసీ ఉపాధ్యక్షుడు పెన్స్‌ను కలుసుకున్నారు. అబ్బాసీ అభ్యర్థన మేరకు పెన్స్ అధికారిక నివాసంలో వారు ఉభయులు శనివారం సమావేశమైనారు.

దౌత్యవేత్తలపై వేధింపులకు నిరసనగా పాక్‌కు భారత్ లేఖ

దిల్లీ: తమ దౌత్యవేత్తలపై వేధింపులకు నిరసనగా పాకిస్థాన్‌కు భారత్ ఆదివారం మరో లేఖ పంపింది. ఇలాంటి లేఖ(నోట్ వెర్బల్)ను పంపడం గత మూడు నెలల్లో ఇది 13వసారి. పాక్ విదేశాంగ శాఖకు భారత హైకమిషన్ దీన్ని అందించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. వేధింపులకు సంబంధించి మూడు ఘటనలను దీనిలో ఉదహరించినట్లు పేర్కొన్నాయి. వీటిలో ఓ ఉన్నతాధికారిని గుర్తుతెలియని వ్యక్తులు కారులో వెంబడించిన ఘటన కూడా ఉంది. దీనికి సంబంధించి మొబైల్‌లో చిత్రీకరించిన వీడియోను సమర్పించినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు నలుగురు హైకమిషన్ అధికారులు ఆబ్‌పారా మార్కెట్‌కు వెళ్లినప్పుడు ఇద్దరు ద్విచక్రవాహనాలపై వెంబడించిన ఘటన గురించీ లేఖలో ప్రస్తావించారన్నారు. భారత హైకమిషన్ వెబ్‌సైట్‌ను బ్లాక్‌చేస్తూ అసౌకర్యం కలిగిస్తున్న ఘటన గురించీ ప్రస్తావించినట్లు చెప్పారు. ఈ అంశాలపై లోతుగా విచారణ చేపట్టాలని కోరినట్లు వెల్లడించారు.


శ్రీవారి ఆలయ ధ్వజస్తంభానికి మొక్కుతున్న ఉపముఖ్యమంత్రి కేఈ

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచడమే లక్ష్యం: డాక్టర్ రఘురాం

ఈనాడు, హైదరాబాద్: భారతదేశ మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు ప్రముఖ రొమ్ము శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ రఘురాం అన్నారు. ఇండో యూకే రొమ్ము సర్జన్ల ఫోరం ఆధ్వర్యంలో యూకేలోని బర్మింగ్‌హామ్‌లో రొమ్ము శస్త్రచికిత్సల్లో చోటుచేసుకుంటున్న అత్యాధునిక మార్పులపై శనివారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రొమ్ము శస్త్రచికిత్సల్లో యూకేలో నైపుణ్యం సాధించినా, మాతృభూమిపై మమకారంతో భారత్‌లో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ భారత్‌తో రొమ్ము క్యాన్సర్‌ను నివారించడంలో అనేక సవాళ్లు ఎదురవుతున్నాయనీ, వాటిని ఎదుర్కొంటూ లక్ష్యసాధన దిశగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు.

గడ్డిఅన్నారం మార్కెట్‌లో రెండు రోజులు విక్రయాలు బంద్

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ యార్డులో ఈ నెల 20, 21వ తేదీల్లో కమీషన్ వ్యాపారుల సమ్మె కారణంగా రెండు రోజుల పాటు క్రయవిక్రయాలు జరగవని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పుటం పురుషోత్తంరావు, ఎస్‌జీఎస్ వెంకటేశం తెలిపారు. సమ్మె దృష్ట్యా రైతులు గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్‌కు మంగళ, బుధవారాల్లో ఉత్పత్తులను(పండ్లను) తీసుకురావద్దని కోరారు. 22వ తేదీ నుంచి తిరిగి క్రయవిక్రయాలు కొనసాగుతాయన్నారు.


లొంగిపోయిన మహిళా మావోయిస్టు సుందరమ్మకు చెక్కు అందిస్తున్న ఎస్పీ త్రివిక్రమవర్మ

మహిళా మావోయిస్టు సుందరమ్మ లొంగుబాటు

అరసవల్లి, న్యూస్‌టుడే: మావోయిస్టు పార్టీ ఏవోబీ ఏరియా దళ సభ్యురాలు ఇరోతు సుందరమ్మ అలియాస్ సాధన అలియాస్ సింధు ఆదివారం శ్రీకాకుళం జిల్లా ఎస్పీ త్రివిక్రమవర్మ ముందు లొంగిపోయారు. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం గ్రామానికి చెందిన సుందరమ్మ 2002లో నక్సలైట్లలో చేరారు. పార్టీ సభ్యురాలి నుంచి ఏసీఎం స్థాయికి చేరుకున్నారు. విజయనగరం జిల్లా కొండబారిడి ఏరియాలో దళం సభ్యురాలిగా మొదలుపెట్టి గొట్టా, దేరువాడ ఏరియా కమిటీల్లో పనిచేశారు. దమనజోడి నాల్కో సంస్థపై దాడి చేసిన ఘటనలో, ఒడిశాలోని నారాయణపట్నం బ్లాక్‌లో పాలూరు దాడిలో పాల్గొన్నారు. కొంతకాలంగా మావోయిస్టు పార్టీలో అంతర్గత కలహాలు, సైద్ధాంతిక విభేదాల వల్ల పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనడం లేదు. హైకమాండ్ ఆదేశాల మేరకు తిరిగి పార్టీలో చేరినా ఆరోగ్యం సహకరించక ఆదివారం లొంగిపోయారు. సుందరమ్మపై రూ.4 లక్షల రివార్డు ఉంది. దీన్ని ప్రభుత్వం నుంచి ఇప్పించనున్నట్లు ఎస్పీ హామీ ఇచ్చారు. రూ.5 వేల చెక్కును ఆమెకు అందజేశారు.

నిరాధార ఆరోపణలు మానుకోవాలి

- పవన్‌కల్యాణ్ పంథా మార్చుకోవడం వెనుక ప్రయోజనాలు బహిర్గతం చేయాలి: మంత్రి గంటా

వన్‌టౌన్(విశాఖపట్నం), న్యూస్‌టుడే: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నిరాధార ఆరోపణలు మానుకోవాలని మంత్రి గంటా శ్రీనివాసరావు హితవు పలికారు. ఆదివారం విశాఖ నగరంలోని తెదేపా కార్యాలయంలో.. ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్లపాటు తెదేపాతో కొనసాగి, ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందుతోందని వల్లెవేసిన పవన్ కల్యాణ్ ఒక్కసారిగా పంథా మార్చుకోవడం వెనుక ప్రయోజనాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జనసేన ఆవిర్భావ సభలో.. ప్రధాని మోదీ వ్యవహారశైలి, ఏపీ పట్ల భాజపా వైఖరిపై కానీ ఆయన రెండు మాటలైనా మాట్లాడలేదని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రయోజనాల నేపథ్యంలోనే 2014లో భాజపాతో కలిసి ఎన్నికలకు వెళ్లామన్నారు. కేంద్రం ఏదో చేస్తుందని నాలుగేళ్లపాటు ఎదురు చూసినా చివరకు రిక్తహస్తమే ఎదురైందన్నారు. దీంతో ఎన్‌డీఏ కూటమి నుంచి వైదొలగుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని ఆయన చెప్పారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంటా, చిత్రంలో ఎంపీ అవంతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు

కేంద్రంపై తెదేపా ప్రవేశపెట్టనున్న అవిశ్వాస తీర్మానికి పలు రాజకీయపక్షాల నుంచి మద్దతు లభించిందని ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. ఈ నెల 19న మళ్లీ లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నామని, ఇంతవరకూ 150 మంది ఎంపీల మద్దతు లభించిందన్నారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌తో కూడిన చర్చకు అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విషయాన్ని స్పీకరు దృష్టికి తీసుకెళ్లామన్నారు. సెంటిమెంట్‌తో డిమాండ్లు నెరవేరవని కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ అనడాన్ని ఎంపీ తప్పుబట్టారు.

నాలుగేళ్లు ఎదురుచూసినా ఆశాభంగమే

విభజనతో నష్టపోయిన రాష్ట్రానికి కేంద్రం న్యాయం చేస్తుందని నాలుగేళ్లపాటు ఎదురుచూసినా ఆశాభంగమే ఎదురైందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆదివారం విశాఖ జిల్లా నర్సీపట్నంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలను సక్రమంగా అమలుచేయకుండా. ఎంగిలిమెతుకులు విదిల్చినట్టుగా కేంద్రం వ్యవహరించిందని మంత్రి అయ్యన్నపాత్రుడు ధ్వజమెత్తారు. ఈ వివక్షను నిరసిస్తూ కేంద్రమంత్రివర్గం నుంచి తెదేపా నేతలు వైదొలగిన తర్వాత కక్షసాధింపునకు పాల్పడుతోందని ఆయన ఆరోపించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రెన్నెళ్ల క్రితంవరకు తెదేపా పాలనను మెచ్చుకొని ప్రస్తుతం మాటమార్చారని.. పార్టీ ఆవిర్భావ సభలోనూ సీఎం చంద్రబాబుపై ఆయన విమర్శలు చేశారన్నారు. తెదేపాని ఏమీ చేయలేక అవగాహనలేని వ్యక్తుల చేత ప్రధాని నరేంద్రమోదీ తిట్టించడం తగునా? అని ప్రశ్నించారు. మోదీ మిత్రధర్మం మర్చిపోయారన్నారు. దేశప్రధానిగా ఉన్న ఆయన రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని మంత్రి అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరిచి ఆంధ్రప్రదేశ్‌కు మేలు చేయాలని ఆయన కోరారు.

అజ్ఞానంగా మాట్లాడుతున్న అజ్ఞాతవాసి

ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వ్యాఖ్య

తిరుమల, న్యూస్‌టుడే: అజ్ఞాతవాసి అజ్ఞానంగా మాట్లాడుతున్నారంటూ జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌నుద్దేశంచి ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి వ్యాఖ్యానించారు. ఉగాది సందర్భంగా తిరుమల శ్రీవారిని ఆదివారం ఆయన దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు దేవదేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. పలువురు ప్రధానమంత్రులను ఎంపిక చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. కేంద్ర ప్రభుత్వంపై తాము అవిశ్వాస తీర్మానం ప్రకటించిన గంట వ్యవధిలోనే దేశవ్యాప్తంగా 16 పార్టీలు మద్దతు తెలిపాయంటే తెదేపా ఘనత అర్థమవుతుందన్నారు. రాష్ట్రంలో పరిణామాలను ప్రజలు గమనిస్తున్నారని, నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రికి తిరిగి పట్టంకడతారనే విశ్వాసం వ్యక్తం చేశారు.

వైకాపా భాజపాకు దగ్గరకావడం నీతి బాహ్యం: ఆర్థిక మంత్రి యనమల

ఈనాడు, అమరావతి: రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ భాజపా, వైకాపాల మధ్య వారధిలా మారారని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆరోపించారు. భాజపా సమావేశంలో ప్రశాంత్ కిషోర్ పాల్గొనడంతో 2019 ఎన్నికల్లో భాజపా, వైకాపాలు కలిసి పోటీచేస్తాయనేది తేటతెల్లమైందన్నారు. ఆర్థిక నేరాల స్వభాగం కలిగిన వైకాపాకు భాజపా దగ్గరకావడం నీతిబాహ్యమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఆంధ్రులను ఇబ్బందిపెడితే భాజపాలో తిరుగుబాటు తప్పదు: బుద్ధా వెంకన్న

విజయవాడ సబ్‌కలెక్టరేట్, న్యూస్‌టుడే: వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా, ఎన్డీఏకు ఛైర్మన్‌గా వ్యవహరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తన బాధ్యతలను ఎంతో సమర్థంగా నిర్వహించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో భాజపా ఎంపీలు తిరుగుబాటు చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆదివారమిక్కడ పేర్కొన్నారు. లోక్‌సభలో తొలుత వైకాపా ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానానికి పెద్దగా మద్దతు లభించలేదని, తెదేపా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి ఒక గంటలోనే వివిధ పార్టీలకు చెందిన 151 మంది ఎంపీలు మద్దతు తెలిపారని పేర్కొన్నారు. వైకాపా వ్యూహకర్తగా వ్యవహరిస్తున్న ప్రశాంత్ కిషోర్, భాజపా సమావేశానికి హాజరు కావడం చూస్తే ఆయన వైకాపా, భాజపాలకు అనుసంధానకర్త పాత్ర పోషిస్తున్నట్లుగా ఉందన్నారు. దేశంలోని ఎంపీలందర్నీ కూడగడతానని పవన్ చెబుతున్నారని, ఏపీలోని ఇద్దరు భాజపా లోక్‌సభ సభ్యుల మద్ధతును మీరు పొందగలరా? అని ప్రశ్నించారు.

పరిహారంలో ఎందుకీ వ్యత్యాసం

- అసైన్డ్ రైతుల సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో గళమెత్తక తప్పదు
- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ఉద్దండరాయునిపాలెం(తుళ్లూరు), న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా భూములిచ్చిన రైతులకు పరిహారం విషయంలో ఎందుకు తేడా వచ్చిందని జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం, లింగాయపాలెం గ్రామాల్లోని లంక భూములను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్దండరాయునిపాలెంలో రైతులు చెప్పిన సమస్యలు ఆలకించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన వారికి ఎకరానికి 1450గజాల వంతున పరిహారం అందజేసిన సర్కారు.. లంక భూముల అసైన్డ్ రైతులకు 600 గజాలే ఇస్తామంటూ అన్యాయం చేస్తోందని పవన్‌కల్యాణ్‌కు వివరించారు. పట్టా భూములకు సమానంగా పరిహారం ఇప్పించాలని కోరారు. దీనిపై పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ పంజాబ్‌లోని చండీగఢ్, గుజరాత్‌లోని గాంధీనగర్ ప్రాంతాలు విడతల వారీగా అభివృద్ధి చెందాయన్నారు. రాత్రికి రాత్రి విభజనతో నష్టపోయినందున తక్షణమే రాజధానిని నిర్మించుకోవాలన్న తపన ఉండటం సహజమన్నారు. ఒకప్పుడు ఇవి పచ్చని భూములని.. ఒక్కసారిగా బీడుగా మారి అనేక మంది ఉపాధి కోల్పోయారని తెలిపారు. అభివృద్ధి అందరికీ చెందాలని, పట్టాభూములకు ఇచ్చినట్లే అసైన్డ్ భూముల రైతులకూ ప్రభుత్వం పరిహారమిచ్చి న్యాయం చేయాలన్నారు.. ఈ విషయంలో జ్యుడీషియల్ విచారణ, లేదా ఉన్నతస్థాయి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న ఎన్నికల్లో గళమెత్తక తప్పదని హెచ్చరించారు. రాజధాని నిర్మాణానికి మరో రెండు దశాబ్దాల కాలం పట్టే అవకాశం ఉన్నందున.. మాస్టర్ ప్లాన్‌పై రాజకీయ పక్షాలన్నీ చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. రాజధాని విశ్వనగరంగా అభివృద్ధి చెందాలంటే మన మధ్య కులాల గొడవ లేకుండా చూడాలని పవన్ సూచించారు.


కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ నుంచి అవార్డు అందుకుంటున్న రామకృష్ణ

ప్రకాశం రైతుకు ఐఏఆర్ఐ-ఐసీఏఆర్ డిగ్రీ

ఈనాడు, దిల్లీ: ప్రకాశం జిల్లాకు చెందిన రైతు కట్టా రామకృష్ణ జాతీయస్థాయిలో గుర్తింపు సాధించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్), భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐఏఆర్ఐ)ల నుంచి ఫెలో(అవుట్‌స్టాండింగ్ డిగ్రీ) సాధించారు. దిల్లీలో మూడు రోజులుగా ఐసీఏఆర్-ఐఏఆర్ఐ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న కృషి ఉన్నతి మేళాలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్ చేతుల మీదుగా రామకృష్ణ ఈ డిగ్రీ అవార్డును స్వీకరించారు. పంటల్లో సూక్ష్మ పోషకాలు, వ్యవసాయంలో జీవన ఎరువుల ప్రాముఖ్యత, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై సుమారు 40 కథనాలు(ఆర్టికల్స్) రాయడం వల్ల వాటిని గుర్తించి తనకు ఈ అవార్డు ఇచ్చినట్లు రామకృష్ణ తెలిపారు.

సీఎస్‌కు మాతృ వియోగం

ఈనాడు, అమరావతి: ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌కు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి సత్యవతి దిల్లీలో మృతిచెందారు. పంజాబీబాగ్ శ్మశానవాటికలో ఆదివారం ఆమె అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతిపట్ల సీఎం చంద్రబాబు సంతాపం తెలిపారు.

8 రాష్ట్రాల సిఫారసులకు 'పద్మ' జాబితాలో దక్కని చోటు!

దిల్లీ: ప్రతిష్ఠాత్మక 'పద్మ' అవార్డుల కోసం ఎనిమిది రాష్ట్రప్రభుత్వాలు, ఏడుగురు గవర్నర్లు, 14 మంది కేంద్ర మంత్రులు చేసిన సిఫారసులను సంబంధిత ఎంపిక సంఘం తిరస్కరించింది. 2018 సంవత్సరానికి గాను పద్మ అవార్డుల కోసం సుమారు 35,595 సిఫారసులు/నామినేషన్లు అందాయి. వీటిల్లో నుంచి కేవలం 84 ప్రముఖులను మాత్రమే ఈ పురస్కారాల కోసం ఎంపిక చేసుకున్నట్లు కేంద్ర హోంశాఖ వర్గాలు పేర్కొన్నాయి. పదిమంది సభ్యుల ఎంపిక సంఘం రూపొందించిన పేర్లే ఈ తుది జాబితాలో ఉన్నాయి. 'మట్టిలో మాణిక్యాలు' (అన్‌సంగ్ హీరోస్) పేరుతో విడుదల చేసిన ఈ జాబితాలోని వారంతా కూడా నిరుపేదల కోసం తమ జీవితాలను అంకితం చేసిన వారే. కొందరైతే అత్యంత సామాన్యమైన నేపథ్యం నుంచి వచ్చిన వారేనని హోంశాఖ అధికారి ఒకరు వెల్లడించారు. తమిళనాడు, హరియాణా, జమ్ము-కశ్మీర్, కర్ణాటక, ఉత్తరఖండ్, బిహార్, రాజస్థాన్, దిల్లీ రాష్ట్రాల ప్రభుత్వాలు అందచేసిన సిఫారసులను ఎంపిక సంఘం తిరస్కరించినట్లు పేర్కొన్నారు.

రాజధాని రైతుల్లో అశాంతికి పవన్ ప్రయత్నం

ఎమ్మెల్యే శ్రవణ్‌కుమార్ ఆరోపణ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులందరూ ప్రభుత్వ పరిహారంతో సంతోషంగా ఉగాది చేసుకుంటుంటే అపోహలు సృష్టించి అశాంతి నెలకొల్పేందుకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో ఆరోపించారు. దేశంలో ఏ రాజధానికి ఇవ్వనంత పరిహారం ఇక్కడి రైతులకు ఇచ్చారన్నారు. గతంలో రాజధాని కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయన్న పవన్ ఇప్పుడు ఎవరి రాజకీయ ప్రయోజనాలకోసం మాట్లాడుతున్నారని ప్రశ్నించారు.

చైనాలో రెండువేల ఏళ్లనాటి మద్యం లభ్యం

బీజింగ్: దాదాపు రెండువేల ఏళ్లకు పూర్వం నాటిదిగా భావిస్తున్న మద్యం నింపి ఉన్న అరుదైన కాంస్య కెటిల్(తేనీటి డికాక్షన్ తయారీ పాత్ర)ను పరిశోధకులు కనుగొన్నారు. కిన్ వంశస్తుల సమాధుల వద్ద నిర్వహించిన తవ్వకాల్లో కనిపించిన ఈ కెటిల్‌లో సుమారు 3వందల మిల్లీ లీటర్ల మద్యం అలాగే చెక్కుచెదరకుండా ఉంది. ఈ కెటిల్ మూతను ప్రత్యేకమైన , ప్రకృతిసిద్ధమైన పీచుతో గట్టిగా బంధించి ఉంచారని శాస్త్రవేత్తలు వెల్లడించారు. తెల్లగా పారదర్శకంగా ఉన్న ఈ మద్యాన్ని పులియబెట్టే ప్రక్రియద్వారా పూర్వీకులు తయారు చేసి ఉండవచ్చని భావిస్తున్నారు.



పార్టీ ప్లీనరీలో చిరునవ్వులు చిందిస్తున్న సోనియాగాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్

ఎన్డీయేపై మన్మోహనాస్త్రం!

- కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడిన మాజీ ప్రధాని
- ఆర్థిక రంగాన్ని భ్రష్టు పట్టించారు
- 'అసమర్థ మేనేజర్లు' వ్యవస్థను నాశనం చేశారు
- కశ్మీర్‌పైనా విఫలమైన ప్రభుత్వం
- కాంగ్రెస్ ప్లీనరీలో మన్మోహన్‌సింగ్ విమర్శలు
- వ్యవస్థని మెరుగుపరచగలిగేది కాంగ్రెస్ మాత్రమే: చిదంబరం

దిల్లీ: కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు దేశ ఆర్థిక రంగాన్ని అన్ని విధాలా భ్రష్టు పట్టించిందని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ విమర్శించారు. వ్యవస్థ మొత్తం గందరగోళంలో ఉందనీ, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. అసమర్థులైన ఆర్థిక మేనేజర్లు దేశ ఆర్థిక రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. అలాంటి వారి నుంచి దేశాన్ని రక్షిస్తేనే వృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. రెండు కోట్ల మందికి ఉపాధి కల్పన, రైతుల ఆదాయం రెట్టింపు అంటూ పెద్ద పెద్ద వాగ్దానాలు చేసినా అవేవీ నెరవేరలేదని చెప్పారు. ఆదివారం కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో ఆర్థిక తీర్మానంపై ఆయన ప్రసంగిస్తూ ఎన్డీఏ సర్కారుపై విరుచుకుపడ్డారు. జమ్ముకశ్మీర్ విషయంలోనూ ప్రభుత్వం తగిన రీతిలో వ్యవహరించలేకపోయిందనీ, మునుపెన్నడూ ఇలా జరగలేదనీ మన్మోహన్ చెప్పారు. దేశం లోపలా, బయటా ఎదురవుతున్న భద్రత సమస్యలపై పోరాడుతున్నట్లు చెప్పడం మరో బూటకమని వ్యాఖ్యానించారు. విదేశాంగ విధానం, దేశ రక్షణ, ఆర్థిక వ్యవస్థ వంటి అన్ని అంశాల్లోనూ ప్రభుత్వం విఫలమయిందని ఆయన తూర్పారపడుతున్నప్పుడు ప్రతినిధులంతా లేచి నిల్చొని కరతాళధ్వనులు మార్మోగించారు. 'జమ్ముకశ్మీర్‌లో రెండు విభాగాలు ఒకదానికొకటి విరుద్ధంగా పనిచేస్తున్నాయి. దానివల్ల పరిస్థితి రోజురోజుకీ క్షీణించిపోతోంది. అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం వల్ల మన సరిహద్దులు సుభద్రంగా లేవనేది స్పష్టమవుతోంది. పరిస్థితులు ప్రజలందరికీ ఆందోళన కలిగించేలా మారుతున్నాయి. ఈ సమస్యలన్నీ వాటంతట అవే పరిష్కారమైపోతాయని మోదీ సర్కారు భావిస్తున్నట్లుగా ఉంది. కానీ అలా జరగదు. పొరుగుదేశాల మద్దతు లభించే వాతావరణాన్ని సృష్టించుకుని, వాటితో కలిసి ముందడుగు వేయడం దేశాల బాధ్యత. బంగ్లాదేశ్, పాకిస్థాన్, నేపాల్, శ్రీలంక, చైనాల విషయంలో కాంగ్రెస్ సర్కారు అలాగే పనిచేసింది. విదేశాలతో సమస్యల్ని శాంతియుతంగా పరిష్కరించుకోవాలే గానీ విరోధంతో, అరుపులతో కాదు' అని చెప్పారు.


తీర్మానానికి ఆమోదం

అసమర్థ ఆర్థిక మేనేజర్ల నుంచి దేశాన్ని రక్షించి, దేశ సర్వతోముఖాభివృద్ధికి అనేక ఏళ్లుగా పాటుపడినవారికి పగ్గాలు అప్పగిస్తేనే ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందంటూ పేర్కొన్న తీర్మానాన్ని ప్లీనరీ ఆమోదించింది. మార్పునకు ఇదే సమయమని దానిలో పేర్కొంది. ఎన్డీఏ పాలనలో బ్యాంకింగ్ రంగం కూడా కునారిల్లుతోందని విమర్శించింది. నియంత్రణ వ్యవస్థల్ని బలోపేతం చేసి, బ్యాంకులకున్న బకాయిలను రాబట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ప్రైవేటు బ్యాంకుల మాదిరిగా ప్రభుత్వరంగ బ్యాంకులూ సమర్థతను, పారదర్శకతను పెంచుకోవాలంది. కేంద్ర మాజీ మంత్రి చిదంబరం ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. గతంలోనూ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచిన తాము మళ్లీ అలా చేసి తీరుతామని చెప్పారు. ఇది అహంకారంతోనో, ఆత్మస్తుతి కోసమో చెబుతున్న మాట కాదన్నారు. దేశాన్ని వృద్ధిబాట పట్టించడానికి లభించిన సువర్ణావకాశాన్ని మోదీ సర్కారు చేజార్చుకొందని విమర్శించారు. చిట్టచివరి సంవత్సర బడ్జెట్టును చూస్తే దేశం మరింత సంక్షోభంలో కూరుకుపోతోందని అర్థమవుతుందని చెప్పారు. మరో ఏడాది తర్వాత అధికారంలోకి ఎవరు వచ్చినా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు.

నాలుగేళ్లలో ఏం చేశారో చెప్పండి

'విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, ఉపాధి రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రస్తుత ప్రభుత్వం పరిష్కరించలేదు. మరి నాలుగేళ్లలో ఏం చేశారో చెప్పండి? దీనికి ప్రధాని జవాబు చెప్పాల్సిందే. పెద్దనోట్ల రద్దుకు మించిన పెద్ద అబద్ధం మరొకటి లేదు. ఆ నిర్ణయంతో నల్లధనాన్ని నిర్మూలిస్తామనీ, అవినీతిని అంతం చేస్తామనీ చెప్పారు. నకిలీ కరెన్సీ లేకుండా చూస్తామన్నారు. మరి నల్లధనం ఆగిపోయిందా? ప్రధాని నిర్వహిస్తున్న సభలకు నల్లడబ్బు కాకుండా మరే డబ్బు ఖర్చు చేస్తున్నారు?' అని చిదంబరం ప్రశ్నించారు.

2 కోట్ల ఉద్యోగాలన్నారు.. 2 లక్షలు కూడా ఇవ్వలేదు



- సీమాంతర ఉగ్రవాదానికి పాకిస్థాన్ ఊతమిస్తుండడం ఆమోదయోగ్యం కాదు. ఉపఖండంలో శాంతి, సుసంపన్నతలను విచ్ఛిన్నం చేసే ఈ మార్గాన్ని విడనాడాల్సిందిగా పాక్‌ను హెచ్చరించాల్సి ఉంది. రెండు దేశాలూ కలిసి కూర్చొని శాంతియుతంగా సమస్యల్ని పరిష్కరించుకోవాలి.
- స్థూల జాతీయోత్పత్తిలో కేవలం 1.6 శాతాన్ని రక్షణరంగంపై ఖర్చు చేస్తున్నారు. సవాళ్లను ఎదుర్కొనేందుకు అది ఏ మూలకూ సరిపోవడం లేదు.
- యూపీఏ పాలనలో 7.8% వృద్ధిరేటు సాధిస్తే గత నాలుగేళ్లలో మాత్రం ప్రపంచ ఆర్థిక రంగంతో మన దేశ ఆర్థిక రంగానికి సంబంధం లేకుండా పోయింది.
- సామాజిక, ఆర్థిక సమస్యల్ని పరిష్కరించడంలో ప్రభుత్వ లోపాలను ఎండగట్టేరీతిలో ఆర్థిక సర్వే వెలువడింది. 'అధికారంలోకి వస్తే 2 కోట్ల ఉద్యోగాలిస్తామన్నారు. కనీసం 2 లక్షలైనా ఇవ్వలేదు.
- ముందుచూపు లేకుండా ప్రకటించిన పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ అమలు నిర్ణయాలు అనేకమంది ఉద్యోగాలను పోగొట్టాయి. పారిశ్రామిక, అసంఘటిత రంగాలూ సమస్యల్లో చిక్కుకున్నాయి.
- రైతుల ఆదాయం రెట్టింపు అయ్యేలా చూడాలంటే ఏటా కనీసం 12% వృద్ధి సాధించాలి. అది ఊహకైనా అందని విషయం.
- భావసారూప్య పక్షాలతో కలిసి వచ్చే ఎన్నికల్లో భాజపాను గద్దె దించుతాం. స్వాతంత్ర్య పోరాటం నుంచి దేశానికి అభివృద్ధి పథాన్ని చూపడం వరకు అనేక విధాలా సేవలందించిన కాంగ్రెస్ పార్టీ మరోసారి అలాంటి సవాల్‌ను స్వీకరించి, బాధ్యతను నిర్వర్తిస్తుంది.

మోదీయే అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించినా, అలాంటివారిని కాంగ్రెస్‌లో ఎన్నడూ వారు అంగీకరించబోరు. ప్రమాణాలకు తగ్గట్టుగా మేం లేకపోతే ప్రజలు మమ్మల్ని శిక్షిస్తారు. భాజపా అంటే ఒక సంస్థ. కాంగ్రెస్ మాత్రం దేశవాణి...' అని వివరించారు.

భ్రమలు వీడుతున్నాయి...

'అచ్చేదిన్ అని నినదించిన అధికార పార్టీపై వివిధ వర్గాలకున్న భ్రమలు వీడుతున్నాయి. అడవి మీది కాదని వారు గిరిజనులకు చెబుతారు. భాష మార్చుకోవాలని తమిళులకు చెబుతారు. ఎన్నడూ పాకిస్థాన్‌కు వెళ్లని ముస్లింలను పట్టుకుని మీరు ఇక్కడివారు కాదని అంటారు. మీరు తినేది మాకు నచ్చదని ఈశాన్య రాష్ట్రాల వారికి చెబుతారు. మహిళల వస్త్రధారణ గురించీ వారే చెప్పేస్తారు. నేను ఎక్కడ యువతను ప్రశ్నించినా వారు చేయడానికి పనేమీ లేదనే చెబుతున్నారు. ప్రజాకాంక్షల్ని నెరవేర్చకపోవడం వల్లనే 2014లో కాంగ్రెస్‌కి ప్రజలు ఓటు వేయలేదని అంటుంటారు. నిజమే... గత ప్రభుత్వం ప్రజాకాంక్షల్ని నెరవేర్చలేకపోవడంతో ప్రజలు నిరుత్సాహం చెందారు. మనం కూడా మారాలి. కాంగ్రెస్‌లోనూ మార్పు తీసుకురావాలి' అని రాహుల్ చెప్పారు.

పదేళ్లలో భారత్ దార్శనికత

నిరుద్యోగం, రైతాంగం సమస్యలు, బ్యాంకు కుంభకోణాలు వంటివాటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి ఆకర్షణీయ కార్యక్రమాల ద్వారా భాజపా ప్రయత్నిస్తోందని రాహుల్ విమర్శించారు. ఈ అంశాలపై ప్రధాని మౌనం దాల్చారని చెప్పారు. 'దేశం ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రధాని అంగీకరించడం లేదు. ఊహల్లో తప్పిస్తే సమస్యలు మరెక్కడా లేవన్నట్లుగా వాటి నుంచి మన దృష్టిని ఆయన మళ్లింపజేస్తున్నారు. ఆర్థికంగా మన దేశం పరుగులు తీస్తోందని ప్రభుత్వం చెబుతూ ఉంటుంది. కానీ కోట్ల మంది యువత ఉద్యోగాల్లేక అల్లాడుతున్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. మోదీ మాత్రం గబ్బర్‌సింగ్ టాక్స్ నుంచి యోగా వరకు ఒకదాని తర్వాత ఒకటిగా వేర్వేరు అంశాల్లోకి వెళ్తూ మన దృష్టి మళ్లిస్తున్నారు. ఈ సమస్యలపై ఆయనెన్నడూ మాట్లాడరు...' అని వివరించారు. 'రాబోయే దశాబ్దిలో ప్రపంచ యవనికపై భారత్ అత్యంత కీలక పాత్ర పోషించనుంది. ఇప్పటివరకు ప్రపంచం ముందు రెండు దార్శనికతలే ఉన్నాయి. ఒకటి అమెరికా, రెండోది చైనా. పదేళ్లలో భారత్ దార్శనికతనూ వాటి సరసన చేర్చాలనేది నా కోరిక.' అని చెప్పారు. స్వాతంత్ర్యం కోసం జాతిపిత మహాత్మాగాంధీ 15 ఏళ్లపాటు కారాగారంలో గడిపితే ఆరెస్సెస్ నేత సావర్కర్ మాత్రం క్షమాభిక్ష కోసం ప్రాధేయపడ్డారనీ, దేశ ప్రజలు ఆ విషయాన్ని ఎప్పటికీ మరిచిపోలేరని తెలిపారు.

చేసిన తప్పుల్ని మేం అంగీకరిస్తాం...

తనకు, కార్యకర్తలకు మధ్యనున్న అడ్డుగోడల్ని కూలగొడతానని రాహుల్ హామీ ఇచ్చారు. 'అకస్మాత్తుగా ఆకాశం నుంచి ఊడిపడి ఎన్నికల్లో టికెట్టును ఎవరో ఒకరు ఎగరేసుకునిపోతారు. పార్టీ కోసం కష్టపడే అసలైన కార్యకర్తకు మాత్రం- తగినంత డబ్బు లేని కారణంగా టికెట్ ఇవ్వలేకపోతున్నామని- చెబుతారు. నేను చెబుతున్నది ఇక్కడ కూర్చొన్నవారిలో కొందరికి నచ్చకపోవచ్చు. మన మధ్య ఈ అడ్డుగోడల్ని తీసేయడం నా మొదటి విధి. మేమూ మనుషులమే. కాంగ్రెస్ కూడా తప్పులు చేస్తుంది. అయితే మేం వాటిని ఒప్పుకొంటాం. భాజపా మాత్రం ఎన్నడూ అలా చేయదు. పెద్దనోట్ల రద్దు నిర్ణయం తప్పు అని ప్రపంచమంతా చెప్పింది. అలాంటి తప్పును మేమే చేసి ఉంటే దానిని అంగీకరించి, సరిదిద్దే చర్యలు తీసుకునేవాళ్లం. మోదీ మాత్రం తనను తాను భగవంతుని అవతారంగా భావిస్తారు. అందువల్ల తాను తప్పులే చేయనని అనుకుంటారు' అని చెప్పారు. వ్యవస్థల్ని ఆరెస్సెస్ నాశనం చేస్తోందనీ, ఆ సంస్థ ఛత్రం కిందికి అంతా రావాలని కోరుకుంటోందనీ తెలిపారు. ప్రతిభావంతులైన యువతతో పార్టీ వేదికని భర్తీ చేస్తానని చెప్పారు. క్రమశిక్షణ ఆవశ్యకతను నొక్కి చెబుతూ... విభేదాలన్నింటినీ పక్కనపెట్టి పార్టీ విజయం కోసం పాటుపడదామని పిలుపునిచ్చారు.

సీడబ్ల్యూసీపై నిర్ణయం రాహుల్‌కే

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుల ఎంపికపై అధికారాన్ని రాహుల్‌గాంధీకే అప్పగిస్తూ ప్లీనరీ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించింది. ఈ ఎంపిక కోసం ఎన్నికలు నిర్వహిద్దామా అని సీనియర్ నేత ఆజాద్ అడిగినప్పుడు ప్లీనరీ దానిని తిరస్కరించింది.

కాంగ్రెస్ హస్తం కాపాడుతుంది

'మీరు మా గురించి ఎంత చెడ్డగానైనా రాయండి. ఆరెస్సెస్ మీపై దాడి చేసినప్పుడు, అణిచివేయాలని చూసినప్పుడు కాంగ్రెస్ చిహ్నమైన హస్తం మాత్రం మిమ్మల్ని కాపాడుతుంది' అని విలేకరులనుద్దేశించి రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మీడియాకూ బెదిరింపులు ఎదురవుతున్నాయనీ, తాము అధికారంలోకి వచ్చాక మీడియాను కాపాడతామనీ తెలిపారు. ఆహారశుద్ధి సముదాయాలను దేశవ్యాప్తంగా నెలకొల్పి, ప్రతీ జిల్లాలో రైతులు తమ ఉత్పత్తులను నేరుగా ఈ కర్మాగారాలకు విక్రయించుకునేలా చూస్తామనీ తెలిపారు. ఐ.ఐ.టి. తరహా నాణ్యమైన విద్యను అందిస్తామని చెప్పారు. రైతుల్ని ఆదుకునేందుకు మరోసారి రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు.

ఈ వేదికను భర్తీ చేయాల్సింది యువతే...

'ఈ వేదిక మీదే. ఈ పార్టీ మీదే. పార్టీ లోపలా, బయటా ఉన్న యువత కోసం వేదికను ఖాళీ చేయించాను. యువత లేకపోతే నరేంద్రమోదీ కూడా దేశాన్ని మార్చలేరు. నాలుగేళ్ల క్రితం మోదీ వాహనాన్ని యువత... ముందుకు నెట్టింది. అయితే దానిలో ఒకపక్క నీరవ్‌మోదీ, మరోపక్క లలిత్‌మోదీ కూర్చొన్నారు. ఆ వాహనం వెళ్లిపోయింది' అని రాహుల్ చెప్పారు. 'ఈ పార్టీ మీ చేతిలో ఆయుధం. మీ ప్రతిభ, సాహసం, శక్తి ఈ దేశానికి అవసరం. మీలాంటివారి కోసం మేం తలుపులు తెరిచి ఉంచాం' అని చెప్పారు. 70-80 ఏళ్ల క్రితం పార్టీకి ఉన్న వైభవాన్ని తిరిగి సాధించాలనేది తన కల అని చెప్పారు.

ప్లీనరీ కళకళ.. ప్రియాంక మార్చిందిలా

దిల్లీ: దేశ రాజధానిలో మూడు రోజుల పాటు కోలాహలంగా జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ప్లీనరీ సమావేశాల్లో ప్రియాంక గాంధీ తనవంతు పాత్రను పోషించారు. దోమల సమస్య నిర్మూలన నుంచి ఖాళీ సీట్లను భర్తీ చేయించడం వరకు పలు విషయాల్లో జోక్యం చేసుకుని ప్లీనరీ నిండుగా, సజావుగా జరిగేందుకు చొరవ తీసుకున్నారు. సభాస్థలిగా ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియం ఎంపిక నుంచి సభా వేదిక నిర్మాణం వరకు అంతా ఆమె చెప్పిన ప్రకారమే జరిగింది. మొదటి రోజు సభలో కొన్ని కుర్చీలు ఖాళీగా కనిపించడంతో ఆమె కొందరు నేతల్ని పిలిచి రెండోరోజు మరింత మంది హాజరయ్యేలా చూడాల్సిందిగా ఆదేశించారు. అంతే కాదు... సభా వేదికపై దోమలు కుడుతున్నాయని తన తల్లి సోనియాగాంధీ నుంచి అనేకమంది ప్రతినిధులు ఫిర్యాదు చేయడంతో ప్లీనరీ మొదటి రోజు రాత్రి బాగా పొద్దుపోయాక ఆమె స్టేడియానికి వచ్చారు. దాదాపు రెండు గంటలు అక్కడే ఉన్నారు. దోమల నిర్మూలనకు చేపడుతున్న చర్యల్ని దగ్గరుండి పరిశీలించారు. ఎవరెవరు ప్రసంగించాలి, ఎవరి తర్వాత ఎవరు మాట్లాడాలి అనేది కూడా ఆమే నిర్ణయించారు. వేదికపై రాహుల్ గాంధీ ఒక్కరే మాట్లాడాలనీ, ఆయన వెనుక కాంగ్రెస్ చిహ్నం ప్రస్ఫుటంగా కనిపిస్తూ ఉండాలనీ ఆలోచన ఇచ్చింది కూడా ప్రియాంకే.

మార్పు ఇలా మొదలైంది..!

ప్లీనరీ సమావేశాలనగానే నాయకులంతా వేదికపై సంప్రదాయ పరుపులపై ఆసీనులయ్యే దృశ్యమే కళ్లముందు కనిపిస్తుంది. అలాంటిది ఈసారి దానికి స్వస్తి పలికారు. 'మార్పు ఇప్పుడే' అనేది ప్లీనరీ నినాదం కాగా దానికి సభావేదిక ఏర్పాట్లతోనే శ్రీకారం చుట్టినట్లయిందని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతినిధులుగా వచ్చిన వారంతా వేదిక కిందన కూర్చొన్నారు. పార్టీలో తన సోదరుడికే తప్పిస్తే తనకు ఎలాంటి పాత్రలేదని ప్రియాంక గతంలో పలుమార్లు చెబుతూ వచ్చారు. అలా అంటూనే యూపీలో సమాజ్‌వాదీతో పొత్తు కుదరడంలో కీలక పాత్ర పోషించారు. గుజరాత్ ఎన్నికల ప్రచారాన్నీ పర్యవేక్షించారు. 2019 ఎన్నికల్లోనూ తెర వెనుక ఆమె పాత్ర కనిపిస్తుందనేది స్పష్టం.



మహారాష్ట్రీయుల నూతన సంవత్సరం గుడి పడ్వా సందర్భంగా ఆదివారం ముంబయిలో జరిగిన వేడుకల్లో సంప్రదాయ దుస్తుల్లో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మహిళలు

సర్దార్.. అసర్దార్...

- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై సిద్ధూ చమక్కులు

దిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌పై పంజాబ్ మంత్రి, మాజీ క్రికెటర్ నవజ్యోత్ సింగ్ సిద్ధూ ప్రశంసల జల్లు కురిపించారు. మన్మోహన్ ఓ సర్దార్ (సిక్కు) మాత్రమే కాకుండా అసర్దార్ (ప్రభావశీలుడు/ సమర్థుడు) కూడా అని ఆయన తనదైన శైలిలో వ్యాఖ్యానించారు. కవితలు, హాస్యోక్తులు రంగరిస్తూ కాంగ్రెస్ ప్లీనరీ సమావేశాల్లో సిద్ధూ చేసిన ప్రసంగాన్ని సోనియాగాంధీ సహా నేతలంతా ఆసక్తిగా విన్నారు. 'నేను సర్దార్ మన్మోహన్‌సింగ్ ముందు తల వంచి క్షమాపణలు కోరాలనుకుంటున్నా. ఎందుకంటే నానా హడావుడితో భాజపా చేయలేని పనిని మీరు (మన్మోహన్) మౌనంగానే సాధించి చూపారు. పదేళ్ల తర్వాత నేను ఈ విషయాన్ని గ్రహించాను సార్. ప్రధానిగా మీరు ఉన్నప్పుడు ఆర్థిక రంగం అరేబియన్ గుర్రంలా పరుగులు తీసింది. మౌనంగానే ఆ విజయాన్ని మీరు సాధించారు. ఇప్పుడు భాజపా పాలనలో అది తాబేలు నడకలు నడుస్తోంది' అని సిద్ధూ చెప్పారు. రాహుల్ గాంధీ 2019 ఎన్నికల్లో ప్రధానమంత్రి కావడం, ఎర్రకోటపై జాతీయ జెండా ఎగరేయడం ఖాయమని చెప్పారు. పార్టీకి ఆత్మ, ప్రాణం, గుర్తింపు అంతా కార్యకర్తలేననీ, వారు లేకపోతే పార్టీయే లేదనీ అన్నారు. కార్యకర్తలు గ్రీకు చక్రవర్తి అలెగ్జాండర్ అంతటి వారని చెప్పారు. కాంగ్రెస్ ఓడిపోతే కొందరు నాయకుల వల్లనే గానీ కార్యకర్తల వల్ల కాదన్నారు.

అదంతా.. పరాజితుడి వాక్చాతుర్యం!

- రాముడి ఉనికినే ప్రశ్నించి ఇప్పుడు పాండవులుగా అభివర్ణించుకుంటారా?
- రాహుల్‌పై మండిపడ్డ భాజపా

దిల్లీ: కాంగ్రెస్ ప్లీనరీలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ప్రసంగంపై భాజపా విరుచుకుపడింది. రాముడి అస్తిత్వాన్నే ప్రశ్నించిన పార్టీ.. ఇప్పుడు తమను తాము పాండవులుగా అభివర్ణించుకోవడాన్ని ప్రశ్నించింది. రాహుల్ ప్రసంగాన్ని అంశాలవారీగా ఖండిస్తూ.. అదంతా 'పరాజితుడి వాక్చాతుర్యం'గా భాజపా సీనియర్ నేత, రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ అభివర్ణించారు. అందులో ఎలాంటి పసలేదన్నారు. ఒక ఆలయ సందర్శన సందర్భంగా తాను పూజార్లతో మాట్లాడానంటూ ఒక కథను వర్ణించారని పేర్కొంటూ.. "కాంగ్రెస్ పూజారి, భాజపా పూజారి ఉంటారని నేనెక్కడా వినలేదు. రాహుల్ గాంధీ మాత్రం దానిపై ఒక పెద్ద కథనే వినిపించారు. హిందువులను, హిందూ మతాన్ని అవహేళన చేయడానికే అలా చేశారు" అని విమర్శించారు.

ప్రధాని నరేంద్ర మోదీని.. నేరగాడు నీరవ్ మోదీ, లలిత్ మోదీతో లంకె పెట్టడాన్ని నిర్మలా సీతారామన్ ఖండించారు. అది తప్పుడు వర్ణన అని మండిపడ్డారు. "నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై ఉన్న రాహుల్ గాంధీకి.. జాతిపిత మహాత్మా గాంధీ ఇంటి పేరే ఉంది. మరి అది మహాత్ముడి నైజానికి దర్పణం పడుతుందా" అని ఆమె ప్రశ్నించారు. భాజపా అధ్యక్షుడు అమిత్ షాపై రాహుల్ చేసిన విమర్శలను ఆమె ఖండించారు. అమిత్ షాకు కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ ఇలాంటి విమర్శలు చేయడం తగదన్నారు.

మోదీ హయాంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. న్యాయవ్యవస్థకు కాంగ్రెస్ సంరక్షణదారుగా మారిందా అని ఎద్దేవా చేశారు. "తనకు వ్యతిరేకంగా ఒక్క తీర్పు రావడం వల్ల న్యాయవ్యవస్థతో ఇందిరా గాంధీ ఎలా వ్యవహరించారో నేను గుర్తు చేయాల్సిన అవసరం ఉందా? మీడియా స్వేచ్ఛను హరించడానికి 1988లో రాజీవ్ గాంధీ.. దాదాపుగా ఒక బిల్లు తెచ్చినంత పనిచేశారు. ఎమర్జెన్సీ సమయంలో ఇందిర ఆంక్షలు పెట్టారు. ఇప్పుడు ఆమె మనుమడు మీడియా స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నారు" అని విమర్శించారు. డబ్బు ఎలా లెక్కబెట్టాలో.. తిరుపతిలోని హుండీ ఆదాయాన్ని లెక్కించేవారి నుంచి రిజర్వు బ్యాంకు నేర్చుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "నల్లధనాన్ని లెక్కించడానికి కాంగ్రెస్ సేవలను ఆర్‌బీఐ వినియోగించుకోవాలి. లెక్కించడంలో వారు దిట్టలు" అని పేర్కొన్నారు. మరోపక్క మోదీ, ఎన్‌డీయే సర్కారుపై రాహుల్ గాంధీ విమర్శలు చేయడాన్ని కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ తప్పుపట్టారు. రాహుల్ గాంధీ తొలుత. . కాంగ్రెస్ అకృత్యాలకు క్షమాపణ చెప్పి, ఆ తర్వాత ప్రధానిపై విమర్శలు చేయాలన్నారు.

ఏపీ కాంగ్రెస్ నేతల మౌనదీక్ష

ఈనాడు, దిల్లీ: 2019లో ఎర్రకోటపై రాహుల్ గాంధీ జాతీయ జెండా ఎగురవేస్తారని ఏపీపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. ఆదివారమిక్కడ ఏపీ కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన రాజ్‌ఘాట్‌లోని గాంధీ సమాధి వద్ద మౌన దీక్ష చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా కోసం శాంతియుతంగా గాంధీ సమాధి వద్ద దీక్ష నిర్వహించామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రత్యేక హోదా ఇచ్చి తీరుతామన్నారు. వ్యవసాయం లాభసాటి చేయడానికి, నిరుద్యోగ సమస్య తొలగించడానికి రాహుల్ కంకణం కట్టుకున్నారని తెలిపారు. నాలుగేళ్లుగా ప్రత్యేక హోదా విషయంలో చంద్రబాబు మాటలు మార్చారని రఘువీరా ఆరోపించారు. 84వ ప్లీనరీ ద్వారా కాంగ్రెస్ నేతల్లో రేగిన నూతనోత్సాహంతో ముందుకెళ్తామని తెలిపారు. ఎంపీ కేవీపీ మాట్లాడుతూ.. 2019లో పార్టీని అధికారంలోకి తేవడానికి దేశవ్యాప్తంగా యువత సిద్ధంగా ఉందన్నారు. ప్లీనరీ రాజకీయ తీర్మానాల్లో ప్రత్యేక హోదా చేర్చడం కాంగ్రెస్‌కు ఏపీ ప్రజల పట్ల ఉన్న చిత్తశుద్ధి తెలుస్తుందని ఆయన అన్నారు. మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు మాట్లాడుతూ.. ఈ సమావేశాలు చూస్తుంటే రాహుల్ ప్రధాని అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. ప్లీనరీ వేదికపై మాజీ ఎంపీ జేడీ శీలం మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభివృద్ధి కోసం మరిన్ని పథకాలు తీసుకొచ్చేలా ఆలోచన చేయాలన్నారు. సమావేశంలో ఎంపీ సుబ్బరామిరెడ్డి, నేతలు కిల్లి కృపారాణి, పనబాక లక్ష్మి, గిడుగు రుద్రరాజు, మాజీ మంత్రులు వట్టి వసంతకుమార్, కాసు కృష్ణారెడ్డి, బాలరాజు, మహిళా నేతలు పద్మశ్రీ, అమర్జహా బేగ్, రమాదేవి తదితరులు హాజరయ్యారు.

కాల్వ కట్లకూ కబ్జా కాటు!

- నేతల అండ.. ఊతమిస్తున్న ఉచిత విద్యుత్తు
- సాగర్ ప్రధాన కాల్వ పక్కన చదును చేసి వరి సాగు

ఈనాడు - గుంటూరు

ఉచితంగా నీరు, విద్యుత్తు లభిస్తోంది.. వీటికి తోడు సారవంతమైన భూములు అందుబాటులో ఉన్నాయి. ఇక అడిగే నాథుడు లేకపోవటంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. కాల్వ కట్టలను సైతం కబ్జా పడుతూ దర్జాగా వ్యవసాయం చేసుకుంటున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు(ఎన్నెస్పీ)లో కుడి ప్రధాన కాల్వ పక్కన ఈ దుస్థితి కొనసాగుతోంది. గుంటూరు జిల్లా నకరికల్లు మండల పరిధిలో దీని వెంబడి ఉన్న 1680 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు గతంలోనే అధికారులు గుర్తించారు. అయినా స్వాధీనం చేసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తుండడంతో ఆక్రమణదారులు బరి తెగిస్తున్నారు. క్షేత్రస్థాయి యంత్రాంగం ముడుపుల మాటున చూసీచూడనట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వచ్చి ప్రశ్నిస్తే నేతల ద్వారా ఒత్తిడి చేయించి మరీ వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారు.

రూ.20కోట్ల భూముల ఆక్రమణ

సాగర్ కుడి కాల్వ వెంట ఏటికేడు భూములను కబ్జాచేస్తూ వస్తున్న ఆక్రమణదారులు ఇటీవల నకరికల్లు మండలంలో సుమారు వందెకరాలను ఆక్రమించడమే కాక ఈసారి కట్టలను సైతం చదును చేసి వరి వేశారు. ఇక్కడ ఎకరా రూ.20లక్షలు పలుకుతుండడంతో రూ.20కోట్ల భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆక్రమణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శివాపురం తండాకు వెళ్లే వంతెన పక్కన కాల్వ కట్టలు చదును చేస్తున్నా అడిగే వారు లేక ఒకరిని చూసి మరొకరు సాగుకు సిద్ధమవుతున్నారు. రూ.లక్ష వెచ్చించి చదును చేసుకుంటే రెండేళ్లలో పెట్టిన సొమ్ము చేతికి రావడంతోపాటు ఏటా పంటలు వేసుకోవచ్చన్న ధీమాతో ఉన్నారు. ఉచిత విద్యుత్తు కావడంతో కాల్వలోని నీటిని సాగుకు అక్రమంగా వినియోగించే క్రమంలో మోటార్లను ఆన్‌చేసి వదిలేస్తున్నారు. దాంతో నీరు ఎక్కువై తిరిగి కాల్వలోకే మట్టితో వెళ్లిపోతుండగా పూడిక ఏర్పడుతోంది. పైగా విద్యుత్తు దుర్వినియోగమవుతోంది. కాల్వకు అప్పట్లో 500మీటర్ల వెడల్పుతో భూములు సేకరించగా దానికి ఇరువైపులా వంద మీటర్లకుపైగా కట్టలు, ఖాళీ ప్రాంతం ఉంది. నీరు, ఉచిత విద్యుత్తు వసతి ఉండడం, సారవంతమైన భూములు కావడంతో కాల్వ వెంబడి జీపు దారిపోగా మిగిలిన భూమిని ఆక్రమిస్తున్నారు. వీరికి రాజకీయ నేతల అండదండలు ఉండడంతో యంత్రాంగం చర్యలు తీసుకోలేని పరిస్థితి నెలకొంది.

పరిశీలించి చర్యలు చేపడతాం..

సాగర్ కాల్వ కట్టలు ఆక్రమణకు గురైనట్లు మా దృష్టికి రాలేదు. అధికారులను వెంటనే క్షేత్రస్థాయికి పంపి భూములను స్వాధీనం చేసుకుంటాం. ఆక్రమణలను అడ్డుకోని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. కాల్వ నుంచి పంపింగ్ చేయకుండా నీటి చౌర్యాన్ని అరికడతాం. *-పురుషోత్తమ గంగరాజు, పర్యవేక్షక ఇంజినీర్, లింగంగుంట్ల సర్కిల్*



సాగర్ కుడి కాల్వ కట్టను చదును చేసి వేసిన వరి పంట

ఛాంపియన్





కార్తీక్ 29 నాటౌట్

ఆ ఎనిమిది బంతులు

దినేశ్ కార్తీక్ ఎదుర్కొన్న ఎనిమిది బంతుల్లో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లు ఉన్నాయి. అతను ఎదుర్కొన్న ఆ ఎనిమిది బంతులను ఎలా ఆడాడంటే..

తొలి బంతి: లాంగ్‌ఆన్ మీదుగా సిక్సర్
రెండో బంతి: లాంగ్ ఆన్ మీదుగా బౌండరీ
మూడో బంతి: స్క్వేర్ లెగ్ దిశగా సిక్స్
నాలుగో బంతి: పరుగు రాలేదు
ఐదో బంతి: రెండు పరుగులు
ఆరో బంతి: స్కూప్ షాట్‌తో బౌండరీ
ఏడో బంతి: సింగిల్
ఎనిమిదో బంతి: కవర్స్ మీదుగా ఫ్లాట్ సిక్సర్

- కార్తీక్ కళ్లు చెదిరే ఇన్నింగ్స్
- 8 బంతుల్లోనే 29 పరుగులు
- భారత్ అద్భుత విజయం
- ముక్కోణపు టీ20 సిరీస్ కైవసం

కిర్రాకు పుట్టించాడే...



ఇదేమీ ప్రపంచకప్ మ్యాచ్ కాదు.. మనది పూర్తి స్థాయి జట్టూ కాదు.. ప్రత్యర్థి పెద్ద జట్టేమీ కాదు.. కొట్టినోడు గొప్ప పేరున్న బ్యాట్స్‌మన్ కూడా కాదు!

కానీ ఈ మ్యాచ్‌ను లైవ్‌లో చూడకపోయి ఉంటే.. ఆ ఉత్కంఠను అనుభవించకపోయి ఉంటే.. ఆ మజాను ఆస్వాదించలేకపోయి ఉంటే.. ఆ షాట్లను చూడలేకపోయి ఉంటే.. ఆ గెలుపు క్షణాల్ని అదే క్షణాల్లో వీక్షించలేకపోయి ఉంటే.. అది దురదృష్టమే!

ఎందుకంటే ఎన్నేళ్లయిందో ఇలాంటి మ్యాచ్ చూసి..? ఎప్పుడు అనుభవించామో ఇంతటి ఉత్కంఠను..? ఎన్నడు పొందామో ఇలాంటి ఆనందాన్ని..?

చూసే వాళ్లకే గుండె వేగం పెరిగిపోయి.. ఉత్కంఠతో నరాలు తెగిపోతుంటే.. ఇక ఆడే వాడి పరిస్థితి గురించి చెప్పేదేముంది? చివరి బంతికి సిక్సర్ బాదాల్సి వస్తే అదెంత పెద్ద సవాలో వివరించేదేముంది?

కానీ అంత ఒత్తిడిలోనూ.. అంత ఉత్కంఠలోనూ.. అసాధారణ నైపుణ్యంతో, తిరుగులేని శక్తితో, కళ్లు చెదిరే టైమింగ్‌తో అతనాడిన ఆ షాట్.. వాహ్.. వాహ్.. వాహ్!

ఎప్పుడో దశాబ్దాల కిందట భారత్ మీద చివరి బంతికి మియాందాద్ సిక్సర్ బాది పాకిస్థాన్‌ను గెలిపించడాన్ని లైవ్‌లో చూసిన వాళ్లు దాని గురించి ఇప్పటికీ కథలు కథలుగా చెప్పుకుంటుంటారు. దాని గురించి మాట్లాడుతూ పాక్ అభిమానులు ఉప్పొంగిపోతారు.

ఇకపై భారత అభిమానులు కూడా అలా చెప్పుకోవడానికి, ఉప్పొంగిపోవడానికి గొప్ప ఉదాహరణ దొరికింది. ఆ అద్భుతాన్ని ఆవిష్కరించిన ఆటగాడు దినేశ్ కార్తీక్. 2011 ప్రపంచకప్ విజయాన్నందించిన ధోని సిక్సర్‌లా అతనాడిందీ చరిత్రలో నిలిచిపోయే షాటే! కేవలం ఆ సిక్సరేనా.. దాని కంటే ముందు కూడా అతనాడిన ప్రతి షాటూ ఆణిముత్యమే. 8 బంతుల్లో అతను సాగించిన విధ్వంసమంతా చరిత్రాత్మకమే!


ఇప్పటిదాకా ఎలా ఆడాడో.. ఇకపై ఎలా ఆడతాడో.. కానీ ఈ ఒక్క ఇన్నింగ్స్‌తో దినేశ్ కార్తీక్ అనేవాడు క్రికెట్ చరిత్రలో తన పేరును ప్రత్యేకంగా లిఖించేశాడు.

కొలంబో

దినేశ్ కార్తీక్ అద్భుతం చేశాడు. గెలుపు అసాధ్యం అనుకున్న స్థితిలో అసాధారణ రీతిలో చెలరేగిపోయాడు. కేవలం 8 బంతుల్లోనే 29 పరుగులు బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్నందించాడు. ఆదివారం రాత్రి నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగిన ముక్కోణపు టీ20 సిరీస్ ఫైనల్లో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 167 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. 6 వికెట్లు కోల్పోయి చివరి బంతికి ఛేదన పూర్తి చేసింది. మొదట షబ్బీర్ రెహ్మాన్ (77; 50 బంతుల్లో 7×4, 4×6) చెలరేగడంతో బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేసింది. భారత బౌలర్లలో యుజ్వేంద్ర చాహల్ (3/18) చక్కటి ప్రదర్శన చేశాడు. అనంతరం కెప్టెన్ రోహిత్ శర్మ (56; 42 బంతుల్లో 4×4, 3×6) ఛేదనలో భారత్‌కు మంచి పునాది వేయగా.. చివర్లో విజయంపై ఆశలే లేని స్థితిలో కార్తీక్ (8 బంతుల్లో 29 నాటౌట్; 2×4, 3×6) కళాత్మక విధ్వంసంతో భారత్‌కు విజయాన్నందించాడు. అతనే 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

పడి లేస్తూ..: ఛేదనలో భారత్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. ధావన్ (10), రైనా (0) 4 ఓవర్లలోపే పెవిలియన్ చేరిపోయారు. ఈ స్థితిలో రోహిత్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో జట్టును నడిపించాడు. అతడికి కేఎల్ రాహుల్ (24) నుంచి సహకారమందింది. వీళ్లిద్దరూ నిలకడగా ఆడటంతో భారత్ పదో ఓవర్లో 83/2తో పటిష్ఠ స్థితికి చేరుకుంది. కానీ వీళ్లిద్దరూ వెనుదిరిగాక ఇన్నింగ్స్ గాడి తప్పింది. మనీష్ పాండే (28; 27 బంతుల్లో 3×4), విజయ్ శంకర్ (17; 19 బంతుల్లో 3×4) ఆశించినంత వేగంగా ఆడలేకపోయారు. దీంతో సాధించాల్సిన రన్‌రేట్ క్రమంగా పెరిగిపోయింది. 17 ఓవర్లకు భారత్ స్కోరు 132/4. ఈ స్థితిలో ముస్తాఫిజుర్ తర్వాతి ఓవర్లో ఒక్క పరుగే ఇచ్చి పాండేను ఔట్ చేయడంతో భారత్‌కు విజయావకాశాలు మూసుకుపోయినట్లు అనిపించింది. కానీ కార్తీక్ వచ్చి మ్యాచ్‌ను మార్చేశాడు. మొదట చాహల్ సహా భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బంగ్లా క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఐతే షబ్బీర్ ఒక ఎండ్‌లో మొండిగా పోరాడి జట్టుకు మంచి స్కోరు అందించాడు. అతడికి మహ్మదుల్లా (21), మెహదీ హసన్ (19 నాటౌట్)ల నుంచి కొంత సహకారం అందింది.

ఆ మూడు ఓవర్లలో..



మ్యాచ్‌లో 37 ఓవర్ల వరకు ఆట మామూలుగానే సాగింది. అప్పటిదాకా పెద్దగా ఉత్కంఠ ఏమీ లేదు. 3 ఓవర్లలో 35 పరుగులు చేయాల్సి ఉండగా.. విజయావకాశాలు ఇరు జట్లకూ సమానంగానే కనిపించాయి. ఐతే చివరి మూడు ఓవర్లలో మాత్రం అటు అనూహ్య మలుపులు తిరుగుతూ సాగింది..

నైరాశ్యం.. నిశ్శబ్దం: 18 బంతుల్లో 35 పరుగులు చేయాల్సిన స్థితిలో క్రీజులో కుదురుకున్న మనీష్ పాండే, ఓ మోస్తరుగా ఆడుతున్న విజయ్ శంకర్ బ్యాటింగ్ చేస్తుండటంతో భారత్ ఆశలు కోల్పోలేదు. తన చివరి ఓవర్ బౌలింగ్ చేయడానికి ముస్తాఫిజర్ బంతి అందుకున్నాడు. శంకర్ స్ట్రైకింగ్‌లో ఉన్నాడు. అనూహ్యంగా నాలుగు బంతులు వరుసగా వృథా అయిపోయాయి. ముస్తాఫిజుర్ ఔట్ స్వింగర్ వేయడం.. శంకర్ షాట్ కోసం ప్రయత్నించడం.. అది బ్యాట్‌కు తాకకుండానే వికెట్ కీపర్ చేతికి వెళ్లడం.. నాలుగు బంతులకూ ఇదే దృశ్యం. ఐదో బంతికి సింగిల్ తీశాడు. చివరి బంతికి పాండే ఔట్. 18వ ఓవర్లో వచ్చింది ఒకే పరుగు. సమీకరణం 12 బంతుల్లో 34గా మారింది. ఆశ పోయింది. నిశ్శబ్దం ఆవహించింది.

ఎగసిన ఆశలు: ఇక మ్యాచ్ పోయిందనుకున్న స్థితిలో క్రీజులోకి అడుగుపెట్టాడు దినేశ్ కార్తీక్. అతను ధాటిగా ఆడగలవాడే కానీ 2 ఓవర్లలో 34 పరుగులు చేయడమంటే మాటలా? పైగా అనుభవజ్ఞుడు, 3 ఓవర్లలో 13 పరుగులే ఇచ్చిన రుబెల్ హుస్సేన్ బౌలింగ్‌కు వచ్చాడు. తొలి బంతికి అతను లో ఫుల్‌టాస్ వేయగా.. దాన్ని అద్భుత రీతిలో అందుకున్నాడు కార్తీక్. శక్తికి, టైమింగ్ కూడా తోడవడంతో బంతి లాంగాన్ దిశగా మెరుపు వేగంతో దూసుకెళ్లింది. బంతి స్టాండ్స్‌లో పడింది. అంతే అప్పటిదాకా స్తబ్దుగా ఉన్న స్టేడియం హోరెత్తిపోయింది. ఇక లెగ్ స్టంప్‌పై పడ్డ తర్వాతి బంతిని లాంగాన్, మిడ్‌వికెట్ మధ్య ఫోర్‌గా మలిచాడు. ఇక మూడో బంతి లెగ్ స్టంప్ మీదుగానే ఫుల్‌లెంగ్త్‌లో పడింది. దాన్ని మోకాలి మీదికి వంగి స్క్వేర్ లెగ్ మీదుగా సిక్స్ అందుకుని విస్మయానికి గురిచేశాడు కార్తీక్. 3 బంతుల్లోనే 16 పరుగులు రావడంతో ఒక్కసారిగా మ్యాచ్ భారత్ వైపు మొగ్గినట్లు కనిపించింది. ఐతే నాలుగో బంతి వృథా చేసిన కార్తీక్.. ఐదో బంతికి రెండు పరుగులు తీశాడు. చివరి బంతికి కార్తీక్ కళ్లు చెదిరే షాట్ ఆడాడు. అది చెత్త బంతేమీ కాదు. వదిలితే వికెట్లు లేచిపోయేదే. బంతి వేసే ముందే స్కూప్‌కు అనువుగా నిలబడ్డ కార్తీక్.. అనుకున్న ప్రకారం బంతికి బ్యాట్ తాకించాడు. నేరుగా బంతి ఫైన్‌లెగ్‌లో బౌండరీ ముంగిట పడి ఫోర్ వెళ్లింది. ఈ ఓవర్లో 22 పరుగులు రావడంతో సమీకరణం 6 బంతుల్లో 12గా మారింది.

ఉత్కంఠతో ఊపేసి..: ముందు ఓవర్లో 22 పరుగులొచ్చాక చివరి ఓవర్లో 12 తేలిగ్గా కనిపించే లక్ష్యమే. ఐతే స్ట్రైకింగ్‌లో కార్తీక్ లేడు. శంకర్ బ్యాటింగ్‌కు రావడంతో లోలోన దడే. సౌమ్య సర్కార్ బౌలింగ్‌కు వచ్చాడు. అతను తొలి బంతికి వైడ్ ఇచ్చాడు. ముందు ఓవర్లో మాదిరే బ్యాట్‌ను శంకర్ గుడ్డిగా ఊపడంతో బంతి వృథా అయింది. రెండో బంతికి సింగిల్ తీసి కార్తీక్ స్ట్రైక్ ఇవ్వడంతో హమ్మయ్య అనుకున్నారంతా. కానీ కార్తీక్ కూడా సింగిలే తీశాడు. తిరిగి స్ట్రైకింగ్‌లోకి శంకర్. 3 బంతుల్లో 9 చేయాలి. దీంతో మళ్లీ ఉత్కంఠ. ఐతే నాలుగో బంతికి శంకర్.. థర్డ్ మ్యాన్ దిశగా ఫోర్ కొట్టాడు. అయినా ఉత్కంఠ తగ్గలేదు. 2 బంతుల్లో 5 చేయాలి. శంకరే స్ట్రైకింగ్. ఐదో బంతికి అతను ఔట్. ఉత్కంఠ పెరిగింది. ఐతే కార్తీక్ స్ట్రైకింగ్‌కు రావడంతో ఆశ చావలేదు. కానీ ఒక్క బంతిలో 5 పరుగులు చేయాలి. ఫోర్ కొడితే డ్రా. సిక్సర్ బాదితే విజయం. ఎంత కార్తీక్ అయినా చివరి బంతికి సిక్సర్ బాదగలడా అని సందేహం. ఐతే ఆఫ్ వికెట్‌కు దూరంగా సర్కార్ బంతి విసిరితే.. కార్తీక్ తన పూర్తి శక్తిని వినియోగిస్తూ.. అద్భుతమైన టైమింగ్ జోడించి కవర్స్ దిశగా అమోఘమైన రీతిలో బంతిని బాదాడు. అది నేరుగా వెళ్లి బౌండరీ అవతల పడింది. భారత్ అద్భుత విజయాన్నందుకుంది.

"ఈ ఇన్నింగ్స్ చాలా చాలా సంతోషాన్నిచ్చింది. ముస్తాఫిజుర్ గొప్పగా బంతులేశాడు. ఆ స్థితిలో బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదు. అందుకే వీలైనంత గట్టిగా బంతిని బాదాలని నిర్ణయించుకుని ఆడాను. నిజానికి మాకు అవకాశం తక్కువగా ఉంది. కానీ ఆ చిన్న అవకాశాన్ని కూడా ఉపయోగించుకున్నాం. ఈ టోర్నీలో భారత ప్రదర్శన సంతృప్తికరంగా ఉంది"

– దినేశ్ కార్తీక్

"అభిమానులకు కావాల్సింది ఇలాంటి ఫైనలే. బంగ్లా ఈ మ్యాచ్‌లో చాలా బాగా ఆడింది. కానీ ఒత్తిడిని అధిగమించిన భారత్ విజయాన్ని అందుకుంది. 18, 19 ఓవర్లను అత్యుత్తమ బౌలర్‌తో వేయించాలని అనుకున్నాం. జట్టులో అందరూ బౌలర్లు సమర్థులే. కానీ తొలి బంతి నుంచే హిట్టింగ్‌కు దిగిన కార్తీక్ మా ప్రణాళికలను చెదరగొట్టాడు. కప్ గెలవకపోయినా ఈ సిరీస్‌లో ఎన్నో సానుకూలాంశాలున్నాయి"

– షకిబ్ అల్ హసన్

"అద్భుతమైన మ్యాచ్. అభిమానులకు చివరి వరకు వినోదాన్ని పంచింది. యువ ఆటగాళ్ల సత్తాను వెలికి తీసిన టోర్నీ ఇది. ఈ ప్రదర్శన వారిలో ఎంతో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఉంటుంది. కార్తీక్ తాను అనుకున్నట్లుగా ఆడాడు. అతని ఫినిషింగ్ సామర్థ్యాన్ని తెలిసే బ్యాటింగ్ ఆర్డర్‌లో వెనక్కి పంపించాం"

– రోహిత్‌శర్మ

శంకర్.. హమ్మయ్య!

ఈ మ్యాచ్‌లో భారత్ విజయంతో అత్యంత ఆనందించిన వాడు విజయ్ శంకరే అయ్యుంటాడేమో! మ్యాచ్ పోతే అతడి పరిస్థితి ఎలా ఉండేదో ఊహించుకోవడం కూడా కష్టమే. విజయావకాశాలు సమానంగా ఉన్న స్థితిలో 18వ ఓవర్లో వరుసగా నాలుగు బంతులు వృథా చేశాడు శంకర్. అందులో ఒక్క బంతికీ బ్యాట్ కూడా తాకించలేకపోయాడు. ఆ సమయంలో శంకర్‌ను తిట్టుకోని భారత అభిమాని ఉండడేమో! చివరి ఓవర్లో సైతం అతను తడబడ్డాడు. 2 బంతుల్లో 5 పరుగులు చేయాల్సినపుడు బంతిని గాల్లోకి లేపి ఔటైపోయాడు. దీంతో శంకర్ మరోసారి భారత అవకాశాల్ని దెబ్బ తీశాడనే భావన కలిగింది. ఐతే చివరి బంతికి కార్తీక్ అద్భుతం చేశాడు. శంకర్‌ను బతికించాడు. లేదంటే మాత్రం శంకర్ ఏ స్థాయిలో విమర్శలు ఎదుర్కొనేవాడో? కాబట్టి ఈ విజయం శంకర్‌కు గొప్ప ఊరటే!

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: తమీమ్ (సి) శార్దూల్ (బి) చాహల్ 15; లిటన్ దాస్ (సి) రైనా (బి) సుందర్ 11; షబ్బీర్ (బి) ఉనద్కత్ 77; సర్కార్ (సి) ధావన్ (బి) చాహల్ 1; ముష్ఫికర్ (సి) శంకర్ (బి) చాహల్ 9; మహ్మదుల్లా రనౌట్ 21; షకిబ్ రనౌట్ 7; మెహదీ నాటౌట్ 19; రుబెల్ (బి) ఉనద్కత్ 0; ముస్తాఫిజుర్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 6 **మొత్తం:** (20 ఓవర్లలో 8 వికెట్లకు) **166; వికెట్ల పతనం:** 1-27, 2-27, 3-33, 4-68, 5-104, 6-133, 7-147, 8-148; **బౌలింగ్:** ఉనద్కత్ 4-0-33-2; సుందర్ 4-0-20-1; చాహల్ 4-0-18-3; శార్దూల్ 4-0-45-0; విజయ్ శంకర్ 4-0-48-0

భారత్ ఇన్నింగ్స్: ధావన్ (సి) హక్ (బి) షకిబ్ 10; రోహిత్ (సి) మహ్మదుల్లా (బి) నజ్ముల్ 56; రైనా (సి) ముష్ఫికర్ (బి) రుబెల్ 0; రాహుల్ (సి) షబ్బీర్ (బి) రుబెల్ 24; పాండే (సి) షబ్బీర్ (బి) ముస్తాఫిజుర్ 28; విజయ్ శంకర్ (సి) మెహదీ (బి) సర్కార్ 17; దినేశ్ కార్తీక్ నాటౌట్ 29; సుందర్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం:** (20 ఓవర్లలో 6 వికెట్లకు) **168; వికెట్ల పతనం:** 1-32, 2-32, 3-83, 4-98, 5-133, 6-162; **బౌలింగ్:** షకిబ్ 4-0-28-1; మెహదీ 1-0-17-0; రూబెల్ 4-0-35-2; నజ్ముల్ 4-0-32-1; ముస్తాఫిజుర్ రెహ్మాన్ 4-1-21-1; సర్కార్ 3-0-33-1

మోసగించిన సంస్థపై ద్రవిడ్ ఫిర్యాదు



బెంగళూరు: భారత దిగ్గజ బ్యాట్స్‌మన్ రాహుల్ ద్రవిడ్ బెంగళూరుకు చెందిన విక్రమ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ సంస్థ తనను రూ.4 కోట్లకు మోసం చేసిందని ద్రవిడ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ద్రవిడ్‌తో పాటు పలువురు ప్రముఖులు లాభాలు ఆశించి ఈ సంస్థలో పెట్టుబడి పెట్టారు. ఐతే ఈ సంస్థ ఇటీవలే బోర్డు తిప్పేసింది. లాభాలు రాకపోగా పెట్టుబడులు కూడా వెనక్కి వచ్చే పరిస్థితి లేకపోయింది. ద్రవిడ్ ఈ సంస్థలో నాలుగేళ్ల కిందట రూ. 20 కోట్ల దాకా పెట్టుబడి పెట్టాడు. అందులో రూ.16 కోట్లు వెనక్కి రాగా.. 4 కోట్ల మేర ఆ సంస్థ ఎగ్గొట్టింది. దీంతో లావాదేవీలకు సంబంధించిన పత్రాలతో అతను పోలీసుల్ని ఆశ్రయించాడు.

మూడో వన్డేలోనూ భారత మహిళల ఓటమి

వదోదర: ఆస్ట్రేలియా మహిళలతో వన్డే సిరీస్‌లో భారత జట్టు పరాజయం పరిపూర్ణమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆసీస్ 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అలిస్సా హేలీ (133; 115 బంతుల్లో 17×4, 2×6) మెరుపు శతకం బాదడంతో ఆదివారం జరిగిన మూడో వన్డేలో ఆసీస్ 97 పరుగుల తేడాతో భారత్‌పై ఘనవిజయం సాధించింది. హేలీతో పాటు హేన్స్ (43), గార్డ్‌నర్ (35) రాణించడంతో మొదట ఆస్ట్రేలియా 7 వికెట్లకు 332 పరుగుల భారీ స్కోరు చేసింది. లక్ష్య ఛేదనలో భారత్ తడబడింది. గార్డ్‌నర్ (3/39), షుట్ (2/54), పెర్రీ (2/40) ధాటికి 44.4 ఓవర్లలో 235 పరుగులకే ఆలౌటైంది. స్మృతి మంధాన (52) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిథాలీ (21), హర్మన్‌ప్రీత్ కౌర్ (25) విఫలమయ్యారు.


ఏసీయూకు ఆధారాలు



కోల్‌కతా: మహ్మద్ షమిపై ఆరోపణల నేపథ్యంలో అతడి భార్య హసీన్ జహాన్‌తో బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం (ఏసీయూ) అధికారులు మాట్లాడారు. నగర పోలీస్ ప్రధాన కార్యాలయంలో అధికారులు ఆమెతో పాటు ఆమె తండ్రి, ఇద్దరు కుమార్తెలతో కూడా సంభాషించారు. తన ఆరోపణలకు మద్దతుగా ఆమె కొన్ని పత్రాలను అందించినట్లు తెలుస్తోంది. షమిపై గృహహింస కేసు పెట్టిన హసీన్, అతడిపై ఇంకా అనేక ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. ఐతే తనపై చేసిన ఆరోపణల్లో సగం కూడా హసీన్ నిరూపించేకపోయిందని షమి వ్యాఖ్యానించాడు. ఆమెతో మళ్లీ కలిసిపోయే అవకాశం లేదని, ఆమె ఎంత దూరం వెళ్తుందో చూస్తానని అన్నాడు.

విదర్భదే ఇరానీ కప్

నాగ్‌పూర్: రంజీ ఛాంపియన్ విదర్భ ఇరానీ కప్‌నూ చేజిక్కించుకుంది. రెస్టాఫ్ ఇండియాతో మ్యాచ్ డ్రాగా ముగియగా.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా విదర్భ విజేతగా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించడం ద్వారా నాలుగో రోజే ట్రోఫీని ఖాయం చేసుకున్న విదర్భ.. ఐదో రోజు లాంఛనాన్ని ముగించింది. ఓవర్‌నైట్ స్కోరు 236/6తో తొలి ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన రెస్ట్ జట్టు.. 390 పరుగులకు ఆలౌటైంది. గుర్బాని నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఆంధ్ర ఆటగాడు హనుమ విహారి భారీ సెంచరీ (183; 327 బంతుల్లో 23×4, 3×6) సాధించాడు. జయంత్ యాదవ్ (96)తో ఏడో వికెట్‌కు అతడు 216 పరుగులు జోడించాడు. విదర్భకు తొలి ఇన్నింగ్స్‌లో 410 పరుగుల ఆధిక్యం లభించింది. 800/7 వద్ద ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. ఆట ముగిసే సమయానికి విదర్భ రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 79 పరుగులు సాధించింది.



ఆల్ ఇంగ్లాండ్ ఛాంప్స్ తైజు, షి యుకి

బర్మింగ్‌హమ్: ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల విభాగంలో షి యుకి (చైనా), మహిళల్లో తై జు యింగ్ (కొరియా) టైటిళ్లు కైవసం చేసుకున్నారు. ఆదివారం పురుషుల సింగిల్స్ ఫైనల్లో షి యుకి 21-19, 16-21, 21-9తో లిన్‌డాన్ (చైనా)ను ఓడించాడు. మహిళల తుది సమరంలో తై జు యింగ్ 22-20, 21-13తో అకానె యమగూచి (జపాన్)పై గెలిచింది.

రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ విజయం!

ఎగ్జిట్ పోల్స్‌లో ఆయనకు 73.9% ఓట్లు



ఓటు హక్కును వినియోగించుకుంటున్న పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడిగా వ్లాదిమిర్ పుతిన్ నాలుగోసారి ఎన్నికయ్యారు!! ఆయనకు 73.9% ఓట్లు పడినట్లు ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడయింది. అధ్యక్ష ఎన్నికల్లో ఓటేసేందుకు ఆదివారం ప్రజలు పోటెత్తారు. దేశవ్యాప్తంగా మొత్తం 10.7 కోట్ల మంది ఓటర్లు ఉండగా.. మధ్యాహ్నం 2 గంటలకే దాదాపు 52 శాతం ఓటింగ్ నమోదైంది. పలు కేంద్రాల్లో ఓటర్లు ఇంకా బారులు తీరి కనిపించారు. ఈ ఎన్నికల్లో పుతిన్‌తోపాటు మరో ఏడుగురు అభ్యర్థులు బరిలో దిగారు. న్యాయపరమైన కారణాలతో పుతిన్ ప్రధాన ప్రత్యర్థి అలెక్సీ నావల్నీని తాజాగా ఎన్నికల బరి నుంచి తప్పించారు. పుతిన్ మరోసారి ఎన్నికవ్వడం లాంఛనమేననే తేలిపోయింది. దాదాపు 19 ఏళ్ల క్రితం ఆయన తొలిసారిగా దేశాధ్యక్ష బాధ్యతలు చేపట్టారు. నాటి నుంచి అధికారంలో కొనసాగుతున్నారు. పుతిన్ పాలనలోనే పుట్టి.. పూర్తిగా ఆయన పాలనలోనే జీవిస్తున్న యువత (ఇటీవలే 18 ఏళ్లు నిండినవారు) తొలిసారిగా ఈ ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు.



జుత్తు చూడ చూడ.. అందంగా దూడ

14 నెలలకే భారీగా పెరిగిన జఫ్రాబాది జాతికి చెందిన దున్న ఇది. రాజమహేంద్రవరం కొప్పాక వెంకటనారాయణ దీన్ని పెంచుతున్నాడు. ఈయనకు వివిధ జాతులకు చెందిన 20 గేదెలు, 20 ఆవులు ఉన్నాయి. గుజరాత్‌కు చెందిన స్నేహితుడు 10 నెలల వయసున్న జఫ్రాబాది దున్న దూడను ఉచితంగా ఇవ్వడంతో ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నాడు. విశేషమేంటంటే ఈ దున్నకు జుత్తు బాగా వస్తోంది. దీంతో జుత్తుకు నూనె రాసి అందంగా పాపిట తీస్తున్నారు. ఉగాది వేడుకల్లో భాగంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఈ దున్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

–ఈనాడు, రాజమహేంద్రవరం

రద్దయిన నోట్లను ముక్కలు చేశాం: ఆర్‌బీఐ

దిల్లీ: రద్దు చేసిన రూ.500, రూ.వెయ్యి నోట్లను లెక్కించి, అవి అసలైనవేనని నిర్ధరించుకొని, చించేసినట్లు భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) తెలిపింది. ఆ ముక్కలను కట్టలుగా కట్టినట్లు వివరించింది. టెండర్ ప్రక్రియ ద్వారా వాటిని విక్రయిస్తున్నట్లు పేర్కొంది. గత ఏడాది జూన్ 30 నాటికి అందిన నోట్ల విలువ రూ.15.28 లక్షల కోట్లుగా ఆర్‌బీఐ లోగడ అంచనావేసింది. వీటిని అధునాతన కరెన్సీ వెరిఫికేషన్, ప్రాసెసింగ్ వ్యవస్థ ద్వారా లెక్కించి, పరిశీలన సాగించారు. ఆ తర్వాత వీటిని తమ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థ ద్వారా చించేసి, కట్టలుగా కట్టామని ఆర్‌బీఐ పేర్కొంది. వీటిని తాము రీసైకిల్ చేయబోమని తెలిపింది. రూ.500, రూ.వెయ్యి నోట్లను కేంద్ర ప్రభుత్వం 2016 నవంబర్ 8న రద్దు చేసిన సంగతి తెలిసిందే.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00